విజ్ఞాన వల్లికా గ్రంథమాల ౧౭.

ఓం

శారద



గ్రంథకర్త:
సాహిత్య సరస్వతి
సిరిపి, ఆంజనేయులుగారు,
ధర్మవరము; అనంతపురమండలము.

ప్రకాశకులు:
విజ్ఞానవల్లికాగ్రంథమండలి.

ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్, బెజవాడ.
1922 మే నెల.
మూల్యము రూ 1—8—0

ప్రధానపోషకులు.

1 రాయిసాహేబు మిషరల హంపయ్యగారు, గుంతకల్లు,
అనంతపురము జిల్లా.

2 ఎస్, చిన్నపరెడ్డిగారు, ఇల్లూరు, గుత్తితాలూకా ,,

3 కె, సుబ్బారెడ్డిగారు, తరిమెల ,, ,,

4 కె, చిన్నారపరెడ్డిగారు, పెద్దవడుగూరు ,, ,,

5 పాణెము తిరుమలప్పగారు, గుత్తి ,,

6 బి. కృష్ణారెడ్డిగారు, చీమలవాగుపల్లి ,,

7 కరణము చిక్కప్పగారు, కల్యాణదుర్గము ,,

8 ఆవుల, పెద్దకొండారెడ్డిగారు, ఆత్మకూరు ,,

9 మారనేని, చిన్న వెంకటపతిగారు, నిడిగల్లు ,,

అభిమానులు.

1 జి. లక్ష్మణరెడ్డిగారు, ప్లీడరు, గుత్తి. అనంతపురము జిల్లా

2 మాదాసు పెద్దరంగప్పగారు, తాడిపర్తి ,,

3 ఎమ్. నాగప్పగారు, కల్యాణదుర్గము ,,

4 కణేకల్లు హుస్సేన్ సాహెబ్, మహమ్మదు
హాషీమ్‌సాహేబుగార్లు ,,

5 పాటీల్ తిమ్మారెడ్డిగారు, కణేకల్లు ,,

6 లక్కా [illegible] రెడ్డిగారు, కణేకల్లు, బళ్ళారిజిల్లా.

7 లక్కా వెంకటరెడ్డిగారు, కణేకల్లు ,,



సాహిత్య సరస్వతి

శిరిపి ఆంజనేయులు

గురుదక్షిణ.

తే॥ గీ॥ శ్రీవిద్వాజ్జిల నాచార్య ♦ శేఖరుండు
భువన విజ్ఞాన మాటవ ♦ స్తువులకతన
శిష్యులకుఁ జెల్వు కైవడి, ♦ సృష్టివలనఁ
బరమవిధిఁ జాటు లోకైక ♦ గురునిఁ దలఁతు॥

సీసమాలిక.

'ఓం నమ' యటంచుఁ దా ♦ నోంకార నామ మం-త్రపుబల్మిఁ దెల్పిన ♦ రాజగురుని
పసితనమున సాంద్ర ♦ భాగవతిక థామృ-తాస్వాదన మొనర్చి ♦ నట్టిగురుని
క్రమమునఁ గాక నొ ♦ క్కట సెక్కముల మొదల్-గఱపిన శ్రీశివ ♦ జ్ఞానగురుని
తెనుఁగున నభిమాన ♦ మును గొల్పినట్టి జే-శాయి, శ్రీ వేంకట ♦ రాయగురుని
ప్రవిమల సత్కృపా ♦ భావంబులో నన్నుఁ-గాంచిన రాజశే ♦ ఖరునిగురుని
ప్రత్యక్ష బోధన ♦ పద్ధతి హితరీతిఁ - జాటిన రాఘవా ♦ చార్యగురుని
గీర్వాణమునఁ బ్రశ ♦ స్తినిఁ గూర్చ నెంచి యొం-[illegible]జేసినట్టి కా ♦ మేశగురుని
ఓర్మిపై బాలభ ♦ టోద్యమశిక్షలో త-మ్ముఁడైన వేంకట ♦ రమణగురునిఁ
తే॥ దలఁచి, హృదయాన సద్భక్తి ♦ నిలిపికొలిచి
నిఖిల భారతి సాహిత్య ♦ నిచయ నియమ
మునకుగా దీని వ్రాసితి ♦ బుధులకరుణ
గలుగ, గురువరేణ్యులకృపా ♦ కలనఁ జేసి.

గీతమాలిక.

ప్రేమధనులార! నాగురు ♦ స్వాములార! - తిన్నఁగాఁ జెల్వు కూడని ♦ చిన్నవాఁడు
బారెడు దనమ్రగహించి, మ ♦ దీయవృద్ధి-కొఱకు, వాత్సల్యమున నన్ను ♦ దరికిఁ దీసి
పల్పితిరి మీరు మీపరి ♦ శ్రమము మూల్య-కాలమునకు నేరుచు టె ♦ కతన నెంతొ
దానిఁ దీర్చికొనంగ నా ♦ తరమె? కాని - ఇదిగో! మీదీవన ఫలంబు ♦ ముదమెసంగ
నిడెద గురుదక్షిణగ దీని ♦ నెలమితోడఁ-గొనుఁడు శిష్యుని పైఁ గృప ♦ మనసు చేసి

— గ్రంథకర్త.

శారదపై

పండితాభిప్రాయములు.

ఉ॥ స్తుత్యకథావిధానము, వచోరమణీయము నెన్నమీరలు, నౌ
చిత్యమెఱింగి మీరలు రచించిన శారదఁ గాంచినార మే
కృత్యయదోషమైనఁ గనుపట్టదు, శిరిపి ఆంజనేయ! సా
హిత్య సరస్వతీ! భవదుదీరితకావ్యము భవ్యమన్నిటన్॥

ఇట్లుభాషాసేవకులు,

16-5-22

శేషాద్రి రమణకవులు.

శతావధానులు.

ఆంధ్రభాష కిది యభ్యుదయకాలము. ఈకాలమున నాటకములు నవలలు శాస్త్రములు చరిత్రములు కావ్యములు కథలు శతకములు చాటువులు పద్యములు పాటలు మొదలగు ననేకగ్రంథము లీభాష నలంకరించుచున్నవి. వీనిలో నవలలువింతరచనలఁ గలిగి సర్వజనాహ్లాదకరము లగుటచేఁ బెక్కులు వెలయుచుఁ ద్వరితగతిని వ్యాపించుచున్నవి. ఇందునూటికిఁదొంబదివఱ కాంగ్లవంగాది భాషాగ్రంథములననువదింపఁబడినవియు ననుకరింపఁబడినవియు నైయున్నవి. తక్కిన పదిమాత్రమే స్వతంత్ర గ్రంథములు. అనువాదానుకరణములకన్న స్వతంత్ర రచనా గ్రంథములు వాఙ్మయమున కమూల్యాలంకారములుగా విలసిల్లును.

ఏగ్రంథమైనను జదువరుల విలువగల కాలమును గడపివేయకమానదు. కావున నాగ్రంథమువలనఁ గాలముకన్న విలువగలఫలము పాఠకులకు లభింపవలయును. లేకున్నయట్టిగ్రంథము భూమికిభారమై పాఠకులకనర్థదాయకమగును. అతిభీరువుల నసహాయశూరులనుజేసి యుద్ధరంగముల నుఱికించి విజయభేరీనినాదములో జయలక్ష్మీకరగ్రహణమును జేయించుటకుఁగాని, జ్ఞాన వైరాగ్యములచే భాసిల్లు పండితప్రకాండు నైనను శృంగార రసానుభవముచే సుఖభోగశీలునిగా మార్చుటకుఁగాని, నిత్యదాస్యముచేఁగృశించు నిర్భాగ్యునైనను స్వాతంత్ర్యభావప్రభావముచే స్వేచ్ఛావిహారధీరునిగాఁ దీర్చుటకుఁగాని, వజ్రకర్కశ హృదయుఁడగు కిరాతకునైనను నవనీతకోమల దయామయహృదయునిగాఁ జేయుటకుఁగాని, గ్రంథరత్నములే సమర్థములను టతిశయోక్తి కానేరదు.

చదువరుల హృదయములఁ బాచుచుండఁ గైవసము చేసికొని కీలుబొమ్మలవలె నాడించుచు, నిరంకుశ రాజ్యముచేయు నీ పుస్తకముల

పట్టునఁ, గృతికర్తలుగాని-గ్రాహకులుగాని-యించుకయు నుపేక్షింపఁజనదు. ఆఁకలిగొన్న మనుజులు లభ్యపదార్థముల నెల్లఁ జవిఁజూచునట్లు, జిజ్ఞాసువులగు పాఠకులు దొరకిన గ్రంథముల నెల్ల రుచిచూడక విడఁజాలరు. అందువలన నీవిషయమునఁ బాఠకుని బాధ్యతకంటెఁ గృతికర్త కర్తవ్యమే యధికమగుచున్నది. కృతికర్త యేవిధముగాఁ గథకల్పించి యేమేమి వర్ణనలు వర్ణించిన నెట్టిఫలితము చేకూరునో సమగ్రముగా యోజించి లోకోపయుక్తములగు నీతి జ్ఞాన వైరాగ్యాది సద్గుణసాంప్రదాయ ప్రదాయకములై - సాగరనౌకాయాత్రికులకు మెలఁకువగల కర్ణధారునివలెఁ బ్రపంచయాత్రికులగు నవయువకులకు జీవితపరమార్థమును దెలియఁజేయుచు సన్మార్గదర్శకములై సద్గురుసదృశములై సార్థకములగు నుత్తమ కోశములనే రచియించుట సమంజసము. అవిరైనను వ్యర్థముగాఁ బుటలు సంపుటములకొలఁదిఁ బెంచక యనవసరవర్ణనల పొంతఁబోక విసుఁగు జనింపఁజేయక యుత్సాహజనకములై యొప్పునట్లు చూడవలయును.

ఈ శారద యట్టియుత్తమగ్రంథములలో నొకటి. కవి యారంభమునుండియుఁ జదువరుల హృదయక్షేత్రముల సుగుణబీజముల నాటఁదలకొని యా వ్యవసాయమున సఫలుఁడయ్యెను. ఆనందమఠ జదివిన దివ్యతర దేశభక్తియుఁ, బుష్పాంజలిఁ బఠించిన భవ్యతరభగవద్భక్తియు, వికారాఫ్ వేక్ఫీల్డు జదివిన లోకోత్తర లోకానుభవమును లభించునట్లు శారదను బఠించిన జిత్తశుద్ధియు జీవిత సంస్కారమును సిద్ధించును. దండిపండితులకుఁ గుండలను లక్కులేనట్లు గుణముగల గ్రంథములకుఁ టీకలు రోగతా పత్రములు ననావశ్యకములు. శారదశైలి ప్రబంధశైలినిఁ బోలి ప్రౌఢమై నిగూఢపదభూయిష్ఠమైయున్నది. అయినను గ్రంథప్రశస్తికి ముఖ్యముగాఁ గావలసిన పాత్రౌచిత్యము భావగాంభీర్యము రసపోషణము నొప్పిదములై శ్లాఘ్యతరములుగా నున్నవి.

అనేకోత్తమకృతికర్తలును, సాహిత్యసరస్వతీ బిరుదాంకితులునగు శిరిపి యాంజనేయులు గారింకను నాంధ్రభాషాయోషామణికి మణిభూషణప్రాయములగు సద్గ్రంథముల ననేకములు రచించి యాంధ్రసారస్వతాభ్యుదయమునకుఁ దోడ్పడ, భగవంతుఁడనుగ్రహించును గాక యనికోరుచు రసలోలురగు పాఠకుల యమూల్యకాలము నధికముగ వ్యయముసేయక విరమించుచున్నాను.

ఇట్లు విన్నవించు విబుధవిధేయుఁడు,

తణుకు (కృష్ణాజిల్లా.) మంగిపూడి వేంకటశర్మ.

కేవలము నాటక, కావ్య, ప్రబంధములే కాక చరిత్రములు శాస్త్రములు కథలు నవలలు మున్నగునవి భాషావిజృంభణమున కెల్లదు వెలువడు చున్నవి. ఇట్టివిజృంభణము దేశసేవకును భాషాసేవకును గాకపోదని సంశయ మొందఁదగదు. గ్రంథములు సేయు ప్రజాసేవాధిక్య మెవరికిని దెలియకపోలేదు కదా?

... ...

సేవచేయవలెనన్న లోకసంస్కార మావశ్యకము. సంస్కారముల వ్రాతమూలమున సమకూర్ప నగును. ఇందులకుఁ గథలు నవలలు నుత్తమము లని నానమ్మిక. "థ్యాకరే, డికెన్సు, స్కాటు, రేనాల్డ్సు, మెరిడిత్, వెల్సు" మున్నగు నాంగ్లేయ గ్రంథకర్తలు వివిధములుగఁ గథలు నవలలు వ్రాసి, సంస్కారములకుఁ బూని ప్రజాసేవసల్పిరి.

... ...

ఈ శారద శోకమూలము చూడుఁడు. ఇందలి కథాంశములన్నియు పట్టి భావనా కల్పనలే కావు. లెక్కకలవిగాని ప్రతిదినముఁ జరుగఁబోవు, ఈ మన ప్రపంచపు గందరగోళములను. అంశము లసాధారణములు కాకపోయినను, ఒకొక్కటినుండి యెన్నియోనీతులు నేర్చుకొనఁదగును. స్వభావము-అలటుటు-నడత లెటువంటివైనను నిరుగుపొరుగులు మార్పఁగలవు. ఏదోయొకింత పెద్ద లార్జించిన యాస్తిగలదని గర్వించి, యేవిద్యయందును లక్ష్యముంపఁ జేయింపక యతిగారాబముతోఁ బిల్లలఁ బెంచిన తలిదండ్రులయొక్కయు, నట్లు పెరిఁగిన పిల్లలయొక్కయు స్థితియేమగునో మనమందఱము సరిచక్కఁగా నాలోచించుటకూడ లేదు. గొప్పవారినియు మగుణులనియు నటించు నిక్కాలపు జనులయంతరాత్మ వేఱుగానుండును. చెప్పఁబూనిన నిట్టివెన్నియో యుండుఁ గలవు. విస్తరమగునను భీతిమిక్కుటము. కాక చదువరుల యభిప్రాయము ముందుగనే యెట్టిదికారము నొందనోయను భీతికూడనుగొంత.

శారదశైలి సులభము. మాటలతి మధురములు. అంశము లసత్యములు కావు. పాత్రలు పొందినయిడుమలు చాలయింపు. తుదకుఁ జదివిన మేలోనరి పక్క పోదు. ఇది 5, 6 ఫారముల విద్యార్థులపఠనమునకుఁ జక్కని గ్రంథమని నాదృఢవిశ్వాసము. విద్యాధికారు లిటువంటి సద్గ్రంథములఁ బఠనీయములుగ నియమించిన నెంతయో బాగని నావిజ్ఞప్తి.

DHARMAVARAM, (*St.*) **Kurudi N. Ranga Rau, B. A.,**
29—4—22. *Head- Master, B. M. School.*

విజ్ఞాపనము.

ఈ నవలానిర్మాణవిధానము కడుఁ జిత్రమైనది. నవల వ్రాయు సంకల్పమే నాకు లేకుండెను. ధర్మవరము నందలి యభిమాన నిరతులును - నాంధ్రభాషా ప్రియులును - యశఃకాములును నగు, నాయార్యవైశ్య ధర్మభ్రాతలు - శ్రీరంజితులు - కలవల వేంకటనారప్ప మట్టా నారాయణస్వామి ప్రభృతులు, నాకు శక్తి యున్నదని కాకపోయినను నారోపించు వారికిఁగల ప్రేమాతిశయముచే, నేది యైననొక చరిత్రాంశమును బెంచి, వచన ప్రబంధరూపమున వ్రాయఁ దలఁచునను బ్రేరేచుచుంటయు, నందులకుఁదగిన ప్రపంచజ్ఞానమును - భాషాపాటవమును - భావనా బలమును - లేమి నే నిప్పనికిఁ జొరఁబడఁజాలక మిన్నకుండుటయు, మాత్రమప్పుడప్పుడు సంభవ మగుచుండెను. వంగదేశకవి ప్రపంచ మానసాబ్ధియందలి నిర్మలాశయ సుధాంశుశీకరములఁగొని, తదీయ భావామృతవృష్టిచే నాంధ్రుల హృదయ ద్రుమ వితానములఁ బల్లవితమొనర్చు నాంధ్రీకరణరూప నవలామేఘ సంఘములఁ గాంచినను — ప్రకృతి సౌందర్యశోభావిశేషము, మృదులతర శైలిలో సుమనోభిరామముగ నొప్పార, నెంతయు విన్నాణముఁగూర్చు నాంధ్రదేశ నవలా శిరోమణులఁ గన్నను — నారచనోద్యోగమునకుఁబూన సాహసము జనింపకుండుటయు కాక, కలమెత్తుటకుఁగూడ సిగ్గుపొడముచుండును. మిత్రుల ప్రోత్సాహాతిశయముచ నొక్కొక్కతఱి, నందుల కుద్యమించినను నావిశీర్ణహస్తమున భావదారిద్ర్య సమన్వితమగు నాఖ్యాయిక వ్రాసి, తద్రచయితల కవమానముఁ దెచ్చిపెట్టిన పాపమునఁ బడిపోవుదు నేమోయనుట తలఁపునకువచ్చుటచే, నెంటనేయాయుద్దేశము మగల్చుకొని, తత్ప్రయత్నమునుండి విరమించెడువాఁడను. సందర్భమిట్లుండ —

కడచిన సంవత్సరము వంగరాష్ట్రమునందలి నిఖిలభారత సాహిత్య సంఘ పరిషత్సదమున, నేనొక పరీక్షితుఁడనుగా నిలిచితిని. పరీక్షారుసుము ముదుపు చెల్లించినవెనుక, సంఘ నిబంధనల ననుసరించి, వారివిషయమాలికలోని వ్యాసలేఖనమో — యాఖ్యాయికాకల్పనమో — రచన కైస్థిరీకరించుకొనవలసివచ్చెను. ఏదినిర్ణయించుకొనవలసినదియుఁ దోఁపక కొన్నిదినములును నన్య కారణముల వలనఁగొన్నినాళ్ళును గడచెను. చివరకు నవలారచనమే నిశ్చయించుకొని, యుపక్రమింపక తీఱదయ్యెను. నే నాపరీక్షకై వ్రాసిన యాఖ్యాయికల మొదటింటిలో సిద్ధిమొందటిది. ఇందలికథ చారిత్రాత్మకము కాదు. కేవలసంస్పృష్టమును గాదు. అత్యల్పముగజరిగిన యొకసామాన్యాంశము, సందర్భోచితములగు మార్పు

లతోఁ బ్రకృతస్థితుల కానుగుణ్యముగఁ బెంచఁబడినది. కథకు నిర్ణయములైనస్థానములు పశ్చిమాంధ్రదేశ సంబంధములు. పాత్రాదుల నామములు కల్పితములు.

నే నీనవలను బ్రచురింతునను తలంపునఁగాక పరీక్షానియమితకాలములో నేదో యొకవిధమునఁ బూర్తిచేయవలయునను కుతూహలమున మనసు పోయినట్లెల్ల వ్రాసితిని. వ్రాసినయంశమును బునర్విమర్శ చేయఁ దరువాతఁ జిత్తుప్రతి నెత్తిచూచుకొనలేదు. అట్టిప్రమేయము నుండలేదు. ఉండునను కొనలేదు; కనుక నిందుఁ బ్రమాదములుండవని చెప్పుట సాహసము. పరీక్షలో నిదియెట్లో గెలుపొందెను. అనంతరము దీనిఁ బ్రచురణము తప్పనిసరిగఁ బొసఁగెను.

ఇది ముద్రణమున కనుపఁబడినసమయమున నేను జ్వరగ్రస్తుఁడనై యుంటిని. స్ఖాలిత్యరహితముగ శోధనపత్రములు సంస్కరించి ముద్రించుభారము ముద్రాపకులే వహించిరి. ఇందు మొదటినుండి • పదునొకండుఫారములనఁగా ౧౭౬ పుటలభాగము వారుచూచినదే. పరిశోధకుల ప్రమాదముననో, వేగిరపడి ముద్రించుటచేతనో మఱే కారణముననో స్ఖాలిత్యములపారముగ దొరలినవి. అర్ధానుస్వారశకటరేఫములలోను దదితర విషయములలోను బరిశోధకు లచ్చుటచ్చుట మాతృక ననుసరింప మఱచిరి. కొన్నిశబ్దములలోని యరసున్నలు విడిచిపెట్టఁబడినవి. రేఫశకటరేఫభేదములను- థ-ధల వ్యత్యయములను- శ్రద్ధతోఁ బాటించియుండలేదు. ఇవి సామాన్యము లగుటవలనను, వీని నన్నిఁటిని యథావిధముగ సూచించుట గ్రంథబాహుళ్యమునకుఁ గారణమగునను భీతిచేతను, కేవల విమర్శన దృష్టిసారయు భాషాసేవకులకుఁ దక్కఁ, గథాగ్రాహకుల నివియంత బాధించవను నూహచేతను, నిట్టి వ్యత్యయ లోపములఁ దెలుపక ప్రధాన దోషములను మాత్రమే కనఁబఱచితిని. నా యాంధ్రసోదరులిందులకు క్షమించి, తప్పులు ముందుగా సవరించుకొనఁ బ్రార్థితులు.

ఈ నవలా నిర్మాణమునకుఁ గారకులైన భ్రాతలకును, ముఖ్యముగాఁ గలకత్తా నిఖిలభారతసాహిత్యసంఘ సభ్యులకును, దీని నచిరకాలమున ముద్రించి యిచ్చినగ్రంథాలయ ముద్రాపకులగు బ్రహ్మశ్రీ, కర్లపాలెము కోదండరామశర్మగారికిని బ్రణామములు సల్పుచున్నాఁడను. ఇందులవమేని సుగుణమున్న బోధకమహనీయుల యాశీర్వచన ఫలమే కాని వేఱుగాదు.

ఇట్లు

ధర్మవరము — భాషా సేవానంద నిరతుఁడు,

(కిలేరము) బెజవాడ. — సీరపి, ఆంజనేయులు.

తప్పొప్పుల పట్టీ.

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
౩	౨౧	సమారాధనావైభవ	సమారాధనవైభవ
౪	౧౪	సమారాధనాధికముల	సమారాధనాదికముల
౬	౨	వలలులు	వంటరులు
,,	౩	యాయద్రిశ్రేణుల	యాయద్రిశ్రయణుల
౮	౨౩	వారించి,	సారించి,
౧౬	౧౭	నదియంతయు	నదిరయెంతయు
౧౮	౨౧	క్రోసు	కోసు
౧౯	౧౬	యాదేశరత్నములఁ	యాదేశములఁ
౨౧	౧౭	గన్నులాం	గన్నులార
౨౩	౨౦	అగుపడివను	అగపడినను
౩౨	౧౦	బలసెను	బలిసెను
౩౫	౧౯	బహువల్లికలఁ	బాహువల్లికలఁ
౩౬	౧౨	కావలసినట్లు	రావలసినట్లు
౩౭	౪,౫	సమయానుకూల్యముగ	సమయమానుకూల్యముగ
,,	౧౮	అతఁడు మేళమునకు	అతఁడుమాపతికి
౪౧	౧౦	సుత్తమ వర్ణుల	సుత్తమర్ణుల
౫౩	౨౨	బ్రతిమాలెను	బతిమాలెను
౬౪	౨౦	నమస్కరించి	మనస్కరించి
౬౬	౬	సంభాషణము	యుపదేశము
౮౧	, ౮	య్యైహికపరంప	య్యైహికసుఖపరంప
౮౪	౧౦	నాబాగు	నాలాగు
౮౫	౧౫	హెచ్చరించెను.	హెచ్చరించిరి.
౩౮	౫	జాఁచి, వధూమణీ!	జాఁచి, వధూమణీ
౮౭	౮	లుకీ	కీలు
,,	౧౭	కెంది	చేరి
౮౯	౬	భవనమువఁ జేరఁ	భవనముఁ జేరఁ
,,	౨౩	చిఱునవ్వెలయ	చిఱునవ్వొలయ
౭౨	౪	లోవచ	లోచన

౮౩	౨౩	యానందావృతము	యానందామృతము
౯౩	౨	సమారాధనాదినము	సమారాధనదినము
౯౬	౧౦	యాయాశాఖా-మార్గము	యాశాఖామార్గము
౯౭	౧,౨	మనపూర్వకముగఁ	మనఃపూర్వకముగఁ
,,	౧౫	మ్మదిరిగితిని.	దిమ్మదిరిగితిని.
౯౮	౧౫	నాశనము	నాశము
౧౦౮	౩	నిరూఘప్రవర్తనముఁ	నిగూఢప్రవర్తనముఁ
౧౨౪	౧	రమణీ వశుఁడై	రమణికి వశుఁడై
౧౨౯	౫	ఇట్టితతి	తగుపరి
౧౩౨	౩	రెయొన్ని	తన్నాశ్రయించినరెయొన్ని
౧౪౨	౧౫	ప్రకమముగ	సక్రమముగ
౧౪౮	౨,౩	వాఙ్నైపుణము	వాఙ్నైపుణ్యము
౧౫౬	౧	మఱచియుండిరా?	మఱచియుంటిరా?
౧౬౦	౫	సీత నథోలోకమున	సీత నన్నథోలోకమ్మున
౧౬౩	౧౬	నరహంతకులకును	నరహంతకులను
౧౬౪	౮	నిట్లుండుట నేయు పతికి	నిట్లుండుటయేయగు పతికి
,,	౧౯	గంటకగుల్మిసీకుల్యము	గంటకగుల్మిని
౧౬౯	౧౨	దిరుప్వార్శ్వములఁ	దిరుపార్శ్వములఁ
౧౭౧	౨౦	బొక్కి-పోవు	జొక్కి-పోవు
౧౭౩	౧౭	శత్రులుగాని	శత్రువులుగాని
౧౮౨	౫	రఘునాథనాయఁ	రఘునాథరాయఁ

కథ-వధ-పథము- రథము- నాథుఁడు- సారథి-నిరాకరించు- ప్రార్థించు మున్నగు ధ్వనులలోని థ ధ ల భేదము పాటించియుండలేదు. ఇద్దరు-తరి-మారు మరి-అందరు-ఎరింగి-తిరగు-నెగవేర్చు-కొందరు-నెరపు-విరిగి-తెరచు-కోరమీ సము-కోరకు-పరకు-ఉరుకు-కూరఁట-ఈశబ్దములలోని రేఫము, శకటరేఫముగను మాఱుగాఁ బడినది. ముఱఁది-ఏఁట-చాఁచు-వాఁడు-చీఁకటి-మెఱుఁగు-ప్రాఁకు-మెఱఁగు-ప్రాఁగు-రేఁగు-మోఁదు-దాఁక-మూఁకు-ఆఁగు-తొడఁగు-మూఁడు-తోఁచు-తొలఁగు-ఈపదములలోని యరసున్నలు విడిచిపెట్టఁబడినవి. చదువరులు యథామతి వీనివ్యత్యయములను ముందుగా సవరించుకొనఁ బ్రార్థితులు.

విషయసూచిక

(సూచికకు మొదట)

(సూచికకుఁ దరువాత)

శారద.

మొదటి ప్రకరణము

ॐ

రెండువేల బహుమానము.

స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహనశకవర్షంబులు, ౧౮౩౨ వ సాధారణనామసంవత్సర వైశాఖ కృష్ణ త్రయోదశీ భానువార దివసమున, శ్రీ*కాటమేశ్వరకూటప్రదేశమసంఖ్యాక జనసమూహముచే నలంకృతమై యుండెను.

కాటమేశ్వరకూటము కటకప్రదేశమున నుత్తరదిగ్భాగమునఁ గొలఁది దూరములోనొంటిగా రమారమి మూఁడు వందల యడుగుల యున్నతముగల శైలరాజము. దాని దక్షిణతటమునఁ బూర్వాభిముఖముగా నొకయాలయమున్నది. గర్భాలయమున సుమారు గజమెత్తుగల నల్లని శిలావిగ్ర

*ఈకాటమేశ్వర కూటమే ప్రకృతము "కాటమయ్య" కొండ'యను నామమున వ్యవహరింపఁ బడుచున్నది.

హము కాటమేశ్వర నామమునఁ బూజఁగొనుచుండును. ఈ విగ్రహము బహుపురాతనకాలమునఁ బ్రతిష్ఠింపఁబడిన దనుట కాప్రాంతవాసు లొకకథ నేఁటికిని జెప్పుకొనుచున్నారు.

పాండవు లొకప్పుడు రాజ్యవైభవములు మాని యరణ్యమున కరిగి, యందు నివాసమేర్పఱచుకొన్న పిమ్మట, నర్జునుఁ డొక్కనాఁడు విహారము కొఱకీ గిరిప్రాంతమునకు వచ్చెను. ఈశ్వరుఁడు నుమాసహితుఁడై విలాసార్థ మప్పుడప్పుడే యీప్రాంతమునఁబోవుట తటస్థించెను. పార్వతి యర్జునుని వెన్నుభాగమునఁగల విశాలతిలకమునుగూర్చి పెక్కుతడవలు విన్నదగుటచే, దానిఁజూడఁగోరి తనయిష్టమును నాథునకు విన్నవించుకొనెను. శంకరదేవుఁడు నందులకామోదించి, కిరాతవేషమునుదాల్చి, యొకానొకకారణమున నర్జునునితో ముష్టియుద్ధమునకుఁ గడంగెను. ఆపోరునఁ బార్థునకే జయము లభించెను. అతఁ డుమేశునిఁ గ్రిందికిఁద్రోసి పైఁబడి, తనపట్టు నుండి మహేశ్వరుఁడు కొంచెమేనిఁ జలించనిరీతిని, దనబలిష్ఠ బాహుపాశములచే నాతని శరీరాంగములను బంధించెను. సమీపమున నిలుచుండి యీచిత్రములనెల్లఁ గాంచుచుండిన గౌరికి, విజయుని చరమాంగమునందలి మచ్చయగపడెను; కనుక నామె చిరకాల మనోభీష్టమును సిద్ధించెను. మహాదేవుఁడు ధనంజయుని బాహువిక్రమమున కాశ్చర్యమునొంది తనదివ్య పాశుపతాస్త్ర మామేటివీరునకుఁ బ్రసాదించెను.

కాటమేశ్వర పర్వతారణ్యజను లీ పురాణగాథ నిప్పటికిని జెప్పుకొనుచు, నాయీశ్వరుఁడే యాతఁడని భావింతురు.

అర్జునుఁడు పరమేశ్వరు నుద్దేశించి హిమశైల శిఖరమునఁ దపస్సు చేసినట్లును, ఈశానునివలనఁ బాశుపతాస్త్ర లాభమును సహిత మచ్చటనే పొందినట్లును, మహాభారతము నుడువుచున్నది; కాఁగా నరుఁడు దండకారణ్య పీఠభూములఁ జరించుటయు, మల్లయుద్ధమున గౌరీవల్లభుని జయించుటయు, నందుఁ బాశుపతాస్త్ర భాగ్యమును బడయుటయు, నెట్లు పొసఁగునో! సువిచారపరులగు మా పాఠకోత్తము లిందలి సత్యాసత్యములను నిర్ణయింప సర్హులు.

శ్రీ కాటమేశ్వరాలయ పార్శ్వభాగమున యాత్రికుల యుపయోగార్థ మొక ప్రశస్త శిలామందిరము నిర్మింపఁ బడియున్నది. ఈస్థానము పవిత్రక్షేత్రమని భావించి, భక్తు లనేకులిచ్చటికివచ్చి, కొండయందలి దొనలలో జలకమాడి, మొక్క మాఱు శైలప్రదక్షిణ మాచరించి, మహాదేవునకుఁ బుష్పఫలతాంబూలాదులను సమర్పించి, ప్రసాదభాగ్యమునుబొంది పోవుచుందురు. ప్రతి వత్సరమునను గాటమేశ్వరున కుత్సవాదులు వైభవపురస్సరముగ జరుగుచుండును. పర్వతమునకుఁ 'గాటమేశ్వర కూట' మను నామ మందలి యీశ్వరాలయమును బట్టియే వచ్చియుండునేమొ!

శ్రీ కాటమేశ్వర సన్నిధానమున జరగు నుత్సవాదులలో, నిప్పటికిఁ గొన్ని సంవత్సరములుగ నేఁటేఁటను దప్పనిసరిగఁ దటస్థమగు సమారాధనావైభవ మన్నికడలఁ జాలఁ బేరెన్నికఁ గాంచియుండెను. ఈవిషయమున సిద్ధరామపుర వాస్తవ్యుఁడగు వియ్యూరి పూర్ణచంద్రయ్యనామ మాబాల

గోపాలమునకు విదితమై యుండెను.

పూర్ణచంద్రయ్య బహుకాల మనపత్యుఁడుగనుండి, యొకప్పు డారాధనార్థ మీకాటమేశ్వర సమ్ముఖమునకు భార్యతోఁ గూడ వచ్చి, తనకుఁ బుత్త్రసంతానభాగ్య మబ్బినచో నిరువదియైదు సంవత్సరములకాల మీకోట దైవసన్నిధానమున, బీదజనుల కన్నదానమును - వస్త్రప్రదానమును - జేయునట్లు సంకల్పించుకొనెను. అంతమాత్రముననేగాక జాయాపతు లీవాంఛాపరత్వమునఁ బెక్కువ్రతముల నాచరించి, సంతానకరౌషధముల నెన్నింటినో సేవించిరి. అనంతర మొకటి రెండేండ్లకుఁ బూర్ణచంద్రయ్యప్రియపత్ని యగు శకుంతలాంబకుఁ జూలు నిలుచుటయు, నందనుఁ డుద్భవ మందుటయుఁ దటస్థించెను. జనకుఁ డాపుత్త్రునకుఁ జంద్రమౌళి యను నామకరణ మొనరించెను. అదిమొదలాతఁడు స్వామిసేవయం దెంతయు నిరతుండై, సమారాధనాధికముల నత్యంత భక్తిపూర్వకముగ జరపించుచుండెను.

కాటమేశ్వర సన్నిధానమున నీవఱ కిరువదినాలుగు సమారాధనలు చెల్లిపోయినవి. వాని ప్రతీతిని గుఱించియు నియమదినమును గూర్చియు నాకర్ణింపనివా రుండరు. నేఁటిసమారాధన కడపటిది. పూర్ణచంద్రయ్య యత్యంత విభవాభిరామముగ నీ కైంకర్యమును బూర్తిచేయింపఁ దీర్మానించుకొని, తీవ్రోత్సాహముతో నిందుల కుద్యమించెను.

ఉత్సవమునాఁటి కొకటిరెండుదినములకు ముందే బహుదూరమునుండి బీదసాదలు వందలకొలఁది గుంపులు గుంపులై

వచ్చి, యాపర్వత సానుతటముల నునికి నేర్పఱచుకొనియుండిరి. దరిద్రులుమాత్రమేకాక, లోభపరాయణులలోఁ గలవారు సహితము కొందఱు దక్షిణాకాంక్షకారణమున నానాస్థలములనుండి పాదచారులై యేతెంచి యుండిరి. వేరు లనేక ప్రాంతములనుండి వచ్చి, యా శైలరాజమునకు దక్షిణభాగమునంగల సమతలమున వరుసలుగఁ బటకుటీరములను నిర్మించుకొని, పలు తెఱఁగులగు పదార్థసంచయమును విక్రయమునకు సంసిద్ధముగ నుంచుకొని యుండిరి. ఈమహోత్సవ దినములను వినోదార్థముగాఁ గడపఁదలఁచి, ధనికులును దదితరులును స్వకుటుంబములతో శకటములపైఁ జనుదెంచి, యాప్రదేశ భాగ మహీరుహచ్ఛాయల విడిసియుండిరి. ఇట్లుకూడిన యాత్రికసేనాపరంపర లాయచలతటమునఁ గలకలాన్వితముగ నత్తుంగతరంగసంచయ సమాకీర్ణమగు నొక మహాసాగరము వోలెఁ జెలువారుచుండెను.

పూర్ణచంద్రయ్య గృహసేవకులతోడను భార్యాపుత్త్రులతోడను మిత్రమండలితోడను బయలుదేఱి, తొలినాఁటి యుదయమునకే కాలమేశ్వరస్థానముఁ జేరి, వలయు సన్నాహముల నన్నిఁటిని గావించెను.

యాత్రికు లుత్సవమునాఁటి ప్రభాతసమయముననే మేల్కని, యాహ్నికకృత్యములను నిర్వర్తించి, వారి వారికి లభ్యములైన కొలఁకులలోఁ దీర్థమాడఁ జొచ్చిరి. పర్వతమునందలి దొనలన్నియు యాత్రాపరుల జలక్రీడలతోను సంతోషకోలాహలధ్వనులతోడను మునిఁగి పోవుచుండెను.

దైవాలయ పార్శ్వభాగమునఁ గల పత్రిమున గాఁడి పొయ్యి లేర్పఱుపఁబడినవి. నేర్పరులగు వలలులు శుచిర్భూతులై యాయధిశ్రయణులయం దగ్నిని బ్రజ్వరిలఁజేసి, పాకములను సిద్ధపఱుపఁ జొచ్చిరి. వంటకపు రాసులు శ్రేణులు గట్టుచుండెను. పలువిధములైన కూరలుభాండములనుండి కమ్మని వాసనల వెలివఱచుచుఁ, గాంచువారికిఁ జవులూరఁ జేయుచుఁ, బాచకుల పాకశాస్త్రనైపుణ్యముఁ బ్రదర్శించుచుండెను.

ఈశ్వరునకు మంగళాభిషేకాలంకరణ కర్పూర నీరాజనాది పూజాక్రియలు నెఱవేర్పఁబడిన యనంతరము, యాత్రికు లాశిఖరి నికటమునందలి తింత్రిణీవనమున, భోజనార్థము వరుసలుగట్టి కూరుచుండుట కనుమతింపఁబడెను. ఎవ్వరికి నేవిధమగు లోటుపాటును గలుగక, జాగులేక, సర్వులకుఁ దోడ్తోడ వడ్డన లమర్చుటకుఁ గుశాగ్రబుద్ధిగల యువకులు నియోగింపఁ బడిరి. సుందరశాల్యన్నము, దివ్యసూపము, పరిమళఘృతము, మధురభక్ష్యములు, మనోజ్ఞశాకములు, సురసోపదంశములు, మున్నగు పదార్థములతో నెమ్మదిగఁ దృప్తికరముగ భోజనములుతీఱెను.

తదుపరి యాత్రికజనులందఱును దింత్రిణీవన పురోభాగమున నిర్మింపఁబడియున్న సువిశాలోన్నతకాయమానమునఁ జేరిరి. అది నలువైపుల సమున్నత కదళీస్తంభములను, బచ్చతోరణములను, బహిర్ద్వారముఖమున “స్వాగత” వచనమునుగలిగి వివాహమండపవిధమునఁ గరము విరాజిల్లుచుం

డెను. మండపాంతరాళమునఁ గేంద్రస్థానమున నెత్తైన వేదిక యు నందుపై దారుపీఠములు నేర్పఱుపఁబడియుండెను. పూర్ణచంద్రయ్యయు నాతని మిత్రమండలియుఁ దదితరప్రముఖవర్గమును నందుఁ గొలువైయుండిరి. మండపమంతయు యాత్రికసభ్యులచేఁ గ్రిక్కిరిసి కిటకిట లాడుచుండెను. జనుల కోలాహలము నడఁప శాంతిరక్షకు లందందుఁ బరిశ్రమించుచుండిరి. పండ్రెండేండ్లు దాఁటని బాలుఁడొక్కఁ డారంభమునఁ బైకిలేచి గళము సవరించుకొని శ్రావ్యస్వరమున శ్రుతిననునయించి సరళముగ — సరసముగ — హృదయాకర్షకముగ — నీశ్వరప్రార్థనాగీతికలను బాడి, వినువారి మనోంబుజముల నానందసాగరమునఁ దేల్చెను. అనంతరము హితకారిణీ సమాజసభ్యులలోఁ గొందఱు ఆరాధన — ఉత్తమశీలము — త్యాగము — మున్నగు శీర్షికలపై ననర్గళవాగ్ఝరితో నుపన్యసించిరి. వారిలో నొక్కఁడగు శివరామయ్య చంద్రపాళీశ్వరుని జీవితమున నింతవఱకు నడచిన కథాభాగమును గుఱించి మాటలాడుచు, నడుమ నడుమఁ జెందిన యాతని పరివర్తనముం గూర్చి, వినసొంపుగ — నర్మగర్భితముగ — సముచితముగ — హితసూచకముగ — భాషించెను. పూర్ణచంద్రయ్య వారిని గౌరవపురస్సరముగ యోగ్యరీతిని సత్కరించెను. పిమ్మటఁ గొంతతడవు సభ నిశ్శబ్దముగ నుండెను.

ఆ సమూహమున నెచ్చటనో మాఱుమూలనున్న విరజానందయోగీంద్రుఁడు నమ్రభావమున నిలుచుండి, కరుణాపరిపూర్ణములగు దన కటాక్షమాలికలను ముందునకు సారించి,

నెమ్మదిగ — స్వాదువచనముల నిట్లనెను.

"ఉదారగుణాలయుఁడైన యీ పూర్ణచంద్రుఁడు కొనియాడఁ దగిన సత్పురుషులలో నొక్కఁడు. ఈతఁడు మహనీయుఁడగు నొకానొక రాజయోగి. ఇట్టి సుచారిత్రుని కుచిత సంతానభాగ్యముఁ బ్రసాదించుటలో, నీశ్వరుని భవ్యోద్దేశమీపవిత్రరంగమున సువ్యక్తమయ్యెను. భాగ్యనాథుఁడగు పూర్ణచంద్రుఁడు తన దివ్యాశయమును సుస్థిరసంకల్పమున వినిర్మలహృదయముతోఁ గీర్తివంతముగా నెఱవేర్చెను. దినద్వయమునుండి సమస్తభూతములకు నిచ్చట సమభావమున నారాధనము జరుపఁబడినది. ఎవ్వరియెడ నించుకేనియు భిన్నబుద్ధి చూపఁబడలేదు. పూర్ణచంద్రుఁడు సమారాధనశబ్దమును దన యుత్తమపరిశ్రమమువలనఁ జక్కఁగ సార్థకము చేసెను. ప్రపంచమున భూతకోటి కెల్లవేళల నిట్టి యానందమే నింపాదిగఁ గలుగునుగాక! చంద్రమౌళి జీవితావధి నిట్టి పవిత్ర జన్మదినము లెన్నియేనిఁ జెల్లిపోయెడిని గాక! పూర్ణచంద్రుని యుత్తమకుటుంబమున నభ్యుదయ పరంపర లనారతమభివృద్ధి నొందెడునుగాక!"

ఆ యాత్రికజనసముదయమున నిట్టి దివ్యపురుషుండుండెనని, యింతవఱకు నచ్చట నెవ్వరును గమనించియుండలేదు. ఎల్లరకు నాతఁ డపరిచయుఁడే. అందలి ప్రజలందఱు నాశ్చర్య సంభ్రమ సమన్వితాలోకనముల నమ్మహనీయునిఁ జూడఁదొడఁగిరి. వారిచూడ్కు లాసాధుమూర్తి వదనమండలమును జుంబించుచున్న ట్లుండెను. ఆపూజ్యుని వాక్యజాలము

వాదలి ప్రత్యుత్తరము నత్యంత భక్తిశ్రద్ధలతో నాలించుచుండిన పూర్ణచంద్రయ్య విస్మయాంతఃకరణుఁడై నిలుచుండి సవినయముగ "ఓ పావనమూర్తీ! మీవంటి యోగీంద్రుల దివ్య పాదరజోలేశ మీయెడ మమ్మనుగ్రహింపనుండెనని గ్రహింపఁజాలని మందమతుఁడనైన నా యపరాధములను క్షమించి, యిచ్చట సిద్ధముగనున్న యీ యుచితాసనము నంగీకరించుఁడు." అని ప్రార్థించుకొనెను. పూర్ణచంద్రయ్య యతిసత్తము నాహ్వానించుచున్నట్లే యాజనస్తోమమున సమ్మహాత్మునికై దారియేర్పడెను. అట్టి సత్కార మావిరాగి కింపుఁ గూర్పలేదు కాఁబోలు. ఆతఁ డతిప్రయాసముతోఁ బూర్ణచంద్రయ్య యభిమతమును సిద్ధింపఁజేసెను. అంతలో శకుంతలాంబ వరహాలును ఫలావళులును గల యొక పైఁడిపళ్ళెరము నెంతయుఁ బూజ్యభావమునఁ గొనివచ్చి, యమ్మహానీయునకు సమర్పింపఁబోయెను. కందమూలాదుల నాహారములుగఁ గొనుచు, నడవులఁ గ్రిమ్మరు సన్యాసుల కివి యన్నియు నెందులకు? యోగిపుంగవుఁడు — విరజానందస్వామి — మందస్మితుఁడై, యందుండి యొక కదళీఫలమును మాత్రము గ్రహించి, తనకు నిరూపింపఁబడిన పీఠమున నాసీనుఁడయ్యెను. అదియొక మహాభాగ్యముగ భావించి, శకుంతలాంబిక పళ్ళెరమును గన్నుల కద్దుకొని, వెనుకకొదిగిపోయెను.

వస్త్రప్రదాన మారంభింపఁబడెను. గుట్టలవలెఁ జూపట్టుచున్న పరీధానరాసులు క్షణక్షణమున నదృశ్యము లగుచుండెను. స్త్రీలకుఁ బురుషులకు బాలకులకు బాలికలకు వృద్ధు

లకు యువకులకు వర్ధించిన యొక్కొక్కరికిని లేదనక యోగ్య వస్త్రములు పంచిపెట్టఁబడెను. దక్షిణాలు విరివిగ నొసఁగఁబడెను. అందుఁ జేరియున్న సర్వులు పూర్ణచంద్రయ్య త్యాగశీలము ననేక రీతులఁ బ్రశంసించిరి. ఇంతలో శ్యామలవర్ణుఁడును — దృఢశరీరియు — గభీరవదనుఁడును-నగు నొకపురుషుఁడు పైకి లేచి యిట్లనెను.

"ఇంతవఱకు భాషించిన నాసోదరు లోక ముఖ్యాంశమును వదలి నావిషయముగ మాటాడ నాకవధిఁ గల్పించినందులకు సంతసింతును. ప్రకృత విషమస్థితినిఁగూర్చి విశదపఱచుట కీసమయ మెంతయును దగియున్నది. లోకమున సుఖించువారికంటె శ్రమనొందువారిసంఖ్యయే యధికము. అనేకులు దరిద్రదేవతకు దాసులైపోయినారు. సుఖవంతుల మనుకొన్నవారును గష్టములకు గుఱియగుచుండక పోలేదు. బీదలు తిండికిలేక స్రుక్కుచుండుట యటుండ దొంగలభీతి చేఁ గంపించుచున్నారు. ముఖ్యముగా నీప్రాంతమున దోఁపిడీలు — హత్యలు నానాఁట హెచ్చుచున్నవి. ఇందులకుఁ గీలకమైన పురుషుఁడొక్కఁడే. అతఁడు ధనలోభమునకుఁ గట్టువడి, తినకీడైనవారి నొకకొందఱినిఁ గూర్చుకొని, యీప్రాంతారణ్య భూములయం దెచ్చటనో కొండగుట్టలలోఁ జేరుకొని దారుణ క్రియలకుఁ గడఁగుచున్నాఁడు. అతనియునికి భేదింప నీవఱకెందఱో ప్రయత్నించియు వ్యర్థులైపోయిరి. అతఁడు సాధారణపురుషుఁడని తోఁచుటలేదు; కనుక నావిషయమై సల్పు కృషియు నసాధారణమైనదే యగును. నిశ్చయముగ నారా

షుసునిఁ బట్టి యుచితశిక్షకు గుఱిసేయకున్నచో జనులకష్టములింకను హెచ్చుఁగలవు. ఈమహాజనలోకమున నాచోరనాథునిఁ బట్టితేఁగల శూరులెవ్వరేని యున్న, దయయుంచి ముందునకు రండు. మాయెదుటఁ బ్రతిజ్ఞఁబూనుఁడు. అట్టి వారికిఁ బ్రపంచహితార్థమై నేను స్వహస్తమునుండి విరాళముగ నేయిరూపాయల నొసఁగ నిశ్చయించుకొంటిని."

గంభీర భాషణముల నిట్లు పలికిన యా పురుషుఁడు చినవీరశర్మ. సిద్ధరామపురవాసుఁడు. పూర్ణచంద్రయ్య యాదరణమునకుఁ బాత్రులైన మిత్రులలో నొక్కఁడు. సభ్యులందఱు నాతని పరోపకారపారీణతను గూర్చి వేయి విధముల శ్లాఘించిరి. కొండొక తడవున కారంగమునుండి యౌవనపురుషులిద్దఱు ముందునకువచ్చి సుస్థిర స్వాంతమున "మేమా దుష్టుని సపరివారముగఁ బట్టెదము. ఇదే ప్రతిజ్ఞ చేయుచున్నారము" అనిరి. ఆయువకులలో నొక్కఁడు మహారాష్ట్రుఁడైన చిన్నోజి. మఱియొకఁడు రసపుత్రి వంశజుఁడగు రూపసింగు. వారును సిద్ధరామపురవాస్తవ్యులే. మఱియు హితకారిణీ సభ్యులుకూడను. ఆ వీరవర్యుల శక్తి తత్వముల నెఱింగిన యచ్చటి సదస్యులు "ఔనిదిపోలు. ఇందులకీ యువకులెంతయును దగుదురు. వీరిని గనుబ్రొమ నెట్టిపోటరియగువానికేనిఁ గాదు" అనిరి.

"మంచిది. మీరెంత శీఘ్రముగ నీపని పూర్తిచేసిన నంతమేలు. ఇందులకై మామిత్రుఁడగు పూర్ణచంద్రయ్య కూడ, నిప్పుడే మఱియొక వేయి వాగ్దత్తముచేసెను; కనుక మీరు

గట్టిపూనికతోఁ గృషిసల్పి యా దస్యునాధునిఁబట్టి మాకడఁ బెట్టి రెండువేల బహుమానముఁ గైకొనుట యెంతయు నుచితము." అనుచుఁ జినవీరశర్మ యా వీరుల హస్తాంజలియందుఁ దాంబూల మిడెను. తోడనే కరతాళములు మ్రోఁగెను. సభముగిసెను.

రెండవ ప్రకరణము.

అపరాధ పరిశోధకుఁడు.

మధుమాసమునఁ బ్రథమ పక్షము నడచుచున్నది. అందొక్కనాఁ డాకాశసాగరమున జలధరతరంగములు చెల రేఁగఁజొచ్చినవి. తనసహజతేజమును బాసి సూర్యభగవానుఁ డావారిదసంచయగర్భమున నెందు డాఁగియుండెనో యెవరు చెప్పఁగలరు? సాయంసమయ పర్యంత మేకవిధముగాఁ దారా పథమున నలమికొనిన యామేఘమాలిక లప్పుడప్పుడే వీచిన మలయమారుత స్పర్శమువలనఁ గరఁగి, సోనలుగురియసాగెను. క్రమక్రమముగ సోనపరంపర లభివృద్ధిఁ గాంచి యద్భుతవర్షముగా మాఱిపోయెను.

ధారాధరము లిట్లు వారిధారల నెంతకాలము గ్రుమ్మరించెనో మే మెఱుంగము. రాత్రియయ్యెను. ఆ తమిస్రాసమయార్ణవమునఁ దిమిర తరంగములు హెచ్చి, ద్విగుణముగఁ జెలరేఁగఁ జొచ్చెను. ముదిరసముదయము లింకను జెదరిపోవ లేదు; వర్షమునాఁగలేదు. అట్టి భీషణయామినీ సందర్భమున—ఆ కటికి చీఁకటిలో—నిండుగాఁ గంబళముఁ గప్పుకొనిన వ్యక్తి యొక్కటి, వర్షపాతమధ్యమున శేషసాగరవీథులలో వడివడిగా నడచుచుండెను. ఆ విగ్రహమిట్లు చనిచని యొక భవన ప్రవేశముఁ జేసి, యందొక్కచోఁ దటాలున నిలిచిపోయెను. అందలి

దీపప్రకాశమున మే మామూర్తిముఖావలోకనము చేసితిమి. మాకావ్యక్తిస్వరూపము సువ్యక్తముకాలేదు. కొన్ని ముఖ్య చిహ్నములఁబట్టి యదియొకానొక పురుష విగ్రహమని మాత్రము భావింపఁ గలిగితిమి. మనకింతవఱకు నాతని పరిచయ మొదవియుండెనో లేదో నిర్ధరించుటకుఁగాదు. అతఁడా గృహ యజమానుఁడగు నుమాపతి మాత్రముకాఁడు. ఎవ్వఁడో యపరిచితుఁడై యుండునేమొ!

శారద దేదీప్యమానముగఁ బ్రకాశించుచున్న దీపచ్ఛాయను గూరుచుండి వీణ వాయించుచుఁ, గోమల కలకంఠమున మధుర మోహనరుతము సేయుచుండ, నెదుటనాసీనుఁడైయున్న యుమాపతి యాప్రశస్తమంగళస్వరమునం దంతరంగముఁజొన్పి, తన్మయత్వముఁ జెందియుండెను. కాలనియతి గానవినోదమునకులేదా? ఉదయ మధ్యాహ్న సంధ్యలు దానికిఁ దెలియఁబడవా ? రాత్రి — కాఱుచీఁకటి — పిడుగులనురాల్చెడు మేఘగర్జనలు— అందున నెడతెఱపిలేక కురియు వర్షము — ఇట్టి యసమయమునఁగూడఁ బంచమస్వరాత్మకముగు కోకిలారవము హృదయాకర్షదాయకముగనుండునా? ఆదివ్యనాదమున కివియన్నియు నభ్యంతరకారణములు కాఁజాలవా? కానిచో నిశ్చయముగ నదియొకానొక యున్మాదకర కర్మమని తలపోయఁజెల్లునా ?

ఉమాపతి యాక్రొత్తమనుజునిఁ జూడలేదు. అప్రశాంత దివ్యజ్యోతిసమ్ముఖమున. సముజ్జ్వలకాంతులఁ గ్రుమ్మచుఁ, దనమాధురీసమంచితారవమును వీణానాదముతో నైక్య

మొనరించుచు నుండు నాసరస్వతీదేవికూడ నాయన్యపురుషునిఁ గాంచలేదు. ఆతని పదశబ్దమైన వారికిఁ దెలియఁబడలేదేమొ.

ఆ తరుణమున నామానవుఁ డేహేతువున నందుఁబ్రవేశించెనో యూహింపఁగాదు. ఆ గానామృతరాశిలో నాతని మానసము మునుకవైచినట్లు లేదు. ఆపురుషుని చిత్త మొక వంక నుండలేదు. ఆతఁడు మిక్కిలి చలించిపోవుచుండెను. తన సంకల్పము నుత్తర క్షణముననే యజమానునకుఁ దెలియఁజేయఁ దహతహపడుచున్నట్లు కన్పట్టుచుండెను. గృహస్థుఁ డది తెలిసికొనలేదు. తెలియఁజేయుటకు నూతనపురుషుఁడు సాహసింపలేదు. ఇట్లొక క్షణకాలము దాఁటెను. మఱునిమేషముకూడ తనంతనే కడచిపోయినది. ఆగంతకుఁడు కాలయాపనము నోర్వజాలక యుపాయాంతరముఁ దలపోసి గళము సవరించుకొనుచు ధ్వనిచేసెను. శారద తలయెత్తి యా నిగూఢమానవాకృతినిఁ జూచెను. తత్క్షణమే గానమునాఁపి యామె యచ్చటనుండి లోనికేగెను.

తమ యానందానుభవమున కున్నట్టుండి భంగముకలిగించుట కేది కారణమైయుండును? ఇట్లు శంకించి కాఁబోలు నుమాపతి వెనుదిరిగిచూచెను. అచ్చటఁ గృష్ణవర్ణమును మంచికండరపుష్టియుఁ గల దీర్ఘకాయుఁ డాతనికి గోచరించెను. ఆమానవుని నుమాపతి సమీపించి, "మీ రెవరు? అయ్యా! మీ దేయూరు?" అని ప్రశ్నించెను. ఆగంతకుఁ డించుక యోజించి "నేనొక గృహస్థుఁడను - భూసురుఁడను - నావాససలము సిద్ధరామపురసమీపమునందలి యొకానొక కుగ్రా

షము" అనెను. ఉమాపతి క్షణకాలము చింతామగ్నుఁడై యుండి, 'నేనెఱుఁగని క్రొత్తవారిలో నీపురుషుఁ డొక్కఁడై యుండు' నని యాత్మగతమున భావించెను. పిమ్మట వారికి క్రింది మాటలు నడచెను.

ఉమా—ఎచ్చటనుండి మీరాక?

అగం—మండల ప్రధానస్థానమగు శేషనగరము నుండి.

ఉమా—మీయుద్యోగము?

అగం—నేనొక యపరాధ పరిశోధకుఁడను. ఆయుద్యోగ ధర్మము ననుసరించియే యిట్లు వేషాంతరముఁ బూనవలసి వచ్చినది. మీరు మండలమునందలి చోరనాథునిఁగూర్చియు, నాతని భటవర్గమును గుఱించియు, వినియున్నారుగదా?

ఉమా—ఆ దుండగీండ్ర క్రూరాచారములఁగూర్చి యాలకింపని. వారెవ్వరుందురు? ఇప్పు డావిషయముగ నేమి సంభవించినది?

అగం—మేమా దస్యుసంఘము నన్వేషించు ప్రయత్నమున నున్నారము.

ఉమా—అవు నదియుంతయు నుచిత కర్తవ్యమే. పిమ్మట?

అగం—నా యీ విధాయక కార్యమున నేను యోగ్య ఫలప్రాప్తి నందుదునుక, చాల నిగూఢముగ మెలఁగవలసి యున్నది. లేనిచో వారిజాడలఁ దీయుట కష్టము.

ఉమా—మంచిది. తరువాత?

ఆగం—ఇది చాల మర్మగర్భితము. ప్రస్తుతావసరమున మీకు నివేదింపఁ దగిన దింతయే. తదితరాంశము లనంతర మవధానముగ సంభాషించుట భావ్యమై యుండును.

ఉమా—నన్నిప్పు డేమిచేయు మందురు ?

ఆగం—మీరు నాకొఱకు మీయింట వేఱుగ నొక గది విడిదికై యొసఁగ వలయును. అది చాల రహస్యస్థానముగ నుండుటయావశ్యకము. నాయీ యునికినిగూర్చి మీరెవ్వరికి నేమియు సూచింపవలదు. దొంగ లది తెలిసినచోఁ దప్పక పలాయితు లగుదురు. ఈ ప్రయత్నమునకు మీతోడ్పాటు ముఖ్యముగఁ గాంక్షింపఁ దగియున్నది.

ఉమా—మంచిది. అన్న పానములు ?

ఆగం—ఆవిషయమున మీయింట నాకభ్యంతరము లేదు.

ఉమా—నేను యాదవకులజుఁడనని . మీరెఱుంగుదురు.

ఆగం—ఔను. అందువలనఁ గొఱఁత లేదు. మీరీవిషయముగ నెంతమాత్రమును శంకింపకుఁడు. ఈ పరిస్థితులలో నెట్టినియమమును బాటించుటకుఁగాదు.

ఉమాపతి మిన్నకుండెను.

ఆగం—నేను నారక్షకవర్గముతోఁ దఱచు సిద్ధరామపురమునకు వెళ్ళెడివాడను. శేషనగరమున కదియొక క్రోసుదూరము మాత్రమే యుండునుగదా? ఆసమయములలో నెల్లవేళల నేకాంతస్థానమున మీ బావమఱది పూర్ణచంద్రయ్య మా

సహాపంక్తివాఁడే! అతనియింట మాకుఁ గొఱంతలేక దినమొక దినుసువిందు జరిగిపోవుచుండును. ఆగాథ లటుండనిండు. విశేష సంభాషణమున కిప్పు డవధిలేదు. ముందు నా యభిమతముఁ దీర్చుఁడు.

ఉమాపతి మౌనభావమున ముందునడిచెను. ఆగంతకుఁ డాతనిని వెంబడించెను. గృహపతి యాతనికొఱకు రక్షకస్థానముఁ జూపి యందు నివసింప నియోగించెను.

మూఁడవ ప్రకరణము

అడకొత్తులోని పోఁక.

శారద కిప్పుడు పదునాఱేండ్ల వయస్సు; కాని యవివాహిత. సిద్ధరామపురమున-మాతులగృహమున-గరుడోత్సవము నారసి వచ్చుటకై జననితోడ నరుగవలసినయట్లు జనకుఁడు ననుమతించియుండెను. బండియు సంసిద్ధముగ నుండెను. ఏహేతువుననోగాని యామె వదనమండలమున నపూర్వానంద చంద్రిక లప్పుడప్పుడే యుదయించి నలుగడలఁ బ్రసరించుచుండెను. ఆ లావణ్యమయి సుకుమారసుందరాంగము లన్నియు నుత్సాహసంజనకములై యామె నవయౌవన తనూవిలా

సమునకును మోహనకర సౌందర్యాతిశయమునకును మఱింత శోభఁ గూర్చుచుండెను.

శారద యొకానొక చక్కనికుటుంబమునఁ బుట్టినకన్య. ఆమె జననీ జనకు లత్యంత సాత్వికులు. ధనాఢ్యులకును గుణాఢ్యులకును సంతెరువున్నది. ఒక మానవునకు సువర్ణము సుగుణమువలె నిజమైనగౌరవమును నిష్కళంకమైన యశస్సును గల్గింపఁజాలదు. ఉమాపతి ధనసంపన్నుఁడు కాఁడు ; కాని సద్గుణగరిష్ఠుఁడు. బహుగ్రంథములఁ జదివి వానిలోని గుణోత్కర్షమును గ్రహించిన వివేకి. కులాగతములైన హింసలను వర్జించి, గౌరవహాని కారకములగు మధుమాంసాదులను సేవింపమాని, వానివలని యపాయముల నూరివారికిఁ దెల్పుచుఁ, గేవల సాత్విక శాకాదులనే యాహారములుగాఁ గొనుచు, నాచారవ్యవహారములఁ జక్కఁగ సంస్కరించుకొనుచుఁ, దనకుటుంబరథము నా సాత్త్వికమార్గముననే కొనిపోవుచుఁ, బరువుతోఁ బ్రతిష్ఠతో జీవనముసేయుచుండెను. పౌరులలోఁ బెక్కండ్రుమాపతి యాదేశరత్నముఁ బూజ్యభావమున మనస్కరించి వినుచు, శక్తికొలఁది వాని ననుష్ఠానమునఁ జూపుచు, నున్నతిఁ గాంచుచుండిరి; కావున విశేషభోగాదులేవియు నుమాపతిని వరింపకపోయినను, నతని వినిర్మలకీర్తిచంద్రికలుమాత్ర మచ్చటచ్చట నావరించుచుండెను.

ఉమాపతి సతీరత్నము గౌరాంబిక. ఈమెయు సద్గుణాలంకారము. వయసు మీఁజిన వెనుక నీదంపతుల కొక స్త్రీశిశువు జన్మించెను. ఆమె రూపలక్షణములన్నియుఁ బితా

మహినిఁ బోలియుండెను. అందుచే సుమాపతి తనజనయిత్రి జ్ఞాపకార్థమై యాకందునకు "శారద' యను పేరుబెట్టెను. మాతృదేవి శిశువు నత్యంతావధానముతోఁ బెనిచెను. బాలికయు నల్లనల్లనఁ దప్పటడుగులు వైచుచుఁ గొంతకాలమునకే చిలుకవలెఁ బలుకనేర్చెను. ఆముద్దులమూన తెలివితేటలఁ గాంచి పొరుగింటియాఁడువారలిది చదివిన నెంత యుక్తముగ నుండునోయని మురియుచుండిరి.

శారద తనయైదవయేట స్వగ్రామమునందలి బాలికా పాఠశాల కనుపఁబడెను. ఆబిడ చాలఁ గుశాగ్రబుద్ధిగలది. విద్యయందు నెక్కువ యక్కఱపాటుగలది; కనుకఁ గొన్ని యేండ్లకే యాంధ్రగ్రంథములనెల్ల నిరాఘాటముగఁ జదువుటకును జదివినవిషయములలోని తత్త్వమును గ్రహించుటకును నుత్తమశక్తి నలవఱచుకొనెను. ఆమె సంగీతమును సహితమభ్యసింపఁదొడఁగెను. రూపమునకుఁ దోడు విద్యయు, శ్రావ్యకలకంఠమునకు సాహాయ్యముగ గానకళయుఁ గుదురుబాటగుటచు, నాబాలిక మెఱుఁగుపెట్టిన వజ్రమువలె నెంతయును రాణింపఁజొచ్చెను. పదునేను సంవత్సరముల యీడు దాఁటిన పిమ్మట జనకుఁడు శారదను బాఠశాలనుండి మాన్పించెను. నాఁటికామె తెనుఁగున మంచి సాహిత్యజ్ఞానమును సంగీతమునఁ జక్కని స్వరజ్ఞానమును బొంది, యభినవ సరస్వతివోలె నొప్పారుచుండెను. ఈశ్వరభక్తియు విజ్ఞానజిజ్ఞాసయు నామె కుపాంగములుగ నుండెడివి.

శారదకుఁ బెండ్లియీడువచ్చినందున, రాయబారము

లధికముగా రాఁదొడఁగెను. క్రొత్తవారు సహిత మెచ్చ [illegible]
సంబంధములనో గల్పించుకొనుచుఁ, దమకుఁ గూఁతు నీయ
వలసిన యుమాపతిని బతిమాలుచుండిరి. "స్థితి పదివేలు—కుమా
రుఁడు చక్కనివాఁడు — కన్యాశుల్క మైదువందలు—మీయు
ద్దేశమేమి?" యని స్వజాతిలోని ధనికులనేకులు లేఖలఁ బంపఁ
జొచ్చిరి; కాని యుమాపతి కేసంబంధమును సరిపడలేదు.

ధనము ప్రధానముకాదు. గుణమావశ్యకము. నిరు
పేదయైనను గుణవంతుఁడు పూజ్యుఁడు. గుణము జ్ఞానాభి
వృద్ధికి సాధనము. విద్యార్జనములేక జ్ఞానధనము గోచరిం
పదు. జ్ఞానవిహీనుఁడు పశుతుల్యుఁడు; కావునఁ దరుణ
వయస్సు—సత్ప్రవర్తనము—సాధుస్వభావము— సాత్వికాహార
నియమము — గల యుత్తమవరునకుఁ గన్యాదానముచేసి
పాణిగ్రహణోత్సవము జరుపవలయు ననునది యుమాపతి
ముఖ్యోద్దేశము. ఇంతవఱకుఁ దనకుఁ దెలియవచ్చిన సంబంధ
ములలో నీయాశయముల కొదవిన వరుఁడొక్కఁడును లభింప
లేదు; కనుక నాతఁ డందఱివిషయమున నిరాదరణభావమే
చూపవలసి వచ్చెను. ఏయొక ధనికునిపుత్త్రునకో కూఁతు
నిచ్చి, వివాహవైభవముఁ ద్వరలోఁ గన్నులారఁ జూడవలయు
నని, ముద్దరాలగు గౌరాంబిక వేగిరపడుచుండెడిది; అయినను
దానెంత త్వరపడుచుండెనో యంత శీఘ్రముగ నందులకుఁ
బ్రతిఫలము నిరాశనే పొందుచుండెను.

ఉమాపతి చెలియలికుమారుఁడు చంద్రమౌళి. ఆతఁడు
రూపరియుఁ జదువరియుఁ దరుణవయస్కుఁడును నుచితాహార

నియమవ్రతుఁడును గాకపోలేదు; కాని యేకొన్నివిషయముల యందో మాతులుని యభిమతముల కతఁడు సంపూర్ణముగ భిన్నప్రవర్తకుఁడైయుండెను. అతని గర్హితకార్యములకు వగచి, యుమాపతి శకుంతలాంబికాప్రార్థనానుమతినిఁ జంద్రమౌళిని స్వీయ గృహమున నునిచికొని, సమయోచితముగ హితవు బోధించుచుండెను. చంద్రమౌళి తన బాల్యబుద్ధినుండి విడివడెనో లేదో ఉమాపతి తోడనే యాతనిఁ దలిదండ్రులకడకుఁ బంపెను. చూచినవారందఱు "నింకనుగూఁతుకేల పెండ్లిసేయకున్నా' రనియడుగుచుండుటయు, శారద కీడు దాఁటిపోవుచుండుటయు, సంబంధములేవియుఁ గుదురకపోవుటయుఁ దలఁపనొక్కొకసమయమున నుమాపతికి దీర్ఘాలోచనము పొడముటయుకాని పర్యవసాన మేమియుఁ దేలుటలేదు.

నాల్గవ ప్రకరణము

ఆత్మోద్దేశము.

వివాహవిషయమై శారదాభిప్రాయ మెట్లున్నదియుఁ గనుఁగొని తెలుపవలసినదని యుమాపతి భార్య కాజ్ఞాపించి యుండెను. ఒకనాఁడు భోజనానంతరమున గౌరవాంబికకును దుహితయగు శారదకును గ్రిందివిధమున సంభాషణము జరగినది.

గా—నీవు పెద్దబిడ్డవైతివి. నీకింకను బెండ్లికాకుండుట మాకుజాలఁ దలవంపులు. మీతండ్రిగారన్ననో నీవిషయమై విశేషప్రయత్నమే చేయుచున్నారు. ఫలము మాత్రము కూడి రాలేదు; కాని వారు నీయిష్టమును దెలిసికొని యేలాగైనను మంచిచోటికి నిన్నియఁ దలఁచుకొనిరి. నీమనస్సునందలి కోరికను నాయెదుట దాఁచక చెప్పుము.

శా—ఈ విషయమై నాకేమియుఁ దోఁచుట లేదు.

గా—ధనవంతులు, గుణవంతులు, రూపవంతులు, విద్యావంతులు, పలువురు నిన్నుఁగోరిరి. ఈవఱకే చాలదూరమునుండి యనేకసంబంధములు వచ్చియున్నవి.

శా—తల్లీ! అందేదిమంచిదో యేదిచెడ్డదో నాకెట్లు తెలియఁగలదు? నేను లోకానుభవము లేనిదానను గదా!

గా—నిజము. ఈసంబంధములలోఁ బ్రత్యక్షమునఁ జూచినవియుఁ గొన్నియున్నవి. అందు నీవేవరుని సమ్మతింతువు?

శా—చూచిన మాత్రముననే భావముఁ గ్రహించుట కష్టము. నేనుచూచినవారందఱును, మేలుగుడ్డలు - మణిహారములు - పైఁడియుంగరములు - ధరించి, మిక్కిలిరమ్యముగనే కానఁబడిరి. అందువలన వారు పూజ్యులని తలంపనగునా? పైకి బాగుగ నగుపడినను వికృతస్వభావులుగ నేల యుండరాదు?

గా—అందఱు నట్టి వారేయని యెట్లుచెప్పెదవు?

శా—అందు వీరుమంచివారని నిర్ణయించు టెట్లు ?

గా—అయిన నీసంకల్పమేమి?

శా—నేనింతవఱకు నేమియు సంకల్పించుకొనలేదు.

గౌ—నీకుఁ బరిణయేచ్ఛ లేదా?

శా—లేకున్నను బ్రమాదములేదు. నేనట్లును దలపెట్టలేను.

గౌరాంబిక యందులకు మాఱుపలుక లేదు. కొంతసేపటికి శారదయే మరల మెల్లఁగా నిట్లనెను.

శా—పైమెఱుఁగులకు భ్రమసి తొందరపడుట యుక్తముకాదు. బాల్యమునుండియు మిమ్ము నాశ్రయించికొని, తన జీవనమే మీయదిగా నమ్ముకొని, మీయనుగ్రహమునకై నిండుకాంక్షతో వేచియుండు మీజామాతకన్నను మీకుఁ బూజ్యులెవరు?.

గౌ—(విస్మయాలోకనచిత్తయై) ఆచంద్రహాళినిఁ గూర్చియే నీవు చెప్పుచున్నావా? నా వెఱ్ఱితల్లీ! ఆ చండాలకూపమును స్మరింప నీకేల ?

శా—తప్పని బాంధవ్య మదియేకదా ?

గౌ—అయ్యో! తెలిసి తెలిసి నీ విట్లేల బావి నుఱుకఁ జూచెదవు?

శా—కానిండు. అతని యభివృద్ధిఁగోరఁదగినవారు మీరే.

గౌ—ఛీ! అతులువ యెట్లుపోయిన నేమి.

గౌరాంబిక విరక్తి భావమునఁ బలికెను.

శా—అట్లయినఁ జిరకాల మాతఁ డవివాహితుఁడుగ నుండవలసినదేనా?

గౌ—వాని ప్రారబ్ధమట్లున్న నెవరేమి చేయఁగలరు?

శా—ఆప్రారబ్ధమును దుడిచివేయువారు లేరా?

గౌరాంబిక యున్మాదినివలె నయ్యెను. ఉన్నట్టుండి యామె పెదవులపై నొకవిధమగు విరసహాస మంకురించెను. పుత్రికవంక నామె ప్రేమవీక్షణములఁ బఱపుచు "ఎంత ముగ్ధవు" అనెను. కొంతసేపటికామె మఱల నిట్లనెను.

గౌ—దూరమైనను గోత్రసంబంధమే మేలు. నీవు సుఖమైనచోటు నిర్ధరించుకొని నీతండ్రిగారు నిన్నడిగినప్పుడు విన్నవించుకొనుము. దైవానుగ్రహమున ధనవంతులకుఁ గోడలవై! నీవు సకలసుఖముల ననుభవించుచుండిన నాకెంతసంతోషము.

జననిప్రియతమవచనములకు శారద సుస్మితయయ్యెను. ఆరుచిరహాసమునందామె రహస్య సంకల్పము. వ్యక్తమగుచుండెను. గౌరాంబిక యాకీలకము నెఱుంగజాలకుండెను. ఇంతలోఁ బడసాలనుండి పదశబ్దము వినవచ్చెను. గౌరాంబిక వెలికిఁబోయెను. శారద చింతామగ్నయై యుండెను.

అయిదవప్రకరణము.

నేల విడిచిన సాము.

చోరనాథునిఁ బట్టితెచ్చుటను గూర్చి యానాఁడట్లు సభాస్థానమునఁ జినవీరశర్మసముఖమునఁ బ్రతిజ్ఞచేసివెళ్ళిన

యువకులిద్దఱు నన్వేషణార్థమై వేర్వేఱు దిశలకు వెడలి, నానా ప్రదేశములు చుట్టిచూచి, మరల నొకనాఁటి సాయంకాలమున భాగ్యపురసమీపమునఁగల యుపవనమునఁ గలిసికొనిరి. అచ్చట నాపురుషు లొకచెట్టుదిగువ గుంటిపైఁ గూరుచుండి, యిట్లు సంభాషింపఁ దొడఁగిరి.

"మనము మరల నింతకాలమునకిచ్చటఁ గలిసికొనుట కవకాశము లభించినందులకు సంతసింపవలసి యున్నది. చిన్నోజీ! నీ వానాఁడు పూర్ణచంద్రయ్యగారిబండిలోఁ గూర్చుండియే వెళ్ళితివిగదా?"

చి—అవును. రూపసింగ్! నేను వారిబండిలోనే వెళ్ళితిని.

రూ—మార్గమధ్యమున దొంగలు మిమ్ముఁ దాఁకిరని వింటిని. నిజమేనా?

చి—దానిఁ గూర్చి యేమిచెప్పుదును? ఆదుండగీండ్రు మమ్ము ముప్పతిప్పలపాలు గావించిరి.

రూ—మీరంద ఱుండియుఁగూడ నాక్షుద్ర మానవులను బాఱఁద్రోలలేక పోయినారేమి?

చి—మొత్తమున మేము పదుగురమేకదా? వచ్చినవారో యిరువదింటికి హెచ్చియుండిరి. అందునను జిమ్మచీఁకటి.

రూ—చినవీరశర్మ మీతో నుండలేదా?

చి—ఉండెను. ఆతఁడు కార్యాంతరాసక్తుఁడై మార్గమధ్యముననే బండిదిగి గ్రామాంతరమునకుఁ బోవుచుండెను. పాప మాతనిగతి యేమయ్యెనో! అయినను బలశాలి_ఎదిరికి

లోఁగని పోటుబంటు—

రూ—నష్టమేమాత్రము—

చి—చిన్న మెత్తు సొమ్మైనఁ బోయి యుండలేదు.

రూ—ఏల? వారుమిమ్ము నూరక వదలి పోయిరా!

చి—అవును. వారిరాక డబ్బు నుద్దేశించికాదు.

రూ—మఱి ?

చి—పూర్ణచంద్రయ్యగారి కుటుంబమును నిర్విశేషముగ నాశమొనర్పఁ దలఁచియుండిరని వారిప్రయత్నములఁ బట్టి తరువాత మేమూహించుకొంటిమి.

రూ—అహా! ఆదస్యు లింతకును సాహసించిరా? పాప మాపుణ్యపురుషుఁ డెవ్వరికి నెట్టి హానియుఁ జేసియుండలేదే!

చి—ఈశ్వరానుగ్రహమునఁ దటాలున నొక సాధు సైన్యము మాకుఁ దోడ్పై నిలిచెను. దొంగలు పాఱిపోయిరి. పట్టువడలేదు.

రూ—నాఁటిసభలో నట్లతివినయముఁ జూపిన యా యోగి యెవ్వఁడై యుండును? ఆతనిఁ గూర్చి నా కనుమానము హెచ్చుగనున్నది. నిశ్చయముగ నాపురుషుఁడు కపటసన్న్యాసియే. ఇంతయు నావ్యక్తి వలననే జరిగియుండును. ఏమందువు?

చి—లేదు, లేదు; అట్లు తలంచుట కవకాశము లేశమును లేదు. ఆతని శిష్యబృందమే మామానప్రాణములను రక్షించినది.

రూ—వెనుకటి గొడవతోఁ బ్రకృతావసర విషయము నేమఱితిమి. పోనిమ్ము—నీ ప్రయత్నము కొంతవఱకైన సఫల

మైనదా?

చి—ఔఁ! విఫలమైనది.

రూ—సరే—నీకు సహిత మాహంతకుని జాడ యించుకయుఁ దెలిసియున్నట్టు లేదు.

చి—ఎట్టులో పరిశ్రమించి వానిచరిత్ర మాత్రము కొంత వినఁగల్గితిని.

రూ—చెప్పుము; ఆ విషయమున నేమిగ్రహించితివో.

చి—వాఁడొకానొక యూరిబోయ; పేరు కొండఁడు.

రూ—నేను వినినదియు నదియే. అతఁ డూరిబోయ కొండఁడే. పిమ్మట ?

చి—ఊరిబోయ యనుటయేగాని యతఁడూరియందు మాత్రము కాఁపురముచేయఁడు. వాని యునికి యొకనిగూఢ ప్రదేశము. అదిదుర్జ్ఞేయమైనది. దుర్గమమగునొక పర్వతమాలిక యాస్థానమునకుఁ బెట్టనికోట. అందుఁ బ్రవేశించుటకు మార్గమెద్దియో యెవ్వనికినిఁ దెలియదు. కొండఁ డాచోటఁ బెక్కుమంది భటులతో నివసించును. వాయువేగముగల తురఁగములును-సివంగులఁబోలు జాగిలములును-వానికి గలవు. ఆపురుషునకు వివాహమైనది. భార్య లిద్దరు. వాఁడు రాత్రులయందే సంచారము చేయును. కొన్నివేళలలో దివాసమయములఁ గూడ గ్రామములపై దాడి వెడలుటయుఁ గలదు. అట్టితరి భార్యలుసహిత మాతనితోడ నుందురు. ఆసందర్భమున నావ్యక్తిని దొంగయనిగుర్తింపఁగల మనుష్యుఁడుగాని సాహసించిపట్టఁగల

వీరుఁడుగాని యుండఁడు. వానియనుచరు లన్నివిధముల మిగుల దక్షులు. తమ యజమానుఁ డెందేని బయలు వెడలినపుడు, వారు మారువేషములతో దవ్వుదవ్వులనుండి, యాతఁ డెక్కడను జిక్కువడకుండఁ జాల మెలకువతోఁ గాఁపుందురు. స్వామి కపాయము తటస్థించినపుడు వా రాతనిసంరక్షణార్థమై స్వీయ ప్రాణముల గడ్డిపోరకలకంటె నికృష్టముగాఁ జూతురు.

రూ—మంచిది. ఆదన్యనాథుఁ డీటీవల సల్పినచర్య లేవేని దెలిసినవా?

చి—అవును. ప్రత్యక్షమునఁ జూచిన విషయ మొకటి యున్నది.

రూ—అట్టులా! ఆలాగైన ముఖ్యముగఁ జెప్పుము.

చి—నే నొకనాఁడు విశ్వనాథపురమునకు బోయియుండఁగ నొకమహానీయుఁడు వచ్చియున్నాఁడనియు, సత్రమున బసచేసియుండెననియు విని, యచ్చటికి వెళ్ళితిని. సేవకుఁ డొకఁడు సత్రపు ముంగలిలో గుఱ్ఱమును దోముచుండెను. నేనాతని సమీపించి యిందు విడిసియున్నవా రెవ్వరని యడిగితిని. వారు మా యజమానులేయనియు, మహీశూరదేశపు దివానులనియు, శ్రీశైలయాత్ర వెళ్లుచుండి విశ్రాంతికై యిచ్చట నాఁగిరనియు, వలయు నేని మీరు సందర్శింప వచ్చుననియు, నాతఁడు చెప్పెను. నేనా సత్రముఁ బ్రవేశించిన యుత్తరక్షణము ననే, యందొకచో దూదిపరపుపై నర్థశాయియై పవ్వళించి యున్న యాపురుషునిఁ గాంచఁగల్గితిని. భార్య లిరువంకలఁ జేరి తమ స్వామిపాదముల నొత్తుచుండిరి. వా రమూల్యరుచిరాంబ

రాభరణభూషితలై మహారాణులవలె మిగుల విరాజిలుచుండిరి. నేను వెళ్లి నిలుచుండుట తడవుగా నాపురుషుఁడు కూర్చుండుఁడని చేసైఁగ చేసెను. ఆతఁడు పుష్టశరీరియు - మితభాషియు - గభీరహృదయుఁడును నై దుర్లభుని మాడ్కిఁ దోఁచుచుండెను. అంతలో నాయూరి పురోహితుఁడువచ్చి, పంచాంగము చేఁబూని, తిథివార నక్షత్రయోగకరణాదులఁ బఠించెను. తక్షిణమే వ్యక్తి తనప్రక్కనున్న ధనకోశమునుండి రెండురూప్యములనెత్తి బ్రాహ్మణునికడకు విసరివైచెను. ఆ భూసురుండు నందులకుఁ దనమహాదానందమును సూచించి వెడలిపోయెను. తదుపరి నాపురుషుని దర్శనార్థమై జనులు విరామము లేక రాఁదొడఁగిరి. తన్నుఁ జూడవచ్చినవారి నెవ్వరి నావ్యక్తి రిక్తహస్తములఁ బంపియుండలేదు. చేయిచాచి యాచించిన వారికెల్ల నాతఁడు రూపాయలఁ జింతగింజలమాడ్కి వెదఁ జల్లుచుండెను. పురసంరక్షక భటులకు విచ్చలవిడిగా వ్యయము చేసెను. ఆతని దాన మపూర్వముగా నత్యంత విస్మయావహముగా నుండెను. వేష భాషాదు లాతని నామప్రతిష్ఠకు మిక్కిలి యొప్పియుండెను

రూ—చెప్పుము, చెప్పుము; అనంతర మేమిజరగినది?

చి—ఆతఁ డాగ్రామమున మఱి రెండుదినము లదనముగా నుండెను. మూఁడవనాఁ డన్నిజాతులవారికి సంతర్పణముఁ జేయించెను. సంగీతసాహిత్యములయం దపారజ్ఞానశోభితుఁడని వాసిగాంచిన యొక హరిభక్తుఁ డాయూరికి వచ్చియుండ, నాటిరాత్రి యాతనితో హరికథ చెప్పించి నూఱురూ

పాయలు విరాళముగా నొసంగెను. భక్తుఁ డందులకు సంతృప్తుఁ డగుటఁగాంచి యామూర్తి తన భార్య కంఠసీమను జెల్వొందుచున్న యమూల్యమగు నొక పచ్చలపతకమును సమర్పించి యాతనిని సత్కరించి తనవినిర్మలభక్తిభావమును - త్యాగగుణమును - గనఁబఱచెను.

రూ—పిమ్మట?

చి—పౌరులు హరికథాకాలక్షేపమున నుండఁగా నాఁటిరాత్రియే యూరిలోని కొందఱి ధనికులయిండ్లలో నెమ్మదిగ దొంగతనములు జరగిపోయినవి. దివానుగారు నాఁటి సూర్యోదయాత్పూర్వమే సపరివారముగ వెళ్ళిరి. మొత్తమున నాపురమునఁ బదునేనువేలవఱకుఁ జోరు లపహరించుకొని పోయినట్లు పిదపఁ దెలిసినది.

రూ—అంతపనిచేసిన సాహసికుఁ డాతఁడే. అయ్యో! చేఁజిక్కినదొంగను వదలిపెట్టితివేల?

చి—అవును. ఆవేషధారి చోరుఁడని గ్రహింపఁజాలనైతిని. మఱియు నాతని మాయచరిత్రి నాకంతవఱకుఁ దెలిసియుండలేదు.

రూ—మనము మున్ముం దీ విషయమునఁ జాల హెచ్చరికతోఁ బ్రవర్తింపవలసియుండుట ముఖ్యము సుమా!

చి—లేకున్న నాతని మాయలు గ్రహించుటకష్టము. చూడుము! హరిభక్తుఁడు పట్టువడి యుండెను.

రూ—అదేల!

చి—నాఁడాతనికి సంభావనలో లభించిన పతక మెచ్చ

టనో దొంగిలింపఁబడినదఁట! పురసంరక్షకులు దానిని గుఱితిం చిరి.

రూ—అది శ్రీశైల యాత్రిక నామధారిచే బహు మానము చేయఁబడినదిగదా?

చి—ఆకారణముననే భక్తునియుద్దేశము దుష్టముకాద ని నిర్ణయింపఁ బడినందున రక్షకభటవిమర్శకుఁ డాపతకమును మాత్రముగైకొని యాతనిని వదలిపెట్టెను. యాత్రికుఁ డింకను బట్టుపడలేదు.

వారిట్లు సంభాషించుచున్నట్టే పొద్దువ్రాలెను. క్రమ క్రమముగఁ జీఁకటులు బలసెను. అసరస సల్లాప ప్రవాహమున మునకలు వేయుచున్న యాయువకులకుఁ గాలవాహినీవేగము తెలియఁబడలేదు. అది తటిద్ద్రుతమునఁ బరుగువాఱుచునే యుండెను. అమ్మహారుషరికి విరతియెక్కడిది? అఁగుమన్న నాఁ గదు. దాని.నెవ్వ రడ్డుపెట్టఁగలరు? పనియేమో జరిగిపోవుచు న్నది. ఆ యామినీసమయమున నాదారుణ తిమిరాంకమున నిర్భయముగనుండి జనహితకరవివయభాషణతరంగిణీప్రవ్వ రమున నిమగ్నాంతరంగులైయున్న యాపురుషుల కాకస్మికముగ బాహ్యేంద్రియస్మృతి హెచ్చెను. ఏవియో కొన్నివ్యక్తులు హఠాత్తుగఁ దమ్ముఁ బరివేష్టించినట్లు వారికిఁ దోఁచెను. వానిని విదళింప నానవయావనులు ప్రయత్నించిరి; కాని యావిగ్రహ వితతి యాపురుషుల నొక్కమొగింబట్టి, బలిష్ఠపాశములచే వారిదేహాంగములను నిర్బంధించి, యచ్చటి వృక్షశాఖల కామా నవమూర్తులను వ్రేలాడఁదీసిపోయెను. అట్లు గావించిన యమ్మ

నవ్యవ్యక్తులు చోరభటులగుదురని యాపురుషు లూహించు కొనిరి. పాపము రాత్రియంతయుఁ జెట్టుకొమ్మలదిగువ వ్రేలుచుఁ జలికి మిక్కిలి శ్రమనొందవలసియుండుట యటుండ, బంధములు బిగిసికొనిపోవుటచే నొకటిరెండు యామములలో, వారు మృత్యుముఖముఁ జూడవలసియుండెను. కాని యట్లు జరగుటకుఁ బూర్వమే సంయమీంద్రుఁ డొకఁడు తన శిష్యమండలితో నాప్రదేశమునకువచ్చి, నెమ్మదిగ నాపురుషుల కట్లు విప్పి, యాబంధమునుండి వారికి విమోచనము గలిగించెను. ఆ స్వామి, మొదటిప్రకరణమున మాచదువరులకు శ్రుతపరిచయుఁడైన విరజానందుఁడే.

ఆఱవప్రకరణము.

ఆశా భంగము.

సద్గ్రంథపఠనము శారదకుఁ జాల నిష్టము. భక్తశిరోమణి యనంబఱఁగిన పోతనామాత్యుని భాగవతమునెడ నామెకు గురుభక్తి. ఆగ్రంథము నావిదుషి యవకాశవేళలయందెల్ల మానక చదువుచు, నందలి స్వాదమును జననికి నివేదించుట, తన దైనికకృత్యములలో నొక్క ముఖ్యాంశముగ భావించి, క్రమము దప్పక యట్లు గావించుచుండెను. గృహకార్యములన్నియు నిర్వర్తించి వంటవార్పులు ముగించిన పిమ్మట, శారద

యొకనాఁటి యుదయమున నుగ్రాణమందిరమున జనని చెంగటను గూరుచుండి, యొక పద్యప్రబంధమును జదువుచుండెను. ఆమె ప్రతిపదమును బ్రతివాక్యమును బ్రస్ఫుటముగ — స్వరానుసంధానముగ — హృదయాకర్షకముగఁ — జదువుచుఁ, జదువు కొలఁదినిఁ జవులూరఁజేయుచు నుండెను. శ్రావ్యమై — మనోజ్ఞమై — యొప్పారెడు నామె మధురస్వరమునఁ బద్యముల కే వన్నె హెచ్చెనో — పదలాలిత్యమును వాక్యమార్దవమును భావమాధుర్యమునుగలయందలిరసోదంచితపద్యరత్నము లే యామె కలకంఠమునకు మెఱుఁగు వెట్టుచుండెనో — యానందపరవశత్వమునందియున్న గౌరాంబిక యూహింపఁ జాలకుండెను. ఇప్పుడు శారదపఠించునది భాగవతము — దశమస్కంధము — పూర్వభాగము — అందునేఁటి కథాంశము రుక్మిణీకల్యాణము. ఆమె చదువుటకుఁ బ్రారంభించి కొన్నిక్షణములే యయి యుండును. చదివినభాగములోని విషయము నామె తియ్యని నుడుల మాతృదేవి కెఱింగించుచుండెను.

"ఉ. అంకిలి సెప్ప లేదు, చతు♦ రంగబలంబులతోడ నెల్లి యో
పంకజనాభ! నీవు శిశు♦ పాల జరాసుతులన్ జయించి, నా
వంకకువచ్చి, రాక్షసవి♦వాహమునన్ భవదీయశౌర్యమే
యుంకువఁ జేసి, కృష్ణ! పురు♦షోత్తమ! చేకొనిపొమ్ము
(వచ్చెదన్"

ఈ పద్యము చదివి ముగించుట తడవుగా, నెచ్చట నుండియో 'అమ్మాయీ' యనుధ్వని వినవచ్చెను. శారద తత్క్షణమే చదువుట నాఁపెను. ఉమాపతితక్క మఱెవ్వరును

శారద నట్లుపిలుచుచుండలేదు. ఇప్పుడుసహిత మాతఁడే పిలిచియుండును. ఆమెయు నట్లే తలఁచెను. పడసాలలోని పర్యంకమునందలి మృదుతల్పమునఁ బరుండి, దీర్ఘాలోచన చేయుచుండిన సూరన, "అమ్మాయీ!" యనెను. శారద వెంటనే గ్రంథమునుముడిచి జననిహస్తమున దాని నునిచి, మెల్లని నడకలఁ దండ్రిసన్నిధికిఁ దిన్నఁగాఁ బోయి, యాతని మ్రోల వినయముతో నిలుచుండెను.

"నే నింతవఱకు నీవివాహమును గూర్చియే యోజించుచుంటిని. అమ్మాయీ! నీవు బాలవుకావు. నీకుఁ దెలియనిదొక్కటియునులేదు. వచ్చిన రాయబారముల నెల్ల నీ వెఱుఁగుదువు. అందు నీ వేవరుని మనఃపూర్తిగఁ గాంక్షించియుంటివో- నీయభీష్టమెద్దియో-తెల్పుము. ఈవిషయమై నీవు నెమ్మదిగ నాలోచించిచెప్పుట నీకు యుక్తము. ఏలయన నీవు వలచెడు సంబంధ మంతమాత్రముననే విడిపోవునదికాదు. అందలి సుఖమో దుఃఖమో నీజీవితాంతపర్యంతము నీవే యనుభవింపవలసియుండుననుట నిక్కము."

ఉమాపతి కూరుచుండి చింతాభరమున నుడివెను. ఉత్తమహైందవస్త్రీరత్నములకు స్వభావసిద్ధమగులజ్జ శారదకుఁ గలుగుటంజేసి, యామె తన పల్లవబాహువల్లికలఁ గట్టుకొని, యవనతమస్తకయై దక్షిణపాదాంగుష్ఠమును నేలరాయుచు, మిన్నక నిలుచుండెను; కాని యేమియుఁ బలుకఁజాలదయ్యెను. అప్పుడే యొక నవీనపురుషుఁడు లోని కరుదెంచెను.

శారద పార్శ్వమందిరమునకుఁ బోయెను. క్రొత్తమను

ష్యుఁ డుమాపతినిఁ జూచి సంతోషముతో నమస్కరించెను. వచ్చినయతఁడు సిద్ధరామపురవాసుఁడగు రూపసింగని తెలిసికొని, యుమాపతి ప్రతివందన మాచరించి, కూర్చుండుఁడని పడకఁ జూపెను. రూపసింగు తల్పమున నాసీనుఁడయ్యెను.

"మన యమ్మాయి వివాహవిషయ మేమియోచించితిరి ?" అని ప్రశ్నించెను. తరువాత వారి కీక్రిందిసంభాషణము జరిగెను.

ఉమా—తగిన దాంపత్యమింకను గుదరలేదు. మీ రెప్పుడు వచ్చితిరి ?

రూ—నిన్నటియుదయమున-కార్యసంభ్రమముచే నిమ్మవలోకించుటకుఁ గాలేదు. ఆవశ్యకముగఁ జూచి మీతో మాటలాడి కావలసినట్లు శకుంతలాంబ నా కాజ్ఞాపించినది.

ఉమా—మంచిది. వారందరును గుశలముగ నున్నారు కదా?

రూ—యౌవనుఁడగు కుమారుఁడు వివాహమునకై వేచియుండవారికిఁగుశలమెక్కడిది ?

ఉమాపతి మిన్నకుండెను. రూపసింగు తిన్నఁగ నాతని ముఖావలోకనము సేయుచు సాదరభావమున నిట్లనియెను.

రూ—మీరేల సోదరియెడ నిట్లు దయతప్పినారు? ఆమెచేసిన యపరాధమేమి? ఉమాపతి బదులుచెప్పలేదు. ఆతని వదనమున ననంగీకారభావము వ్యక్తమగుచుండెను.

రూ—శారదను జంద్రమౌళికి ముడివైచి, చెల్లెలి యిష్టమును దీర్చుటమేలు.

ఉమాపతి విచారసూచకమగు మందహాసముచేసెను. కొండొకతడవున కిట్లనియెను.

"ఈ పిచ్చిభ్రాంతి యామె నింకను వదలినట్లులేదు."

రూ—ఏల? కోడలిఁ గోరికొనుట యామెకు భావ్యము కాదా? మీరు భ్రాంతి యనుచున్నారు. ఎట్లు?

ఉమా—నేను కన్యనీయనని మొదటనే వ్యక్తపఱచి నాను. ఈయాసతో నామె కేమిపని?

రూ—మీరట్లు సెలవీయరాదు. ఆమె ప్రాణములన్ని యుఁ గోడలిపై నున్నవి. మీరు శారదను దప్పక శకుంత లాంబయొడిలో నుంచుట భావ్యము.

ఉమా—వారి కింకొకమాఱు నొక్కి చెప్పెదు. నన్ను నమ్ముకొని వారు వారిప్రయత్నములనుండి విరమించుట ధర్మ మైయుండదు. క్రొత్తసంబంధముఁ జూచుకొనుట మేలు.

రూ—అట్లయినచో శారదను జంద్రమౌళి కిచ్చుతలం పు మీకు బొత్తిగా లేదా?

ఉమా—అవును. నాయీయభిప్రాయము వారికి విస్పష్టముగ నెఱింగించుఁడు.

రూ—చిత్తము. నేను నేఁటిసాయంకాలమున మిమ్ము సందర్శింపవచ్చునా?

ఉమా—నిస్సంశయముగఁ గావచ్చును; ఈయంశము వకే మైనచో శ్రమతీసికొనవలదు. మీ రెప్పుడు వెళ్ళనున్నారు?

రూ—రాత్రికి.

ఉమా—మంచిది.

రూ—సమారాధనోత్సవమునకు మీరు రాక నిలిచిపోయితిరి. పూర్ణచంద్రయ్య కావిషయమున నమితవిచారము కలిగెను.

ఉమా—నిజమే. అప్పుడు నాకెంతమాత్రమును సమయానుకూల్యముగ నుండలేదు. తలవనితలంపుగఁ దటస్థించిన యాయనివార్యము నామనోభీష్టమును దుంచివైచినది. ఆతరుణమున మాయమ్మాయి జ్వరగ్రస్తయై పడియుండెను. మే మాతొందరలోనుండి యన్నిఁటినిమఱచి యుంటిమి.

రూ—ఒక్కమాట. మీయింటి కిటీవల నెచ్చటనుండియో యొకయతిథి వచ్చియున్నట్లువింటిని. నేను వారి పరిచయప్రాప్తి నందఁగోరుట మీకిష్టమేనా?

ఉమా—ఆసందర్భమును గూర్చి యోచించుట కిప్పుడవధిలేదు. ఈయసమయమున నేనేమియుఁ దెలుపఁజాలనందులకు క్షమించుఁడు.

రూపసింగుముఖము వివర్ణతనొందెను. ఆపరిణామ మాతని హృదయాంతరాళమున నడఁగియున్న సంశయాంకురముఁ బ్రస్ఫుటమొనరింపఁ జాలియుండెను. అఁత డుమేశమునకు నమస్కరించి యచ్చటనుండి వెళ్ళిపోయెను.

శారద గదిగుమ్మమున కావలివైపున నిలుచుండి యాసంభాషణము నాద్యంతము నత్యాసక్తిమెయి నాకర్ణించుచుండెను. చివరకు హతాశయయయ్యెను. ఆమె మ్లానవదనయై యటనుండి లోనికేగెను.

విద్యాబుద్ధులునేర్చి శారద తరుణవయస్కయైనది మొ

దలు చంద్రమౌళి శేషసాగరమునకుఁ దఱచుగ వచ్చుచుఁ బోవుచునుండెను. అతఁడు మాతులుని మనస్సుకరఁగునట్లు మాట్లాడుచు, సాధుభావమున వర్తించుచుండెను; కాని యది కుటిలవర్తనమని భావించిన యుమాపతి కాతనియం దాదరము పొడముటయరుదు. గౌరాంబిక చంద్రమౌళి విషయమున వెనుకటి భిన్నోద్దేశముమఱచి యల్లునిఁ గాంచిన వెనుక నెప్పటివలె మాతృప్రేమ నెఱపఁజొచ్చెను. చంద్రమౌళి పలుమఱు శేషసాగరమునకు వచ్చుచుండుట యుమాపతి కెంత మాత్రమును సమ్మతముగ నుండలేదు. ఒకనాఁ డాతఁడు జామాత నుద్దేశించి యిట్లనెను.

"నీవు సారెసారెకుఁ బురమువిడిచి రావలదు. పనిలేక పలుమఱు గ్రామాంతరముల నుండుట యుచితముకాదు. అకారణముగ ముందెప్పటికిని నీయింటి కడపనైనను ద్రొక్కవలదు."

చంద్రమౌళి వెంటనే స్వగ్రామమునకుఁ బోయెను. అట్లు వెళ్లిన యనంతర మాతఁడు మరల శేషసాగరమువంక గన్నెత్తియైనఁ జూడలేదు. అతఁడు రాక నిలుచుటచే నుమాపతి కెట్టి యసంతృప్తియుఁ గలుగలేదు. తనవిభుఁ డట్లు నిష్ఠుర వాక్యములచే నల్లుని గారించినందున, గౌరాంబికకు మాత్రము విచారము పొడమకపోలేదు.

ఏడవప్రకరణము

అనంతశాస్త్రి.

అపరాధ పరిశోధకుని నామ మనంతశాస్త్రి. అతఁ
డుమాపతిగృహమున బహుదినము లుండెను. ఆభవనమున
సపర్యలయం దాతనికిఁ గొంచెమైనను గొఱఁత కలుగలేదు.
గౌరాంబిక యాభూసురునిఁ బితృతుల్యునిగ భావించి వలయు
నుపచారములు సల్పుచుండెను. శారదయుఁ దఱచు దైవసన్ని
భుఁడగు నాయతిథిసమ్ముఖమునఁ గూరుచుండి యుత్తమ
గ్రంథరాజములఁ బఠించి యాతనిఁ బరితుష్టునిగా నొనర్పఁ
బ్రయత్నించుచుండెను. ఉమాపతియుఁ బూజ్యభావమున నా
తనిని సంసేవించుచు నేవిషయమునను లోపము కలుగనియట్లు
చూచుకొనుచుండెను. తానున్నతవంశ సంభవుఁడనని శాస్త్రి
చెప్పుకొనినందులకుఁ దార్కాణముగ నట్టిలక్షణ మాతనికడ
లేశమును గాన్పించుటలేదు. ఆపురుషుని యాచరణమునఁ
బ్రాతికూల్య భావము లెన్నియేని వ్యక్తమగుచుండెను. లోక
మున నుత్తమవర్ణులలో నిట్టి మానవులు సహిత ముందురని
యుమాపతి తలఁచెను.

దొంగలరాయుని సపరివారముగఁ బట్టి బంధించుటను
గూర్చి కాఁబోలు ననంతశాస్త్రి నిరంతర మేకవిధముగాఁ జింతి
లుచుండెను. యోజనాతరంగము లనవరతము నాతని హృద
యతటము నుద్వేలముగఁ గొట్టుకొనుచు సంక్షోభ పఱచు

చుండెను. ఆతని ప్రియత్నము బహుజనోపయుక్తమైన దగు టచే నుమాపతిసహిత మావిషయమున శక్తివంచనలేక తోడ్పడుచుండెను.

శేషసాగర మంతగొప్పపట్టణము కాకపోయినను గుగ్రామము మాత్రముకాదు. ఆయూర సంపన్నులసంఖ్య యధికము. తస్కరు లీవఱకు నందలి ధనపతుల గృహములఁ దగులకపోయినను ముస్ముందు తప్పనిసరిగ నట్టియుత్పాతములు పొడచూపవచ్చునను భయము పౌరులలో హెచ్చియుండెను. ఆకారణమున నుమాపతి శాస్త్రియంగీకారమును బడసి పురమునందలి శ్రీమంతులగు నుత్తమవర్ణుల నాహ్వానించి వారి స్థితిగతుల కలరూపెరింగించుచు వారి కాతని పరిచయభాగ్యము గల్గించెను; మఱియు నిశాచరనాథునివలనఁ దమభార్యల మానవిత్తముల కెట్టియనర్థమును వాటిల్లనియట్లు, సంరక్షింపఁగల భారము వహింపక తీరదని, శాస్త్రికి విన్నవించుకొనెను. ఉమాపతికిఁ జారమండలిపైఁ గల ప్రేమ విశ్వాసములఁ దలపోసికాఁబోలు, శాస్త్రి విస్మితుఁడగుచు నందులకుఁ దన యామోదమును సూచించెను.

అపరాధ పరిశోధకోద్యోగమున శాస్త్రియాజ్ఞఁ దలఁదాల్చి, మిక్కిలి నేర్పుతోఁ బాటుపడఁగల రక్షకభటులు పండ్రెండుగు రాయూరి సత్రమున, భిక్షుకరూపమున విడిసియుండిరి. అందలి ముఖ్యుఁ డప్పుడప్పుడు రాత్రులయందు యజమానుని కడకరుగుచు, ముస్ముందు సలుపఁదగిన కార్య సంవిధానములఁగూర్చి స్వామియానతి నొందుచు, నందుల

కించుకేనియు న్యూనత పొసంగనియట్లు తనకర్తవ్యకార్యములం గడుహెచ్చరికతో సక్రమముగ నెరవేర్చుచు, సత్యాసక్తిమెయి ఫలమునం గాంక్షించుచుండెను.

రక్షకభటులలో పెద్ద అనుదినము వేకువ ప్రథమయామముననేలేచి బుడబుడకల వేషములను ధరించి గ్రామమంతయు దిరుగుచు సందలి రహస్యములనెల్ల నెఱుంగుచుండిరి. కొందరు వస్త్రవ్యాపారులై క్రయవిక్రయముల సలుపుచు నింటింటి గుట్టును గనిపెట్టుచుండిరి. మఱికొందరు జోస్యులై పౌరులకు ఫలాఫలముల దెల్పు నెపమున వారి హృదయమర్మముల గ్రహించుచుండిరి. పగటివేషధారులై కొందరింటింట బహువిధభాషణముల నెరపుచుం బ్రజావైఖరిని గమనించుచుండిరి. ఇట్లు రాత్రిందివములు నిద్రాహారములుమాని కృషిసల్పుచున్నను వారు చోరులయునికి నారయంజాలక పోవుట యటుండ దమకన్నుల యెదుటనే విరివిగ జరిగిపోవుచున్న చౌర్యవ్యాపారముల నాపం గేవల మశక్తులైయుండిరి.

ఒకనాంటి యుదయమున సుమాపతి విమర్శనాధ్యక్షుడగు ననంతశాస్త్రి యున్నగదిలో నాతని సామీప్యమునం గూరుచుండి సంభాషించుచుండెను. వారి సల్లాపమిట్లుండెను.

ఉమా—ప్రయత్న మొక్కటియు ఫలింపలేదు. దొంగలు పట్టువడలేదు.

అ॥ శా—అవును రక్షకభటుల పరిశ్రమలోప మిందులకు హేతువైయుండును.

ఉమా—పాపము! వారు శ్రద్ధతోడనే పనిచేయుచు

న్నారు. జరిగెడు కార్యములు మాత్రి మాగలేదు.

అ॥శా—దొంగలశ్రేష్ఠుఁ డగు బోయకొండఁ డసాధారణపురుషుఁడు. నాకన్నులయెదుటఁబడి యెన్నియోమారులు దప్పిపోయినాఁడు. వానిఁ బట్టుటయును సామాన్య విషయమనుకొంటిరా?

ఉమా—మీరీయూర నింకెంతకాల మాఁగఁదలఁచితిరి.

అ॥శా—రెండు దినములకంటె నధికముగ నుండఁబోము.

ఉమా—స్వస్థలమున కేగినపిమ్మట మీరు పూర్ణచంద్రయ్యను జూడఁదలఁచుకొన్నారా?

అ॥శా—ఆఁ! తప్పక.

ఉమాపతి తనచేతనున్న యొక యుత్తరము నవంతశాస్త్రి హస్తమున నునిచెను.

అ॥శా—దీనిని బూర్ణచంద్రయ్యయే వ్రాసెననుకొందును. విశేషము లేమి?

ఉమా—గరుడోత్సవమునకై శారద ననుపఁగోరుచు బండిని బంపియున్నాఁడు.

అ॥శా—సంతోషము. మీ రేమి నిర్ధరించుకొంటిరి.

ఉమా—నేఁటిసాయంకాలమే ప్రయాణము నిశ్చయింపఁబడెను. నాభార్యనుగూడఁ దోడిచ్చిపంపెదను.

వారి సంభాషణమునకు గారాంబిక విచ్ఛేదము గలిగించెను. క్రొత్తమనుజుఁ డొకఁ డనంతసాగరమునుండి యిప్పుడే వచ్చి గుమ్మమునొద్ద నిరీక్షించియున్నాఁడనియు నాతఁడు,చిన్నో

జో యనియు నామె తన విభునకుఁ జెప్పి వెడలిపోయెను. ఉమాపతి గదిగుమ్మముఁ జేరి యటఁదనకై వేచియున్న యొక యువకునిఁ జూచెను.

ఎనిమిదవప్రకరణము.

ఆపురుషుఁ డెవ్వఁడో!

ఉమా—ఎవరికై వచ్చితిరి?

చి—ఈగ్రామమునఁ బ్రముఖులగుటచే మీతో సంభాషింపవచ్చితిని. నాపేరు చిన్నోజి.

ఉమా—నే నెఱుఁగుదును. నానుండి మీకుఁ గావలసిన దేమి?

చి—పది దినములనాఁడు మీగ్రామమున కొక నవీన పురుషుఁడు వచ్చియుండవలయును.

ఉమా—(క్షణకాలము యోజించి) ఎట్టివాఁడు?

చి—సమున్నతకాయుఁడు—కృష్ణవర్ణుఁడు—బైరాగి.

ఉమా—బైరాగియా? ఎచ్చటనుండి?

చి—అనంతసాగరము నుండియే. ఆ పురమున నిటీవల నొకచిత్రకథ జరిగినది.

ఉమా—ఆకథయేమి?

౭—నెలదినముల క్రిందటినాఁ డొక బైరాగి తనసలువురి శిష్యులతో నాపురప్రవేశముచేసి, యొక సత్రమున విడిసి యుండెను. అతఁ డనుదినము నుషఃకాలముననే లేచి, యందలి కొలనున స్నానముచేసి, కావి వస్త్రములను గంధాక్షతలను రుద్రాక్షసరములను తావళములను ధరించి, నిరంతరము చిఱుగంట మ్రోయించుచు — శంఖముఁబూరించుచు — భక్తికీర్తనములఁ బాడుచు, సూర్యోదయ పర్యంతము గ్రామమునందలి ప్రతివీథియుఁ బ్రతిగృహమును దిరుగుచుండును. అనంతరము విడిదికేగి, విశుద్ధ కౌశేయాంబరములఁ దాల్చి, స్వర్ణపీఠమునఁ గూరుచుండి, యోగసాగర నిమగ్నుఁడై యుండును. ఆ బైరాగి స్థిరయోగధారణ మవలంబించెనేని, యాహారపానీయముల నొల్లక దినములకొలఁదియు మాసములకొలఁదియు నుండునను కింవదంతి యంతటను వ్యాపించియుండెను. అతఁడు సామాన్యమానవుఁడుకాఁడనియు — మహనీయుఁడనియు — దేవ సదృశుఁడనియు — నవతారపురుషుఁడేయనియు — నల్పకాలములోనే యూరిజనులకుఁ దెలిసిపోయెను. పురమునందలి జిజ్ఞాసాపరులు కొందఱాతనిని సందర్శించుటకును — కొందఱు సంసేవించుటకును — మఱికొందఱు తత్త్వోపదేశము వడయుటకును, నాతని సన్నిధి కరుగుచుండిరి; కాని యాతఁడెవ్వరితోడను మాటాడుటలేదు. భక్తి పురస్సరముగ నెవ్వరేమియర్పించినను స్వీకరించుటలేదు. గోధుమరవ— పంచదార— పాలు— నేయి— మఱియు వారి కత్యావశ్యకములైన పదార్థముల నన్నిఁటి నాపణములకడ విలుచుకొనుట తక్క, లేశమైన నన్యులనుండి

కైకొనుటలేదు. ఆతని శిష్యులు విరివిగ వనమూలికలఁ గొని తెచ్చుటకై యనుదినము నారణ్యసానుతటముల కేగుచుండు వారు. తమకానుకూల్యములైన యోషధులు లభింపనిచోఁ, గొన్నిసమయములయందు వారహర్నిశలు గొండనెత్తముల యందే విహరించుట కలదఁట! దుస్సాధ్యములగు రుగ్మతలను సహిత మాబైరాగి, దర్శనమాత్రముననే నివారించును. అమూల్యములగు నౌషధరత్నముల నాయత్తపఱచును. పసరునుండి బంగారము తీయును. సమస్త మంత్రములు నాతనికిఁ దెలియును. ఇట్లనేక కథలాపురుషునిఁగూర్చి జనులుచెప్పఁకొనఁ దొడఁగిరి. బైరాగినిఁ జూడనివారుసహిత మీకార్యము లమ్మహాత్మున కేపాటియని యనుకొనుచుండిరి. ఆయూరి ప్రముఖులలో నొక్కరగు శివభద్రశర్మగా రిదియంతయు గ్రహించి బైరాగిశిష్యులను దనభవనమున కాహ్వానించి, సగౌరవముగ నారాధించి వలదనుచున్నను బలోచితముగఁ బట్టుపుట్టములను రత్నఖచిత హేమభూషణములను సమర్పించి, వైద్యమునందును —బసరున బంగారుతీయు నుత్తమకళయందును — మంత్రతంత్రములయందున —దనకుమారుని సుశిక్షితునిగా నొనర్పఁ బ్రార్థించి పుత్రుని — రఘురాముని — వారివశముచేసిరి. ఈ కైంకర్యము నెప్పటికిని మఱవఁజాలమని బైరాగిశిష్యులు నుడువుచు, నాతనికుమారుని దీసికొనివెళ్లి తమసేవలోనుంచుకొని పుష్టికరముగ బోషించుచుండిరి. కాని యున్నట్టుండి నేఁటికిఁ బది దినముల నాఁడూరివెలుపలి కాళికాలయమున వారాయువకుని హత్యగావించి యాతనియొడలిమీఁది స్వర్ణాభరణముల నొలచు

కొని పారిపోయినారు.

ఉమా—ఏమీ! నగలకై వారాయువకుని వధించిరా?

చి—లేదు—ఆ యాలయమున ద్రవ్యమున్నదనియు నొకయంసలుని బలిచేసినఁగాని యది గోచరింపదనియుఁ జాల కాలమునుండి పురమునఁ బ్రతీతియుండెను. నరహత్యాదోషము నకు వెఱచి గ్రామవాసులెవ్వరు నందులకు సాహసింపలేదు. వారాధనతృష్ణచేతనే యాదారుణకర్మ జరిగించియుందురు. అచ్చట నొక పల్లమును ద్రవ్వఁబడియుండెను.

ఉమా—అందువలన వారి కేమిలభించినది?

చి—తెలియదు. వారాయువకునిఁ జంపిపోయినది నిజము. ఊరితలవరి కొంతదూరము వారిని వెంబడించియుఁ బ్రయోజనముఁగానక వెనుదిరిగినాఁడు.

ఉమా—అతఁడు బైరాగియని మీరు చెప్పుచున్నారు- అందునను భక్తుఁడు—సాధుమూర్తి—ఇంతటి ఘాతుక క్రియ కెట్లు ముందుపడియుండును?

చి—మేము పొరబడినారము. నిజమున కాతఁడు బైరాగి కాఁడనియు వేషధారియనియుఁ బిమ్మటఁ దెలిసికొంటిమి. ఆ దుర్మార్గుఁ డాగ్రామమున నున్నంతకాలమునచ్చట జరుగుచుండిన దొంగతనములకుఁ బరిమితియే లేకుండెను.

ఉమా—బైరాగి యెవ్వఁడును మా గ్రామమునకు వచ్చియుండలేదు. అట్టివాఁడు వచ్చినచో మేమును గనుగల్గియుండెదము.

చి—అంతమాత్రమున నుపయోగముండదు. ఆ క్రూ

రుఁడు కంటక ప్రాయుఁడు. మార్గమును నిష్కంటకముగఁ జేసినఁ గాని పథికులకు సుఖముండదు. మీరాదుర్మార్గునిఁ గనుఁగొన్నచోఁ దోడనే మాకుఁ బట్టి యీయవలయును. వాఁడొక్క బైరాగివేషముననే యుండునని తలంపకుఁడు.

ఉమా—మంచిది. నేనందువిషయమునఁ జాల మెలఁకువతోనుండును. తగిన యేర్పాటులు చేయుదును.

చిన్నోజీ యుమాపతినుండి సెలవుగైకొని వెళ్లెను. అతని మాటలు విన్న పిమ్మట వసంతశాస్త్రి విషయముగా నుమాపతికి సంశయము మిక్కిలి హెచ్చెను. అప్పుడే యాతని రహస్యమును వెల్లడింప నుంకించెను; గాని ప్రపంచమున దుష్టులెందఱో యుందురనియు, హత్యకుఁ గారకుఁడెవ్వఁడోయనియు, నొక సామాన్య బ్రాహ్మణున కింతటి సామర్థ్యముండదనియు, నిజమెఱుఁగక యొకరికి హానిచేసినఁ దత్పాపఫలముఁ గుడువక తీఱదనియుఁ దలంచెను. ఎట్లయిన శాస్త్రి నింటినుండి తొలఁగించుట యే క్షేమకరమని యాతఁడు నిశ్చయించుకొని లోనికిఁ బోయెను.

ఉమాపతి యనంతశాస్త్రి యున్న గదికేగెను. అనంతశాస్త్రి యచ్చట లేఁడు. అతని వస్త్రాదికములు సహితమందుఁ గానఁబడలేదు. గదిలోని పలకగూఁటి తాళము విఱిగి క్రిందఁ బడియుండెను. ఉమాపతి చకితస్వాంతుఁడై సంభ్రమపాటునఁ గూఁటి తలుపులను దెఱచిచూచెను. అచ్చటఁ దానీవఱకు నుంచియుండిన రెండువేల నిష్కములును లేవు. ఉమాపతి విభ్రాంతుఁ డయ్యెను. పాప మాద్రవ్యముఁ గూడ నాపాపుఁడే సంగ్రహించుకొనిపోయియుండును. అతఁ డెచ్చటికిఁ బోయెనో—

ఎప్పుడుపోయెనో—యింటివారి కెవ్వరికిని దెలియదు. దిడ్డిదారి నుండి యొక నల్లని మనుష్యుఁడు మిక్కిలి తొందరగా వెళ్ళి పోయినట్లు మాత్రము పొరుగింటిస్త్రీవలనఁ దెలిసినది. స్వకార్యార్థమై యెచ్చటికో పోయియుండుననియుఁ, బైకముకూడ నావశ్యకమైనపనికొఱ కాతఁడే కొనిపోయెననియు, నచిరకాలముననే యాతఁడు తిరిగిరావచ్చుననియు నాతఁడు భావించెను. రెండుమూఁడుదినములు నిరీక్షించియున్నను బోయిన పురుషుఁడు మరల రానేలేదు. సిద్ధరామపురప్రాంత కుగ్రామములఁ గూడ నట్టి చతురుఁడగు దుష్టుఁ డున్నట్టిజాడలేదు. ఆపురుషుఁడెవ్వఁడో!

తొమ్మిదవ ప్రకరణము

తోఁసిరాజు.

కలిమికొలఁది వైభవము ననుభవించినవారిలో వియ్యూరి రాఘవచంద్రుఁ డొకఁడు. ఈతఁడు వృష్ణికులభూషణుఁడు. అపారైశ్వర్య సంపన్నుఁడు. సాము గరిడీలయం దాసక్తిఁగలిగి బాల్యమునుండియు శరీరసాధనముఁ గావించుచుండుటచే నాతఁడు మంచి కండరపుష్టిఁగలిగి మిగులఁ జేవఁ జెంది యుండెను.

రాఘవ చంద్రుఁడు తనమేడయింటనే వసించి పగలంతయు గ్రంథావలోకనము — మిత్రసంభాషణము — మున్నగు కార్యములతోఁ గడపి, చీఁకటిపడిన వెనుక గుఱ్ఱమెక్కి విహారార్థ మూరి వెలుపలికిఁ బోవుచుండును. ఆతని కశ్వారోహణమునం దెక్కువయభిరుచి. ఎప్పుడు నాతనిచెంత సలక్షణములైన తురంగములు రెండు సంసిద్ధములుగ నుండును. వాని నాతఁడు తఱచుమార్చుచు వాహ్యాళికై వినియోగించుచుండును.

రాఘవచంద్రయ్యకు వేఁట ప్రాణసమానము. పక్షమునకు రెండుదినములైన నాతఁడు తనసేవకులతో మృగయార్థ మరుగుచు ననేకజీవజంతువులను వధించి, వాని కళేబరములను మిగుల వైభవముతోఁ బురికిఁ దెచ్చువాఁడు. ఒకనాఁ డాతఁడు కటకప్రదేశమునఁ గొండలనడుమఁ గ్రూరసత్వములఁ దునుమాడుచు నొకవన్యకిటినిఁ దార్కొని వెన్నాడెను. ఆసమయమున నది యెదురుతిరిగి పైఁబడి తననిశిత దంష్ట్రములచే నాతని పుష్టశరీరమును భేదించెను. ఆఘోరసంఘాత కారణమున రాఘవచంద్రయ్య కూలిపోయెను. కొన్నినిమేషములలో నాతని సూక్ష్మకాయ మీస్థూలప్రపంచమును దాఁటిపోయెను.

రాఘవ చంద్రయ్యకు శేషాంబికవలనఁ గలిగిన పుత్త్రుఁడు పూర్ణచంద్రుఁడు. ఇతఁడు శైశవమునుండి మిక్కిలి యాదరమునఁ బోషింపఁబడిన పురుషుఁడు. కొంతకాల మీతఁడును దేహసాధనములయం దలవాటుపడియుండినను భోగ

ములను మరగి వానిని మానుకొనెను. ఈతని వివాహ మిరు వదియైదవయేఁట నడచెను. అనంతరమే తండ్రియగు రాఘవ చంద్రియ్య స్వర్గస్థుఁడయ్యెను.

పూర్ణచంద్రియ్యకు శకుంతలాంబికవలనఁ గలిగిన పుత్త్రుఁడు చంద్రమౌళియనియు, జననీజనకులును విదితరులును నాతని నీశ్వరప్రసాదలబ్ధునిగఁ దలఁచుచుండిరనియు, వెనుకటి యంశములవలన మనము తెలిసికొంటిమి. చంద్రమౌళి యనంతర మాదంపతులకు సంతానములేదు. విచారపరులును బ్రపంచానుభవజ్ఞులునునగు జ్యోతిర్విద్యాపారంగతులీనందనుని జన్మపత్త్రము నత్యంతజాగరూకతమెయిఁ బరిశీలించి, సర్వశుభలక్షణసమన్వితుఁడగు నీతఁడు విద్యాధికుఁడును — గుణనిధియుఁ — బ్రతాపశీలుఁడును — సంపన్నుఁడును — విస్తారయశోధురంధరుఁడును — నగునని నిర్ధరించుటవలనను, నతఁడు కేవల సుకుమారశరీరుఁ డగుటంబట్టియు, నందునొంటిబిడ్డయగుటంజేసియుఁ, దలిదండ్రులు బాల్యమునుండి చంద్రమౌళి నత్యంతానురక్తిమెయిఁ బెనిచిరి. అతఁడేదికోరినను గొఱఁతలేక సమకూర్చుచుండిరి. జననీజనకు లెల్లవేళల నిట్లాతని నెక్కుడు గారాబముతోఁ జూచుచు, మిక్కిలి చనవిచ్చుచున్నందునఁ, జంద్రమౌళికి వినయమునకుమాఱుగ నలక్ష్యభావమెక్కుడై, నానాఁట నాతని హృదయావనిఁ గడుగాఢముగఁ బాదుకొనఁ జొచ్చెను.

పూర్ణచంద్రియ్య కుమారుని నొక యుత్తమపాఠశాల కనిచెను. చంద్రమౌళి క్రమక్రమముగ బడికిఁబోవుటగాని,

చదువుటగాని యెఱుగఁడు. ఈ విషయమున శకుంతలాంబిక కు మారుని ఖచితముగ మందలింపఁ జూచెను; కాని యందులకుఁ బూర్ణచంద్రయ్య సమ్మతింపక, బాలకుని నట్లొత్తిడిపెట్టవలదని యాజ్ఞాపించెను. ఇందువలనఁ దనయునిఁగూర్చి యెక్కువ శ్రద్ధ తీసికొనుట కామె కెంతమాత్రము నధికారము లేకుండినను, దుడుకుఁదనము సుతునియం దభివృద్ధినొందుచున్నందులకు వగచుచు, సమయము నెఱిఁగి చాటున నయభయముల నాతనికి బుద్ధిఁ గఱపుచునేయుండెను. అదియును బూర్ణచంద్రయ్య కనుఁగొని, యట్లు జడిపించుటచేతను జీవాట్లు పెట్టుటవలనను బాలకుఁడు నొప్పిపడుననియు, దండనతాడనాదులు పిల్లలకు నితాంతముగఁ గూడవనియుఁ జెప్పి, యాతనిని స్వేచ్ఛగా వదలునట్లానతిచ్చెను. పిమ్మటఁ జంద్రమౌళి చెడ్డపిల్లలతోఁ జేరి, యలరిపనులను— బూతుమాటలను దుడుకుఁ జేఁతలను నేర్చికొని, మఱింత చెలరేఁగెను. ఆతఁ డీ దుర్విషయములయందు సక్రమాభివృద్ధి నొందుచు, సహపాఠులనుపహిత మాముగర్వమునఁ దిప్పుచుండుటఁ జూచి, తరగతి యుపాధ్యాయుఁ డొక్కనాఁడు పూర్ణచంద్రయ్య కిట్లువ్రాసి పంపెను.

“మీకుమారుఁడు పాఠములఁ జదువుటలేదు. సక్రమముగఁ బాఠశాలకు వచ్చుటయు లేదు. విద్యాబుద్ధులలోఁ జంద్రమౌళి నానాఁటికిఁ దీసిపోవుచున్నను మీర లుదాసీనభావమే చూపుచున్నారు. ఓగాములరయక, సర్వవేళలఁ దలిదండ్రులు బాలకులవిషయమున నిట్లుదాసీనభావముఁ గనఁబఱచుచుండుట, పిల్లవాండ్రు మిక్కిలి చెడిపోవుటకుఁ గారణమగు

చున్నది. ధనికులబిడ్డలకుఁ జదువురాదనియెడి నుడి పొడముట కిదియే హేతువు. నే నీవిషయమున రెండుపర్యాయములు మీకు సూచించినాఁడను. ఉపాధ్యాయుల వాక్యములయందు బాలకుల పోషకులకుఁదగిన గౌరవ మొదవు దనుక, పిల్లలు బాగుపడుటకల్ల. పోషకు లిది గ్రహింపక, వారి మురిపెమునకై యుపకారము చేయుచున్నామని తలఁచి యపకారమే చేయుచు, బాలుర నన్నివిధములఁ జెఱచుచు, మహోపచితికి దావలమగుచున్నారు. విద్యార్థులు పసితనముననే వారి సద్వర్తనముఁ గోల్పోయిరేని, మరల నెన్నఁటికినిఁ గోలుకొనఁజాలరని తలిదండ్రు లెఱుంగనియంతకాలము, లోక మున్నతినందఁజాలదు."

తదుపరి పూర్ణచంద్రయ్య తనకుమారుని కొకటిరెండు పర్యాయములు హెచ్చరించెను; కాని యాతనిమాటలు చంద్రమౌళి కంతహితదాయకములుగ నుండలేదు. ఆతని కిట్లు బాల్యమునఁ గొలఁదిగ నలవడిన తుంటరితనము పెద్దయగు కొలఁది పెచ్చుపెరిఁగి, యిరుగువారికిని — పొరుగువారికినిఁ — గ్రమక్రమముగ నూరిజనులందఱకును — దుస్సహమై, జననీజనకులకు సహితము కేవలము దుర్భరమై యనివార్యమయ్యెను.

శకుంతలాంబిక కుమారుని దుస్థితికి మిగులఁ జింతించి, పుట్టినింటికిఁ బోయి యున్నప్పు డొకనాఁడు తనయగ్రజున కావిషయమై విన్నవించి, యల్లుని రప్పించుకొని హితోక్తుల నాతని సత్పథమునకుఁద్రిప్పవలసినదిగా సోదరుని బ్రతిమాలెను. బాల్యమున యథేష్టముగా వదలుటయే యాతఁడిట్టి దుశ్శీలుఁ డగు

టకుఁ గారణమయ్యెనని తొలుత నుమాపతి చెల్లెలిపైఁ గినిసినను, పిమ్మట నాతని మంచిమార్గమునకుఁ ద్రిప్పుటకై సల్పిన ప్రయత్నము విఫలమగుటచేఁ గాఁబోలు నాతఁడల్లుని సిద్ధరామపురమున కనుచుట చదువరులెఱుఁగుదురు.

పదియవప్రకరణము

సాధుసంగమము.

చంద్రమౌళి శేషసాగరమును వదలి యింటికివచ్చినపిమ్మట నాతని నా యుత్పథమునుండి మరలించి, యుత్తమమార్గమునకుఁ ద్రిప్పఁదలిదండ్రులు బహుప్రయత్నములు చేసిరి. తల్లిమాత్రమేకాక తండ్రిసహిత మప్పుడందువిషయమై యెక్కుడుశ్రద్ధ వహించెను. చంద్రమౌళినిఁ దమసంఘమునఁ జేర్చికొని, యెప్పుడును దమతోడ నునిచికొని, మంచిమాటలచేఁ గ్రమక్రమముగ నాతని నవినీతినుండి తొలఁగించుచు, సద్గ్రంథపఠనమునం దభిరుచి కల్పించి, కొంతకాలమునకైన సదాచారవంతునిగాఁ జేయఁగోరుచు, నందులకుఁ బ్రతిఫలముక్రింద సమాజమునకుఁ దగినయుత్తమగ్రంథములను దెప్పించి యొసంగునట్లును, నిశ్చయించి పూర్ణచంద్రయ్య చంద్రమౌళినిఁ దనయూ

రి హితకారిణీమండలి వశముచేసెను. పూర్ణచంద్రయ్య యెడఁ దమకుఁగల పూజ్యభావముచేతనో, ప్రతిఫలాపేక్ష కారణముననో, మఱే హేతువుననో సమాజసభికులు సహితము చంద్రమౌళి పురోభివృద్ధినిఁగూర్చి, నిరంతరము శక్తివంచనలేక పాటుపడిరి; కాని వారిపరిశ్రమ మూరకపోలేదు. హితకారిణీ సమాజమునఁ జేరినకొన్ని నెలలు చాంచల్యబుద్ధిచేఁ జంద్రమౌళి మనసు చెడుతలఁపుల కెడమిచ్చుచు నుండెను. వారి యుత్తమ భావములను — భాషణములను — పనులను — ననుక్షణ మెదుటఁ జూచుచుండియు, సద్గ్రంథపఠనము — సత్కథాశ్రవణము — సమయోచితప్రసంగము — మున్నగు నుత్తమనియమము లుండియుఁగూడఁ జంద్రమౌళి బాగుపడుట సులభముగ సాధ్యముకాలేదు. ఎట్లైనను జివర కాతనిచిత్తము సాధుసంగమకారణమునఁ దద్వృత్తులనుండి మరలుట తెలిసియుఁ — కుమారునియభీష్టము నెఱింగియుఁ — బూర్ణచంద్రయ్య మిక్కిలిహర్షించి, సభికులర్థింపకమున్నె చంద్రమౌళి యుద్దేశమునకు ద్విగుణముగ, మండలికి మూలధనముగా నైదువందలరొక్కమును, బరమావశ్యకములైన రెండువందల యుత్తమగ్రంథములను గౌరవపురస్సరముగ నొసంగి, సాంఘికుల నభినందించెను. తాము మాటమాత్రముననైన హెచ్చరింపకపోయినను, జనకునిఁ బ్రేరేచి యట్టియుత్తమపారితోషికముచేఁ దమ్ము సన్మానింపఁ జేసిన చంద్రమౌళిని నెచ్చెలులు మిగులఁ గొనియాడిరి. అతఁడు నందుల కానందించి తనసౌశీల్యమును గ్రమోన్నతస్థితికిఁ దెచ్చుకొనుచుండెను.

ఈపరిణామ ముమాపతికిఁ దెలిసినదికాదు. తెలిసినను గూడ నాతఁడు విశ్వసించుట యరుదు. విశ్వసించినను దానిఁ బట్టియే తనకూఁతునిచ్చుటయుఁ గల్ల. శకుంతలాంబిక యీ కీలకమును బాగుగ నెఱుంగును; కనుక నామె యిఁకఁ దనయభీష్టములు ఫలింపవని మొదటనే గ్రహించెను. ఉమాపతి పుత్త్రిక నీయనని నిరాకరించిన మాత్రముననే, చంద్రమౌళికిఁ బెండ్లి జరుగకపోదు. లోకపరిస్థితులలో వరుని గుణావగుణములను విచారించువారు లేకపోవచ్చును; కాని ధనికులసుతులకుఁ గన్యలనిచ్చువారుమాత్రము లేకపోలేదు; పూర్ణచంద్రయ్యకును శకుంతలాంబికకును సన్యసంబంధము సమ్మతముగ నుండ లేదు. శారద చక్కనికన్య. అట్టి యుత్తమబాలిక తమవంశమున లభించుటయరుదు. లభింపదనియే చెప్పవచ్చును. ఈవిషయము శకుంతలాంబిక దృఢముగ నెఱుఁగును. ఒక్కఁడే కుమారుఁడగుటచే దూరముపోవుట కిష్టములేదనియు, ననుగ్రహించి కూఁతు నీయవలసినదనియు, నామె యొక్కపర్యాయ మన్నను బ్రార్థించెను. ఉమాపతి యంగీకరింపలేదు. శకుంతలాంబ యాప్రయత్నమునుండి విరమించెను. పూర్ణచంద్రయ్య కంతటితో నిరాశ పొడమలేదు. తనగృహమున శుభోత్సవములు నడచునపుడెల్ల నతఁడు శారదను బిలువనంపుకొని, ముచ్చటపడుట మానలేదు. చంద్రమౌళికిఁ బుత్త్రికనిచ్చువిషయమున నుమాపతి నిరాకరించినను, బూర్ణచంద్రయ్యకు శారదయెడఁగల యనురాగము లేశమైనను దఱుగలేదు. గరుడోత్సవమును జూడ శారదకొఱకు కాతఁడు బండి నంపినది శకుంతలాంబిక యెఱుఁగదు.

పదునొకండవ ప్రకరణము

భైరవుఁడు.

శేషసాగరమున కుత్తరదిగ్భాగమున సుమారెనిమిది క్రోసులదూరములో నొకచిన్న పర్వతమాలిక యున్నది. దాని నడుమ దాదాపుగ నొకమైలు వైశాల్యమున బయలొక్కటి వలయాకృతిని విస్తరించియున్నది. అచ్చట శైలశిఖరముల యందుఁ గురిసిన వర్షజల మనంతముఖములఁ జిన్నచిన్న కాలువలుగాఁ గ్రిందికిదిగి, యందొకచో నేకమై నదీరూపముఁ దాల్చి, యాకటకప్రదేశమధ్య భాగముగ నదీచీపథము ననుగమించి యుండును. వేసవియందా యేఱు నితాంతముగ నెండిపోవుచుండును. తమంతట సాంద్రముగాఁ బెరిఁగిన కంటకద్రుమ గుల్మినీ వితాన మరుణాంశుజాలము నవరోధించుకారణమునఁ జిమ్మచీకటి యెప్పుడు నానిబిడారణ్యముతోఁ జెలిమి సలుపుచుండును. ఆ వనాంతర్భాగముననుండి నిరంతరముగ వెలువడు కీచురొద, యందలి గిరిగహ్వరములఁ బ్రతిధ్వనింపఁ జేయుచు, నమ్మహాటవీగభీరతకు మఱింత మెఱుగు వెట్టుచుండెను.

శేషసాగరమునుండి చిన్నని కాలిత్రోవ యాకాననాంతరమునుండియే సిద్ధరామపురమునకుఁ బోవుచుండెను. విశాల రాజమార్గము ప్రత్యేకముగ లేనందున, శకటములు సహిత మాక్షుద్ర పథముననే కొండలోయల నడుమ నతికష్టముతో సాగుచుండును. కొండొకకాలమున దూరప్రయాణికు లందఱు

విడిసి — వంటలు చేసి — భుజించి — శ్రాంతినొంది — పదంపడి యూ
టనుండి బయలుదేఱుచుండి రనుటకు గుఱుతుగాఁ, గొన్ని యల్ప
మందిరములును — ఒక విదారకయు — శిలామయ కటాహము
లును — నేఁటికిని ఖలరూపమునఁ గానఁబడుచున్నవి. ఆవనమున
నెవ్వరును బసచేయుచున్నట్లు లేదు. అందుఁ గొంతతడవు విశ్రాం
తికైన నేయుద్యోగుఁడును నిలువ సాహసించుట లేదు. అనేకు
లామార్గమునఁ బ్రయాణము సల్పుటకే భయపడుదురు. పసు
లకాపరులు సహిత మావన పరిసరప్రాంతములకేనిఁ దమ
మందలఁ గొనిపోవుట మాని యుండిరి.

అది వ్యాఘ్రాది భీకరసత్వముల కావాసభూమియై
యుండెను. పులులు — తోఁడేళ్ళు — నేదుబందులు — మున్నగు
క్రూరమృగము లచ్చటి పశ్వాదుల ననుబట్టి చంపుచుండినవి. నర
మాంసముఁ జవి గొన్నవగుటం జేసి, బెబ్బులు లాప్రదేశమునఁ
జేరిన పథికజనులపైఁబడి, వారినిఁ జీల్చి తినివేయుచుండెను. వాని
రాయిడి క్రమక్రమముగ హెచ్చిపోయినది. అవి చుట్టుప్రక్క
లఁగల గ్రామములఁజొచ్చి, తమకంటఁబడిన జీవములనెల్ల నిర్దం
చి భక్షించుచుండినవి. ఇది చూచి సైఁపలేక జానపదు లనేకులు
గుంపులుకట్టిపోయి, యాయాటవిక మృగములనెల్ల నిశ్శేష
ముగ వధించిరి. నాఁటఁగోలె వేదనోదంతము లెవ్వియు నాప్రాం
తమునుండి జనపదుల శ్రుతిపుటముల కందుచుండలేదు; కనుక
జనులాత్రోవను మరలఁ దిరుగాడఁదొడఁగిరి.

మన చరిత్రకాలమునాఁటి కావిపినాంతరమున దుష్ట
మృగోపద్రవము సంపూర్ణముగఁ దగ్గియున్నను దొంగల బాధ

కొంతవఱకు హెచ్చియుండెను. ఒకనాఁడు పెరిణయార్థ మరుగుచుండిన స్త్రీలను దోఁచుటయు — మఱునటిదినము వ్యాపారులఁ గొట్టి వారి ధనము నిశ్శేషముగ హరించుటయు — మఱియొకప్పుడు సరకుబండ్ల నడ్డగించి, తమకెదురొడ్డిన బల్లిదుల నందలి వృక్షశాఖలకు వ్రేలగట్టి, వారి పదార్థసంచయముఁ గొల్లఁగొనుటయు జరగినది. అందు దోఁపిడికాఁడొకఁడు తన సహచరులతో నివసించి యుండవచ్చును. నాయకునిస్థాన మందలి కొండగవులలో నుండియుండవచ్చును. ఈప్రతీతి కొంతవఱకు సత్యమేకావచ్చును.

ఇట్టి పరిస్థితులలో నొకనాఁటిరాత్రి, సుమారెనిమిది గంటలసమయమునఁ బైన వర్ణించిన వనమునందలి యేటియొడ్డున, ముగ్గురు మనుష్యులు కూరుచుండి యెవరికొఱకో నిరీక్షించి యుండిరి. కొంతసేపటికి వారిట్లు మాట్లాడఁ దొడఁగిరి.

ఒకఁడు—నిప్పునకుఁ గూడఁ జెదపురుగుల దాడియా? అగ్గి నఱుక నున్న యీమందుఁ డెవ్వఁడై యుండును ప్రభూ!

ప్రభు.—(సరోషముగ) ఎవ్వఁడైన నేమి?

ఇట్లు పలుకుచుఁ బ్రభుఁడు వెంటనే తనయొరనుండి మిఱుమిట్లుగొలుపు చంద్రహాసమును బైకి లాగెను.

ప్రభుఁ—భైరవా! ఈనాఁడికత్తి బలిగొన్న తల లెన్నిరో లెక్కించినావా?

భైర—లేదు — మహాప్రభూ! వానికి లెక్కలేదు.

ప్రభుఁ — (విస్మితుఁడై) అందులో నానిర్భాగ్యుని మస్తకముకూడ నొక్కటియై పోవును. బీరన్నా! నీవట్లుతలం

పంజాలవా?

బీర—ఒక్కఁడుకాఁడు: దేవా! శిష్యులతోఁ బదుగురు.

ప్రభుఁ—మఱియు మేలేమైనది లెమ్ము. ఆపదుగుర యుడుకురక్తమును గూడ నిది తనివి దీఱఁ ద్రావఁగలదు.

వికటాట్టహాసము సేయుచుఁ ప్రభుఁడాకత్తినిఁ గ్రమ్మఱ నొరయందుఁ జేర్చెను; మఱియు నాతఁ డలక్ష్యభావమున "వాఁడు సన్న్యాసిరాజఁట! ఆదుర్బలునిఁ బట్టఁజాలని యేపిఱికిబంటు నా యూడిగమునకుఁ దలయొగ్గినాఁడు?" అనెను.

ఱేని నయనముల నెత్తురుగ్రమ్మెను. ఆతఁడు తన రౌద్రవదనమును దీవ్రగతి నెడమప్రక్కకు మలంచెను.

బీర—ఏలినవారి పాదసేవకున కీపనియెంతో! దేవా! గడవిందు.

ప్రభుఁ—మంచిది. ఒక్క నెల —

బీర—మహాస్వామీ! ఏలినవారి దయయున్నచోఁ గడవొక వారముమాత్రమే చాలియుండును.

ప్రభుఁ—ఔను. నీ విట్టి మేటిబంటువని స్థిరీకరింపవలసియున్నది.

ఇంతలో మఱియొక వ్యక్తి యామనుష్యులను సమీపించి చేతులఁ గట్టుకొని ప్రభుని మ్రోల వినమ్రుఁడై నిలుచుండెను.

ప్రభుఁ—ఏమిచెప్పనున్నావు?

వ్యక్తి—బందివాఁ డొక్కఁడు: ఆఁడువాండ్రిద్దఱు.

ప్రిభుఁ—వారి వెంట?

వ్యక్తి—మఱెవ్వరును లేరు.

ప్రిభుఁ—ఆ వయసుపిల్ల?

వ్యక్తి—వారితో నుండెను.

ప్రిభుఁ—మొత్తమున?

వ్యక్తి—ముగ్గురు.

ప్రిభుఁ—సరే! ఈపనికి భైరవుఁడు చాలును.

వ్యక్తి—తక్కినవారి కేమి సెలవు?

ప్రిభుఁ—బుక్కసాగర మార్గము నరికట్టుట.

వ్యక్తి—చిత్తము.

వెంటనే యందఱు నాచిమ్మచీఁకటిలో నదృశ్యులై పోయిరి. ఒక్కమానవుఁడుమాత్రి మందు నిలిచియుండెను. అతఁడు భైరవుఁడే. భైరవుని శరీరచ్ఛాయ యాయమావాస్య రజనీకాంతిలో సమ్మిశ్రితమై యుండెను. అతని దేహము కాళికాసదృశము. ఆపురుషుఁడు ధరించిన గోఁచియందుల కెంతయుఁ దగియుండెను. అతని దుడ్డుగఱ్ఱయునట్టిదే; కనుక నాచిక్కనిచీఁకటిలో నామనుజుఁ డొక యుక్కుతునుకవలె మిక్కిలి చక్కఁగాఁ బ్రికాశించుచుండెను. ఆ గాఢాంధకారమున విలీనమైయున్న తనకాయము నొక్కమాఱుచూచుకొని, భైరవుఁడు పక్కున నవ్వుకొనియెను. ఉన్నట్టుండి పెదవుల నడుమ బయలువడిన యాధవళదంత పంక్తి, యాతనిమేనికాంతికి మిగులమిక్కిలి వికారమునే కలిగించెను. అతఁ డాచోటు బాసిపోయెను.

ఆసాంద్ర జీమూతావకుంఠన మధ్యమున — ఆ భయంకరారణ్యమున + ఒక శకటము నడచుచుండెను. సారథి బండి నతివేగముగఁ గొనిపోవుచుండెను. పోవుచుఁ బోవుచు శకటమొక యేటిపల్లమునఁ దటాలున నాఁగెను. ‘వలదు — రామయ్యా! ఈచోటు మిగుల నపాయకరమైనదని నీవెఱుఁగుదువు గదా? బండినిచ్చట నిలుపవలదు. వడిగాఁ బోనిమ్ము.’ ఈ శబ్దము శకటాంతర్భాగమునుండి వెలువడెను. ఇది యొకానొక యువతీమణి కోమలకలకంఠధ్వని. ఆశ్రావ్యనాదము మనమీవఱకుఁ బెక్కుతడవలాలించియున్న శారదా మృదుస్వరమును బోలియున్నది. శకటమున నున్నది శారదయేనా? అవును. ఆమె తన జనయిత్రి పాదములకడఁ గూరుచుండియుండెను; కాని మనకగపడదు. రామయ్య యెడ్లనదలించుచు బండినతిత్వరితముగ నడపుటకై విశ్వప్రయత్నములఁ జేసెను. శరవేగమునఁ బరువిడఁగల మాతంగసన్నిభములగు నావృషభరాజములు పాప మొక్క యంజమైన వేయఁ జాలకపోయెను. బండి కదలలేదు. అయ్యో! ఆశకటచక్రములందలి సికతాతలమునఁ గ్రుంగిపోయినవా యేమి? మునికోల మూపుననుంచుకొని నొగలపైనుండి రామయ్యదిగి బండివెనుకకుఁ బోయెను. మునిపాదముల నిసుకయందూఁదుకొని హస్తద్వయమున బండిచక్రమునుబట్టి యూఁపిన యొకానొక నల్లని దృఢకాయుఁడాతనికి గోచరించెను. అదిచూచి రామయ్య యుగ్రుఁడై ‘బండి నిట్లడ్డగించిన నీవెవ్వఁడవురా? దొంగ!’ యని జలదగంభీరస్వరమునఁ బ్రశ్నించెను. ఆ భయంకరాకారుఁడు బలిష్ఠమైన

తన దుడ్డుగోలచే రామునకుఁ బ్రత్యుత్తరముచెప్పెను. ఒక్క ప్రహారముతోఁ నతఁడు నేలఁగూలెను. వెంటనే యానవీన పురుషుఁడు సారధిపదవి నధిష్ఠించి శకటమును దన నిరంకుశ మార్గమునకుఁ ద్రిప్పుకొనిపోయెను. ఆనూతన నియంత యెవ్వఁడు? — భైరవుఁడు.

పండ్రెండవ ప్రకరణము.

వారు నేఁడును దాటిపోయిరా?

కాటమేశ్వరకూట గహ్వరములందు ఋషిసత్తము లనేకులు వాసముచేయుచున్నారనియు, వారు మర్త్యులకు దర్శన మీయనొల్లక పగలంతయు నంతర్భూతులైయుండి నిశాసమయముల నందందు విహరింతురనియు, బహుకాలమునుండి వదంతియున్నది. ఒక్కమహనీయుఁడుఁ మాత్రము జడమతులగు పాపులఁ గటాక్షింపనెంచి, తనశిష్యమండలితోఁ బరిపక్వహృదయులకుమాత్రము ప్రత్యక్షమై, మంత్రోపదేశము ననుగ్రహించి యదృశ్యుఁడై పోవుచుండుననియుఁ దెలియుచున్నది.

వెనుకటి ప్రకరణమునందలి యంశములు జరిగిన నాఁటి యుషఃకాలముననే, కాటమేశ్వర కూటము నందలి యొకానొక మహాకందరమున సుమారేఁబది సంవత్సరముల

యీడుగల పురుషుఁడొక యున్నత శిలాపీఠమునఁ గనులుమూ సికొని జపమాలఁదిప్పుచు నిశ్చలధ్యానుఁడై కూసచుండి యుండెను. ఆపురుషుఁడు స్ఫటికాక్షహారములను—భస్మపుండ్రములను —శుద్ధధవళాంబరములను—ధరించి, శంకరదేవుని చందమున భాసిలుచుండెను. ఆమహనీయుని మోల, నించుక క్రిభాగమున సమర్పఁబడియున్న సోపానముపై నొక తరుణవయస్కుఁడు బద్ధహస్తుఁడై —భక్తిభావ గర్భితుఁడై —పద్మాసనాసీనుఁడై —యుండెను.

యోగపరవశుఁడైయున్న స్వామి, విరజానందుఁడు. అమ్మహనీయుఁడు జపమాలఁ ద్రిప్పుట నాఁపి, కొంతకాలమున కున్మీలిత నయనుఁడై శిష్యునివంక దృష్టిని సారించి, ప్రసన్న భావమున నిట్లు సంభాషింప మొదలిడెను.

"వత్సా! అల్పబుద్ధిగల మానవుఁడు, బ్రహ్మాండజాలమున కధినాయకుఁడగు నాపరాత్పరుని యద్భుత కార్యసాష్టవము నూహింపఁ జాలునా? ఈ విశాల భౌతిక ప్రపంచము నొక్కమాఱు సూక్ష్మ చక్షువులచే నవలోకింపుము. ఆయనంతుని యద్భుత కర్మకలాప మెంత చిత్రకరముగ సమకూర్పఁబడి యుండెనో గ్రహింపఁగలుగుదువు."

శిష్యుఁ డమ్మహాత్ముని వాక్యములఁ బూజ్యభావమున నమస్కరించి వినుచుండెను.

గురు—ప్రపంచసౌధము నంసృష్టమైనది. సలిలరాసులు నిర్మింపఁబడినవి. అందు దీపికానిచయమువలెఁ దారకాగణము సముజ్జ్వలకాంతితో భాసిలుచున్నది. సూర్యుఁడు తన సహస్ర

కరములను జాఁచి, సముద్రతరంగములఁ గ్రోలుచున్నాఁడు. అతని తీక్ష్ణతరకరపంక్తి, క్షారవారిలోని నిర్మలజలము నావిరి రూపమునకు మార్చి విశాలావకాశమునకుఁ గొనిపోవుచున్నది. మలయసమీరుఁడు మోహనకరమైన తన యమృతకరస్పర్శముచే, నాయంబుకణముల నొక్కటిగఁ గూర్చుచు జలదరూపమునకుమార్చి, దానిని వియత్పథమునఁద్రిప్పుచున్నాఁడు. మేఘుఁడు శీతలవాతపోతములకుఁ గరఁగి నీరధారలఁ గురియించి వివిధౌషధీరసములను వెలయించుచున్నాఁడు. ఏమి యీ వైచిత్ర్యము! చూడుము. ఈప్రపంచసృష్టి యొందులకు? దానికి సూర్యుడు — మలయసమీరుఁడు — మేఘుఁడు — తారకలు — మున్నగు సేవకాగణకైంకర్యముతోఁబనియేమి? వీని నిట్లునియోగించిన చతురుఁ డెవఁడు? ఎవరికొఱకు? ఈ మహాకటాహగర్భమున నిట్టి ప్రపంచగోళము లెన్ని యిమిడియున్నవి! వత్సా! ఊహింపుము.

శిష్యుడు నిశ్చలభావమున నాకర్ణించుచు నుండెను.

గురు—మనమొక్క వైహికప్రపంచమును మాత్రమే తెలుసుకొదము. నీవు సృష్టిరంగమును దిలకించుచున్నావు. అందు జడములు చరములు — జడములలో జీవనిర్జీవ భేదములు— చరములలోఁ జిత్రవిచిత్రస్వరూపములు—నీదృష్టిపథమునఁ బడుచున్నవి. దర్శయోగ్యములగు బచ్చనిపైరులు—ఫలవృక్షములు— సూక్ష్మాకృతిఁ దాల్చి గాలిలో నెగురు క్రిమిజాలము — నేలపై బ్రాకు కీటకసమూహము—నీళ్ళయందుఁ—జరించు జలచరవర్గము—భూమినిఁ దిరుగాడు తిర్యక్సంతతి — మఱియుఁ బిపీలికాది

మనుష్య పర్యంతముఁగల సమస్త జీవజాలమును నిర్మించి, యమ్మహనీయుఁ డీనాట్యరంగమున వాని నెట్లెట్లు ప్రదర్శించుచుండెనో సుఖదుఃఖముల నెడు యవనికలనడుమ ప్రాణికోటి యెట్లు నటించుచుండెనో — గమనించుము.

ఆకస్మికముగ సన్న్యాసియొక్కఁడు లోనఁ బ్రవేశించుటచే మహాత్ముఁడు నాఁటిసంభాషణము నంతటితో విరమించెను. శిష్యుఁ డాచార్యునకుఁ బ్రణమిల్లి గురుదేవుని సెలవు పొంది, యటనుండి నిర్గమించెను. మహాత్ము నానతిని సన్న్యాసి పార్శ్వతలమునఁ గూరుచుండెను.

గు—నేఁడొక నవీనాంశము నాకర్ణింతు ననుకొందును.

స—మహాత్ములకేదియు నవీనవిషయముగ నుండఁజాలదు. ఆ దురాత్ములు కంటకప్రాయులై చరించుచున్న విషయము నూతనము కాదుకదా ?

గు—అవును, పిమ్మట ?

స—నేఁటి సాయంసమయమునఁ జీఁకటిపడిన యనంతరము సహచరుల నాయాకడలకుఁబంపి, నేను బుక్కసాగరమునువదలి, కటక ప్రాంతరమార్గమునుబట్టి నడచుచుంటిని. త్రోవలో ముగ్గురు దోఁపిడికాండ్రు నాకు గోచరించిరి. వారు సాయుధులై యుండుటచే, నేనొక్కఁడ నెదురు తిరిగియుఁ బ్రయోజన ముండదనుకొని, యాదుష్టుల బారినుండి తొలఁగితిని. నేను వారిని వెన్నాడి యాచోరుల నిగూఢస్థానముఁ గనుఁగొనఁ దలఁచితిని. కాని, గురువర్యుల నూతనసందేశము నన్నాయుద్దేశమునుండి మరల్చెను.

గు—ఆపైన ?

స—ఒక క్రోసుదూరము నడచునప్పటికి దారిమధ్యమునఁ జిత్రవధగావింపఁబడిన స్త్రీల వికలాంగములు కొన్ని నాకంటఁబడెను.

గు—దొంగలను గుర్తింపఁజాలక పోయితివి.

స—చిత్తము. ముసుఁగుకుళ్ళాయులను ధరించి ముఖములకుఁ బూతపూసికొని యుండుటచే నేను వారినిఁ బోల్చుకొనఁ జాలకపోయితిని.

గు—సరే! తరువాత ?

స—నే నచ్చటనుండి కటకపాంతరముఁ బ్రవేశించుట తడవుగా నున్నట్టుండి స్త్రీలయాందోళనము వినవచ్చెను. ఒక నిమేషకాలము నేనందేనిలిచి మరల నాలకింపఁ జొచ్చితిని. "ఎవ్వరైన మ మ్మీకూరాత్ముని బారినుండి రక్షించిన పుణ్యమునఁబొందు" అను విపత్సూచకవాక్యము నాశ్రుతిపుటములఁ దగిలెను. ఆ గాఢాంధకారమున నాకేమియు నగపడుటలేదు; అయినను ధ్వనివచ్చిన దిశకుఁ బరుగువాఱి, యాదారుణ కాళరాత్రిలో నెవ్వఁడో దుష్టచిత్తుఁడు, స్త్రీలున్న శకటమును దురధ్వమునఁ గొనిపోవుచున్నట్లు తెలిసికొని, బండిని సమీపించితిని. నొగలపైఁ గూరుచుండి యొకానొక స్త్రైనభటుఁడు పగ్గిల్లదములాడుచున్నట్లును గ్రహించితిని. నేనా యున్మత్తునిపై నుఱికి, నాచేతి బడిలచే వానిఁ గ్రింద బడమోఁది, శకటము నారోహించితిని. దాని నుత్తమపథమునకుఁ ద్రిప్పితిని.

గు—అనంతరము?

స—ఆసమీపస్థానమునఁ జోరు లుండవచ్చునను సంశయము నాకుఁ బొడముటచే నందుఁ దామసింపలేను.

గు—మంచిది.

స—శకటమునంగల యబలలు తొలుత నన్ను విశ్వసించినవారు కారు. నేను వంచకుఁడనుగానని నమ్మఁబలికి, వారికిఁగల సంశయమును దీర్చి, జరగిన సందర్భములఁ దెలిసికొని, మార్గమధ్యమునఁ బ్రహారఘాతమువలన స్మృతితప్పి పడియుండిన సారథిని బండిలోనిడికొని, సిద్ధరామపురమునందలి వియ్యారివారి గృహమున నాపాంథులను జేర్చి వచ్చితిని. ఆస్త్రీలలో నొకర్తుక వృద్ధురాలు — ఉమాపతి సతీతిలకము. యువతి వియ్యారి పూర్ణచంద్రయ్యగారి కోడలగు శారద.

గు—ఆయభాగిని కింకను గష్టములు హెచ్చనున్నవి.

స—మరల నాప్రదేశమునకువచ్చి దస్యునికై యాప్రాంతమెల్ల వెదకితిని. ఆ దుర్మార్గుఁ డెందేగెనో తెలియదు. ప్రయత్నములు ఫలవంతములు కాలేదు. గురుదేవా! పాప మంతకాల మింకను సంరక్షింపఁబడఁగలదు?

గు—(మందస్మితుఁడై) కానిమ్ము వారు నేఁడును దాఁటిపోయిరా?

పదమూఁడవప్రకరణము.

గరుడోత్సవము.

నేఁడు వైశాఖ శుక్లవిదియ — సిద్ధరామపుర గరుడోత్సవదినము—పౌరుల కిది మహాపర్వ దివసప్రాయము.

ఈ వాహనోత్సవ మీయూరి చెన్నకేశవునకుఁ బ్రతివత్సరమున నత్యంతభక్తిపూర్వకముగ — విపులవిభవాభిరామముగ — జరుగుచుండును. స్థలాంతరములనుండి ప్రేక్షణికు లనేకు లిమ్మహోత్సవసందర్శనకౌతూహలమున నిచ్చటకు విచ్చేయుచుందురు. ఆగంతుక జనులకు భోజనాదివసతులఁ గావించి, వారిని గారవించుభారము వియ్యూరివారిదై యుండును.

సిద్ధరామపురమునందలి ముఖ్యవీధులన్నియు మిగుల రామణీయకములుగ నలంకరింపఁబడినవి. కేశవుఁడు విహారము సల్పు రాజమార్గము శుద్ధోదకసంసిక్తమై — చిత్రితర రంగవల్లీసంశోభితమై — యొసలారుచుండెను. పౌరులు తొలివేకువనే మేలుకని స్నానాదికములఁ దీర్చికొని రుచిరాభరణ పరీధాన పరిష్కృతులై యానందతరంగములు హృదయపారావారమునం జెలరేఁగ నుత్సాహసంభరితులై విలసిల్లుచుండిరి.

ఆ పురమున రాజవీధి నుత్తరాభిముఖమయియున్న యొక ప్రాచీన సుందరభవన మెంతయు నొప్పిదముగఁ బరిష్కరింపఁబడియుండెను. దాని సువిశాలప్రాంగణభూమి, యుద్వాహమండపముచే నావృతమైనది. ఆచవికె పచ్చతోరణాలంకృతమై

ముత్యాలజాలరులతోడను రసగోళములవలనను జెలువారుచుండెను. దాని శిఖరభాగము మంజులధ్వజవిరాజమానమై యుండెను. మండపోన్నతస్తంభములు కదళీప్రకాండమండితములై యుండెను.

నాఁడామందిరమున జనులకలకలము మిగుల హెచ్చి యుండెను. బీదసాదలు తమకిష్టమగు బదార్థసంచయము నందలి గృహసేవకులనడిగి విరివిగఁగొనిపోవుచుండిరి. అందుఁ బ్రవేశించుటకును, దమకుఁగావలసినవానినడిగి పుచ్చుకొనుటకును, గుంటిగుడ్డి మున్నగు వికలాంగుల కెట్టియభ్యంతరమును లేకుండెను. అందఱు దిడ్డిదారిని లోనఁ బ్రవేశించుచుఁ దమయభిమతముల నెఱింగించుచు, సఫలమనోరథులగుచు వెళ్లుచుండిరి.

ఆభవనాంతరమునందలి వసారాలోని వేదికపై రత్నకంబళములు పఱుపఁబడియుండెను. అందొక స్థూలవిగ్రహుఁడు మండలాకృతిగనుండిన దిండున కొరగిలి కూరుచుండియుండెను. ఆతని దృఢావయవము — కోరమీసములు — సమున్నతనయనములు — దీర్ఘబాహులు — విశాలఫాలభాగము నాపురుషుని గంభీరాకృతికిఁ బ్రబలనిదర్శనములై యుండెను. నానావిధకుసుమమాలికలవలనను — మధురఫలములచేతను — ఆకువిడెములతోడను — నిండియున్న వేర్వేఱు పళ్లెరములు, మనోహరచందనసలిల పరిపూరితస్వర్ణపాత్రము, నాయున్నతపురుషమూర్తికి వామపార్శ్వమున నెలయుచుండెను.

చిక్కని కాటుకవన్నె చేనొప్పి మైనిండ బూది నలఁదుకొన్న యొకమహోదరుఁ డాతని సమ్ముఖమున సుఖాసీ

నుండై యుండెను. పురుషసింహుఁ డిట్లనెను.

"ఔను — శాస్త్రి గారూ! మీరు సెలవిచ్చినట్లు వివాహ కర్మ కడుంగడుఁ బావనమైనదే."

గభీరపురుషున కభిముఖుఁడై యున్న లంబోదరుఁ డాయూరి పురోహితుఁడగు సీతారామశాస్త్రి.

శాస్త్రి — కనుకనే కదా పూర్ణచంద్రయ్యగారూ! ఇది యైహికపరంపరాభివృద్ధి కాధారమగుచుండుట?

పూర్ణ — అంతియ కాదు. జగన్నియంతయగు నీశ్వరుని పవిత్రోద్దేశముల నారాధించుటయందు, స్త్రీపురుషులు పరస్పరసహాయులై మెలఁగవలసియున్నది. అందుకొఱకే యీ యుక్తకర్మరూపమున వధూవరు లొండొరులు ప్రేమ శృంఖలులచే బద్ధితులగుచున్నారు.

శాస్త్రి — కావుననే మనముసల్పినయత్నము లీనాఁటికీ పవిత్రకర్మరూపముఁ దాల్చినవి.

పూర్ణ — అనుగ్రహించి కార్యోపాయము నెఱిఁగించినవారుమీరు — కార్యసాధనమున కుపక్రమించినవారుమీరు — తత్సాధనానంతరమున నుత్తమఫలభాగ్యమును బ్రదర్శింప నున్నవారును మీరే. భారమంతయును మీపైనున్నది. సర్వ వ్యవహారములు మీనుండియే నెఱవేఱవలసియున్నది; కాని యీయల్పాంశమే పరంపరాగతమై యమేయమైన మాయమూల్యస్నేహశృంఖలులకు, విచ్ఛేదకారణ మగు నేమోయని వితర్కించుచుంటిని.

శాస్త్రి — ఇది కేవల మనుష్యమాత్ర కల్పితము కాఁ

జాలదు. ఈశ్వరప్రేరితము. ఉమాపతి వలదన్నను జరగవల సినకార్యము నిలువనేరదు. ఈతత్త్వ మాతనికైనఁ దెలిసియే యుండవలయును. ఉమాపతి ప్రకృతి చాలయోగ్యమైనది. నామాటలయం దాతనికెంతయును బూజ్యభావము. నేనా సాధుపురుషున కన్నిఁట నుచితరీతిని మనశ్శాంతిఁ గల్గింతును. మీ కీవిషయమున శంకవలదు. నాపైభారమువైచి మీరు నిశ్చింతగా నుండుఁడు.

పూర్ణ—చంద్రమౌళి జాతకపత్రమును మీరు పరిశీలించినారు. అది మీతండ్రిగారు వ్రాసినది.

శాస్త్రి—చిత్తము. ఇప్పు డాతనికి శుక్ర మహాదశ.

పూర్ణ—ఇది యాతని తొమ్మిదవయేటఁ బ్రారంభమయి యుండెను.

శాస్త్రి—అవును. దానిపరిమితి యిరువది యబ్దముల కాలము.

పూర్ణ—అయినచో నిఁక రెండు సంవత్సరముల వఱ కా దశయే యుండుననుకొనుచున్నారా? ఇది యాతని యిరువది యొకటవయేఁడు.

శాస్త్రి—చిత్తము. అనంతర మాదిత్యుఁ డుచ్చస్థానము నందును.

పూర్ణ—ఆ సందర్భమున మనమెంతప్రయత్నించినను—

శాస్త్రి—(అర్ధోక్తియందే) జన్మపత్రములోఁ జెప్పినట్లు పదునాఱేండ్ల వయస్సులోపల వివాహ మాతనికిఁ గూడి వచ్చినదికాదు. దైవయోగము తప్పినందులకు మీరేమి

చేయఁగలరు?

పూర్ణ—అదియుఁ జాల నాశ్చర్యకరమగు విషయమే. పోనిండు — ఈముహూర్తమైనను జక్కఁగఁగుణించి నిర్ణయించి నారా?

శాస్త్రి—బాగుగాఁ దఱచి చూచియే లగ్నమును నిశ్చయించినాను. అది జాతకుని జన్మలగ్నమే. బహుప్రశస్తముగా నున్నది. ఈసన్ముహూర్తమునఁ బరిణతులైన దంపతు లెట్టియరిష్టమును బొందక; నిత్యానంద రసానుభవులై —యన్యోన్యప్రేమానుబద్ధులై — వర్తించి, సుఖింతురు.

పూర్ణ—లగ్న పత్రమునఁ బగలు పదునొకండుగంట లనివ్రాయఁ బడినది. స్వామికిఁ గైసేఁతలు ముగిసినవా?

శాస్త్రి—అంతయు సిద్ధమైనది.

పూర్ణ—మంచిది. ఇఁకఁ దామసింపనేల? మీకిప్పు డేమి కావలసి యున్నది?

శాస్త్రి—నేఁటికైంకర్యవ్యవహారము బహుదివ్యముగా నుండవలసియున్నది.

పూర్ణ—ఔను. సందియము లేదు.

శాస్త్రి—ఇదిబాపలపని. గొప్పవారికార్యములన్న వారికిఁ గొండంతయాశ. మీకుఁ దెలియని దేమియున్నది?

పూర్ణ—యోచింపవలదు. పాపము వారును జాలఁ గష్టపడవలసి యుండురు. ఇప్పు డీవందరూప్యల పత్త్రముఁ గొని పొండు.

శాస్త్రి—(ఆసూతృణముగ) మాకిది యేపాటి! — మీ

యనుగ్రహ మొక్కటియున్నఁ జాలును. ఇంటఁ గావలసిన పను లన్నియును దీఱినవా?

పూర్ణ—ఏమియుఁ గొఱంతలేదు. మీకై నిరీక్షించి యున్నాము.

శాస్త్రి—అయినచో నింకెంతసేపు—నేనీవఱకు మీకుఁ జెప్పిన విషయమై యేమియోచించితివి? గౌరాంబికను గార గాంతరమున నెటకో పంపి మన మీకార్యము పూర్తిచేయుటయే లెస్సకదా?

పూర్ణ—క్షమించుఁడు. అది గౌరవార్హముకాదు. ఎప్ప టికి నా శాగు జరగింపరాదు. తల్లియూరిలోనుండ నామెకను బ్రిమి యీపనిచేయుట భావ్యముగనుండదు.

శాస్త్రి—అయిన మీ విషయ మామెకుఁ దెలియఁ జేసెదరా?

పూర్ణ—రాత్రియే తెలియఁజేసితిని.

శాస్త్రి—ఇందుల కామె సమ్మతించినదా?

పూర్ణ—ఔను. ఆమె సంపూర్ణాంగీకారమును బడ సియే యీవ్యాపారమున నుపక్రమించితిని.

శాస్త్రి—మగని యుద్దేశ్యమునకు భిన్నముగ నడచుట యామె యిష్టముకాదుకదా?

పూర్ణ—ఎంత మాత్రమును గాదు; కాని తనప్రియ పుత్రికామానసికతలమున నక్రమాభివృద్ధిఁ బొందుచున్న యాశా లతను బలోచితముగఁ గోసివేయఁ జాలదు. తన యభీష్టముఁ దెల్పుకొనలేదు. మఱియు నా సంకల్పమును ద్రోసివేయనే

రదు. ఈమహోత్సవవైభవ మతిశీఘ్రముగఁ గన్నులారఁ జూచి యానందించు కుతూహల మామె కెంతయును గలదు; కనుక నేమైనఁగానిమ్మని తన యామోదమును సూచించినది.

శాస్త్రి—అంతయు మనమనుకొనినట్లే జరగినది. ఈశ్వరానుగ్రహము మనయెడఁ బూర్తిగనున్నది. సూత్రధారణమున కఁక వేళయతిక్రమింపకుండ నేను పోయివచ్చెదను.

పూర్ణ—చిత్తము.

శాస్త్రియచ్చటనుండి వెళ్ళిపోయెను. చన్న కేశవుఁడు గరుడవాహనారూఢుఁడై పురవీధుల వేంచేయుచున్నాఁడనుటకుఁ బ్రథమసూచనయోయనఁ దూర్యారావములును, మంగళ మధురగీతములును, పటహ డిండిమ మురజాది వాద్యనాదములును మిన్నంటెను. పూర్ణచంద్రియ్య పరిచారకులు వడివడిగాఁ బ్రాంగణప్రదేశమునం దొకవైపునఁ గంబళములను, వేఱొకవంకఁ గుఱిచీలను బొంకుగుపీఁటలను వైచి, మంగళులను హెచ్చరించెను. వారును మేళవాద్యములను మిన్నుముట్ట మ్రోయించిరి. ఊరిలోని పెద్దలు—పిన్నలు—నందఱును గుంపులు గుంపులై వియ్యారివారి గృహమువంక నడువఁజొచ్చిరి. గృహసేవకులు చేరవచ్చిన జనులకు భక్తిపూర్వకముగ నుచితస్థానములఁ జూపుచుండిరి. అంతలో శతాధికసంఖ్యగల ప్రజాసమూహముతో, గరుడవాహనారూఢుఁడు వియ్యారివారి భవనప్రాచీరముఁ జొచ్చి, సర్వాలంకారసంశోభితమగు మండపమధ్యప్రదేశమున నొక్కెడ నాఁగెను.

కేశవుఁడు మణిమయ మండలప్రసాధితుఁడై, పరిమళ

కుసుమహారవిరాజమానుఁడై, యుండెను. హస్తమున వింజామరపూని, యొకపార్శ్వమున సమీచీన చీనాంశుకధారిణి యగు విలాసవతియోర్తుకయు, మఱొకప్రక్కఁ బీతాంబర ధరుఁడును గేవల లలితప్రియుఁడును నగు నర్చకుఁడును నిలిచి యుండిరి. పురోభాగమున భక్తులుకొందఱు హరినామకీర్తనములఁ బాడుచుండిరి. వారి కావల వారవిలాసినులు నాట్యమాడుచుండిరి. రశికసిఖామణు లాపుంశ్చలుల చుట్టు ముసరి వారిభావవైఖరిని హేలావిలాసమును — గమనించుచు నాంగిక ప్రవృత్తుల నవలోకించుచు, నాకామినుల యంగవిన్యాసాదికములఁగూర్చి నర్మగర్భ భాషణము లాడుకొనుచు మోహావివశులగుచుండిరి. ప్రజాకలకలము మిక్కిలి యతిశయించుచుండెను. శాంతిరక్షకు లాకోలాహలమును వారింపఁ బ్రయత్నించుచుండిరి.

కొంత తడవునకు భక్తుల హరిస్తుతులును భోగకాంతల యభినయములును నాఁగిపోయినవి. వారెల్లరు వివాహవేదిక వంకఁ దమదృష్టులను సారింపఁజొచ్చిరి. ఆయుద్వాహపీఠమున గంధమాల్యాంబరాభరణశోభితులగు వధూవరులు పరస్పరాభిముఖులై నిలిచియుండిరి. వారినడుమ నొక చిన్న తెరవ్రేలుచుండెను. వివిధవిధమంగళద్రవ్యములను — సురుచిర పుష్పఫలాదులను—మణిమయ భూషణ దుకూలములను—కాంచన పూర్ణకలశములను — దీపకళికానళులను—ప్రత్యేక ప్రత్యేకముగాఁ బసిఁడి పళ్లెరములలో నునిచికొని, పుణ్యాంగనలిరువంకల నిలిచియుండిరి. బంధు మిత్ర పరివారవర్గము వారి

బరివేష్టించి కార్యకలాపసంవిధానము నారయుచుండెను. పురోహితుఁడు వధూవరుల మధ్యభాగమున నిలిచి, విధిమంత్రపూర్వకముగా వివాహకర్మ నడుపుచుండెను.

మంత్రోచ్చారణ సలుపుచు వరుఁడాచార్యుని యాదేశానుసారము తన బాహుదండములను జాఁచి, వధూమణీపల్లవకంధరమునఁ గల్యాణసూత్రధారణ మొనరించెను. తోడనే తెర తొలఁగింపఁబడెను. చంద్రమౌళి శారదా మృదుపాణిని బరిగ్రహించెను. అర్చకుఁ డాయుత్తరక్షణముననే స్వామికి నీరాజనము సమర్పించెను. వధూవరులిద్దఱు నాదివ్యజ్యోతికభిముఖులై — యవనతాననులై — నమస్కరించిరి. మహాజను లాప్రౌఢదంపతుల యభ్యుదయాభివృద్ధినిఁ గోరి వారిపైఁ గుసుమాక్షతరాసులఁ గురియించిరి. భూసురవరుల పుణ్యాహరవ మతిశయించెను. దర్శకులకుఁ బుష్పఫలతాంబూలాదు లొసంగఁబడెను. పిమ్మటఁ బూర్ణచంద్రయ్య పైఁడిపళ్ళెరముతో సువర్ణములఁ గొనివచ్చి యందుఁ జేరియున్న యాగంతుకుల కొక్కొకటినంతున సమర్పించి, వినమితగాత్రుఁడై యందఱకుఁ బ్రణామములను సల్పెను. వధూవరులు సువాసినుల ననుగమించి గృహముఁ జొచ్చిరి. కేశవుఁడు ముందుసాగెను. ప్రేక్షకులు విరిసిపోయిరి.

పదునాలుగవ ప్రకరణము

రమణి.

సిద్ధరామపురమునందలి వేశ్యలలోఁ బేరెన్నికఁ గన్నది రమణి. ఈమె గురుముఖమున సంగీతవిద్య చక్కఁగ నభ్యసించి ఘననాయికసానియని కీర్తివడసినది. నర్తనమునందేమి మృదుగానమునందేమి హావభావవిలాసవైఖరుల యందేమి ప్రేక్షణికుల మంత్రబద్ధులవలెఁ జేయుటయం దాబంధకి కడుంగడు నేర్పరురాలు. ఒక్క కామవీక్షణముచేతనే యామె దిదృక్షుల మానసాంబురుహముల నొక్కుమ్మడి హరించి లక్కబొమ్మలవలె వారి నాడించు సామర్థ్యముఁ గలది. సామాన్యజను లాయిచ్ఛావతిని సన్మానింపఁ జాలరనుట సహజము. కలవారు ధనవ్యయమునకుజంకి యామె గానకళానైపుణ్యముఁ గనుంగొనసాహసింపరు. కావున నారమణి గీతకళాదులు జరుగుటయే దుర్ఘటముగ నుండెను.

చంద్రమౌళీశ్వరుని వివాహసమయమునఁ గూడఁ దన ధర్మముచొప్పున రమణి పూర్ణచంద్రయ్యకొక సందేశమంపెను. ఒక్కఁడే పుత్త్రుఁడగుటచేతను, వివాహ మతివైభవముగ జరుప నిచ్చగలవాఁ డగుటవలనను, భోగవనితామేళము నుంచినఁ దక్క రక్తిఁ గూర్పదను భిన్నభావముఁ గల వర్గమునఁ జెందియున్నవాఁడగుటంజేసియుఁ, బూర్ణచంద్రయ్య రమణి పంపిన సందేశము నంగీకరించి, యావృత్తాంత మామెకుఁ

దెల్పెను. నాఁటి మధ్యాహ్నమునఁ దనభవనమున జరుగ నున్న సంగీతసభకు వేంచేయఁ గోరుచు నతఁ డూరిపెద్దలకు సహిత మాహ్వానపత్రములఁ బంపెను.

ఈవార్త క్షణములోఁ బురమునందంతటను వ్యక్తమైపో యినది. నిర్ణీతకాలమునకు ముందునుండియే ప్రజలొక్కరొక్క రుగా వియ్యూరివారి భవనమునఁ జేరఁ జనుచుండిరి. వచ్చిన వారి నుచితరీతి సన్మానించి, సముచితస్థానములఁ గూరుచుండ నియోగించుటకొఱకు సేవకులు సంసిద్ధులైయుండిరి. కొంతసేప టి కావిశాలభవనమంతయుఁ బౌరజనులచే నిండిపోయెను. ప్రే క్షకులింకను వచ్చుచునేయుండిరి. పాపము పనులుతీర్చు కొని సావకాశముగ నరుదెంచెడివారికి, జనసమూహమునందలి పిఱుంద సంగుష్ఠములపై నిలుచుండి నిక్కిచూచుటయే విధి యయ్యెను. అనంతరము జనులు నిలుచుండుటకే చోటులేక పోయెను. ఇంతలో మఱికొందఱు గుంపులుగట్టివచ్చి, యాజన స్తోమముఁ జొచ్చి, యెదుటివారిని ప్రక్కలకుఁ ద్రోలఁగఁదోయు చు, ముందున కరుగఁజొచ్చిరి. ఇందువలనఁ బిల్లజగడము లా రంభమయ్యెను. ఆ యల్లరుల నడుమఁ గొందఱందందుఁ గుప్పించుచుఁ 'గూర్చుండుఁడు — కూరుచుండుఁ' డని మఱింత బిగ్గఱగాఁ గూఁకలు వెట్టుచుండిరి. అప్పుడాచోటఁ గోలాహల ము మిగుల హెచ్చియుండెను.

పూర్ణచంద్రియ్య యనుమతియైన వెంటనే రమణి నిలుచుండి, నయభావమున నొయ్యారముగ ముందునకొ క్క యడుగువైచి చిఱునవ్వులయ సభాస్తారులకుఁ గేల్మోడ్చె

ను. తదనంతర మాపుంశ్చలి వీణఁ గైకొని తంత్రులను సవరించి, ప్రక్కనున్న తనవయస్యయు భగినియునగు రాధకొసంగి ఘనరాగములలో నొక్కటియగు దోడి నాలపించెను. ఆహా. ఏమి యాపికకూజితసదృశకలకంఠనాదము! ఏమి యాయా లాప విశేషము! ఏమి యామనోజ్ఞగానవైఖరి! అది యప్సరస గానమో యక్షగానమో యైయుండును. మహాత్ములైన కవిరాజు లట్టిదివ్యగాన మహిమాతిశయమును చిత్రరీతుల మనసార వర్ణించిరి. మే మా గానమధువుఁ గ్రోలియుండలేదు. ఈ మర్త్యలోకమున మేమట్టి యమృతమయగానము నింక నాక ర్ణింపఁజాల మేమో. భూతలమును దివిష్టపముగ మార్చు నద్భుతసామర్థ్య మా కమనీయగానకళకుఁ గలదు. అందెట్టి మా ధుర్యము—నెట్టియానందము—నెట్టిమంత్రశక్తి—యెట్టి సమ్మో హనబలము—లీనమైయున్నదో మే మెఱుంగము. సరళమై— సరసమై మార్దవమై—మాధురీసంయుతమై—కేవల మనోజ్ఞమైన యామోహిని వినిర్మల స్వరమున శ్రోతల హృదయములు లగ్న ములై పోయినవి. నాదస్వరాత్మకంబగు నాసంగీత స్వారస్యము వలనఁ గలిగిన యానందమహిమాతిశయమువలనఁ, బ్రేక్ష కులు శరీరములనే మఱచిరి. అత్తరుణమున మేన సూదులఁ జెక్కిన నెవ్వారికేని స్మృతియొదవునా? చెప్పఁజాలము. ఆ ప్రమద స్వరయుక్తముగ

తోడి—రూపకము.

"ప॥ స ఆరసాక్షు - జ అ అల - మె ఎ ఏలరా, సరసకు
బిల - చిన పలుకవు

వీరఅనా - మొరవిని సర - గునన్నె ఏలర ॥స॥
పధని సాస - నిసరీస - సనిదానినా - పధని సరిస -
నిసని ధపమ ప॥

అ॥ బాలనురా - చాలునురా - మేలవురా - మేలునురా
బలానురా - చలూనురా - మెళావురా - మెలూ
నురా, వలచినదొలగగని ఏలర స॥
సారిసనీ - నీసనిదా - దానిధపా - పాధమపా -
సరీసనీ - నిసానిదా - దనీధపా - పధామపా, పధని
సరిస - నిసని దమప ప॥

చ॥ వేవే - రుగ దలచగ - నేవే - లలరము ఉన, నేవే_
రము దలచగ - నేవే
నోరువరా - నేరమేర - వారిజాక్ష - దీనమరా
నొరూవరా - నెరామెరా - వరీజక్షా - దిరానురా,
మలరుని శర - ములకోబర్వర ॥స॥
సాసా - నిసరి సనిధ - నీనీ - నినిస - నిధప, దాదా -
ధధని - పపమ - పాపా
సారిసనీ - నీసనీధ - ధానిధాప - పాదపమా -
సరీసనీ - నిసానిదా - ధనీధపా - పదామసా, పధని
సరిస నిసని ధపమ ॥ప॥"

ఇట్లుపాడుచుఁ, బ్రత్యక్ష సరస్వతివోలెఁ బొడసూపుచు, మహాకూపారకల్లోలమధ్యమునఁ జలించుచు నే తెంచెను తరణి కరణి, మార్దవముగ — నతిలలితముగ — నత్యంతమనోహరముగ నృత్యముసేయుచు, సరసముగ — సావకాశముగ —

నిరతరావ్యక్తమధురస్వరమున — గానమొనరించుచు, దిదృక్షుల మనస్సమాకర్షణముఁ గావించెను.

ఆహా! ఆలాసికావిలాసమేమి? తేజోవంతములై — యత్యంతసంచలితములై యెసంగెడు నాలోనచపరిసరణమున, లోకము నొక్కట సముపార్జింపఁ జాలెడు, నావామలోచన నిరుపమరహస్యహేలావిలాసమేమి? సౌందర్యరాశియం దా కామిని చిక్కనిసారమనిన నతిశయోక్తి యుండఁజాలదు. ఆలావణ్యమునకు సర్వజనహృదయోల్లాసదాయకమగు నామధురస్వరము — మోహనకరమగు నాయంగవిక్షేపము — నెట్టియుత్తేజ మొదవించుచుండెనో వర్ణింపఁజాలము. ఆబిత్తరి బెడిదంపు జూపులలోని యొయ్యారముఁగాంచి, యెవండు విమోహితస్వాంతుఁడు గాకుండునో యూహింపఁ జాలము.

నూతనవధూవరులు సుఖాసీనులైయున్న వేదిక కెదురుగ నిలుచుండియే, యానర్తకి తన యభినయ కౌశలప్రభావము నెఱపుచుండెను. ప్రణయోన్మాదమునఁ జంద్రమౌళీశ్వరుఁడు శరీరచేష్టలుదక్కి, యామె గానవాహినిలోఁ గొట్టుకొనిపోవుచుండెను. తీవ్రతమమై — యధికసముజ్జ్వలమై — యెసంగెడు, నాకాముకతీక్ష్ణతరాపాంగవీక్షణజ్వాలపరిభావకారణమునఁ, బాపమాయభాగ్యుని నవనీతహృదయము కరఁగిపాఱెను. చంద్రమౌళీశ్వరుని యప్పటి విషమదశ నాస్వైరిణి గమనింపక పోలేదు. తత్క్షణమే యానితంబిని మఱింత యతిశయముగ దుర్మోహముఁ జూపుచుఁ, గపటాభినయముఁ బ్రకటింపఁ దొడఁగెను. ఆమె సామగానము — రామణీయకమైన యామె

నృత్యము — చిత్తాకర్షకమగు నాలలన దృష్టిపరిసారము — ఆ
చిత్రితాంగహారము — చంద్రమాళీశ్వరుని దేహమును,
హృదయమును, బుద్ధిని, క్షణకాలములో నాకర్షించి యాతని
నున్మత్తునిగఁ జేసివైచెను. అందులకానుగుణ్యముగ నాభామిని
వెంటనే రాగముమార్చి, 'మేరగాదు లేచిరారా — ఏరా
స్వామి' యను మఱొకజావళి నందికొని, చంద్రమాళీశ్వరు
నిపైఁ గుటిలదోహదముఁ జిలుకుచు, మోహవృష్టిఁ గురియించి,
తన విలాసకాసారమునం దావఱకే యల్లలనాడుచున్న యా
మందభాగ్యుని హృదయకల్హారము, ననంతగతులఁ బరిభ్ర
మింపఁజేసెను. తన యతిశయరూపసంపదనుజూచి మన్మథో
ద్రేకభరమున, నామోహినియే మనస్ఫూర్తిగఁ దనయెడ
వలపుఁగొనియెనని తలఁచి, చంద్రమాళీశ్వరుఁడు చిత్తవిభ్రాం
తినొందెను. తమిఁగొనెను. ఆతని యుత్కలికయు — నాతఁడగు
పఱచెడు బాళియు — గమనించుకొలఁది నాకులట మఱింత
లావణ్యముగఁ గులుకఁ జొచ్చెను. ఆ విలాసినీ లోలత్వవ్యా
పారముఁ గాంచునట్లెల్ల, నాతని కాసుందరియెడఁ గల మోహ
ము గాఢమై మిగుల దుస్సహమయ్యెను.

కొంతసేపటికి నర్తన మాగిపోయెను. సీమంతినీమతల్లు
లాగంతుకులకు సుగంధపుష్పఫలతాంబూలాదులు సమర్పిం
చిరి. పురనాయకులు మిగులహర్షించుచు 'శిశుర్వేత్తి పశు
ర్వేత్తి వేత్తి గానరసం ఫణి' యను నార్యోక్తిని స్మరించుచు —
గృహనాయకునిఁ గొనియాడుచు — ఇందాఁకఁ దామనుభవిం
చిన యానందామృతమునందలి యంత్యభాగమును జూడఁ

గొనుచుఁ బూర్ణచంద్రియ్యచే ననుజ్ఞవడయుచు — నొక్క-
రొక్కరుగా నిజవాసముల కేగుచుండిరి.

రమణి సల్పినక్రియలలో నీసందర్భమున స్మరణీ
యాంశ మొండుగలదు. ఆమె సగౌరవముగ వీడ్కొలుపఁ
బడినతరిఁ జంద్రమౌళీశ్వరునిఁ దన నిశితకటాక్షమార్గణమున
సుప్రక్కించుటయే. ఆ యబల ప్రయోగించిన యాసమ్మోహన
విశిఖసంఘాతకారణమునఁ గలిగిన వేదనను సైఁపజాలక,
పాపము సబలుఁడగు నా చంద్రమౌళీశ్వరుఁడు శక్తిహీనుఁడై
యప్రాప్తమనోరథుఁడై — తినదైన్యదృష్టుల నాయంగనవీక్షణ
పరంపరలతో నైక్యమొనరించి, యనుతాపవేగమున నొక్క-
నిట్టూర్పుఁబుచ్చెను. ఇందాఁక శారదముపోలె మిగులఁ జలిం
చుచుండిన యాతని హృదయావేగ మేమైనదోకాని, ప్రకృత
మది యాతనిలో లేదు. ఈ వైచిత్ర్యమును జూపఱులలో నెవ్వ
రును గమనింపక పోయినను, ప్రత్యక్షమున నిలుచుండి వీని
నామూలాగ్రముగ నవలోకించిన పురుషుఁ డొక్కఁడు మాత్ర
ముండెను. చంద్రమౌళీశ్వరుని యవివేకజన్యమోహాదృష్టుల
కా పురుషుఁ డగపడలేదు. నర్తనవిలోకనాతత్పరత్వమునఁ
బరధ్యానులగుటంజేసి, పౌరులకు సహిత మావ్యక్తి దుర్గోచరుఁ
డే యయ్యెను; కాని యాదివ్యపురుషుని యుత్తేజమును సమా
కర్షించిన యబల యొకర్తుకయే యుండెను. ఆమె శారదాంబ.

పదునైదవ ప్రకరణము.

దొంగలు పట్టువడి పోయిరి.

చంద్రమౌళీశ్వరుని వివాహదినము లిట్లుగడచెను. పూర్ణచంద్రయ్య తన యేకపుత్రిని యుద్వాహము మిగుల జయవంతముగ నడపెను. ఆతఁడమ్మహోత్సవసమయమున మహనీయులను — పండితులను — పామరులను — దరిద్రులను — ఎల్లవారిని, వయోనియమము వర్గనియమము లేక చక్కఁగ సత్కరించెను. బీదసాదలకు భిక్షుకులకు నర్థించినవారికినెల్ల వస్త్రాదికముల నిచ్చకొలఁది దానముచేసెను. ఉదారగుణ మాతనికి జన్మముతోడనే కలిగినది. సమారాధనలు చేయుట — ఉత్సవాదులు సలుపుట — శైవాలయముల నఖండదీపారాధనలు గావించుట — ధనమును దృణప్రాయముగ వెచ్చించి సమస్తజాతులవారి నన్నివిషయములఁ దనియింపఁ జేయుట — యాతని కుల్లాసదాయకము. ఈకార్యముల నాతఁడత్యంతతీవ్రోత్సాహముతోఁ బ్రారంభించి, సామంజస్యముగ ముగించి, యానందించును. చంద్రమౌళీశ్వరుని కల్యాణోత్సవవైభవము తన సంకల్పమునకు శతగుణాధికముగ హెచ్చియున్నను బూర్ణచంద్రయ్యకుఁ దృప్తి కలుగలేదు. అమ్మహోత్సవమున సమస్తమును సక్రమముగ సమకూడియున్నను, ఒక్కవిషయమునమాత్రమాతనికిఁ జాలఁ గొఱఁత కలిగియుండెను. బాల్యమాదిగఁ దనకు విహితుఁడై, అప్తమిత్రుఁడై, పాయనిబంధువై,

మీఁదుమిక్కిలి పూజ్యార్హుఁడై యుండిన యుమాపతి యొక్కఁడు, నాసందర్భమున లేకపోయెను. గౌరాంబిక యావివాహవేళనుండి యెల్లవేడుకలఁ జూచినను నానందానుభవము పొందలేదు. తన ప్రాణేశుఁ డాశుభసమయమునఁ దనతో లేకపోవుటచే నామెకించుకయు సంతోషము కలుగలేదు. మఱియు నందులకు ద్విగుణముగ విచారమే యామె మనస్సును బీడించుచుండెను. ఇదియే పూర్ణచంద్రయ్య యసంతృప్తికిఁ గారణమైనది. హేత్వంతరమున నిట్లుజరిగింపవలసివచ్చినందుల కాతఁడు గడుంగడుఁ జింతించెను.

ఈ యుద్వాహవిషయ ముమాపతికిఁ దెలిసెను. ఆతఁడిది విన్నతోడనే విస్మయవిచారపరితప్త హృదయుఁడై పోయెను. ఎట్టిచిత్రము? తన ప్రేమైకజీవమగు శారదకు వివాహము నడచెనా? ఒక్కింతయుఁ దెలుపకయే తన కయిష్టుఁడగు పురుషుని నాశీలవతి పెండ్లాడెనా? అందుల కామె మనఃపూర్వకముగ సమ్మతించెనా? ఇది నిజమా? లేక కల్పనయా? అకారణముగ నిందునుగూర్చి కల్పించునంతటి ప్రేమయ మితరులకేమియుండును? పరిణయవిషయమై మామగారే శారదను బలాత్కరించి యుందురా? విశాలదృష్టిగల పూర్ణచంద్రయ్య యీస్వల్పవిషయమున నిట్లు వేగిరపడెనా? తనకుఁదెలుపక యిట్టికార్యాచరణమునకు స్వయముగ నుపక్రమింప నాతఁడు సాహసించెనా? పుత్రికతోడఁ దల్లియుండియు నిష్ప్రయోజనమే యయ్యెనే! తన స్వభావము నెఱింగిన చెల్లెలు శకుంతలయు నందులకే లోఁబడిపోయినదా? దాతలేకయే దానప్రతిగ్రహాదులెట్లు నడచినవి?

ఇట్టి యోచనాప్రవాహవీచికాజాలములలోఁ నుమాపతిహృదయము పడిపోయెను. అతనిమానస మా భంగసంఘముల నడుమ నటునిటుఁ గొట్టుకొనఁజొచ్చెను. తలఁచినట్లు జరుగలేదు. ఈశ్వరాదేశ మిట్లుండనేమొ. అనితలంచి చివరకాతఁడెట్లో మనస్సమాధానముఁ గావించుకొనెను.

ఉమాపతి భార్య ననుపఁగోరి పూర్ణచంద్రయ్యకు లేఖ వ్రాయుచు బండినంపెను. గౌరాంబికయుఁ దోడనే బయలు దేఱెను. ఆమెతోడ శకుంతలాంబ యుండెను. తనయనుజ్ఞ నుల్లంఘించి తన కసమ్మతమగు విషయమున నతిచారదోషమునకుఁ బాల్పడినందున నుమాపతి సహోదరిపై మండిపడెను. స్వల్పినది ధర్మవిరుద్ధకార్యమగుట, శకుంతలాంబ యగ్రజునికడ నేరియుఁ బలుకక మిన్నకుండెను. శేషసాగరమును విడచినది మొదలు జరిగిన చిత్రకథ నామూలాగ్రముగ నుమాపతి భార్యవలనఁ దెలిసికొని విస్మయవిషాదములఁ బొందెను.

ఉమాపతి క్రోధము క్షణికమైనది. అతఁడు శకుంతలాంబికపైఁ గినిసినను వెంటనే శాంతిని బొందెను. ఆతఁ డామె నొకటిరెండువారములు నిలుపుకొని యనంతరము సగౌరవముగ సంతోషపూర్వకముగ సిద్ధరామపురమునకుఁ బంపెను.

పరిణయానంతరము శారదాంబ గృహావితరణాదికముల నత్తచెంగటఁ గడునేర్పుతో గ్రహింపఁజొచ్చెను. కసవుచిమ్ముట —కలయంపి చల్లుట—కట్టెలఁ జీల్చుట — జలముఁ దోడుట — ఆహారపదార్థములను జక్కఁగ సంస్కరించుట—మున్నగుపనుల పన్నిఁటిని నామె స్వయముగ నెఱవేర్చుచుండెను. పెక్కువిష

యములలో సత్తమ్మామ లాజ్ఞాపించుటకుఁ బూర్వమే యాప్రాజ్ఞ వారిముఖలక్షణములఁబట్టి భావమును గ్రహించుచుండెడిది. విశ్రాంతిసమయములయందుఁ బ్రశస్తకావ్యముల నొప్పిదముగుఁ బ్రియమధురస్వరమునఁ దిన్నగఁ బఠించుచు, నందలి యమోఘార్థమును దియ్యని నుడుల వెలివఱచుచు, సత్తమ్మామల కాహ్లాదముఁ గూర్చుచు, నిరతరానందస్వాంతమునఁ బ్రవర్తించుచుండెడిది. కాళ్ల యందియలు గలగలలాడ, మందహాససంభరితమగు ముఖపద్మము కలకలలాడ, మనఃకలశమున నానందసుధారసము చిప్పిలుచుండ, సకలసౌభాగ్యముల కిక్కయైన శారదాంబ యిందిరాదేవిచందమున నొప్పారుచుండఁ, బూర్ణచంద్రయ్య మందిరమున లక్ష్మీసరస్వతులు సహజవైరము మాని యొద్దికమెయిఁ దిరుగాడుచున్నట్లుండెను. అట్టిఁ పూతచరిత్రింగాంచి యెవ్వారు హర్షాంబుధి నోలలాడకుందురు? ఆమానిని రుచిరదరహాసచంద్రికలు జెలువాఁగ, మనోహర మందగమనమున నయనానందకరముగ నడయాడుచుండుట, నాగృహము రెండవ దేవమందిరమువోలె నెంతయు శోభాయమానముగఁ దేజరిలుచుండెను.

శారదాంబ మాతాపితల క్షేమోదంతమును దఱచు వినఁ గుతూహలపడుచుండినను, బుట్టినింటికి వెళ్ళ నువ్విళు లూరుచుండుట లేదు. ఒకవేళ వెళ్లినను నామె యచ్చట నెంతకాలముండఁగలదు? మాతృభవనమున నెంతమహత్తరసుఖమున కాస్పదమున్నను, దానికంటె శ్వశురమందిరమునందలి యంబలియే శ్రేయోదాయకమని యామె గ్రహింపఁ గలిగెను.

శారదాంబ ప్రకృత సమయమున నింటలేదు. పూర్ణచంద్రయ్య యప్పుడప్పుడే భుజించి మేడగదియందలి మృదుతల్పమున నర్ధశాయియై పరుండియుండెను. శకుంతలాంబ ప్రాణేశునిసన్నిధినిఁ గూరుచుండి విభున కాకుమడుపు లందించుచుండెను.

శకుం—చంద్రమౌళీశ్వరునితో బంధుగృహమునకుఁ బోయి శారదాంబ చాలసేపయ్యెను. పాపము వారికచ్చట భోజనము లింకను దీఱలేదు కాఁబోలును.

పూర్ణ—ఉండవచ్చును. ఆవిడ యేనాఁడును బొరుగింటికైనఁ గాంచి యెఱుఁగదు. నీవే చెప్పుచుంటివికదా — ఆమెను జూచుటకు నామె మధురవాక్యముల నాలకించుటకుఁ బురమున నెందఱో కులపాలిక లువ్విళులూరుచున్నారని నేఁడిట్లాకస్మికముగ నామె బయటవెళ్ళుట యందఱకును విశేషమేకదా ?

ఆ విషయమై యాప్రియదంపతులసంభాషణ మంతటితోనే యాఁగిపోయెను. పూర్ణచంద్రయ్య తనప్రేయసి మృదులహస్తాబ్జమునుండి విడియముల నందికొనుచుఁ దిన్నగ నమలుచు యోజనాంతరస్వాంతుఁడై యుండెను. ఏదియో స్ఫురణకుఁ దెచ్చుకొని శకుంతలాంబ కొండొకతడవున కిట్లనియె.

"వారి ప్రయత్నమెంతవఱకు ఫలకారియైనదియుఁ దెలియలేదు కాఁబోలును."

ఇప్పుడు శకుంతలాంబ తెలియఁగోరినది. రూపసింగు

చిన్నోజీల ప్రయత్నఫలమునుగూర్చి. దురహంకారులైన యాదస్యులు పట్టువడిరో యింకను దౌష్ట్యముల కెడమిచ్చుచుండిరో తెలిసికొనుటనుగుఱించి. ఉన్నట్టుండి యామె కానరహంతకుల స్మరణ యేలకలిగెనో! ఆయమాయికురాలి కాక్రూరాత్ముల సుద్దులేలనో? అబలల కట్టి స్మృతియొదవుట సహజమే యై యుండును. అదియు రాత్రివేళ.

పూర్ణ—తెలియకేమి! వారు ననుగలసి యప్పుడప్పుడు మాటాడియే పోవుచున్నారు. ఆ దోఁపిడికాండ్రు సామాన్యులుగఁ దోఁచుటలేదు. వారి దుండగములు తగ్గలేదు. క్రమక్రమముగ హెచ్చుచునే యున్నవి. వారిని బంధించుట కీసమయము మిక్కిలి తగినది; కాని పనిమాత్ర మంతసుళువుగ నుండలేదు.

శకుం—(భయవిస్మయములు సూచించుచు) వారి కథలఁ దలఁచుకొనిన శరీరము కంపించును. చంపుట వారికి సామాన్యమైపోయినది. ఈ విషయమున వారిహృదయము మిగులఁ జేవబాఱినది.

పూర్ణ—వారి సంఘముకూడఁ గ్రమక్రమముగ బలపడుచున్నట్లున్నది. ఆదుండగీండ్ర యాటలిట్లే మఱికొంత కాలము చెల్లనిచ్చినచోఁ దరువాత లోకమెల్ల నొక్కటియై వచ్చినను నాదొంగలను లోఁగొనుటకుఁగాదు.

శకుం—అయిన గతి ?

పూర్ణ—ఆ యిద్దఱుపురుషులవలననే యీపని పూర్తి కాఁగలదని నమ్ముటకుఁగాదు. వారాతస్కరుల యునికిఁ దెలిసి

కొనుటకే యింకను బ్రయత్నించుచున్నారు. అందులకుఁ గాలము చాలియున్నట్లులేదు.

శకుం—సరే! వారితో నదియెంతమాత్రమును సాగదని తెలిసిపోయినది.

పూర్ణ—అవును. అదిచాల దుర్ఘటమైనకార్యమే. వారినిఁబట్టుట మాటలలో లేదు; కనుకనే మన చినవీరశర్మ కూడ నిందులకు స్వయముగఁ బూనుకొనవలసివచ్చెను. అతఁడిప్పు డాంతరంగికముగ నిందునుగూర్చి చాలఁ గృషిసల్పుచున్నాఁడు. చివరకిది యెట్లు ఫలించునో దొంగలెప్పుడు పట్టువడుదురో తెలియదు.

శకుం—మీరు చినవీరశర్మ నెక్కుడుగ విశ్వసించుచున్నారు.

పూర్ణ—ఔను. దేవీ! మనకాతనికంటె విశ్వాసపాత్రులెవరు?

శకుం—అతఁడు మీరు తలంచినంతటి సన్మిత్రుఁడని నేను భావింపను.

శకుంతలాంబిక నిజము గ్రహించినది. ఆమె పోరబాటులేక చక్కఁగ యోజించియే మనవిచేసికొన్నది. మగని మ్రోల నీవఱకు నెవ్వరివిషయమునఁగాని యామె యిట్టి భిన్నభావమును వెలివఱచి యెఱుఁగదు. చినవీరశర్మను గూర్చి యీమాత్రమైన నివేదింపనిచో నది ప్రమాదహేతు వగునే మోయని జడిసియే యామె యిందులకు సాహసించినది. ఆమె మాటలకుఁ బూర్ణచంద్రయ్య చిత్రప్రతిమవోలె నయ్యెను.

అతఁడు ప్రియపత్నివంక నాశ్చర్యముతోఁ జూచుచు నిట్లనెను.

"నీవెప్పుడును బ్రమాదమునకు లోనుగావని యెఱుంగుదును. ప్రేయసీ! నీవిప్పుడు సూచించినది చినవీరశర్మను గూర్చియేనా?"

శకుం—అట్లనినఁ గేవలదాక్షిణ్యస్వభావులగు మీ రాశ్చర్యమునొందుట సహజమే. మీ కందఱియందును సమత్వమే. ఎవ్వరియెడ లవమైన విరోధభావము లేదు; కనుక సర్వులను మిత్రులని విశ్వసించి ప్రేమించుట మీవంటిపూజ్యులకు వింతకాదు. చినవీరశర్మ యట్లు విశ్వసించి ప్రేమింపఁదగిన యుత్తమమిత్రుఁడని నేననుకొనను. నా కాతనియందుఁ బూర్ణ విశ్వాసము లేదు.

స్వతస్సిద్ధముగ దయార్ద్రమనస్కుఁడగుఁ బూర్ణచంద్రయ్య విషయముగఁ జినవీరశర్మకైనను భిన్నోద్దేశమేని యేల యుండును? అందునుగూర్చి శకుంతలాంబిక నిశ్చయముగఁ బొరబడియుండునా? యని చదువరులు సంశయింప నవసరము లేదు. పూజ్యమానవుల కొక్కెడఁ బ్రాకృత జనులవలనఁ బీడ హెచ్చుచుండుట స్వాభావికమనువిషయము మన యనుభవమునకుఁ గ్రొత్తకాదు. మనోహరపరిమళభరిత కేతకీకుసుమగుచ్ఛము లనంతకంటకావృతములై — దుష్టోరగవేష్టితములై—యుండుట నైజము కాకుండునెట్లు? కానిచో నాప్రసూనశీతానముల కేమివిలువ? సత్పురుషుల మేల్మిని వారి యున్నతాభివృద్ధులను జూచి యానందింపఁజాలని పామరు

లన్నికడలవలె సిద్ధరామపురమునఁగూడ నుండిరి. అందుఁ బ్రముఖుఁడు చినవీరశర్మ. సమారాధనాదినమున నట్లు సభావేదిక నెక్కి హితవచనములాడి మైత్రిఁ గనఁబఱచినంతనే, యాఁతఁడు పూర్ణచంద్రయ్య కాప్తమిత్రమని మాపాఠకులు భ్రమింపఁబోలదు. చినవీరశర్మ పూర్ణచంద్రయ్య విషయమునఁ బైపై నట్టినెయ్యముఁ బ్రకటించుచు నెచ్చెలివలె నటించుచున్నను, నాతని హృదయతలమున వేరూనిన విషయాంకూరములు మాత్రము, దినదినాభివృద్ధి నొందుచుండక పోలేదు. చినవీరశర్మ యైశ్వర్యసంపన్నుఁడే యైనను, బూర్ణచంద్రయ్యకేమిటను దుల్యుఁడు కాఁజాలఁడు. ఆ కారణమునఁ బూర్ణచంద్రయ్యను—ఆతని భోగభాగ్యములను—నామప్రతిష్ఠలను దలఁచుకొన్నప్పుడెల్ల నాతఁడు లోలోనఁ గుంగిపోవుచుండెను. అంతియకాక పూర్ణచంద్రయ్య యున్నతికి విచ్ఛిత్తిఁ గల్గింప నెంచి, సమయము నిరీక్షించియుండెను. అమాయకుఁడగుఁ బూర్ణచంద్రయ్య యిట్టి కుటిలవర్తనము లెఱుంగనివాఁడు, కనుక నే యాతనిఁ దన యత్యంతాప్తమిత్రునివలె భావించుట శకుంతలాంబికవచించినట్లు చిత్రముకాదు. ఆమె మాటలకుఁ బూర్ణచంద్రయ్య విస్మయాంతరంగుఁడై యిట్లనెను.

"నీ వందుల కెట్టి కారణములను గ్రహించితివి?

శకుం—వాని నన్నింటిని మనవిచేసి నేనిప్పుడే మీ మృదులహృదయమును బాధింపఁజాలను. అవి యెంతయు నావశ్యకముగ నివేదింపఁదగిన యంశములే. అయినను నిజమెఱుఁగక వానిని బయలువఱచుట పాడికాదు. ఆతనిఁగూర్చి

తలకొకవిధముగఁ జెప్పుకొనుచున్నారు. అవియన్నియు సత్య విషయములేయని భ్రమింపఁ బోలదు. మన కట్టిహేతువులతోఁ బనిలేదనుకొందును. కారణము లెట్టివైననేమి? మీరాతనియెడ నప్రమత్తతతో మెలగినఁ జాలుననునదియే నా ముఖ్యప్రార్థనము.

ఇట్లు భాషించుచుండ నున్నట్లుండి యొకమానవుఁడు వారియెదుట నిలిచెను. అతఁడు కేవలము పొట్టిమనుష్యుఁడు కాఁడు. మఱియు నంతపొడుగరియుఁ గాఁడు. శరీరచ్ఛాయ శ్యామలము. ముఖము విశాలము. కనులును మీసములును జాల సుందరములు. చూచుట కాతఁడు మిగుల నందకాఁడు. ఆపురుషుఁడు చినవీరశర్మ గృహపాలకుఁడును బ్రధానుఁడును నగు కృష్ణమూర్తి. అతని రాకఁగని శకుంతలాంబ లోనికిఁబోయెను. కృష్ణమూర్తినిఁ జూచినతోడనే పూర్ణచంద్రయ్య వదనమండల మానందముతోఁ బ్రకాశింపఁ జొచ్చెను.

పూర్ణ—రండు. కూర్చుండుఁడు. విశేషములేమి?

కృష్ణ—పని చేయికూడి వచ్చినట్లు తెలిసినది. మన మిటఁ గూరుచుండి సావకాశముగ మాటాడుట కిప్పు డవధి లేదు. మీరు ప్రయాణము కావలెను. జాగుసేయుటకు లేశమైన నవధానములేదు. శర్మగారుకూడ వెళ్ళుచున్నారు.

పూర్ణ—ఎక్కడికి? త్వరగా సెలవిండు — కార్యమనుకూలించెనా?

కృష్ణ—దొంగలు పట్టువడిపోయిరి. చిన్నోజియు రూపసింగును, హుస్సేనువనమును విడిసి, మీకై నిరీక్షించుచు వర్త

మాన మంపిరి. మీరు బయలు దేఱుఁడు.

పూర్ణచంద్రయ్య వినిర్మల ముఖమండలమున నుత్సాహ జ్యోత్స్నలు తాండవింపఁజొచ్చెను. అతఁ డానందపారవశ్యుఁ డయ్యెను! ఇట్లనెను.

"ఇప్పుడేనా? మనము వెళ్ళవలసినదేనా?"

కృష్ణ—ఔను. ఇప్పుడే—బండి వెలుపల నిలిచియున్నది

పూర్ణచంద్రయ్య తత్క్షణమే లేచెను. అతఁడు దుస్తులను దాల్చి, కఱ్ఱచేఁబూని కృష్ణమూర్తివెంట బయలుదేఱెను. ఆ సందర్భమునఁ దనభర్త యిలువిడిచిపోవుట శకుంతలాంబిక కావంతయేని సంతసముగ నుండలేదు. ఆమె హృదయము తటతట గొట్టుకొనసాగెను. పాప మాసాధ్వీమణి పంచప్రాణములు చలించిపోవుచున్నట్లుండెను; కాని యాసాత్త్వికకులపాలికాతిలకము నాథుని తీవ్రోత్సాహము నడ్డుపఱుపఁ జాలి యుండలేదు.

పదునారవ ప్రకరణము.

కాకదంత పరీక్ష.

దొంగలు పట్టువడినట్లును చిన్నోజీయు రూపసింగును దమకై యూరిబయటివనమున వేచియున్నట్లును గృష్ణమూర్తి చెప్పినవిషయమునఁ గొంతపొరబాటు జరగియుండును. ఏల

యనఁ జిన్నోజి వనములో నిరీక్షించియుండలేదు. అతఁ డప్పు డప్పుడే యారాత్రి పండువెన్నెలలో రామసాగరమునుండి బయలుదేఱి, కటకప్రదేశ భాగమును గడచి, సిద్ధరామపుర మువంక నడచుచుండెను. కనుకఁ గృష్ణమూర్తి మాటలలో నీతనివిషయముగఁ బ్రమాదము పొసఁగియుండును. రూపసిం గునుగూర్చి చెప్పఁబోయి చిన్నోజికూడ నాతనితో నుండియుం డునని కృష్ణమూర్తి భ్రమించెనేమొ.

చిన్నోజి నడచుచున్న దొక చీలిత్రోవ. సిద్ధరామపురము నకు సుమా రొకటిన్నరకోసు దూరముననే యది శేషసాగరపు బండిబాటతోఁ జేరికొనును. చిన్నోజి యాయా శాఖామార్గము నుండి క్రమక్రమముగా బండిబాటను సమీపించెను. శకట మార్గమున మఱియొక పురుషుఁడు వడివడిగా నడచుచు చిన్నో జిని గలిసికొనఁ బ్రయత్నించుచుండెను; కాని యాలోపల నాతఁ డాక్రొత్తమనుష్యుని దాఁటిపోయెను. "అయ్యా! మీ రెవ్వరు? కలిసిపోవుదము కొంచెమాగుఁడు" అని నూతనపురుషుఁ డనెను. చిన్నోజి కది పరిచిత స్వరముగఁ దోఁచెనేమొ. అతఁ డాక్షణమే యచ్చట నాఁగి — వెనుదిరిగి — "ఓహో! శివరామయ్య గారైనది నాకుఁ దెలియదు. నేను మిమ్ముఁ జూడ నోచుకొనుట యొక పుణ్యవిశేష మనవచ్చును. శ్రీ కాటమేశ్వరకూటము నాఁదలి సమారాధనదినమున మము వదలి పోయినది మొదలు మీ రింతకాల మెచటనుంటిరి?" అనెను.

శివరామయ్య సిద్ధరామపురవాసుఁడు. వైద్యుఁడు. అపే క్షించినవారికెల్ల నాతఁ డుచితముగనే వైద్యసాహాయ్యము

చేయును. ఎవ్వరి నుండియు నేమియుఁ బుచ్చుకొనఁడు. మన
పూర్వకముగఁ బనిచేయును. ఎట్టిరుగ్మతనైన జాగులేక కుదు
ర్చును. శివరామయ్య హస్తగుణము చాలమంచిదని పలువుర
యభిప్రాయము. ఆతనినామ మాబాలగోపాలము తెలిసిపోయి
నది; కనుక ననేకు లాతని నాశ్రయించుచుండుట వాడుక. శివ
రామయ్య యొక్కపర్యాయము స్వస్థలమువదలినచో మరల
నాతఁడు శీఘ్రముగ నిలుచేరుటకష్టము. ఈవ్యాపారకారణము
ననే గ్రామాంతర్గతుఁడైయుండి యాతఁడు బహుకాలమున
కిప్పుడేజన్మభూమికి వచ్చుచుండెను. ఇంకను బురిఁజేరుటకుముందే
యొకసన్మిత్రుని దర్శింపగలిగినందుల కాతఁడెంతయు సంతసిం
చెను. పురవిశేషములఁదెలిసికొన నాతఁడెక్కువ వేగిరపడుచు
న్నట్లే లోకవార్తల నాలకించుటకై చిన్నోజియు మిగులఁదహ
తహ పడుచుండెను; పిమ్మట వారిట్లు సంభాషించిరి.

శివ—ఒక్కచోటుకాదు—ఒక్కస్థలముకాదు — పల్లె
యనక పట్టణమనక మ్మదిరిగితిని. పిలిచినతావుల కెల్ల వెళ్ళితిని.

చి—ఆప్రాంతములందలి కాలమానస్థితు లెట్లున్నవి?

శివ—ఏమి చెప్పమనుచున్నారు? జనులంతటను గజవు
చేఁ గ్రాగి పోవుచున్నారు. ఆఘోరవిషజర్వ మేనిమేషముననను
గు చెట్టనోగాని యూళ్ళూళ్ళే తుడిచిపెట్టినది. ఆహా! తలఁచు
కొన్న గుండియలు బ్రద్దలగును. బ్రదికి పేరుఁబెంపు సంపాదింపఁ
దగిన యౌవనసంసారము లెన్నియో కూలిపోయినవి.

చి—ప్రపంచమునంతయు నొకేవిధముగ నులిపెట్టిపోయి
నదికదా యాక్రూరవ్యాధి?

శి—అదెచ్చటికింబోయినది? మరల నచ్చటచ్చటం బొడ సూపుచునే యున్నది. దానికిందోడు మహామారియు నందందు రేగుచున్నది. ఈవిషమావస్థలో జనుల నౌషధసేవనమునకుం బురికొల్పుటయే దుర్ఘటమైనది. వా రన్నియాసలు విడచి తమ కర్మమునే విశ్వసించియున్నారు; కనుక వారికిం గ్రియలలో నమ్మకము నెలకొనుట లేదు.

చి—మనవారి కాత్మవిశ్వాసము బొత్తిగా లేదు; కాని వారికున్న మూఢవిశ్వాసమున కన్ననో కొదువ లేదు.

శి—అదియు నొకవుట్టుడు గొడవరైయున్నది. సర్వవ్యాపియు—సర్వసాక్షియు— సర్వరక్షకుండు—సర్వనియంతయు—నగు నా పరమాత్మయందు, వారి కానంతయేనిం బ్రపత్తి లేదు. తమ కేమాత్రము జబ్బుచేసినను దాము నమ్ముకొనియున్న, దారుశిలాది కల్పిత విగ్రహములకు మీందులు కట్టుటయు, బలిపశువులను విడచుటయు, మిక్కిలి హెచ్చిపోయినది.

చి—మనవారి సర్వనాశనమున కిది మంచియురువుగాం గూడ నున్నది. భోగరాజుగారి నాగయ్య విషయము మీకుం దెలియదేమో. భార్యకు జ్వరము హెచ్చియుండంగా నదినివారణమైనచో నిలువుదోంపు చెల్లించునట్లాతండు వేంకటేశ్వరునకు మ్రొక్కుకొనెను. ఔషధసేవనమును మాత్రము మాన్పించి యుండలేదు.

శి—అదియుం గొంచెము మేలే. పిమ్మట?

చి—ఆమెకు నయముకాంగానే యతండు మొన్ననే భార్యను గొండకుం దీసికొని వెళ్ళి, యామె యొడలిమీంది

సర్వాభరణముల నందలికొక్కొర కప్పఁజెప్పి, శుద్ధముగా బోడి కొట్టించుకొని వచ్చెను. మందులకును బథ్యపానాదులకును నున్నడబ్బంతయు నావరకే వ్యయము చేసికొని యుండెను. ఇంట నిలువయుండిన ధాన్యమెల్ల విక్రయించి, వచ్చినడబ్బునకుఁ జేరికగా నిల్లుతాకట్టుంచి తీసికొనిన ఋణధనముఁ గూడ ప్రయాణవ్యయములకు సరిపోయినది. స్వకాయకష్టమువలన నార్జించిన యార్జవముతో సుఖజీవనము సేయుచు, ఋణమను నదిలేక మహారాజునలె హాయిగనుండిన నాగన్న, యున్నది పోగొట్టుకొని తిండితీర్థములకుఁ గఱవుకాఁగా నిప్పుడప్పులవారికిఁ దలయొగ్గి, దీర్ఘవిచారమునఁ గాలముఁ గడపవలసినవాఁ డయ్యెను.

శి—దేశదారిద్ర్యమున కిట్టివే కారణములని వారికిఁ దెలియదు. చెప్పినను గ్రహింపరు. ధర్మకర్తలు నిందుల కాను గుణ్యముగ స్థలమాహాత్మ్యములను దెల్పు కల్పితగాథలను విరివిగసృష్టించి, మనవారిని మఱింత మోహజలమున ముంచుచున్నారు. మన వివేకశూన్యుల యున్మత్తచేష్టలాలయధర్మకర్తలయు నర్చకులయు నాత్మవినాశమునకుఁగూడఁ గారణమగుచున్నవి. ఈ మూఢభక్తుల నట్లు భ్రమింపఁజేసి వీరినుండి దోఁచిన ద్రవ్యకారణమున మైథునాది దుష్కర్మములకు వశులై యెఱవలనఁ జేఁపలనుబట్టినట్లు డబ్బుచూపి, పలువురఁ బురంధ్రీలను స్వైరవశముచేసికొని, తమకాముకాగ్నిజ్వాలలచే వారి పాతివ్రత్యేంధనమును దహించుచున్నారు.

చి—ఇటీవల పోతులూరి వీరబ్రహ్మ మాతని కుమా

కునకు మారీజాడ్యముసోఁకియుండఁ బెద్దమ్మవారికి రెండెను పోతులను వదలెను.

శి—అతని కొక్కఁడే కుమారుఁడు. ఆ కుఱ్ఱఁడును జని పోయెనని గ్రామాంతరమునసే నాకుఁ దెలిసెను.

చి—ఆవ్యాధితో నామఱునాఁడే యాబాలకుఁడు తీఱి పోయెను; కాని మ్రొక్కులుమాత్రము చెల్లింపక తప్పరాదఁట! అట్లుతప్పినచోఁ బెద్దమ్మ తల్లి యాయింటఁ బొరకపట్టియాడ్చునఁట!

శి—మనవారికి యుక్తాయుక్తవివేచన లేశమైనను లేదు. వారు జనపరంపరాగతములగు భ్రాంతివచనములకు లోనై, తమ యోజనాశక్తిని మఱుగుపఱచి, యిట్టి విపరీత చేష్టల కెడమిచ్చుచుఁ, బరిహాసాస్పదు లగుచున్నారు. మూఁడు దినములనాఁడు, కృష్ణపురమున సుబ్బరామయ్యగారి కుమారునకు జ్వరాధిక్యమువలనఁ బ్రిదోషము సంభవించియుండఁగా, గృహయజమానుఁ డౌషధమువలనఁ బట్టులేదనినమ్మి, కొల్లాపురమ్మకు రెండుకోడిపెట్టలను — దుర్గమ్మ కొకగొఱ్ఱపోతును —విడిచిపెట్టెను. నేను వారి కుచితరీతిని హితవాక్యములను దెల్పి, వానిని దిరుగఁదోలించి రోగికిఁ దగినచికిత్స చేసితిని. ఆతఁడు తేఱుకొనెను.

చి—జనులలో నిట్టిమూఢాభిప్రాయములు సక్రమాభివృద్ధి నొందుచున్నవి. వానిఁ దోలఁచుటకై మీవంటి వాగ్విదులు చాలఁ గృషి సల్పవలసియుండుట యావశ్యకమగుచున్నది.

శి—ఇది యొకరితోఁ బూర్తియగునదికాదు. ఉత్సాహపరు లనేకులు పూనఁగొనవలసి యున్నది. ఊర విశేషము లేమి? ముఖ్యముగఁ జంద్రిమాళీశ్వరునిఁగూర్చి చెప్పుము.

చి—ఆతనికి వివాహమైనది.

శి—ఔను — ఉమాపతికిఁ దెలియనీయక, శారదాంబను రహస్యముగ వివాహమాడు విషయమునఁ దగినసలహాలుచెప్పి, వధువును — దనతండ్రిని — సందుల గొడంబలఁజుపరియున్నమునకై, పురోహితుఁడగు సుబ్రహ్మణ్యశాస్త్రికి సంభావన క్రింద నాతఁడు మూఁడువందలుసమర్పించి యుండుటయు నాకుఁదెలియును.

చి—వివాహానంతర మాతనియుద్దేశము మాఱినది. అతఁడు వెనుకటి స్థితినే యనుసరించెను.

శి—అదేల ?

చి—ప్రకృత మాతఁడు రమణి యధీనముననుండి తన సర్వస్వము నామెకు సమర్పింప నుద్యోగించియున్నాఁడు.

శి—అయ్యో! ఆతఁడెంత త్వరలో మరలఁ బడిపోయెను. నిరపాయకరమగు రాజమార్గమును వదలి పదంపడి నాతఁడేల ముండ్లతుప్పలలోఁ బ్రవేశించెను? అట్టి దశ కేలవచ్చెను? ఆ నిర్భాగ్యున కాళులుమకూవ మెట్లు దాపరించినది.

చి—అన్నిటికి నుద్వాహసమయమే కారణమయ్యెను. ఆసందర్భమునఁ బూర్ణచంద్రియ్య రమణి నాహ్వానించుటయు, నామె కల్యాణమండపమున మోహమంత్రముఁ బఠించుటయుఁ జంద్రిమాళీశ్వరుని చంచలహృదయశలభ మాగీచాత్మ మ

నోసలమున నురుకుటయుఁ దటాస్థించెను.

శి—ఆహా! పూర్ణచంద్రయ్యవంటి ధీమంతునకుఁగూడ నాతుచ్ఛభోగము పాపహేతువను భావ ముదయింప నప్పుడది చంద్రమౌళీశ్వరునింబోలు దుర్బలచిత్తుని ముప్పులఁ ద్రిప్పక విడచులెట్లు ?

ఇట్లు సంభాషించుచు నడచుచు వా రొకవనముఁ జొచ్చిరి. అది చింత — వేఁప — జువ్వి — మున్నగు తరులతండములచే సాంద్రితమముగ నొప్పి, యంధకారమున కావాసమై యుండను. నాఁటినిశీథిని చంద్రికాంతులు లోకమునం దంటను జక్కఁగ నెలకొని, యందలి తిమిరపరంపరల దూరీభూతమొనర్చి, రాత్రిని దివముగఁ దోఁపింపఁ జేయుచున్నను, ఆ వనమునందలి కాఱుచీఁకటి నించుకేనిఁ గదలింపఁ జాలకుండెను. అదియే హుస్సేనువనము. ఆ వనమధ్యమున మార్గమున కెడమ చేతివైపునఁ బాడుపడిన బావియుఁ గుడిప్రక్క నొక చిన్న గుడియు నుండెను. అందొకప్పుడు పగటియందే దొంగలు పాంథుల నలయించియుండిరి. ఇప్పు డట్టిబాధ హెచ్చుగ లేకున్నను నిశాసమయములయం దప్పుడప్పు డాత్మదాత్రిలయము మనుష్యమస్తకములను మాత్రి మాహుతి గొనుచుండెను. చిన్నోజి యీ విషయ మెఱిఁగినవాఁ డగుటచే, శివరామయ్యతో నావనమునఁ జాల మెలఁకువగ నిశ్శబ్దముగ నడువఁదొడఁగెను. ఇట్లు చనుచుండ నాయల్పమందిరమునుండి యేవియో కొన్ని యస్పష్టధ్వనులాకస్మికముగ నాపథికుల చెవులఁబడెను. అటనుండి వారు ముందుజవేయ సాహసింపక యాశిథిలాగారమును దరియఁజేరి,

దానిపార్శ్వభాగమున నొక్కచోఁ గూరుచుండి, యందుండి వెలువడునుడుల నత్యాసక్తి నాలింపఁ గడఁగిరి; కాని చాలసేపటివఱకు వారికేమియుఁ దెలియరాలేదు.

"మనయుక్తి చక్కఁగనే పనిచేసినది. ఆ మందభాగ్యుఁడు కొన్నిక్షణములలో నీ లోకము వదలిపోవును."

ఈమాట లాయధ్వగులకు విస్పష్టముగఁ దెలియవచ్చెను. అచ్చట నొకహత్య జరుగనున్నదని వారు గ్రహించిరి; కాని యది యెవనిఁగూర్చి యైయుండునో యూహింపఁజాలకైరి.

"ఈపనికంటెను ముఖ్యముగ వారిని బలిచేయుట యవసరమై యుండినది."

"మనకట్టి యాజ్ఞ లేదు. మనల నన్వేషించుటకు మూలకారకులలో నాతఁడు నొక్కఁడగుట నిదియు నవశ్యకర్తవ్యమే యగును."

ఇది తమ్ముఁ గూర్చిన దేయనియు—నందుండువారు చోరభటులే యనియు — చిన్నోజి తెలిసికొని సంతసించెను. కాని తనమిత్రుఁడైన రూపసింగు వారి కసువులఁ గోల్పోవనుండెనని తోఁచుటచే నాతనికించుక విచారముపొడమెను; 'కానిమ్ము—నా దేహమునఁ బ్రాణములుండ రూపసింగు మరణించుననుట కల్ల' యని యాతఁడు స్థిరీకరించుకొనెను. ఆయుదంతము నామూలాగ్రముగ శివరామయ్యకు రహస్యముగఁ దెల్పెను.

"అనతికాలముననే — తోడ్తోడనే — యాహత్యలు నాలుగును జరగిపోవలెను. అనంతరము మనపని సుకరమగును"

‘అందు నేనొకఁడను. రూపసింగు రెండవవాఁడు. తక్కిన యిద్దఱు నెవ్వరు?’ చిన్నోజి సంశయాకులితుఁడయ్యెను. తోడనే చినవీరశర్మయుఁ బూర్ణచంద్రయ్యయు స్మృతిపథమున నిలుచుటచే, నాతని సంశయము తొలఁగిపోయెను.

ఇంతలో నొకశకటము సత్వరగమనమున వచ్చి యచ్చట నిలిచెను. బండి నిలుచుట తడవుగ దాని ననుసరించుచుండిన పురుషుఁడొకఁడు ప్రక్కఁగా జరగి చెట్లమాటునకుఁ బోయెను. ఇంతలో బండినుండి యొకవ్యక్తిదిగి యాలయమువంక నడచుచున్నట్టే, యిద్దఱుమనుష్యులాక్షుద్రమందిర ద్వారమునుండి వెలువడిరి. ఆబండి యెక్కడిది? అందుఁ గూర్చుండి వచ్చిన వ్యక్తి యెవరు? చిన్నోజికి బోధపడలేదు. జరుగఁబోవు భీష్మసంఘటనముఁ గూర్చి యాతఁడు మిక్కిలి హెచ్చరికతోఁ గని పెట్టుచుండెను. శివరామయ్యయుఁ జాలమెలఁకువఁ గలిగియే యుండెను. వారు తమదిడ్డుగోలల నాయత్తముగ నుంచుకొనుట నేమఱచియుండలేదు.

“ఎవరుమీరు? చిన్నోజియు రూపసింగును నెక్కడ? శర్మగారువచ్చిరా? దొంగలెందున్నారు? చెప్పుఁడు—”

చిన్నోజి యాధ్వనిని గుర్తించెను. అది పూర్ణచంద్రయ్య కంఠస్వరము. ‘పాపమాసాధుసత్తముని ప్రాణములకే కీడు రానున్నది. దొంగ లేదియో మాయపన్ని యాతని నటకుఁ గొని తెచ్చినట్లున్నది’ యని చిన్నోజి భావించుకొనెను. ఆలయమునుండి వెలికివచ్చిన యామనుష్యులిద్దఱును బూర్ణచంద్రయ్యను బట్టుకొనిరి.

"నను దాఁకవలదు. మీ రెవ్వరో ముందు చెప్పుఁడు?"

"మేమా! నీప్రాణాంతకులము."

పూర్ణచంద్రయ్య మోసమును గ్రహించెను. కృష్ణమూర్తి మాటవిని తోడనున్న సేవకులనుగూడ నాతఁడు వెనుకకుఁ బంపివైచెను. కనుకఁ దానిట నిస్సహాయుఁడయ్యెను; అయిన నాపురుషుఁడు ధైర్యమును వదలలేదు.

"నిజము చెప్పుఁడు. ఈ కపటయంత్రి మెవరొడ్డినది?"

"చెప్పకున్న. నేమిచేసెదవో — నీమాటలకు జడిసి చెప్పెదమనుకొనకు. నిర్భయముగఁ జెప్పుచున్నాము. ఎఱుగవా? మాప్రభుని — కొండలరాయుని —"

పూర్ణచంద్రయ్య బోయకొండనిఁ జూచియుండలేదు; కాని యాతనికర్మకాండను మిక్కిలి చక్కఁగ నెఱిఁగియుండెను. ఆ వృజినకర్ముఁడు బంధింపఁబడెనన్న వాక్యమును విశ్వసించియే యాతఁ డిట్లొంటిమెయిఁ జిక్కిపోయెను.

"ఈ మాయజాలమున నన్ను మీరు 'సంహరింపఁదలఁచితిరా?"

"ఓ! నిన్నేకాదు. నీతో మఱి ముగ్గురనుగూడ. ఊరక సంహరించి వదలుట లేదు. జముని పురికిఁ గాఁపురముండఁ బంపఁదలఁచితిమి."

"ఛీ! అధమాధములారా!"

పూర్ణచంద్రయ్య తన భారమైన చేతికఱ్ఱ నామానవులలో నొక్కనిచరమాంగమున బలముకొలఁదిఁ బ్రయోగించెను ఆ దెబ్బచే నాతఁడు తూలిపోయెను. ఇంతలో మఱియిద్దఱు దొంగ

లాలయమునుండి వెలువడిరి. పూర్ణచంద్రయ్య జంకక నిర్భయముగ నిలిచి తనకరదండముచే వెంటవెంటనే వారి నతిశీఘ్రముగ మోదసాగెను. వారాప్రహారఘాతముల కెదురొడ్డుచు నాతని పైఁగవిసిరి. అదిచూచి చిన్నోజియు శివరామయ్యయుఁ బరుగు వారి యాతనికిఁ దోడ్పడిరి. ఇంకను నామందిరాంతర్భాగమున శేషించియున్న తస్కరులు ముగ్గురు వెలువడి వారిపై నుఱికిరి. ఇందాక దూరమునఁ జెట్లమాటుననుండి యీచిత్రసంఘటనము నంతయును జూచుచుండిన రూపసింగుకూడ తఱిఁగని దొంగల మూకపై దూఁకెను. కలహము హెచ్చెను. తమకుజయముపొసఁగనేరదని తోఁచినందున, చివరకు నిశాచరులు హతాశులై పలాయనులైరి. సారథి తనరథముతోఁ దత్పూర్వమే యచ్చట నుండి యదృశ్యుఁడైయుండెను. మిత్రమండలి యాసమయమున దస్యులను వెన్నాడుటగాని, సావకాశముగ నచ్చట నాగుటగాని క్షేమకరముకాదని తలఁచి, యతిత్వరితగమనమున నావనముఁ గడచి పురమునుసమీపింపఁజొచ్చిరి. అంతకుఁ జనవీరశర్మ వారి కెదురుపడి 'క్షమించుఁడు. కారణాంతరమున నాకిఁట జాగగుటచే మీతోఁగలసికొనఁజాలక వెనుకఁబడిపోతిని. దొంగలెక్కడ? మీరింతశీఘ్రముగ వచ్చితిరేల? ఆకలుషాత్ములు తప్పించుకొనిరా?' యనెను. పూర్ణచంద్రయ్య నడచినసంగతులనన్నిఁటి నాతనికి సాంగోపాంగముగఁ దెల్పెను. ఇదియంతయుఁ దమ్ముఁజంపుటకై యాదుండగులు పన్నిన దుస్తంత్రమని వారు నిశ్చయించుకొనిరి.

పదునేడవప్రకరణము.

సొమ్మునుబోయె దిమ్మునుబట్టె.

సువిశాల నిర్మలాకాశమునఁ దారకలు స్వచ్ఛముగఁ బ్రకాశించుచుండ — అర్ధచంద్రుఁడు మనోహరముగ మందహాసము సేయుచుండ — పిండి యారఁ బోసినరీతిని వెన్నెలలు సర్వదిశలఁ బర్వియుండ — వృక్షాగ్రములయందలి కోమలకిసలయములు తళతళఁ బ్రకాశించుచుండ — మలయసమీరుఁడల్లనల్లన వీతెంచుచుఁ జెట్లయందలి చిఱుగొమ్మలఁ జిగురుజొంపముల నర్తన మొనరించుచుండ — సిద్ధరామపురప్రజలు సుఖనిద్రయందుఁ బరిపతనులై యుండ — ధవళవస్త్రములను ధరించి నిండుగా ముసుఁగు వైచికొని, మొలలో నేమియో దోపికొనుచుఁ బురవీధుల వడివడిగా నడచిపోవుచున్న యాపురుషుఁడెవఁడు? ఈప్రశాంత యామినీసమయమున నాతఁ డెచ్చటికిఁ బోవుచుండెను? మన కాతని వదనమండలము గోచరించుటలేదు. చదువరీ! సత్వరగమనుఁడవై మమ్మనుసరింపుము. ఓహో! ఒక్కతృటిలో మనల నాతఁడు దాఁటిపోయెనే! పోనిమ్ము — అతని పరిచయప్రాప్తికి మనమొక్కింత శ్రమించవలసియున్నది. ఆ పురుషుఁ డీయర్ధరాత్రమున నట్లు నడివీధినిఁబడి, నిర్భయముగ వెళ్ళుట కత్యావశ్యకప్రమేయ మాతని కేమితటస్థించియుండెనో — ఆకార్యవిధానమెట్టిదో — తెలిసికొనవలసి యున్నది. మనము వెన్నంటియే యాతని కథాంశము నారయవలసియు

న్నది. పాఠకుఁడా! వెనుకఁబడఁబోకు. నేఁడు మనమాతని నెంత మాత్రమును వదలరాదు. అవ్యక్తిమర్మము — అతని రహస్య సంకల్పము — ఆమనుజుని నిరూఢప్రవర్తనముఁ — గనిపెట్టుదము — రమ్ము.

అదిగో! ఆమనుజుఁ డిప్పుడే యారాజవీధికి మరలి పూర్వాభిముఖమైయున్న యాయున్నతసౌధముఁ బ్రవేశింప నుంకించుచున్నాఁడు. ఆఁగుము! త్వరపడవలదు — మన మీలటి నాతనికి గోచరింపరాదు. ఆవాకిట నిలుచున్నది యెవరు? ఇంతవఱ కాతనికై నిరీక్షించియుండిన యొకానొక కామిని కాఁబోలు. భళిర! తిరిగి చూడకయే మనవ్యక్తి గృహప్రవేశముచేసెను. ఆ వీటాదికత్తె యింకను గుమ్మముకడ ముందునకు వ్రాలి, వీధి పార్శ్వభాగములఁ దిలకించుచున్నదేమి? అదియు ద్వారబంధముఁ గావించి లోనఁ గొళ్ళెము వైచెను. అయినను గవాటరంధ్రములనుండి, లోనఁ బ్రవేశింపఁ జాలిన మనశక్తి యద్భుతమైనదేకదా ?

ఆ పురుషుఁ డేమయ్యెనో చూడుము. క్షణకాలముననే యాతఁడు లోనియఱఁ బ్రవేశించెను. అదియే శయనశాల. అందలి సముజ్జ్వల దీపజ్యోతి, భాస్కరప్రకాశమును ధిక్కరించు కరణిఁ జూడ్కిఁ జెదరఁ జేయుచు, నెంత ప్రభావంతముగఁ బ్రకాశించుచున్నదో గాంచితివా? చిత్రవిచిత్ర పటజాల మా కుడ్యములకెట్టి యపూర్వశోభఁ, గల్పించుచున్నవో తిలకించితివా? ఆ పటములలోని చిత్తరువులు మదనకేళీవిలాసమర్మముల నెట్లు వెలార్చుచున్నవో విలోకించితివా?

ఇటు చూడుము. ఈ నిలువుటద్దమునకుఁ బార్శ్వ భాగమున నిద్దఱు కావలిభటులు నిలుచున్నారు. అందొక తె సతి. ఆదివ్యవిగ్రహులు కావలిభటు లగుదురా? వారిని మర్త్యు లనఁబోలునా? సురలుకాఁబోలును. ఱెప్పలు సహితి మాడించుట లేదు. నిశ్చయముగ వా రనిమిషులే యగుదు రేని యదియుఁ జిత్రమే. ఈభౌతిక మందిరమున సురలోకవాసులగు బృందారకులు వసించుట చిత్రముకాదా? సంభ్రమపాటు లేక మేము నెమ్మదిగ సావధానముగ నామూర్తులఁ గాంచితిమి. వారమరులుగారని స్థిరీకరించుకొంటిమి. ఓయీ మాయకాఁడా! ఓరాధాకృష్ణా! మమ్మెంత భ్రమింపఁజేసినావు. సర్వుల నిట్లు భ్రాంతివహింపఁజేసియే కాఁబోలు నీవు టక్కరివనఁబడితివి. వా రమర్త్యులుగారనుట ధ్రువమే; కాని, మర్త్యులును గారు. మన మానవబ్రహ్మ — మన శిల్పాచార్యుఁడు సృష్టించిన నిర్జీవ దారుప్రతిమలు — రాధామాధవ ప్రతిబింబములు. వానియందు జీవకళ లె ట్లుట్టిపడుచున్నవో యారసితివా? ఆహా ఏమి యాశిల్పికళావిశారదుని నైపుణ్యము?

గది మధ్యమునఁగల పర్యంకమునఁ దూలికా తల్ప మీడ్వఁబడినది. ఆతల్పమునం దొక పార్శ్వమున రెండు పళ్ళెరములున్నవి. అందొకటి ఫలావళులచే నిండినది. మఱియొకటి గంధపుష్ప తాంబూలాదులఁ గల్గియున్నది. వాని సమీపమునఁ గల రజతపాత్రిలోనివి క్షీరములు. ఆ హంస తూలికా తల్పమున మన పురుషవ్యక్తి సుఖాసీనుఁడయ్యెను. అతఁ డందలి చిత్రాలంకారములఁ దిలకించుట లేదు. నిలువు

టద్దమునఁ దన ప్రతిబింబమునఁజూచి యుడుపులనుమాత్రము చక్కనొత్తుకొనుచు మందస్మితుఁడగు చుండెను.

ఏమీ! మేఘసంచలనములేకయే మెఱుపు కన్పట్టునా? కన్నులు మిఱుమిట్లు గొనఁజేసిన యాయద్భుత ప్రభ యేమిఁదై యుండును. అది సర్వాభరణ భూషితయగు నొక యెలజవ్వని. మఱియు నెఱజాణ. మనము భ్రమించినట్లు నిశ్చయముగ నది మెఱపుకాదు. ఆ సౌందర్యరాశినిఁ గాంచి, మనవ్యక్తి యేలొకో వివశత్వమునఁ దూలిపోవుచున్నాఁడు. అతఁడు చిత్త భ్రమఁ జెందెనేమొ. విమోహితాంతరంగుఁ డయ్యెనేమొ. ఆతని యామనోవికారమునకుఁ గారణమైనదేదియో? మేల్పసిండినిఁ దిరస్కరించు నాయంగన తనూవిలాసమా? ఆమెకై నేసిన భూషణావళులా?

ఆయిచ్ఛావతి ధరించిన యంబరము లెంతయు నద్భుతానహములే. శరీరచ్ఛాయతో మేళగించి, యుండియు లేనియట్లు దోఁచించు బిగువైన కంచుకము — ఉల్లిపొర కెనయగు నాయమూల్య పీతాంబరము — తంతువాయుని యమోఘహస్తవిద్యా ప్రావీణ్యమునకుఁ దార్కాణములే యగును. పట్టుకుచ్చువలె మృదులములై — భ్రమరవర్ణ సదృశములై — పరిమళతైలసమ్మిళితములై — నిగనిగలాడెడు చికురజాలముల నామె చిక్కడలించి, చక్కఁగ — నొయారముగ— ముడివైచి, సృష్టికారకుని దివ్యకళామహిమకు మఱింత సొయగము నించియుండెను. అంతియకాదు. లలాటాంబరమున దోఁచు నానక్షత్రి తిలకము — కపోల తలమున నలంది

యున్న యారక్త చందనము — నేత్రాంచలముల నెసఁగు నాయంజన లేపనము కూడ, సందులకుఁ బ్రీతి నిదర్శనములే.

అనె తొడగియుండు ముక్తావళీ ప్రాంచికాది కంఠహారములు — చెవులయందలి వజ్రాలకమ్మలు — వ్రేళ్ళఁ దనరు నంగుళీయకములు — సమూల్య రత్నమయములా? ఆహా! హస్తకంకణధ్వనులు — పదమంజీరవినాదములు — శ్రావ్యముగ గానముసేయ, నాయలనాగ మెఱుపు దీవవలె మందిరాంతరముఁ బ్రవేశించి పసిండి బొమ్మ తెఱంగున — నిశ్చలభావమున — నకస్మాత్తుగ — నిలచిపోయెను. తన్నుఁ జూచి నిర్విణ్ణుఁడైన యాపురుషమూర్తిపైఁ దనసమ్మోహన కటాక్షమాలికల. నచంచలవృత్తిఁ బ్రసరింపఁజేసెను. ఆ వృషస్య హఠాత్తుగ శయ్యపైకుఱికి ప్రియుని వక్షమునఁ గూరుచుండి, యాతని బిగ్గఁగౌఁగలించుకొని, చెక్కిళుల ముద్దిడెను. చదువరీ! గమనించుచుంటివా? ఇది యొక శృంగారలీల యని భావించితివా? అది యశాశ్వత భోగమని తలంచితివా? కేవల తుచ్ఛవైభవమనియుఁ దలపోసితివా? విరక్తిఁ జెందితివా? విసిఁగితివా? అయినచో మాపైఁ గినియకుము. ఈ విషయమున మాయెడ లవమేని దప్పులేదు. మాలేఖనియు నట్టి తుచ్ఛవైభవసమన్వితవిలాసవర్ణనల నించుకేని యాసించనిదే; కాని విధిలేదు. ఆ పురుషవ్యక్తి కట్టి విరాగము జనించలేదు. అతఁడది నైచ్యమని హృదయమునఁ జింతించలేదు. అట్లే భావించి యాతఁడు తన దుర్విషయవ్యామోహమున కంతటితో జలాంజలి విడిచియుండినచో, నొక్క వాక్యమైన ముందు

నడచుట కాస్పదమే లేకుండెను. మేమును గథనింతటితోఁ బరిసమాప్తి నొందించి, మాలేఖినికి విశ్రాంతి నొసఁగి యుందుము; కాని యట్లుజరుగలేదు. ఆలలితప్రియుఁడు — ఆ విలాసతత్పరుఁడు — ఆభోగ పరాయణుఁడు — మన్మథోద్రేక భరమున నిమీలితలోచనుఁడగుచు, నాప్రియద గండభాగములఁ జుంబించి పరవశత్వము నొందెను. విశాలములై — ప్రదీప్తములై — నిశ్చలములై — విలసిల్లెడు నా వామలోచన కాటుకకన్నులపైఁ, గామపీడితుఁడగు నామనూజుని దృక్ప్రసారము సుస్థిరత్వము నొందెను. ఆవ్యక్తి తనప్రణయనీమధురబింబాధరముఁ బరిచుంబన మొనరించి, యానందపారవశ్యుఁ డయ్యెనేమో!

"మనోహారిణీ! ఈమందిరమే స్వర్గలోకసౌధము కాదు కదా?"

ఆలీలావతి ప్రియుని యంతర్భావముఁ గనిపెట్టి, సమయమానుకూల్యమని భావించి మందస్మిత యయ్యెను.

"మీ రిట్లడుగుట పరిహాసార్థముకాదు గదా? అయినచో నిది మీచరణసేవకురాలి విలాసభవనము."

"నీవు పొరబడితివి. నేనెప్పటికి నట్లుభావించుటలేదు."

కాముకుఁడు కన్నులరమోడ్చుచుఁ బల్కెను. లీలావతి యగు నారమణి తన మనోహరాపాంగవీక్షణామృతబిందువులఁ బ్రియునిపైఁ జిలుకరించి కిలకిల నవ్వుచుఁ, దన దక్షిణహస్తమును జాఁచి పళ్ళెరమునందలి యొక కదళీఫలమునెత్తి యొలిచి, తానించుక చవిచూచి ప్రియునకందించెను. ప్రియుఁడు

దాని నారగించి ప్రతిఫలముగఁ దాను సహిత మల్లే చేసెను. ఆయుపాహారస్వీకారమువలన నెంతోకాలము గడువలేదు. ఆకాంత క్షీరపాత్రఁ దన మనోహరునివక్త్రమున కందించెను. ఆతఁడు నందలి సాబాలుమాత్రము గ్రోలెను. ఆబంధకి శేషార్థమును ద్రావి, విటునివంకఁజూచి రుచిరహాసము గావించి, క్రమ్మఱి నుపగూహన మొనరించెను. ఆమె కోమలహస్తస్పర్శమువలనఁ గలిగిన సంతోషసంభ్రమాతిశయమున, నాతఁడు మైమఱచెను. కొండొక తడవున కావ్యక్తి యవధానుఁడై కటిస్థలమును దడవికొనెను. వెంటనే యాపురుషమూర్తి చకితస్వాంతుఁడై పోయెను. అతని యమూల్యపదార్థమేదియేనియు ప్రియుని హరించియుండును. అందుల కుపాయనముగఁ గాఁబోలు కమ్మని సౌరభముఁ గుమ్మరించు నొక యపూర్వప్రసూనరాజము, నావిటుఁ డాదివ్యసుందరికి సమర్పించెను. ప్రియుఁ డిచ్ఛాపూర్వకముగఁ — కృపాపరత్వమున — నొసంగిన యామనోజ్ఞసుమము, నాకాముకి ప్రీతిపూర్వకముగ స్వీకరించి, తనవామకరలతఁ బ్రియుని కటిప్రదేశమునఁ జుట్టి, యాతని వంకఁ బ్రేమవిలసితలోచనప్రసారములఁ జిమ్ముచు, నావికచకుసుమమునందలి పరిమళసుమనోరజము నాఘ్రాణించెను. ఆపుష్పరసాస్వాదనహేతువునఁ గల్గిన బ్రహ్మానందకారణమునఁ గాఁబోలు నాలతాంగి నిశ్చేష్టయై, తన పల్లవతనుఁవల్లినిఁ బ్రియుని వక్షమున వాల్చెను. కొన్నిక్షణము లిట్లు గడచెను. అనంతర మాముగ్ధప్రణయావస్థనుండి తెలిసి, శరీరమును స్మరించుకొనెను. మనోహరుఁ డెదుటలేఁడు. ప్రియుని మనస్స

మాకర్షణమునకై. తా నలంకరించుకొనియున్న రత్నమయ స్వర్ణాభరణములు — ముక్తావళీ ప్రాంచికాదిదివ్యహారములు — స్వీయగాత్రమున లేవు. తూలికాతల్పమునందలి పైఁడిపళ్ళెరమును రజతపాత్రాదికములును నదృశ్యములైనవి. అంతియ కాదు. పర్యంకమునకు శిరోభాగమునందలి కుడ్యమున కానింపఁబడియున్న లోహపేటిక తెఱువఁ బడినది. అందలిసమస్తభూషణములు నన్యములగు చరసంపదలును హరింపఁ బడినవి. ఆప్రమద బ్రహ్మానంద మంతరించెను. హృదయమునఁ బిడుగు వడినట్లయ్యెను. భయభ్రాంతయై యారమణి దిశలుపరికింపఁ దొడఁగెను. చిత్తసంక్షోభముఁ జెందెను. పాప మావిలాసిని తన విలాసభవనమున నున్మాదినిచందమున నెల్లెడలఁ గ్రుమ్మరుచు దుర్భరపరీతాపమునఁ బ్రలాపింపఁ జొచ్చెను.

ఆలలనామణి చెలిమి సలిపి, యామె మధురవాగమృతధారలఁగ్రోలి, యత్యధికపరిమళసమ్మిశ్రితములై మోహనకరములైన యారమణీదివ్యకటాక్షమాలికలనుదాల్చి, పరిశ్రమపూర్వకముగ నావిభావిసి సల్పిన కామలీలావిలాసవ్యాపారమునఁ జొక్కి, చివర కామె సమస్తభాగ్యములఁ జూఱలాడిన యాచోరశిఖామణి యెవ్వఁడై యుండునో చదువరీ! ఊహింపుము.

పదునెనిమిదవ ప్రకరణము

నాలిక తీఁపు లోన విషము.

మఱునాఁటి తొలివేకువనే చంద్రమౌళీశ్వరుఁడు రమణీగృహమునకు వచ్చెను. భవనద్వారమునఁ దనకొఱకు రమణి వేచియుండలేదు. రాధమైన గుమ్మముకడ దాఁగిలిమూఁతలాడుచుండలేదు. ఆ మందిరవిలాస మంతరించినది. దీపములు కళ తఱిఁగి మినుకుమినుకు మనుచుండెను. వసారాలో రమణి లేదు. రాఁకమాలత్రి మందలి యొకతిన్నెపై రాతినేలను బవ్వళించియుండెను. చంద్రమౌళీశ్వరుఁ డచ్చటినుండి కదలి గదులన్నియుఁ బరికించి, పడకటింటి కడపయొద్ద రమణి పరుండియుండుట నాలోకించెను. హంసతూలికాతల్పమును వీడి యామె భూశయ్యపై మేనిఁ జేర్చినది. ఆ సుందరి కేశబంధము వీడిపోయినది. ఆ చికురజాలము చెదరి దేహమెల్లఁ గప్పికొనినది. చంద్రమౌళీశ్వరుఁడు విభ్రాంతితోఁ దనప్రియురాలిని సమీపించి, నిశ్చలదృష్టి నామెవంకఁ జూడసాగెను. ఆమె యమూల్యనిర్మలాంబరములన్నియు ధూళిధూసరములై యుండెను. ఆతన్వి యుత్తమాంగము నొక్కయలంకారము పూజించుచుండలేదు. ఆచంద్రవదనమోము వాడిపోయినది. మనోహర వచోమృతవృష్టి గురియు నాయధరములు నీరసములై శుష్కించినవి. ఆ హరిణేక్షణ సుందరతర నయనపద్మములు ముకుళించినను గండుదేరినవి. కనుగొలకులనుండి చాలువాఱిన యశ్రుధారా

ప్రవాహచిహ్నము లిరువైపుల నామె మృదు గండభాగములపై నింకను విస్పష్టముగ దోఁచుచునే యుండెను. ఆ భయదాంకములఁ గాంచి చంద్రమౌళీశ్వరుడు నిర్విణ్ణుఁడై నిస్తబ్ధుఁడై పోయెను. వెంటనే యాభయంకరవ్యాపారపరమరహస్య మంతయు నాతని మనఃఫలకమునఁ జిత్రితమైనది. అందులకుఁ దన యపరాధ మెంతేనియుఁ గలదని తలఁచి, చంద్రమౌళీశ్వరుఁడు విచారసాగరమునఁ బడిపోయెను. దానిఁ గడచుట కాదరువగు నాతని జ్ఞాననౌక యుత్తుంగ మోహలహరీజాలములలోఁ గొట్టుకొనిపోయియదృశ్యమైనది. ఆ వీచికాపరంపరనుండి తరించుట యాతనికిఁ గష్టతమముగ నుండెను.

శారదహితోక్తులలో రాత్రియంతయుఁ గడపివైచుట యింతకును మూలమయ్యెనని చంద్రమౌళీశ్వరుఁ డూహించెను. తన విరహతాపము నోర్వఁ జాలని రమణి స్వసుఖసాధనముల నెడఁదోసి — వగర్చి వగర్చి — యప్పుడప్పుడే కనులు వాల్చె ననియు నాతఁడు గ్రహించెను. ఆహా! స్త్రీలహృదయ మెంత మృదులమైనది. తాము వలచిన ప్రియులు కర్కశస్వభావులైనను వారి కుటిలప్రేమకుఁ గూడ గరఁగి స్వీయజీవధనము నేని సమర్పించుకొనఁ జాలిన యిట్టి యువతీలలామల కోమల మానసమునకు నవనీత మెట్లు తుల్యమగును. చంద్రమౌళీశ్వరుని స్వాంతమున నిట్టి యోజనలు క్రమక్రమముగఁ బలుపుకొనుచుండెను. ఈ విషయములఁ దలపోయుకొలఁది, నాతని హృదయము నీరై పోవుచుండెను. తోడనే యాతఁ డాకాంతను మేల్కొలిపి, తననేరము నొప్పుకొని క్షమాపణ వేఁడ సంకల్పిం

చుకొనెను. కాని యట్టిసాహస మాతనికిఁ గలుగ లేదు. సంతా
పభరమునఁ జంద్రమౌళీశ్వరుఁ డామె శిరోపార్శ్వమున నల్లనఁ
గూరుచుండి మనోహరి నెఱికురులఁ జక్కనొత్తుచుఁ దన ధవళ
చేలముచే నామె శుష్కనయనములఁ దుడువసాగెను. రమణి
సుషుప్తిఁ దెలిసి విభ్రాంతయై దిక్కులఁ బరికించుచు "రాధా!
రాధా! ఇఁకేమిసేయుదును. రమ్ము—దొంగచిక్కెను—చెల్లె
లా! త్వరగా రమ్ము" అని బిగ్గఱగా నఱచెను. ఆ కఠోరస్వర
మునకు రాధ యులికిపడి లేచి పరుగిడివచ్చెను.

రమణి యట్లేలయఱచినది? చంద్రమౌళీశ్వరుఁడే
దొంగయా? లేక యామె కలువరించినదా? రాధకేమియుఁ
దెలియలేదు. ఆమె సోదరినిఁ జూచి "అక్కా! నీకింకను మతి
భ్రమపీడ లేదా? దొంగయెక్కడ? అనిలుచున్నది బావగారు
కారా?" యనెను. రమణి చంద్రమౌళీశ్వరునిఁబరితాపసూచక
ముగఁ గాంచి నివ్వెఱపాటున నిలిచి — పైఁటసవరించుకొని —
ప్రక్క కొదిగి వేఱొక వంక మొగముచేసి — మోమునఁ
జెఱఁగుఁజేర్చి — "అయ్యో! నాకిఁక నేది గతి? ఆరాక్షసి
నన్నింత వంచించినది? ఇంత కపటమా! ఇంత మోసమా! ఇంత
ద్రోహమా!" యని రోదనము సేయఁజొచ్చెను. ఇట్లు రమణి
ప్రలాపించుచుండుటచేఁ జంద్రమౌళీశ్వరునిబుద్ధి చలించి
పోవుచుండెను. ఆపరివేదన నాతఁడు చూడఁ జాలఁడయ్యెను.
ఏడ్చియేడ్చి రమణి తన దుఃఖమునుండి యొకింత శాంతి నొందిన
పిమ్మట, చంద్రమౌళీశ్వరుఁ డించుక ధైర్యమవలంబించి,
యామెను సమీపించి, తనమెత్తని పట్టువస్త్రముచే నామెగండ-

స్థలములఁ దుడిచి, యాయంగన నక్కునఁ జేర్చికొని పర్యంకమునఁ గూరుచుండి, "ఏమి యీకలవరము? కాంతా! ఎందులకిట్లు పలవించుచుంటివి? దొంగ యేమి? ఆరాక్షసి యెవరు? నీవెట్టి వంచనకు లోనైతివి? ఈపరితాపమున కేమికారణము?" అని యనుకోశపూర్వకముగ నుడివెను.

రమణి మరల రోదనము నారంభించెను. "అక్కటా. ఇంకేమి చెప్పమనుచున్నారు? అంతయును బోయినదికదా! నాప్రాణమునకుఁ బ్రాణమై మీకెంతయుఁ బ్రియతమమై యుండిన సొమ్మెల్లఁ బోయినదే! నాథా! మీరు గ్రహింపలేదా!" అనెను.

చంద్రమౌళీశ్వరుఁ డందులకదరిపడెను. "ఏమీ! సొమ్ము పోయినదా! ఎట్లు?" అని తొట్రుపాటున నాతఁడు ప్రశ్నించెను.

రమ—అయ్యో! ప్రియవల్లభా? నడచినకథ మీకుఁ దెలియనే తెలియదా? ఒక్క రాధామందిరమున నుంచిననగలు తక్కఁ దక్కినవన్నియుఁ గడచిన నడురేయి దొంగలచేతఁ బడి పోయినవి.

చంద్ర—మనోహరీ! మీరింట లేకపోయితిరా?

రమ—ఉండియు నేమిలాభము? లేకున్న నెంతప్రయోజనమో యుండియు నంతయే యైనది.

చంద్ర—అదేమి?

రమ—మీకు శ్రమగలుగకుండవలయు ననుతలంపున, రాత్రి లోనగొళ్లెముపెట్టకయే వాకిలి తెరమూసి పరుండియుంటిమి. ఎన్నఁడునురాని యీ పాపినిద్ర రాత్రియే మమ్మావరించి

నది. మేము గాఢసుషుప్తినుండఁగా నింతయును జరగిపోయినది.

చంద్ర—అయ్యో! ఎట్టిచిత్రము! అంతనిర్భయముగా నీయింటఁ బ్రవేశింపఁగలిగిన యాదుష్టుఁ డెవ్వఁడై యుండును?

రమ—ప్రాణేశ్వరా! యథార్థవిషయము లెఱుఁగక పోయినను, యింతమాత్రమైన నూహించుకొను లోకానుభవ ము మీకు లేదా? ఈవేళకు మీ రెవరినిఁ బ్రాణతుల్యముగ భావించి యుంటిరో వారివలననే యింత యరిష్టము మనకుఁ బ్రాప్తించినది.

చంద్రమౌళీశ్వరున కీవాక్యములలోని గూఢార్థము బోధపడలేదు. అతఁడు శక్తియున్నంతవఱకు యోచించెను. ఆతని మనోరాజ్యమున నిందులకు హేతుభూతమైన వ్యక్తి యొక్కటియుఁ బ్రత్యక్షము కాలేదు. తానిందాఁక నొక్కమూర్తినిమాత్రమే ప్రాణసదృశముగ భావించియుండెను. ఆమె శారదాంబ. ఆ పరమసాధ్వి యిట్టి దుర్ఘటవిషయములలోఁ బాల్గొనియుండునా? రమణి యుద్దేశ్య మేమైయుండునో చంద్రమౌళీశ్వరునకుఁ దోఁపలేదు.

రమ—సూక్ష్మాంశములను గ్రహింపఁ జాలనంతటి స్థూలముగ మీబుద్ధి మాఱినదని నేనెంచను. తెలిసియున్నఁ వారే -- పరమాప్తులే — యింతపని చేసిరన్నఁ దెలిసికొన జాలనిచో దానిని విఱచిచెప్పుట నాకిష్టములేదు.

రాధ—అక్కా! ఈవిషయ మిఁకను దాఁపవలదు. ఇప్పటికే యింతయైనది. ముందేమివచ్చునో! నీవభిమానవతి వగుటచేతఁ బ్రియున కప్రియము కలుగవచ్చునని జరగిన యుపద్రవమును మఱుఁగుపఱచి, తరువాతఁ దలకుఁ దెచ్చుకొనకు ఆ

మర్మమంతయు నిప్పుడే బావగారికి మనవిచేసికొనుము. లేకున్నచో నేనైనఁ జెప్పి తీఱుదును.

రమ—రాధా! రాఁగలకష్టము లెట్టివైనను రానిమ్ము. అన్నిఁటి ననుభవింతములెమ్ము. ఆరహస్యము మాత్రము వెలివేయవలదు. మనవిశ్వాసమే మనల నీస్థితికిఁ దెచ్చినది. కలరూపు దెలిపి పరులనమ్మకమున కేల భంగము గలిగింపవలెను? ఆభరణములన్నియుఁ బోవుఁగాక, చివరకు నాప్రాణములు పోయినను మీబావగారి కానిగూఢాంశ మించుకయుఁ దెలుపవలదు.

రాధ మౌనవృత్తి నవలంబించెను. చంద్రమౌళీశ్వరున కనుమానము హెచ్చెను. అందాతని మానసము రెండువైపులఁ బరుగువాఱుచుండెను. ఏవంక నిశ్చయించుకొనవలయునో యాతనికిఁ దోఁపలేదు. యోచించుకొలఁది నాతనిహృదయము కలఁతవడిపోవుచుండెను. ఆరహస్యవృత్తముఁ దెలిసికొన నాతఁడు వేగిరపడుచుండెను.

చంద్రి—ప్రేయసీ! అట్లాజ్ఞాపింపవలదు. ఆరహస్యమేమో చెప్పనిమ్ము. ఆద్రోహి యెవ్వరో తెలిసికొనుట నాకును భావ్యమేకదా?

రాధ—తెలిసికొని మీరేమి చేయఁగలరు?

చంద్రి—అందులకుఁ దగినఫలము వారికిఁ గుడువఁబెట్టఁగలను.

రాధ—(పరిహాససూచకముగ) నా కెంతమాత్రమును నమ్మకములేదు. మీ రెప్పటికి నట్లుచేయఁజాలరని నేనెఱుఁగు

దును. కేవల స్త్రీస్వభావుల కట్టిశక్తి యెక్కడిది?

చంద్రి—(తీవ్రస్వరముతో) రాధా! నీవింకను బరిహాసములు మానలేదు.

రాధ—బావగారియెడ హాస్యవచనములాడుట మాకుఁ జెల్లదా?

చంద్ర—చెల్లనిమ్ము — అందులకిదియా తరుణము?

రాధ—పోనిండు— అది యపరాధమైన క్షమించుఁడు. ఇంతకును మూలమైన మీప్రాణధనమగు శారదకు, మీరెట్టి ప్రతిఫలముఁ గుడువఁబెట్టి మీపౌరుషము నిరూపింతురో, యదియుఁ దెలియఁగలదు.

ఈయంత్యవాక్యము చంద్రిమౌళీశ్వరుని గుండెకుఁ బిడుగై నాఁటెను. అగాధవేదన నాతఁ డోర్వఁజాలకపోయెను. అంతకంటె మరణమే సుఖదమగు ననుకొనెను. చాలసేపటివఱకాతఁడు నిరుత్తరుఁడై యుండి పిమ్మట నిట్లనెను.

"హా! ఈశ్వరా! అనుకొనినట్లే యైనది. ఆహా! ఆపరమసాధ్వి యింతకును సాహసించియుండునా?"

రమ—చెల్లెలా! నేనుముందే చెప్పితినిగదా రహస్యము వెల్లడిఁ పనలదని? వారి కామెగారియెడఁ బరమవిశ్వాసము. అందునుగూర్చి మనమేమిచెప్పిన నదియెల్ల విఱుపుమాటగ వారికిఁ దోఁచుట సహజము.

రాధ—ఔను. ఆద్రోహకర్మ శారదవలననే జరగినదని నిస్సంశయముగఁ దెలియవచ్చినను, వారు నమ్మఁజాలరు. రహస్యము బయటఁబెట్టుటచే మనకుఁగలిగిన ప్రయోజన మొక్క

పరిభవమే.

చంద్రి—రాధా! నీవు బాలవు; కనుక లోకజ్ఞానము నీకుఁ దక్కువ. శారదాహృదయమర్మము నెఱింగినవాఁడ నగుటం జేసి, యా శీలవతి యిట్టిదుష్కర్మ కెట్లు సాహసించినదని శంకించుట మిమ్ము నవమానించినట్లయ్యెనా?

రాధ—బావగారూ! కినియకుఁడు. నేనును మీమాటకే వత్తును. లేదు. శారదాంబ శీలవతి. ఇట్టివ్యాపారమునకు సాహసింపఁజాలని బాల; కావున నట్టి యమాయకురాలిపై మేము చెప్పెడు మాటలు కల్పితములు.

చంద్రి—నే నట్లనలేదు.

రాధ—అనలేదుగాని యనుకొంటిరని మీమాటలే చాటుచున్నవి.

చంద్రి—అలుగవలదు. రాధా! ఆమె యిందులకు సాహసించెనని నీవు దృఢముగాఁ జెప్పఁగలవా?

రాధ—సాహసించినదియు లేనిదియు జరగినపనివలననే తెలియుచున్నది. ఒకరుచెప్పవలసినదేమి?

చంద్రి—ఈపని యామెయే చేసినదని నీ వెట్లు నుడువఁగలవు?

రాధ—ఆమె చేయలేదు. తనయాప్తులతోఁ జేయించినది.

చంద్రి—ఆమె కీప్రపంచమున నేనొక్కఁడను దప్ప నింక యాప్తులెవరు?

రాధ—(వికృతహాసము సేయుచు) అట్లనుకొనుట

మీకునైజమే. మీరు మమ్ము నాప్తులని భావింపలేరు; గాని యామె కీయూర మీకంటెను బరమాప్తులెందఱులేరు? ఆమె యెట్టిదినదియు లోకులకుఁగాక మీకెట్లు తెలియఁగలదు? మీరాతత్త్వముఁ గనుఁగొనఁ జాలని దోషము మాదియా?

చంద్రిమౌళీశ్వరుని హృదయము నిప్పులేకయే రగులఁ జొచ్చెను — రాధమాటలవలనఁ గ్రిమక్రిమముగ నదిహెచ్చిల్లుటచే నందుమూలమున నాతని హృదయమేకాక శరీరము కూడ దహించుకొని పోవుచుండెను. ఆతాపము నాతఁడు సైఁపఁజాలఁడయ్యెను.

చంద్రి—ఆమె కాప్తులున్నారనియు నీకార్యము నామె తనయాప్తుల చేతనే చేయించినదనియు మీరు నమ్ముచున్నారా?

రాధ—మేము నమ్ముటయేకాదు. మిమ్మునుగూడ నమ్మఁడందుము.

చంద్రి—దేనిఁ బట్టి?

రాధ—నడచినచర్యనుబట్టి; కానిచో నీయుత్తరమునుబట్టి.

రాధ తనరొండినుండి యొకయుత్తరముఁదీసి చంద్రిమౌళీశ్వరున కొసఁగెను. ఆతఁడాలేఖనందికొని యందలి విషయము నతికష్టముతోఁ జదువుకొనఁదొడగెను. అందిట్లున్నది.

“ శ్రీ శ్రీ శ్రీ—కొండలరాయుల సన్నిధికి:—

అయ్యా! మీరుశారద నెఱుంగుదురు. ఆమె ప్రిత్యక్షమోహినీదేవియనియు నపరభారతియనియు గ్రిహించియే యుందురు. ఆ దివ్యసుందరికి లభించిన విభుఁడు దుర్విదగ్ధుఁడు.

అతఁడు బుద్ధిచెడి పూర్తిగా రమణీవశుఁడైపోయెను. శారదకేక మగనియాసలేదు. మీయద్భుతచర్యల నామె తెలియు నానుండి వినుటచే మీసాహసమున కాశ్చర్యమునొంది మిమ్ము వలచినది. మీరామెను జేకొన నామోదించుటకు గుఱుతుగా నాయువతీమణి తృప్తికై రమణియమూల్యభూషణముల నెల్ల హరించి శారద కొసంగవలెను. ఇందులకు మీకంటె సమర్థులు లేరు; కనుక విన్నవించితిని. చిత్తగించుఁడు.

భ్రాతృఁడు—

సిద్ధరామపురము. వైద్యము – శివరామయ్య."

చంద్రిమాళీశ్వరుఁడు లేఖయందలి విషయము నామూలాగ్రముగఁ జదువుకొనెను. అతని దేహము కంపించెను; అందలి ప్రతిపదము నాతని మనస్సును శూలమట్లుపొడిచి బాధింపఁజొచ్చెను. ఆసంఘాతమునకు నిలువఁజాలక, యాతని హృత్పిండమూడి పడనున్నట్లుండెను. అందుచే నాపురుషుఁడు దుర్భర వేదన ననుభవించుచు నిట్లనెను.

"ఈయుత్తరము మీకెవ్వరిచ్చిరి?"

రాధ—ఎవ్వరు నీయలేదు.

చంద్రి—అయిన నో నదియెచ్చట లభించినది?

రాధ—మన యినుపపెట్టెకడఁ బడియుండెను. రాత్రి దొంగలు సొమ్ములుదోఁచుకొని పోవునవసరమున దాని నిచ్చట వదలిపెట్టి యుందురు.

చంద్రిమాళీశ్వరుఁడు చేతనున్న పత్రమును జించి నేలఁబడవైచెను. అతఁడు బద్ధహస్తుఁడై ముఖమువంచి విషాదపరి

తప్తచిత్తుఁడై యత్యంత దీనభావమున నామొక్కలవంకఁ దదేక ధ్యానముతోఁ జూడఁదొడఁగెను. అతని లోచనయుగళినుండి యశ్రుకణములు ముక్తాఫలములవలె నురలఁజొచ్చెను. కొంత సేపటికాతఁడు తన ధవళకరవస్త్రముచేఁ గన్నులను ముఖమును దుడుచుకొని, "మంచిది — శారదకును నాకును నేఁటితో ఋణముః తీఱినది." అనుకొనుచు నచ్చటనుండి నిర్గమించెను.

పందొమ్మిదవ ప్రకరణము

కంపలో బడ్డ కాకి.

కాలచక్రము తిరుగుచున్నది. ఎన్నియో జీవరాసులాచక్రపరిభ్రమణమునఁ గొట్టుకొనిపోవుచున్నవి. ఉదయమధ్యాహ్నసంధ్య లెట్లు కాలగతిని సూచించుచున్నవో యట్లే బాల్యయౌవనవృద్ధదశలు జీవపరిస్థితిని వ్యక్తపఱచుచున్నవి. ఈకాలపరిమితిలో — ఈత్రివిధావస్థలలో — మనీషాబలము ననుసరించి జీవునకనంతములగు వినిమయము లేర్పడుచున్నవి. ఒకవంశ మధికోన్నతి నొందుటకు నత్యవనతిఁ గాంచుటకు నిదియే కారణమగును. నేఁడొకజాతియొక్క పురుషుని హేతువున విశాలయశఃప్రాసాదమున నడయాడవచ్చును. రేపు మఱొకని కారణమున నధఃపతనము నొందుట తటస్థింపవచ్చును.

మహోన్నతభాగ్యసీమ కధిపతియైయుండు నొకానొక
వ్యక్తి మరుక్షణమే యటనుండి దొరలిపడి యూరుఁబేరులేక
నశించుట సంభవముకావచ్చును. చరప్రకృతి కిది సహజధర్మ
మైయున్నది. మానవసంఘ మీపరిపాటి ననేకవిధములుగ
భావించుచున్నది. కొందఱు దీని దురదృష్టమందురు. కొందఱు
విధిప్రేరితమందురు. మరికొందరు గ్రహచారమందురు. ఒక్క
గ్రహచారపదప్రయోగము లోకమున ననేకానర్థముల కాది
మంత్ర మగుచున్నదనియు దానియనుక్రమమె ధనవ్యయము
నకును జనవినాశమునకును హేతుభూతమగుననియుఁ గొందఱు
శంకింతురు. దాని యాథార్థ్యము నెఱుంగఁగోరి విచారపరు
లింకను మనుష్యజీవితావళులఁ దరుచుచున్నారు.

సిద్ధరామపురమునఁ జాలవిఖ్యాతిఁ గాంచినది యాదవ
వంశము. ఇది బహుపురాతనకాలమునుండి పారంపర్యముగ
వచ్చుచుండెడి క్షత్రియవంశమనియుఁ బౌరాణికయుగమున
దీని ప్రతిభ యత్యున్నతశిఖరసీమ నధిష్ఠించి యుండెననియుఁ
బ్రసిద్ధి. శ్రీకృష్ణమూర్తి స్వీయజన్మకారణమున దీనిని పావన
మొనరించెననియు నాఁటిప్రతిభాశక్తి పెక్కుయుగములవఱకుఁ
దీసిపోవలేదనియుఁ బ్రతీతి. రాఘవచంద్రయ్య జీవితకాలమునఁ
గూడ నిదియెంతయుఁ బేరుమోసియే యుండెను. ఆతఁడు వృష్ణి
కుల భూషణుఁడని వినుతికెక్కియుండెను. ఆ ప్రతాపశీలుని
యాదరాతిశయమువలన నావంగడము పూర్వవైభవముఁ దలఁ
పించుచుండెను. పూర్ణచంద్రయ్య జీవితావధినిఁగూడ దీని
నామప్రతిష్ఠలు యశోభరితములయి మిగుల నొప్పిదముఁ గాం

చియేయుండెను. ఆ దినములలో నిది తొల్లింటి పరమోత్కృష్టస్థితి నందియుండకపోయినను నప్రతిష్ఠమాత్రము పాల్బడియుండలేదు. మేఁకవన్నెపులుల మందనుబోలు శత్రుతండమొకపక్షమున భిన్నాభిప్రాయములోఁ గృషిసల్పుచున్నను పూర్ణచంద్రియ్యవంటి ధీరోదాత్తుని చిత్తము నదియెంతమాత్రమేని నతిక్రమింప నేర్చునా? వియ్యూరివారు కృష్ణభగవానుని స్త్రీసంతతికిఁ జెందియుండిరని కొందఱును బురుషసంతతిలోనివారేయని మఱికొందఱును దలంతురు. ఏదియెట్లున్నను యాదవాన్వవాయజులనుటయుఁ జిరకాలమునుండి పేరుఁ బెంపు సంపాదించి యుత్కృష్టజీవనము నందియున్నవారనుటయు వాస్తవము.

వియ్యూరివారి సౌధనిర్మాణక్రమమే వారి తొల్లింటి యౌచిత్యము నుద్ఘోషింపఁ జాలియుండెను. విస్తారధనధాన్యములతోడను నుత్సవాతిశయములవలనను నిత్యకల్యాణవిభవాదులమూలమునను నామందిర మనారతము శోభిలుచుండెను. ఆవైభవముల కాస్పదమైన యూఁతకోల పడిపోయినది. ఆచరసంపదల విచ్ఛిత్తికిఁదరుణమాసన్నమైయున్నది. నేఁడాభవనము కాంతిహీనమై మిగుల భయంకరముగఁ జూపట్టుచున్నది. ఇందులకుఁ గారణము మనకువ్యక్తమే.

ఏనాఁడు దివ్యసుందరియగు రమణి యాకల్యాణమందిరమున నడుగువెట్టి తనరూపజ్యోతి నందుఁ బ్రజ్వలితమొనరించెనో — ఏనాఁడు సభాంతరాళమున నా రామామణి కుటిల నర్తనము నభినయించి తనవిలాసతత్త్వమును వెలార్చెనో—

ఏనాఁడు స్వీయగానవాహిని నాకలవాణి యాసువిశాల మందిరాంతరమున వెలువరించెనో — ఏనాఁడు తనవిషసమ్మిశ్రిత వీక్షణకణముల నా వామలోచన చంద్రమౌళీశ్వరుని హృదయకుహరమునఁ గ్రుమ్మరించెనో — ఆనాఁడే యాలలన నవయౌవనుఁడగు నాచంద్రమౌళీశ్వరుని స్వత్వముల నెల్లఁ బూర్ణముగ హరించెను. ఆహారిణేక్షణ సముజ్జ్వల నయనజ్యోతుల కాతనిచిత్తము పతంగసన్నిభమయ్యెను. ఆభామిని శృంగారాంగహార మాతని బుద్ధిని భ్రంశమునొందించెను. ఆ గాన లహరిలో నాయమాయకుని సమస్తేంద్రియములు మిగులఁ జలించిపోయెను. పాపమాతఁ డామె దృష్టిప్రసారములకుఁ దన చూడ్కిని దాసత్వమొసరించెను. ఆకపటవర్తనమును బవిత్రశీలముగఁ దలపోసెను. రమణీకృతగాఢతమమోహజాలమున నాతఁడు పూర్ణముగఁ దగుల్కొనెను.

పూర్ణచంద్రయ్య తనూజుని యహితచర్యలఁగూర్చి చాలఁజింతించెను. అతని దుర్వ్యాపారములకు విచ్ఛేదముఁ గల్గింపఁ బ్రయత్నించెను. చంద్రమౌళీశ్వరుని హృదయక్షేత్రమున నాదుర్విషయాంకూరములు సాంద్రితముముగ నెలకొని, వేరూని, పెచ్చుపెరిఁగి, సుస్థిరములైయుండుటచే, వానిని సమూలముగఁ బెకలించి, యందు సత్సంకల్పబీజములఁ జల్లుట పూర్ణచంద్రయ్యకు సాధ్యముకాలేదు. అందుపైఁ గుమారుని మెడ నాతఁడు కనఁబఱచిన చతుర్విధోపాయములును నిరర్థకములేయయ్యెను. చివరకాతఁడు హతాశుఁడై, తనకుఁ గొడుకును కోడలును శారదాంబయే యనినమ్మి, గృహపరిపాలన

భార మూ మెయుండిడి, చరధనమునంతయు న్శోకానొక రహస్యాగారమున నునిచి, దానియునికిని శారదాంబకు మాత్రము దెల్పెను. చంద్రమౌళీశ్వరున కామర్మ మించుకేని సూచింప వలదనియుఁ గట్టడచేసెను.

ఇట్టితటి దయావంతులును ధార్మికస్వాంతులును నగు నావృద్ధదంపతులు, శయనాగారమునఁ బడకపై నున్నట్టులే యొకనాఁటిరాత్రి సుఖమరణమునొందిరి. ఇట్టి యాకస్మిక మృతికేమికారణమో! ఇద్దఱు నొక్కమాఱు నిరామయముగ నేకశయ్యపై నున్నట్టుండి చనిపోవుట, యస్వాభావిక మే యగును. ఈవిషయమునఁ బ్రజాభిప్రాయము పరిపరివిధములుగ నుండెను. గృహమునఁ జాలినంత స్వాతంత్ర్యము తనకియ్యని కారణమునఁ, బుత్త్రుఁడు విషప్రయోగముచేసెనని కొందఱును వారి వైభవాతిశయములఁ జూచి సహింపఁజాలని విరోధి మంత్రప్రయోగము చేయించెనని కొందఱును — అభాగ్యురాలగు శారద యాయింటి కడపత్రొక్కుట యింతకును మూలమయ్యెనని కొందఱును — దైవవిధియట్లుండెనని కొందఱును — దలఁచుచుండిరి. ఎట్లైనను, ఆయుత్తమ దంపతులిద్దఱు నిరాయాసముగ నొక్కపర్యాయమిహలోకమును బాసిపోయినమాట నిశ్చయము. వారిమరణవార్త పౌరుల కపారమగు విచారమును గూర్చెను. పాపము శారదాంబ యాదుస్తర శోకసాగరమునఁబడి వికలచిత్తమైపోయెను.

తలి దండ్రులు గతించిన యారంభదశలోఁ, జంద్రమౌళీశ్వరుఁడు కొంతకాలము రమణీమందిరమునకుఁ బోవ

మానెను. అంతమాత్రమున నాతఁ డావిషఘటమునకు సంపూర్ణ తిలోదకములను వదలెనని తలంచుటకుఁ గాలేదు. కొన్ని దినములవఱకన్యులకుఁ దెలియనిచందమున, నిశాసమయములయందు మాత్ర మాస్వైరిణీ గృహమున కతఁడు పోవుచుండెను. అనంతరము దివాసందర్భములయం దేకాంతముగను దదుపరి నెచ్చెలులతో నిర్భయముగను నాగరికాసౌధమున కరుగఁజొచ్చెను. కొంతకాలమిట్లు కడచినవెనుక నాతఁడు దినమున కొకటిరెండు పర్యాయములు భోజనార్థమింటికి వచ్చుచు, భార్యతోఁ బ్రీతివాక్యములాడి, యామెనుండి ధన సంగ్రహము చేసికొని వెళ్ళుచుండువాఁడు; కాని స్వగృహమునకు వచ్చుట హఠాత్తుగ — నితాంతముగ — మానివైచెను. ఇప్పుడాతఁడు తిండితీర్థములకైన స్వీయమందిరముఁ జేరఁజనుటలేదు. తన యర్ధాంగిని బలుకరించుటలేదు. చూచుటయులేదు. చూడఁ దలఁచుటయులేదు. అట్టి సంకల్పమునకే యాతని మనోరాజ్యమునఁ జోటున్నట్లులేదు. చంద్రమౌళీశ్వరునకు శారదపై నిప్పుడు రోఁతపుట్టియుండును. ఆమె తనభార్య యనుకొనుట కాతనికిఁ జాలనవమానకరముగ నున్నట్లు తోఁచుచుండెనేమొ! మిత్రులు వేడుకార్థమై శారదావిషయము తెచ్చిపెట్టినను నాతఁడు విసుఁగుతో నాప్రస్తావమే వదలుచుండువాఁడు. ఇందులకుఁ గారణము మాచదువరులకు విదితమే.

రమణిని మించిన మోహినీదేవి — అట్టి ప్రణయదేవత ప్రపంచమున నింక లేదని చంద్రమౌళీశ్వరుఁ డెంచియుండును.

అతఁడాయంగన నప్సరోంగన యట్లు భావించియుండును. ఆమె మనోహర కటాక్షమాలికా ప్రసారముల నాతఁడు తన జీవసస్యముల కాధారమగు నమృతవర్షమని తలపోసియుండును. ఆమె కేళీగృహ మమరావతియందలి యింద్రమందిర మని భ్రమించియుండును. ఆకులట సంయోగము స్వర్వేశ్యల వలని దివ్య సుఖానుభవ మహాభాగ్యమని యెంచియుండును. తన మరణానంతరమునఁ గూడ, స్వర్గసోపానముల నారోహించుట కాబంధకియే కేలూఁత యిడునని యా దుర్బలహృదయుఁడు నమ్మియుండును. ఈహేతువుననే కాఁబోలు నాతఁడొక్క నిమేషకాలమైన నాపాంసుల నెడఁబాయఁ జాలకుండెను. అతని జీవిక రమణిబ్రతుకులో నైక్యమందియుండెను.

ఇందులకు శారదాంబ యేమిచేయఁగలదు? ధనమీయక నిరాకరించు బల మాయబల కెక్కడిది? అనివార్యములగు నాతని దుండగములను నిరోధించుట కాసాధ్వీమణి కెట్లు సాధ్యమగును? తన ప్రాణనాథుని చైదములు నికృష్టములని, యా దయామయి యెట్లధిక్షేపింపఁగల్గును?

రమణి భోగమువారి చాన. ఆమె ననుసరించు మానవుఁ డభివృద్ధి నొందఁజాలఁడనుట నిజము. ఏమనుజుఁడైన నాయువతికి దాసుఁడై తన సర్వస్వము నామె చరణసరోజములకు సమర్పించి, చివరకాబిత్తరి తీక్ష్ణతరమగు విషపుఁగాటునకులోనై, యధఃపతితుఁడై పోవలసినదే. రమణి మనోజ్ఞమణిమండితమగు మహోరగమును బోలినది. ఉరగమునకు మనోరంజకమగు సుప్రశస్తమణి మస్తకమునఁ బ్రకాశించుచున్నను — దాని నిశిత

దంష్ట్రపరితలమున, నిగూఢస్థానములయందు విషకోశములున్నవి. అదియేమాత్రము మలిగినను దన ప్రచండవిషబిందువులఁ జింది, యెన్ని జీవములనో నిర్మూలింపఁగలదు. అమాయకురాలగు శారదాంబయీతత్త్వము నెట్లుగ్రహింపఁగలదు? ఒక వేళ గ్రహించినను దన విభుని మనఃఫలకమున నిర్భయముగ నెట్లు చిత్రింపఁ గలదు? ఆమె తొలుదొలుత నాథుని యాశయములఁ గనిపెట్టి తన ప్రశాంత వచనములచే సత్సంకల్పమే మానవులకు వాంఛనీయమనియు, నది మానవాభివృద్ధి కుత్కృష్టసుఖసాధనమనియు, మనస్సంయమనము చాలనిచో మానవు లున్నతిఁగాంచఁజాలరనియు, నాంతర్యమున విన్నవించుకొనెను. చంద్రమౌళీశ్వరుఁడును దాత్కాలికముగ నామె మనోద్దేశ్యము ననుసరించి మాటాడుచున్నను, గ్రియలో వెనుకఁబడుచుండెను. ఇప్పు డాదుర్భావాంకురము వృక్షమై — దృఢతర మూలముల చేతను, బలవత్తమ ప్రకాండమువలనను, శాఖోపశాఖాసంచయముతోడను నొప్పి, దుర్భేద్యముగ నున్నది. ఒక యబల— భర్తృభక్తిపరాయణ — కేవలకోమలశరీర — అమ్మహాశాఖ నెట్లు కదలింపనేర్చును?

చంద్రమౌళీశ్వరుఁ డిప్పట్టుననే నాటకసమాజమున కధ్యక్షుఁడయ్యెను. సిద్ధరామపురమున ధర్మోపదేశములఁ గావించుచు, జనహితకరకార్యములలోఁ దమమనస్సులఁ జొన్పి, హితకారిణీ సమాజమొక్కటి పనిచేయుచుండెనని మన మీవఱకే గ్రహించియుంటిమి. ఆ మండలిప్రతిభఁ గాంచి సైఁపఁజాలని యువకులు కొందఱొక కట్టైనిలిచి, తమ సంఘమున

'కానందమండలి' యను పేరుపెట్టుకొని మద్యపానము కూడదనియుఁ — బహువధ యావశ్యకమనియు — నతిచారము హితదాయకమే యనియు — నందందు బోధించుచు వ్యతిరేకభావమునఁ బ్రవర్తింపఁజొచ్చిరి. తన యాంతరంగికోద్దేశముల కా యాదేశములెంతయు ననుకూలించి యుండుటచేఁ, జంద్రమౌళీశ్వరుఁ డిష్టాగోష్ఠినుండుటకై, నిర్బంధరహితమైన యా సంఘమునఁ జేరికొనెను.

ఆనందమండలి సభ్యు లల్పకాలముననే యథేష్టముగ ధనముఁగూర్చుటకును, స్వార్థముఁ దీర్చుకొనుటకును, దగిన మార్గము నన్వేషింపఁ దొడఁగిరి. ఎన్నివిధముల నాలోచించినను నాటకప్రయత్నమునకంటె, నిందుల కుచితవ్యాపారము వారికిఁ దోఁపలేదు. వారీపూన్కినిఁ జక్కఁగ స్థిరీకరించుకొని, యా భారమును జంద్రమౌళీశ్వరునిపైఁబెట్టి, దానికాతని సధ్యక్షునిగా నెన్నుకొనిరి. ఆయున్నతపదవి లభించుటచేఁ జంద్రమౌళీశ్వరుఁడు చాలఁ బొంగిపోయెను. వలయునట్లు ధనార్జనముచేసి కుబేరులగుటకు నాటకకృషిని మించినది లేదనియు, నందువలన వేలకొలఁది యాదాయము గడింపవీలగుననియు, నాలాభమంతయు నధ్యక్షునకే చెందియుండుననియుఁ జెప్పి, చంద్రమౌళీశ్వరునిఁ గొండపైకెక్కించి, వేషధారులకావశ్యకములగు మండలదుకూలాదులకును, మంఁడప నిర్మాణాదికమునకును, జంద్రమౌళీశ్వరునుండి వందలకొలఁది నిష్కములనుగ్రహించి, యిచ్చకొలఁది వ్యయముచేయఁజొచ్చిరి. మఱియు నాతనిఁ దోడ నిడుకొని యందులకు వలయు పరికరములకొఱకుఁ, గలకత్తా

బొంబాయి మున్నగు నగరములకుఁబోయి, తిండి తీర్థముల క్రిందను — విలాసవైభవాదులక్రిందను — స్వేచ్ఛగా డబ్బు వ్యయముచేయించి, నిలువకుఁ గొన్నివస్తువులను మాత్రము కొనివచ్చిరి. చెన్నపురినుండి యొకచిత్రకారునిఁ బిలువనంపి, యాతనివలనఁ గొన్ని తెరలనువ్రాయించి, యా నెపమున మూఁడు వేలు వ్యయముచేయించిరి. ఇట్లామండలి సభ్యులు దుర్వ్యయములఁ దమపేరు సార్థక్యమొనరించుకొనుచున్నను, మహాశివరాత్రినాఁడు శ్రీరామపాదుకాపట్టాభిషేక నాటకమును బ్రదర్శించుటకు మాత్రము ప్రబలప్రయత్నముఁ గావించుచుండిరి.

చంద్రమౌళీశ్వరుఁ డమాయకుఁడు. అతఁడు మిత్రుల తియ్యనిమాటలకు లొంగిపోవుచుఁ, దన యున్నతాధికారపదవికిఁ దనియుచుఁ, బ్రకటన పత్రములలోని ముద్రిత స్వీయనామముఁ గాంచి మురియుచు, నానందించునేగాని — వేనకువేలుగా వ్యయమగు రూపికలమాటయే తలపోయుచున్నట్లులేదు. భోగవనితయగు రమణీకుటుంబమును నడుపవలసిన భారమునకుఁ దోడు, నాటకకార్యవ్యవహారమునుగూడ నిర్వహింపవలసి వచ్చుటచే, పైకమధికముగను నత్యావశ్యముగను వెచ్చింపవలసియుండెను. ద్రవ్యార్థ మాతఁడు దినమునకుఁ బలుసారులు దూత నింటిగడకుఁ బంపవలసివచ్చెను.

ఇంటనున్నరొక్కము వ్యయమైనది. నిగూఢస్థానమగు భూగృహమునందలి ద్రవ్యమునుదాఁకి శారదాంబ మాతులుని యాదేశము నతిక్రమించినపాపమున మఱుక నేరదు. నిజనాథుని వలన నింతధనము వ్యయమైన నామెకు విచారమావంతయును

లేదు. ప్రాణేశుఁ డెచ్చటనుండినను భౌతికసంపద నెంతవిని యోగించినను గలుగని వ్యాకుల మొక్కపర్యాయము భోజనార్థ మింటివఱకురాక నిలిచిపోవుటచేతను, దనకుముఖసందర్శన భాగ్యమైన నొసఁగకుండుటవలనను దటస్థమై, మహాసంశయమునకు మూలమైయుండును. మాతాపితలఁబోలు నత్తమామలకాలమృత్యువు నోటఁబడుటయు, నదిమొదలుగఁ బ్రాణేశ్వరుని దర్శనభాగ్యముఁ గూడ దూరమగుటయు, నాపరమసాధ్వి కమితవిచారముఁ గూర్చియుండును. ఆవ్యథచే నా నారీరత్నము చాలఁగ్రుంగిపోయి యుండును. ఆశీలవతి తనమనోవిషాదమును పైకిఁ జూపకుండినను లోలోన దుర్భరసంతాపకారణమునఁ జాలశుష్కించియుండును.

ఇరువదియవ ప్రకరణము

ఆత్మశోధనము.

శారదాంబ గృహాంతర్భాగమునందలి వసారాలో నిండు విచారమునఁ గూరుచుండియుండ, నామె యెదుట నొక యతీంద్రుఁడు సాక్షాత్కరించెను. ఆమె కాపురుషుఁడు క్రొత్త. తానీ వఱ కట్టిమహనీయునిఁ జూచియుండలేదు. కనుక నాయతి చూడామణి విరజానందస్వామియని యామె గ్రహింపఁజాలక

పోయెను. శారద దిగ్భ్రమపాటునఁ బైకిలేచి, విస్మయ వినయ భావగర్భితమగు నచంచలదృష్టితో నాపురుషమూర్తినిఁ దిలకించుచు నించుక వెనుకకొదిగి, భక్త్యావేశవివశయై స్వామి చరణయుగ్మమున వ్రాలెను. అట్టితఱి నాసాధ్వీమణి హృదయ సాగరమును సంక్షుభితమొనర్చెడు భావతరంగముల, నాయతి సత్తముఁడు గ్రహించియుండును. ఆపుణ్యపురుషుఁడు వాత్సల్య భరమున, శారదాంబా కోమల కర యుగళి నిబట్టి లేవఁదీసి యిట్లనెను.

"ప్రియపుత్త్రీ! నీవిచారకారణమును- గ్రహించితిని. ఐహికారామ సీమయం దొక విహంగమిథునము, మధుర ఫల భక్షణమున హాయి ననుభవించుచుండె ననుకొనుము. అందలి కపోతరాజమమృత ఫలమని భ్రమించి, విషఫలము నాశించిపోయె ననుకొనుము. అట్టిచో స్వసుఖసాధనాంతరముల నాలోచింప మఱచి, దుఃఖజలనిధిఁ దోఁగుచు, నొంటరియై వసించుచుంట కపోతికిఁ జెల్లునా?"

శారదాంబ యీ వాక్యముల నత్యంత భక్తిశ్రద్ధల తోడనే యాలకించెను. యోగివల్లభుఁడు నిర్హేతుకముగ నిట్లు సాక్షాత్కరించి, యిట్టి ప్రశ్నాశుగమును వెలివఱచుట యేలనో — అందెట్టి రహస్యముండెనో — శారదాంబ యూహింపఁజాలదయ్యెను. అందులకామె యేమియుఁ బలుకక మిన్నకుండెను. పరపురుషుల మోహిల నర్మగర్భితముగఁ బ్రీతి భాషణముల నెఱపుట — యాస్త్రీలలామ కలనైన నెఱుఁగదు; కాని యాతఁడు విరాగి. జ్ఞానవేత్త. ప్రియపుత్రీ యని మృదు

లముగ సంబోధించుటంజేసి పితృతుల్యుఁడవయ్యెను. కనుక నామె కొండొకతడవునకు సంశయముడిగి, సముచితముగ నిట్లు విన్నవించెను.

"తండ్రీ! కపోతరాజము విపినాంతరసీమల కరిగినను, చివర కదృశ్యమైపోయినను, దాని నన్వేషింప వెన్నాడుట కపోతికిఁదగును. తన ప్రాణప్రియాధిక మగుఁ బారావత చంద్రము, తానున్నవనముననే కష్టమో సుఖమో యనుభవించుట చూడఁగల్గినచోఁ, దాను నచ్చటనే యాఖేద మోదములలోఁ బాల్గొనుట, పులుఁగుపడంతి కేలధర్మమై యుండదు?"

"అంతకంటెను దనకనువైన రక్షకస్థానమునఁ జేరికొనుట పతంగికి భావ్యముకాదా?"

"మహాత్మా! ఏవిషయము నాశించి?"

"ఆత్మసుఖమును"

"స్వస్థలమునఁ బ్రాణప్రియుని తాత్కాలిక వియోగమునే సైఁపఁజాలని శకున్తి, స్థానాంతరమునఁ దన చిరవిరహతాపము నెట్లు చల్లార్చుకొనఁగలదు?"

"పరమేశ్వర భక్తికారణమున."

శారదాంబ యోగీంద్రులయంతర్భావమును గ్రహింపఁగల్గెను. స్వామి తన్నుద్దేశించియే యిట్టి ప్రశ్నాపరంపరల వెలివఱచుచుండెననియు నిశ్చయించుకొనెను. అందులకుఁ దానింతవఱకు నొసఁగిన యుత్తరములు సందర్భోచితములాయని వితర్కించెను. అనంతరమిట్లు విన్నవించెను.

"జనకా! నర్మగర్భితమగు మీయాదేశమునందలి పర

మార్గము బోధపడినది. ప్రాణేశ్వరునే తన సర్వస్వముగ నెంచి, యమ్మహాత్ముని కైంకర్యభాగ్యమునఁ దనబ్రతుకును సార్థక్య మొనరించుకొనఁదగిన సాధ్వికిఁ, బరమేశ్వరభక్తి స్థిరపడు టెట్లు?"

"పరమేశ్వరునకును బ్రాణేశ్వరునకును దారతమ్య మున్నదని తలంపవా?"

"మనఃపూర్వకముగఁ దలంతును. ఈశ్వరునకును బ్రాణేశ్వరునకును దారతమ్య మనంతముగ నున్నను, బ్రాణేశ్వరుని యందాసక్తిఁ గొని యున్నచిత్త మీశ్వరునివంక మరలఁజాలదు. చరాచర ప్రపంచమున కెల్లఁ బరమేశ్వరుఁ డధినాయకుఁడై యున్నట్లు, ప్రాణేశ్వరుఁడు కాంతకు నాయకుఁ డగును. తన యుపచారముచేఁ బ్రాణనాథు నలరింపఁజాలని యింతి, యాజగన్నాథు నెట్లు తనియింపనేర్చును?"

"పుత్త్రికా! నీవువచించిన దెంతయును ధర్మయుక్తము. అది యుత్తమభర్తలపక్షమున నన్వయింపఁ దగినది. తనమనోహారి హృదయసౌశీల్యమునైన నెఱుఁగఁజాలని యంతకాలము ప్రాణేశ్వరు నట్టిసాధ్వి యేని యెట్లుతనియింపఁజేయును?"

"మహాత్మా! భర్త యుత్తముఁడగుటకును బ్రమసి పోవుటకును బ్రాణేశ్వరిలోపమును గొంతవఱకుఁ గారణమై యుండఁగలదు? కేవల లోకానుభవమును సూక్ష్మజ్ఞానమును లేని ముగ్ధ, తన నాయకుని హృదయమర్మము నెఱింగి, యారంభముననే దుస్సంకల్పములనుండి నాథుని మరలించి యాతని మనోంబుజమును వికసింపఁ జేయుటలో నించుక యుపేక్షించినను, జివరకది యనర్థమై పోఁగలదు. అందుల

కాస్పదమైన కాంత, తనయుపేక్షకుఁ దగినవిచారమార్గముఁ బూర్తిగఁ గడవనిచో, సుఖసామ్రాజ్యము నెట్లు సుకరముగఁ బ్రాపింపఁ గల్గును?"

"అట్టి దుస్తరసహనకాసారము నీఁదఁ బూనుకొనుట కంటె, నమృతఫల మను భ్రాంతిచే విషఫలము నాశించి పోయిన కపోతరాజము, నుపాయాంతరముచేఁ దనవంక కాకర్షించుకొనుట సామంజస్యమై యుండదా?"

"అది సాహసము. దాని నా యాకాంక్షనుండి బలోచితముగ మరల్చుట యెట్టిపతంగికిని దుస్సాధ్యమే. ఆపారావతమా ఫలమునందలి తిక్తగుణము నెఱింగి, దానినుండి విరక్తిఁ బొంది మరలునందాఁక, నోర్మి వహించియుండుట కపోతికి భావ్యమగును."

"అవును. అట్టి శుభసంయోగము ప్రాప్తింపకమున్నె, తన్ను హరింపఁ బొంచియుండు, శ్యేనవిహంగముల యుపద్రవమునుండి యాత్మరక్షణముఁ గావించుకొనఁ జాలనిచో, నా శకున్తియాశ కేమిఫలము చేకుఱును?"

"మనోద్రఢిమగల కాంతల కిందువలన నెట్టి యుపద్రవమును గలుగనేరదు. ఒకవేళ వారట్టి నికృష్టదశకే పాల్పడవలసివచ్చినను వారి యాత్మరక్షణమునకు భద్రమార్గమున్నది."

"తల్లీ! అదెద్ది?"

"వారి యాత్మ నాథద్రమూర్తితో నైక్యమొనరించుటయే."

"పుత్రీ! అట్టి దారుణ కర్మమునకు సాహసింపఁ దగునా?"

"ఇది సాహసము కాఁజాలదనియు, వీరవనితల పరమ లక్షణమనియు మీరెఱుఁగఁ జాలరా? తండ్రీ! ఆనతిండు—"

"అమ్మాయీ! నీ పవిత్రోద్దేశముల గ్రహించితిని. ఉత్తమహైందవనారీమణులలో నీవు నొకరత్నమవు. మున్ముం దెట్టి ప్రమాదములకును గుఱికాకుండున ట్లాభద్రమూర్తి నీకుఁ దోడగునుగాక!"

విరజానందస్వామి యటనుండియంతర్హితుఁడై పోయెను. కాని యతీంద్రుల తేజోమయ స్వరూపము మాత్రమింకను శారదాంబా దృక్పథమున నిలిచియే యుండెను.

ఇరువదియొకటవ ప్రకరణము.

కన్నుండఁ గనుపాపతీసెను.

అది మధుమాసము. మధ్యదినములు గడచుచున్నవి. నాఁ డుదయకాలము మీఱినది. విభావసుఁ డంతరిక్షమున నడిమీధిని నిలిచి, వీతిహోత్రజ్వాలల ధిక్కరించు తన భీమగాంశుసంచయమున లోకమును దహించుచున్నట్లుండెను. వడగాడ్పు లతిశయించి జీవప్రకరమునకు దుస్సహబాధాకర ముగ దోఁపించుచుండెను. పర్వతగుహాబిలములఁ బవళించి గుఱకలువెట్టి నిద్రించుచున్న ఘాతుకవనసత్త్వముల భీకరో చ్ఛ్వాసములు విస్పష్టముగఁ దెలియవచ్చుచుండెను. ఒక చిన్న

పిట్టయుఁ దన కులాయమునుండి తలవెలికిఁజూప సాహసించుట లేదు. ప్రకృతియందలి ప్రాణివర్గ మాతీక్ష్ణాతపకారణమునఁ బ్రయత్నముల నుడిగి, యించుక విశ్రాంతినొందఁ దలఁచు చుండెను.

అట్టిసమయమున బలిష్ఠములగు రెండెద్దులుపూన్చిన యొకశకటము, కల్యాణగిరినుండి శేషనగరమునకుఁ బోవు మార్గమధ్యమునందలి నిమ్నోన్నత ప్రదేశములలోఁ గదలు చుండెను. ఆ బండిపై రెండుధనపేటికలుండెను. మనుష్యుఁ డొకఁడు చిన్నని ధవళవసనమును దలపైఁడిరోధానముగా వైచి కొని యందొక పేటిపైఁ గూరుచుండియుండెను. బండివెనుక నిద్దఱును బుర్రోభాగమున నిద్దఱును, భటులు రక్షకులై నడచు చుండిరి. రథికునితోఁజేరి మొత్తమున నార్గురు మనుష్యు లాశ కటముతోడ నుండిరి. తాపాతిశయముచే నాపాంథులశరీర మునఁ బొడమిన స్వేదజలము వారియుడుపుల దడిపివైచుచుం డెను. పాపము! వారాతీక్ష్ణకరమరీచివీచికలచేఁ గ్రాగికాగ్రి యలసిపోవుచుండిరి. ఆ దారుణమార్గమధ్యమున నించుక నీడ నొసఁగు వృక్ష మొక్కటియు నుండలేదు. అయిన వారలత్యంత కష్టముతో నట్లే ప్రయాణము సల్పుచుండిరి.

ఆసమయమునఁ గనుచూపుమేరలో నొక యాశ్వికుఁడు తమవైపువచ్చుచున్నట్లు శకటమునఁ గూరుచుండియున్న రాజ స్వభటుఁడు గ్రహించెను. ఆ యాశ్వికుఁడు క్రమక్రమముగఁ దమ్ము సమీపించుచుండెను. సమీపించుకొలఁది నాతని యా కృతి భటునకు విస్పష్టముగఁ దోచుచుండెను. అతఁడు పాద

ములకుఁ దొడిగిన నల్లని కాన్పూరు బూట్సు — మీఁగాళ్ళకు రక్షకముగ బిగించి చుట్టియున్న బాదమువన్నెగల పట్టెలు— మొలకుధరించిన తెల్లని యిజారు — కుఱుచని ధవళాంగ రేఖ— కంటియుద్ధముల జోడు — జరీతలపాగ — కటిప్రదేశమునందలి చర్మావలగ్నబంధమునుండి జీరాడు చంద్రహాసము — నావీర పురుషుని యున్నతాధికారమును సూచించుచుండెను. భటుఁ డాతనిఁగూర్చి శకటపాలకులకుఁ దెల్పి, దూరమునుండియే యాపురుషుని వారికిఁ గనఁబఱచెను. వచ్చుచున్న యాశ్వికుఁడు తమ యున్నతాధికారియని యెఱింగిన యాభటు లత్యంత సంభ్రమస్వాంతులై, తమయుడుపులను సవరించుకొనుచు, శకటమున నొక్కచోఁ జొప్పించియున్న తుపాకులఁ దీసి భుజాస్థలినుంచుకొని, లక్ష్యభావమున నడువఁ దొడఁగిరి. ఆశ్వికుఁడును దన వేగము నించుక హెచ్చించి, యనతికాలముననే వారిని గలిసికొనెను. భటులంద ఱొక్కమొగిని నాయకున కభిముఖులై సక్రమముగ నిలిచి వినయభావపురస్సరముగ నాతనికి గౌరవాభివందనముల నొనర్చిరి. ఆపురుషుఁ డావినతుల నంగీకరించి నందులకు సూచనగ — నెమ్మదిగ — శిరఃకంపనముఁ గావించెను. నాయకుని పరిచయ భాగ్యముఁ బొందిన యనంతరము భటులకుఁ గొంత నెమ్మదిగలిగెను. ఆతఁడు తమ పరిశీలనోద్యోగి కానికారణమున, నావఱకు వారియంతరంగమును బాధించుచుండిన భీతియుఁ దొలగెను. నాయకుఁడు మందగమనమున నశ్వమును నడిపించుచు, నాభటవర్గమునఁగల వయోవృద్ధునితో నిట్లుసంభాషించెను.

నా—ఓయీ! మీప్రయాణ మెంతవఱకు?

భ—దేవా! క్షేమనగరమువఱకు.

నా—మీమండల ప్రధాన స్థానమది యేకదా?

భ—చిత్తము. మేమీ ధనపేటికల నందలి ద్రవ్యాగారమునఁ జేర్పఁబోవుచున్నారము.

నా—నారాక సహితమచ్చటికే. మాది కర్నూలు మండలమోయి.

భ—బహుదూరము వేంచేయుచున్నారే?

నా—ఔను. రహస్యాపరాధ శోధనకార్యకారణమున మండలాంతరసంచారము పూనవలసివచ్చినది. మా ప్రాంతమున హత్యాపచారము గావించిన దుష్టులు కొందఱీవంకకుఁ బాఱివచ్చినజాడలు తెలిసినవి.

భ—దేవరవారెంతకాలముగ నిట్లు క్రిమ్మరుచుండిరో!

నా—రెండువారములు దాఁటెను. ఆదొంగముండకొడుకులు పట్టువడలేదు. తిరిగి తిరిగి ప్రాణము విసిఁగినదోయి.

భటుఁడు భావాంతరమగ్నుఁడై కొన్నిక్షణములు గడపెను. పిమ్మట నిట్లనెను.

భ—నాయల్పబుద్ధి కొక చిన్న యోచన తోఁచుచున్నది. దేవరవారికి సమ్మతమగునేని దానిఁ బాటింపవచ్చును. బోయకొండఁడు మామండలమునఁ బేరుపొందినదొంగ. వానికడ శక్తివంతమైన మూలికయొకటి యున్నది. మీరెట్లో పరిశ్రమించి యాదుష్టునిఁ బట్టుకొన్నచో, సమస్తము బయలుపడఁగలదు. ఇట్టి దారుణకర్మములకెల్ల నాచోరనాయకుఁడే

కారకుఁడు.

నా—మంచిది. వానియునికి?

భ—అది యగోచరముగ నున్నది. నిశ్చయముగ నది దుర్భేద్యమైనదే. దానిఁ దెలిసికొనుటకే ప్రయత్నమవసరమగు చున్నది. దేవరవా రొంటరిగఁ బ్రయాణము సల్పుచుండ లేదుగదా!

నా—లేదు. మాభటులింకను వెనుకనుండి వచ్చు చున్నారు. సేవకులు నాతోఁ గలిసికొనువఱకుఁ గొంత విశ్రాంతి నొందుటకును దాహబాధ తీర్చికొనుటకును మేము వేషములు మార్చుకొనుటకును ముందు మార్గాంతర మున్నదా?

భ—చిత్తము. మనమింకఁ బరుగు దూరముమాత్రము వెళ్ళినచో నొకపవిత్రమైన వనము వచ్చును. అందు దివ్య మైన కాసారమున్నది. స్నానపానములకును, బడలిక లడఁపు కొనుటకును; దేవరవారి కది మిక్కిలి తగియున్నది. మేము సహిత మచ్చటనే చల్లులారగింప సంకల్పించుకొని యున్నాము.

వారిట్లు సంభాషించుచు నడచి, కొండొక తడవున కావనముఁ జేరిరి. అది నింబ జంబూ జటీ వట మధు కామ్రికాది తరుసందోహసమాశ్రితమయి, విరాజిలుచుండెను. అందలి మహోన్నత మహీరుహశాఖలు విపులముగ — నతివిస్తృతముగ — నత్యంత నిబిడముగ — నెల్లమొదల నావరించి, మార్తాండుని ప్రచండమయూఖజాలము నంతరాళమున నవ రోధించి, మనోహర శీతలవాతపోతములను లోఁగొని మిగుల

నొప్పారుచుండెను.

రథసారథి శకటము నావనాంతర్భాగమువఱకు నడపి, యందలి సరోవర నికటమున దానినాఁపి, యెద్లనువిడచి నీరు దావించి, వాని నచ్చటి లేఁబచ్చికలో వదలెను. పిమ్మట నతఁడు చల్దిఁగొని కొలనిలోనికిఁబోయెను. రక్షకభటులెండలో నడచినడచి యాఁకలిదప్పులవలన మిగుల నలసియుండువార గుట, నాయకుని యనుజ్ఞవడసి, తమయాయుధముల నచ్చటి మాత్రిని మొదలనునిచి, భోజనార్థమేగిరి. నాయకుఁడు హయము నుండిదిగి, దాని చరమాంగభాగమునఁ దన దక్షిణబాహు వల్లికను వాల్చి, యొక్కింతవిలాసముగ నిలుచుండి, యల్లనల్లన వీతెంచు చలువపయ్యరవలని హాయి ననుభవించుచుండెను.

కొన్నినిమేషము లిట్లుగడచెను. నాయకునే పరిజనులు వనపరివేశము చేసిరి. రక్షకభటులును దమభోజనాదికములఁ దీర్చుకొని సరసినుండి తీరమునకువచ్చిరి. నాయకుఁడు నిజ సేవకులఁగాంచి యించుక రయోయారముగఁ గను గీఁటెను. అనుచరు లందుచే నేమిగ్రహించిరోగాని, రక్షకభటులు చూచుచున్నట్టే వారియాయుధములనెల్లఁ గొని, కట్టకట్టి, వారించిన నాగఁక వానిని సరోవరమునఁబాఱవైచిరి. ఏదియో మోసము తటస్థింపనుండెనని రక్షకభటులుగ్రహించి, దుడ్డుఁ గఱ్ఱలఁ జేఁగొని నాయకుని యనుచరులపైఁ బడి రణమొనర్ప సాగిరి. వెంటనే నాయకుఁడొక యీలవైచెను. తత్క్షణమే యెచటనుండియో మఱికొందఱు దృఢగాత్రులు సత్వరముగఁ బరుగిడివచ్చి, తమనాయకునివర్గముతోఁ జేరి, రక్షకభటులను

సారథిని మర్దించి, తరుప్రకాండములకు వారిని బంధించివైచిరి. అనంతర మాదుండగీండ్రు తమకడనున్న లోహసాధనములచే ధనపేటికలను బగులఁగొట్టి, యందలి నాణెములను ధనపత్రములను సంచులలోఁ గ్రుమ్మరించి, ముఖములఁగుట్టి, వానిఁ దురగముపైవైచి బిగించికట్టిరి.

ఇరువది రెండవ ప్రకరణము

త ల క్రిం దు లు.

ఒకనాఁటి యుదయమున శారదాంబ కోష్ఠమునఁగూరుచుండియందలిపేటికలలో ధనపత్రములేవేని యింకను శేషించియుండునేమోయని, వానిలోని వస్తుజాలమును విడఁదీసి చూచుచుండెను. అందొకపురాతనపుఁగాగితములసంచి యామెకుగోచరించెను. ఆమె దానిలోని లేఖలనన్నిఁటినిఁ జక్కఁగఁ బరిశోధించెను. చివర కందులోఁ దనకాసమయమున కనువగు ధనపత్రమొక్కటియు లభింపకపోయినను, ముప్పదిసంవత్సరముల నాఁడు వ్రాయఁబడిన, తనమగని జాతకపత్రముమాత్రము గోచరించెను. శారదాంబకు జ్యోతిషమునందలి ఫలభాగమునఁ గొంతవఱకు విశ్వాసమధికము. అందునను ముఖ్యముగ నది తనవిభుని జీవితఫలము; కనుక నామె యందలి విషయముల

నత్యంతకుతూహలముతోఁ బరికింపఁజొచ్చెను. అందీక్రింది విధమున నుండెను.

"శ్రీరస్తు — చిరాయురస్తు.

చి॥రా॥ చంద్రిమౌళి జీవితఫలము. అం॥శ ౧౮౮౫ వ సం॥రము మే నెల ౧౨వ తేది. పార్థివ సం॥ర, వైశాఖ కృష్ణ ౧౩ భౌమవాసరము. సూర్యోదయాది జన్మకాలఘటికలు ౧౧.

జన్మలగ్నము—కర్కాటకము. నక్షత్రము—రేవతి.

జననకాల బుధమహాదశ

సం॥రము ౧-౧౦-౩

కేతుమహాదశ ౭-౦-౦

శుక్రమహాదశ ౨౦-౦-౦

సూర్యమహాదశ ౬-౦-౦

చంద్రమహాదశ ౧౦-౦-౦

అనంతరము కుజమహాదశ —

చంద్ర కేతు	రవి కుజ బుధ	శుక్ర	శని
	రాశిచక్రము		లగ్నము
			గురు
			రాహు

జననకాల బుధమహాదశా శేషము సం॥రము ౧-౧౦-౩

౧ ఈజాతకమునందు సోదరభావము శ్రీగ్రహదృష్టమును శ్రీగ్రహాక్రాంతమును నగుటవలన, సోదరీవృద్ధి కలుగును. సోదరీస్థానాధిపతి పురుషగ్రహసంబంధియుఁ బురుషగ్రహావీక్షితుఁడు నగుటవలన, సోదరవృద్ధియు నున్నది. సోదరీమణుల కంటె సోదరు లధికసంఖ్యాకులు. సోద రాధిపతికిఁ బాపసంయోగ ముండుటకతన, సోదరనష్ట మొక్కింతయుండును.

౨ జన్మకాలము ననుసరించి ఘటికలు ౧౧ ను కర్కట లగ్న భుక్తి ఘటికలు ౧౦ యు నగుచున్నందున, జాతకునకు

శరీరచ్ఛాయ స్వచ్ఛముగా నుండును. జాతకుఁడు మృదుమధుర భాషణము—సాత్వికప్రకృతి—భూతదయాధిక్యము— వాగ్నైపుణము — బుధవర్యులయందు గౌరవాతిశయము — యోగ్య స్వభావము — గలిగియుండును.

3 బాల్యమునఁ బదునొకండు సంవత్సరములవఱకు శరీరసౌఖ్యమును — మిత్రవృద్ధియు — నానావిధాంబరాభరణ ధారణ — విద్యాభ్యాసాధిక్యమును — బుద్ధికౌశల్యమును — సనుదిన ప్రవర్ధమాన మగుచుండును.

౪ వయోగతవర్షములలో ౧౧ నుండి ౩౧ వఱకు శుక్ర మహాదశ యుండును. ఈకాలపరిమితియందు విద్యాకౌశల్యము— విద్యావృద్ధి—కళత్రసౌఖ్యము—నానావిధ వినోదాదరణము— గణితాదివిద్యలయందు బుద్ధికౌశల్యము — బహువిధ కలా భ్యాసము — కావ్యనాటకాదులయం దాదరాతిశయము — సంగీతాదులయందు సఖ్యాధిక్యము—విద్వాంసులతోడి నెయ్యము — మొదలగునవి సంభవమగును. జననాదివత్సరానంతరము పదునాఱేండ్లలోపల నుద్వాహము జరగును. వధూలలామ సద్గుణాలంకృతయు, నుత్తమకుల ప్రసూతయు, భర్తృ మనోనుకూల సంచారిణియు, నగును.

౫ పుత్రస్థానాధిపతి స్వక్షేత్రవర్తి. ఉచ్చగ్రహమిత్ర సంబంధి. ఇది మునుంగాక చంద్రాత్పుత్త్రాధిపబుధసంబంధ. కుటుంబస్థానమున గురుస్థితి. ఇందుచేత పుత్త్రపుత్త్రికాసంతాన సంజనితానందానుభవముగలదు. ఆసంతతి సద్గుణభూయిష్ఠముగ వర్ధిలును. సంతానసప్ట మించుకయున్నది.

౬ కర్మస్థానము తన్నాయకాక్రాంతము, నుచ్చగ్రహా క్రాంతము నగుటంజేసి, జాతకునకు వర్ణోచితగార్హస్థ్యధర్మములయం దనవరతాదరము — నాతిథ్యాదరణతత్పరత్వము దినదినాభివృద్ధి నొందును.

౭ సూర్యుఁ డుచ్చదశయం దుండుటచే స్వార్జితధనము సమృద్ధిగనుండును. కాలభేదానుసారముగాఁ బితృసంబంధము— శతృసంబంధము — మిత్రసంబంధము నగు ధనము లభ్యమగును; మఱియు స్వార్జితద్రవ్యమును నైశ్వర్యాతిశయమును బుద్ధికౌశల్యమును సర్వజనగేయ ప్రవృత్తియుఁ గలిగియుండును. ఇందులకుఁ బ్రమాణములు బృహజ్జాతకము, చంద్రయోగాధ్యాయము కర్మజీవాధ్యాయముల యందుఁ జూడనగును.

౮ వ్యయస్థానము పాపాక్రాంతము. వ్యయనాయకునకు శుభపాపసహచరుఁడు గాన నీ జాతకున కాదాయమున కంటెను వ్యయమల్పమైయుండును. ధర్మకార్యములమునను, శుభకార్యముఖమునగాక, దుర్వ్యయ మెన్నఁడును గలుగనేరదు.

౯ కర్మస్థానము బలయుక్తమును శుభగ్రహ గురు నిరీక్షితమును గర్మాధిపతి బలయుక్తుఁడును నగుటంజేసి, జాతకునకు గంగాదిపుణ్యక్షేత్ర సేవయు, నిత్యకర్మాచరణతత్పరత్వమును ననవరత మధికమగుచుండును.

౧౦ లగ్నాధిపతియగు చంద్రుఁడు క్షీణగాత్రుఁడు గనుక, జాతకుని శరీరమల్ప బలయుక్తమయి, సౌకుమార్యాధి

క్యమును మార్దవాతిశయమును గలిగి యుండును.

౧౧ జననాది వయస్సున ౩౦ నుండి ౩౬ వఱకుఁ గల మధ్యవయఃకాలమున బుత్త్రి పుత్త్రికా సంతానసంభవానందరసానుభవముచే, మనోహర్షముదయించి పెంపొందును; మఱియు నీసందర్భమున శరీరారోగ్యము — భాగ్యాభివృద్ధి — శుభకార్యాచరణము — ధర్మకార్యానురక్తి—గౌరవాతిశయము — రాజావలంబనాధిక్యము — మున్నగు శుభఫలప్రాప్తి యుండును.

౧౨ కుజమహాదశయం దధిక పుణ్యకార్యసంసిద్ధియు, భోగాతిశయమును నగుట నిస్సంశయము — కర్కాట లగ్నములో నల్పభుక్తియైనను, జన్మకాలము ననుసరించి ఫలము వ్రాయఁబడెను.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ. ,,

శారదాంబ జాతక పత్రిమునందలి ప్రతివిషయమును, హృద్గతముగఁ బెక్కుతడవలు పఠించి, యనంతరము దానిని మడచి కోశముననుంచి, యథాస్థానమునందుఁ జేర్చెను.

ప్రథమాంశమున సోదర సోదరీ వృద్ధియని యున్నది. సోదర నష్టముకూడ నిరూపింపఁబడినది. అత్తగారికి నాపాణిప్రియుఁడొక్కఁడు దక్క నన్యసంతతియే లేదు. ఇందు సోదర వృద్ధియు నష్టమును సంభవము లగుటెట్లు?

జాతక సిద్ధాంతము చొప్పునఁ బదునాఱేండ్లకు లోపల నుద్వాహకర్మ నడువవలసియుండెను. అదియు లభ్యమయి

యుండలేదు. సప్తమాంశమున స్వార్జితధన సమృద్ధియు, సర్వజనగేయ ప్రవృత్తియుఁ జూపఁబడినవి. వారి యందివి రెండును బూర్ణముగ విఫలములే.

ఆదాయమునకంటె వ్యయ మల్పమనియు నదియు, సత్కార్యముల మూలమునఁ గాక దుర్వ్యయ మెన్నఁడును గలుగఁ జాలదనియు, నష్టమాంశమునఁ బ్రతిపాదింపఁబడినది. పై విషయములవలె నిదియు నిరర్థకమేయైనది.

జాతకఫలరీతిని విద్యాకౌశల్యము — బహువిధ కలాభ్యాసము — కళత్రసౌఖ్యము — విద్వాంసులతోడి నెయ్యము — వారికిఁ గలుగవలసియుండెను. ఇది వర్తమాన ప్రత్యక్షగోచర విషయము. ఆహా! ఆ దైవజ్ఞుల ఫలసిద్ధాంతము లీచందమునఁ దలక్రిందులయి యున్నవేమి?

ఇట్లు శారదాంబ చాలసేపు వితర్కించుకొనుచుండెను. ఇంటి నడవనుండి యామె కేదియో పదశబ్దము వినవచ్చెను. వెంటనే యామె పెట్టెకుఁ దాళమువైచి యటనుండి కదలి, భవంతిలోనికి వెళ్ళెను.

ఇరువది మూఁడవ ప్రకరణము.

బ్రతుకు గోడ్డేరయ్యెను.

తత్క్షణమే శారదాంబ మ్రోల నొక స్త్రీస్వరూపము నిలిచెను. అపరిచితయగు నావిగ్రహమునుగాంచి, యామె ఱిచ్చపడెను. కృష్ణవర్ణయు స్థూలశరీరయు విగతకంచుకయు నగు నా నూతనకాంత, శారదాంబ యపూర్వరూప ధారణమును, మనోజ్ఞశోభాతిశయమును గాంచి, విస్మయభరితహృదయయయ్యెను. ఆమె యెవ్వరు? అనాహూయముగ నిర్భయముగ నిట్లు లోనఁబ్రవేశించిన దేల? శారద యుత్కంఠితయై యానూతనస్త్రీవంకఁ జూచుచు, నిశ్చలముగ నిలుచుండెను. "నాపేరు సీత. నేను వైష్ణవిని. శారదా! నీవు నన్నెఱుంగవా?" ఇట్లు పలుకుచు నా స్త్రీమూర్తి యట్టహాసమొనరించెను.

ఈమె సీతయైనది మాకుఁ దెలియదు. సీత నూతన స్త్రీ కాదు. ఆమెను మేమెఱుఁగుదుము. పౌరులు నామె యద్భుతవర్తనము గమనించియే యున్నారు. మా చదువరులకు మాత్ర మింతవఱకు నామె పరిచయప్రాప్తి యొదవి యుండలేదు.

సీత సిద్ధరామపురవాసుఁడగు తాతాచార్యుని తనయ. రెండేండ్ల యీడుగల వరునితో నామెకు సంవత్సర ప్రాయముననే, తొట్లలో మురిపెముగాఁ బెండ్లిజరగెను. పిమ్మట నాలు నెలలకే మగఁడు కాలముచేసెను. నాఁటి కామెకుఁ

దిన్నగ మాటలు వచ్చియుండలేదు. ఆమె చక్కఁగా నడువ నేర్చియు నుండలేదు. వరుఁడననేమో పరిణయమననేమో యాకెందున కేమియుఁ దెలిసియుండలేదు. అట్టి సమయముననే వివాహము నడచెను. భర్తగతించెను. అన్నిముచ్చటలు సంతరించెను. తరువాత జీవితకాలమంతయు నామె వైధవ్యవృత్తి నందవలసినట్లు శాసింపఁబడెను. అయినను దుఃఖానుభవమును బొందక యామె నిర్విచారముగ నానందాతిశయముననేకాలముఁ బుచ్చుచుండెను. ప్రథమవివాహ మాయువతికిఁ దెలిసియుండకపోవచ్చును; కాని నవయౌవనప్రాయమునఁ దా నాంతర్యముగ — మనఃపూర్వకముగ జేసికొన్న యుద్వాహము లెవ్వరికిఁ దెలియకుండును? ఆ నడివయస్సున నామె సల్పిన శిశుమేధకర్మముల నెవ్వ రెఱుఁగకుందురు? ఆవిషయమునఁ దనవంటి జవరాండ్రకెల్ల సీత మార్గదర్శినియయ్యెను. ఆమెను సందర్శించుటయు నామె ప్రాపునపేక్షించుటయు, నెవ్వారికేని యంత దుర్లభముగనుండి యుండలేదు. ఆశ్రితజనుల యభీష్టముఁ దీర్చుటకై యెప్పుడు నామె బద్ధకంకణయై యుండెను. ఇది యామె పూర్వగాథ.

నేఁటి సీతకథ వేఱు. ఇప్పుడామెచరిత్రయందు నూతన పరిణామములు పొడసూపినవి. ఆయువతిని మునుపటివలె లఘువృత్తి నారయుటయుఁ, జనవు మెయిఁ బలుకరించుటయు, నెవ్వారికిని సాహసకార్యమే యగును. యౌవనచాపల్యకారణమున నాకాంత యింతవఱ కెవ్వరికి దాసత్వ మొనరించియుండెనో, వారందఱు నామెకే చరణదాసులు కాఁదగిన కాల

మిప్పుడు పట్టినది. నేఁడే పురుషుఁడును — నామెను దేఱిపాఱఁ జూడ సాహసింపఁడు. ప్రమాదవశమున నెవ్వఁడేని, నామెవంకఁ బరిహాససూచకదృష్టినిసారించెనా, ఉత్తరదివస మాతఁడేస్థితి ననుగమించునో చెప్పలేము.

ఈ సీత యెవ్వరు? భోగైకతత్పరుఁడును — భాగ్యాధినాథుఁడును — నిగ్రహానుగ్రహ దక్షుఁడును నగు చిన వీరశర్మ కాత్మీయసఖి — బహిఃప్రాణము — గృహ నాయకురాలు. అతని యాంతరంగికోద్దేశ్యములఁ గార్యరూపమునకుఁ దెచ్చి, తనమాయమర్మములచే వానిని ఫలోన్ముఖమునకుఁ ద్రిప్పఁ జాలిన చతురురాలు. దుస్తరతంత్రములనైన నవలీల భేదింపఁ గలది. "ఈ మాయమర్మముల నీమె యెట్లునేర్చినది? ఇట్టి యద్భుతశక్తి యీమెకెట్లు కలిగినది?" అని మనము వితర్కింప నవసరములేదు. ఇందులకుఁ గారణభూతుఁడు చినవీరశర్మయే. అతఁడే యీమె కాదర్శస్వరూపుఁడగు గురుఁడు.

పాపము శారదాంబ కీచిత్రచరిత్ర యెట్లు తెలియఁ గలదు? ఎవరుచెప్పఁగలరు? ఆమె భవంతినడుమ నొకకంబళము పఱచి, "నేను మిమ్మెప్పుడును జూచియుండలేదు. దేవీ! కూర్చుండుఁడు. అయ్యో! ఈ నిర్భాగ్యురాలి కుటీరమున కేల విచ్చేసితిరి?" అని ప్రసన్నభావమున ననుతాపపూర్వకముగఁ బలికెను. సీత పకాపకనవ్వుచుఁ గూరుచుండెను. శారదయు నామెసాన్నిధ్యమున నాసీనురాలై తన యపూర్వభక్తి పూర్ణోద్గారమును వెడలించెను. పిమ్మట వారిట్లు సంభాషింపఁజొచ్చిరి.

సీ—భాగ్యముతో మాకావశ్యకము లేదు. బాంధవ్య

మవసరమై యున్నది. ప్రపంచమున స్నేహ బాంధవ్యమును మించినది మఱేద్దికలదు? శారదా! నేను దాని నపేక్షించియే నీ కడకువచ్చితిని.

శా—అమ్మా! అభాగ్యురాండ్ర సంసర్గముతో మీ కేమి ప్రయోజనము?

సీ—స్వప్రయోజనార్థము నేనియ్యెడకు రాలేదు. శారదా! నీపురోభివృద్ధినిఁ గాపాడవచ్చితిని.

శా—మీనిర్వ్యాజ కరుణాకటాక్షవీక్షణముచే నన్ను ధన్యతనొందింపఁదలఁచి వచ్చితిరా? తల్లీ! ఏవిషయమున?

సీ—సంభవింపనుండు కష్టములనుండి నీకు విముక్తి కలుగవలసిన విషయమున.

శా—మీరు నాయాత్మేశు నేమఱియుండలేదుకదా?

సీ—ఆవిషయమనంతరము చింతింపదగినది.

శా—అయినచో నారక్షణమునకే ప్రపంచమునఁ గారణమగునదేది?

సీ—సౌందర్య శోభాసమన్వితమగు నీమృదుశరీరము.

శా—(విస్మయాత్మకయై) అదెట్లు తల్లీ!

సీ—ఆవివరమును దెలుపుటకుముందు నీకు నాయందు గాఢాభిమానము గలదని నేను విశ్వసించుటకై, నాకెద్దియేని సమర్పింప నీవు సంసిద్ధవై యుంటివని భావింపవచ్చునా?

శా—అయ్యో! అట్లనుచుంటిరేల? కులదేవతానీకము నకంటెఁ బవిత్రవంతముగ నెన్నఁడు మిమ్ము నారయఁ గంటిమో నాఁడే మాసర్వస్వమును మీచరణ సరసిజములకు సమర్పింపఁ

బడెనుగదా? మీరీయర్థమునే మఱచియుండిరా?

సీ—శారదా! వినుచున్నావుకదా నీవిభుని వృత్తాంతము? ఆఁత డొకానొక కులటకు వశుఁడై, కులస్త్రీని—నిన్ను—సరకుగొనక, యెట్టియన్యాయముఁ గావించుచున్నాఁడో చూచుచున్నావుకదా? ఆ నిర్భాగ్యుని కారణమున నీధనము పోయెను. ధాన్యము పోయెను. సమస్తవస్తుజాలము పోయెను. పెద్దల నాఁటి నుండి సమగ్రవిభవములతో — నశేష సంపదలతోఁ —దనరారుచుండిన యీదివ్య భవనము, నేఁడు పాడుపడిపోయెను. ఇఁకేమున్నది? నేఁడో రేపో దీనిఁగూడ నెవ్వరికో నాలుగు రూకలకు విక్రయించి, చివర కింటిపేరైన లేకుండఁ జేయుటకు సంసిద్ధుఁడై యున్నాఁడు. నీవప్పుడు నిలువనీడయైన లేక కడగండ్లపాలు గావలసివచ్చును. బిడ్డా! నీ వాజారశిఖామణిని విశ్వసించుచుండుట లేదుకదా?

శా—(విభ్రాంతయై) ఆహా! ఎంతమాటాడుచున్నారు! నా ప్రాణేశుని యంతర్భావము మీకుఁ దెలియకపోవచ్చును; గాని నాకుఁ గ్రొత్తకాదుకదా? అది నూతననవనీతమును బోలినదని నేను చక్కఁగా గ్రహింపఁగల్గితిని. అట్టి స్థితిలో వారిని సక్రమ పథమునకుఁ దిప్పుట కష్టసాధ్యమైనకార్యము కాదు.

సీ—అయ్యో! నీవెంత యమాయకురాలవు! విషము నమృతముగ భావించి చరించునంతకాలము సుఖముండునని నిశ్చయించుకొంటివా?

శా—నాజీవితేశుని మీరు చూచియున్నట్లు లేదు.

వారు ముఖముననమృతము దోఁపఁజేసెడు విషకుంభమువంటి వారుకారు. వారిహృదయకలశము సుధారసపూరితమైనదే. అమృతము చెడనిపదార్థము కదా? దేవీ! మాకివి చీఁకటిదినములుకావచ్చును. అయిననేమి వెన్నెల రాత్రు లిఁక నెన్నఁటికిని రాజాలవా? చెప్పుఁడు.

సీ—అమ్మాయీ! చంద్రమాళీశ్వరునిఁగూర్చి నీవు నాకేమియును జెప్పవలదు. అతని పుట్టుపూర్వోత్తరముల నెల్ల నే నెఱుఁగుదును. అతనిస్థితి యీవలఁ జాలవిషమించినది. ఆవృత్తాంతమేదియును నీకుఁ దెలిసియున్నట్లు లేదు. చంద్రమాళీశ్వరుఁడిప్పుడు జనవిరోధనమునకుఁ బాల్పడినాఁడు. కాలము తలక్రిందులుగ నున్నది. ఏవేళ నేమిపొసఁగునో యెవ్వరెఱుఁగుదురు. చీఁకటి గడుపకమున్నె — వెన్నెలరాత్రులు రాకపూర్వమే— చంద్రుఁడుదయింపకుండగనే — ఎట్టిపరిణామ ముత్పన్నమగునో నీకుఁ దెలియునా! వెఱ్ఱిదానా! నీవాతనిని నింకను నమ్మి యిట్లు నిరీక్షించి యుండుట మేలుకాదు.

శా—(విస్మయస్వాంతయై) చెప్పుము చెప్పుము! అమ్మా! ఏమిసంగతి?

సీ—ప్రమాదకర విషయములు పొడమ నున్నవి. నరహత్యలు జరగవచ్చునేమొ. అల్పదినములలోనే భయానక కృత్యములు సంభవింపవచ్చునని తోఁచుచున్నది.

శా—(భయభ్రాంతయై) అట్టి ప్రమేయ మేమి ఘటిల్లినది? ఎవరిమూలమున?

సీ—ముఖ్యవిషయములను సూక్ష్మీకరించి చెప్పితిని.

రహస్యములను వెల్లడించితిని. అందుమీఁద సర్వమును నీవే గ్రహించుకొనుము. వానిని వివరించుటకు సమయమానుకూల్యముగలేదు. ఈ యింట నొంటరిగనుండుట నీకెంతమాత్రము శ్రేయస్కరము కాదు.

శారద యోజనాపరవశయై యున్నకుండెను.

సీ—పుట్టినింటికి వెళ్ళుటయుచితమని నీకుఁ దోఁచుచున్నదా?

శా—అందులకు సాహసింపఁజాలను. ఈదుస్సమయమున నే నచ్చటికి వెళ్ళుట యుక్తముకాదు.

సీ—నీవిఁక నీమగనియాశవదలి నీయుద్దేశమును మార్చుకొనఁగలవా?

శా—ఎట్లు! కర్తవ్యమేమి? అనతిండు.

శారద సతృష్ణనేత్రములతో సీతను జూచుచుండెను.

సీ—మంచిది. నీవు చినవీరశర్మ నెఱుఁగుదువా?

శా—విన్నాను; కాని వారినిఁ జూచియుండ లేదు.

సీ—ఈయూరిప్రముఖులలో ముఖ్యుఁడు. ఐశ్వర్యసంపన్నుఁడు. నీకిష్టమున్నచో నాతనియింట నిర్భయముగ నుండవచ్చును. వలయునేని నేనిందులకుఁ దోడుపడెదను. ఆలెని కుపపత్నులెందఱోయున్నారు.

వినిర్మలమగు శారద మనోదర్పణమున కీ తుదివాక్యముచే నించుక సంశయకాలుష్య మంటెను. సీత వాక్యములలోనేదియో గూఢోద్దేశ ముండునా? పాపమామె యేమిచేయఁగలదు? తన ప్రాణనాథుని దుస్థితినిఁ దలంచుకొని మఱింత

ఖిన్నవదనయయ్యెను.

సీత మరల నిట్లనియెను.

"చక్కఁగా యోచింపుము. నీచే నయిష్టకార్యమును జేయించుట నాకిష్టముకాదు; కాని కష్టమునుండి తొలఁగుట కుపాయముఁ జూచుకొనుట నీకావశ్యకము. నీవిషయమును దలపోయుకొలఁదిని నాకుఁ జాలవిషాదము పొడముచున్నది. ఆహా! నీవంటి సౌందర్యరాశి కీనికృష్టదశయా! స్వర్ణసన్నిభమగు నీశరీరమున నేఁటికొకతోడవైన లేకపోయినదా? ఇట్లుచేసిన యాకాముకీసంగమశీలుఁ డెంతనిర్దయుఁడు. అత్యంతభాగ్యుని మహామేరువునువోలె నమ్మియున్న నీవెంతముగ్ధవు! బిడ్డా! ఈకాసులపేరుచూడుము. ఇది యెంతవిలువగలదియో గమనించుము. వలయునెడల నీవు దీనిని దీసికొనుము. చినవీరశర్మ గృహమున నిట్టి వెన్నియోయున్నవి. నీచిత్తమునకింపగు నాభరణములను, రమ్యములగు నమూల్యకౌశేయాంబరాదులను, ధరింపవచ్చును. అచ్చట నీకెట్టికొఱంతయు నుండదు. నీవాగృహరాజ్యమున సర్వాంగభూషితవై, మహాధనలక్ష్మిచందమున నాయకుని వక్షమునఁజేరి, నానావిధవిషయాభిరతులఁ దేలి, మహత్తరకామసౌఖ్యములను దనివితీఱ ననుభవింపవచ్చును. అట్టి నీయెలజవ్వనము నొకానొక యభాగ్యునకై వ్యర్థముసేయఁ బూనఁదగునా? విభుఁ డెట్టివాఁడో నేనెఱుఁగను. అంతమాత్రమున నాజీవితమును దుఃఖమయముగ నొనర్చుకొంటినా?

శారదాంబకు సంశయము హెచ్చెను. ఈవాక్యము

లాయె సుకుమారహృదయమున నాఘాతమొనర్చెను. సీత యేదియో మోహజాలము పన్నుచుండెనని యెంచెను. అందుల కామె గాఢవిషాదపరితప్తస్వాంతయయ్యెను. తననాథుని విషయమై సీత చెప్పినకథయుఁ గల్పితమగునని తలఁచెను. "ఆహా! సీత నధోలోకమునకంటఁ ద్రొక్క నున్నదా? ఈశ్వరా! తండ్రీ! ఈమె యుద్దేశమేమి! ఇది యత్యంతానర్థదాయకకృత్యమనియు, మిక్కిలి యపవిత్రకర్మమనియు, నీమెకుఁ దెలిసియుండలేదా? తెలిసియు నీపాపోద్యమమున కీదేవి మనఃపూర్వకముగఁ బ్రయత్నించినదా? లేనిచో ననుఁ బరీక్షింపఁగోరి యిందులకుఁ గడంగినదా? ఈభయంకర శోధనము నుండి నన్నెట్లు తప్పించెదవు తండ్రీ!" శారదాంబామానసికతలమున నిట్టి గాఢవితర్కము లావిర్భవింపఁ జొచ్చెను. కొన్ని నిమేషముల కామె యిట్లనెను.

"తల్లీ! నామానసికతలమున నిట్టి కిల్బిషోద్దేశశరముల నేలచొప్పింపఁ బ్రయత్నించుచుంటిరి? ఐహికతుచ్ఛభోగవర్ణనమున కింతతడవేల వ్యర్థముచేసితిరి? ఈదుర్భావములు స్మరగార్హములు కావని మీకుఁ దెలిసియుండియు, నిట్టి యనర్థభాషణజ్వలనమున మీయమూల్యకాలము నేల దగ్ధముచేసితిరి?"

సీ—(వ్యంగ్యపూర్ణమగు మందహాసముఁ గావించి) ఐహికభోగములు తుచ్ఛములైనప్పుడు వాని ననువర్తించు తలఁపులును దుచ్ఛములే కానిమ్ము; దానికేమి.

శా—అమ్మా! కినియవలదు. ఉత్కృష్టవిషయములఁ గూర్చి మీమ్రోల నల్పముగ మాటాడ సాహసింపఁ గడఁగుదు

నేని, యీంవులకు నన్ను క్షమింతురా?

సీ—శారదా! చెప్పుము — నీవు చెప్పవలసిన దంతయును జెప్పుము.

శా—దేవీ! ఈదేహము పరమేశ్వరుని దివ్యమందిర మనియు, నం దంతర్వ్యాప్తమైయుండు హృదయ మాయునకుఁ బీఠమనియు, నది యెప్పుడును బవిత్రముగ నుండవలయు ననియు, లేనిచో నీశ్వరశక్తి యందుఁ బ్రవేశింపఁజాలదనియు, మన మీశ్వరశక్తినుండి తొలఁగి చరింతుమేని తప్పక వినాశము నొందుదుమనియు, మీరెఱుంగుదురు కదా? అమ్మా! మన వినాశమునకుఁ జిత్తము నిమ్నగామియగుటయే కదా కారణము? దాని యధఃపతనమునకు దుశ్చింతయే హేతువు. ఇది మిగుల ననిష్టదాయకమైనది. పాపములకుఁ బునాది కామ క్రోధాది శత్రుగుణములకు మూలబీజము. అమ్మా! ఇవి నా పలుకులుకావు. పెద్దలిట్లు వచించియున్నారు. అది చాల భయానకమైనదనియు నుడివియున్నారు. దుఃఖకారకమగు నిట్టి దుశ్చింతనుండి మరలి, సత్సంకల్పములచే హృదయశుద్ధిఁ గావించుకొని, పరమేశ్వరశక్తిని సంపూర్ణముగ నందుఁ నెల కొల్పుకొనఁ బ్రయత్నించెడు మానవజాతి ధన్యమైనదికదా?

సీ—వెఱ్ఱిదానా! ఈ యనుభవగహితవాక్యముల నేల నేర్చుకొంటివి? కామిగాక యెవ్వఁడును మోక్షకామికాఁడన్న జనవాక్యమును వినలేదా? కామమును శత్రుగుణములలోఁ జేర్చి యిప్పుడే దానిఁ దిరస్కరింపఁ జూచుచున్నావా? ఎంత పొరబడితివి. కర్మజీవులకుఁ గామము నైజగుణమగుచున్నది.

అదిలేక లోకమున కానందములేదు. అభివృద్ధియు లేదు. సమస్తజీవజాలమునందును స్త్రీపురుషభేదమును గల్పించి పరమేశ్వరుఁ డీయద్భుతగుణమును వానిలో నెలకొల్పి యందు మూలమున జగత్తును నడిపించుచున్నాఁడు. యోగినులకును సన్న్యాసినులకును నుండఁదగిన నిష్కామకత్వము నిప్పుడే నీవు పూనఁదలఁచితివా? అయినచో, నది నీశ్రేయోభివృద్ధి కెంతమాత్రమును గారణము కాఁజాలదు.

శా—అమ్మా! క్షమింపవలయును. ఇంద్రియభోగ పరాయణత మానసిక తేజమును సంపూర్ణముగ నశింపఁజేయు ననుట సిద్ధము. భోగాభిలాషలను దృప్తినొందించుట యాత్మ విజయమున కెంతమాత్రమును సాధనముకాజాలదు. కామ మన్నచో నాత్మకుఁ బరమశత్రువు. దానిని సహజగుణముగ బరిగ్రహించిన ప్రాణి యున్నతినందఁజాలదు. సమస్త జీవులయందును స్త్రీపురుషభేదమును గలుగఁజేసిన యాప్రే మైకధాముఁడు, వాని కమూల్యమగుఁ బ్రేమగుణమును బ్రసా దించియున్నాఁడు. తన్మూలముననే స్త్రీపురుషవ్యక్తుల కానం దము జనించుచున్నది. మీ రీప్రేమమునే కామమనివాడితిరి. కామ మసురగుణము. అది చాలభయంకరమైనది. దంపతుల నెడలించునది. కుటుంబములకుఁ గుటుంబములనే కూల్చునది. వంశముల నంతరించునది. ఒక్క కామగుణప్రేరితుఁడగుటచే రావణుఁడు రణస్థలిని సబాంధవముగ నిర్మూలమందెను. దేవ గురుని సతి — యహల్య — యీదుర్గుణము నారాధించుట చేతనే, సర్వసుపర్వగణసమక్షమున మహాపరాభవమునకు

లోనై, చివరకు శాపగ్రస్తమై భూతలమునఁ బడిపోయెను.

సీ—అయినచోఁ బ్రేమమునకును గామమునకును భేదమును సూచింతువా.

శా—(విస్మితయై) దేవీ! మీ రావిషయమును గూడ నానుండియే చెప్పింపదలచుట నాభాగ్యమని భావింతును. నిష్కళంకభావమునఁ దననాథుని నానందింపజేయుట ప్రేమమును బరనాథునివలచుట కామమును, నగుచుండును. స్వవిత్తము సద్వినియోగముఁ జేయుట ప్రేమమును బరధనమును గాంక్షించుట కామమును నగును. కామము, క్రోధలోభమోహమద మాత్సర్యాది దుర్గుణసంజాతమున కూఁత. మనోహర సుందరారామసీమలను మరుభూములకు మార్చునదియు, నమరసంకాశుల నసురగణమునఁ జేర్చునదియు, మనశ్శరీరాత్మలను గలుషితమొనరించునదియుఁ, బవిత్రమును ద్రోలఁగఁ దీసి మనఃపీఠమునుండి పరమేశ్వర తేజమును దూరముగావించునదియుఁ గామమే. అది ప్రళయాగ్నికంటెను భయానకమైనది; కనుకనే సర్వవినాశకర కర్మమైయున్నది. ప్రేమ మట్టిది కాదు. దయాదిసద్గుణముల కది మాతృమందిరము. భీకరములగు శ్మశానవాటికలనుగూడ, సుందరతరోద్యానములకు మార్చును. ఘోరనరహంతకులకును సహితము దేవసదృశుల గావించును. భగవానుని యద్భుతశక్తిని హృదయతలమున బంధించును. వినిర్మలస్వర్గానందమహిమను భూతలమునఁ బ్రతిబింబితమొనరించును. మర్త్యులకు దివ్యశక్తిని బ్రసాదించి నిత్యానందపదవిని వారికిఁ జేకూర్చును; కావున విషయవాంఛ

లనుండి తొలఁగి, కామమును బూర్ణముగా దహనముగావించి, కఠిన నియమములకులోనై, భోగేచ్ఛవలనఁ గాక, నిష్కల్మష ప్రేమభావమున — సపత్యోత్పాదనార్థము — భర్తను రమింపఁజేసి, యమ్మహాసీమునినుండి యుత్తమసంతానభాగ్యము నువడసి, నిర్మల జితేంద్రియ సమన్వితలై, యే తరుణి రాణించునో యామెయే ధన్యురాలు.

సీ—నీవు స్త్రీజాతియందొకానొక చిత్రస్వభావము గల దానవుగాఁ గన్పట్టుచున్నావు లోకమున నిట్లుండుట నే యువతికి సాధ్యము? స్త్రీలందరును గామవివర్జితస్వాంతలుగ నుండుట సంభవమా? శారదా! చెప్పుము.

శా—అట్లుండుటయే యుత్తమజాయాలక్షణము. కొందఱు స్త్రీ లట్లుండ లేరు. వారు కేవల రజోగుణప్రధానములగు నాహారపదార్థములను గోరితినుచుఁ, గామప్రకోపమునకులోనై పశువులవలె వర్తించుచు, నదియొక విలాసమనుకొని యానందించుచు, నా కామాగ్నిజ్వాలలకు శలభప్రాయులై, తమ మనశ్శరీరాత్మలను దగ్ధము గావించుకొనుచున్నారు. ఇట్టి కామగుణసమన్వితమగు నైహికభోగముఁ దుచ్ఛమైనదికాదని యెవరు చెప్పగలరు? అది యాధ్యాత్మికసుఖాభివృద్ధికిఁ జీడపురుగు. ఆముష్మికపథమునకుఁ గంటకగుల్మసీతుల్యము. ముక్తికవాటకమునకు లోహశృంఖలాబంధము. దేవి! ఇట్టి మహద్విషయములలో మీ కేదిక్రొత్త. మీకుఁ దెలియరానిదేది కలదు? మీరు మాకు గురువర్గములోని వారగుట, శిష్యకోటి కాదేశింపఁదగిన మహోద్దేశము లెంతయుఁ బునీతముల

నియు, నవి యాత్మోజ్జీవమునకు మూలాధారములనియుఁ దెలిసిన మీరు నను బరిశోధించుటకై ప్రతికూలమార్గమునకుఁ ద్రిప్పితిరి. నేను మందమతినగుటచే నవాచ్యములకు దొరకొనియుంటినేని తల్లీ! క్షమింప వేఁడుచున్న దానను. ఇప్పటికే కాలాతీతమైనది. మిమ్ముఁ జాల నాయాసపఱచితినిఁ—చిత్త విశ్రాంతి నందుటకై మీరిక సెలవు గైకొనవచ్చును.

శారదాంబ సాగిలపడి బ్రాహ్మీపాదములకుఁ బ్రణమిల్లి, తనయశ్రుధారలచే నామెపాదద్వయమును గడిగెను. పిమ్మట భక్తిపూర్వకముగఁ దాంబూలము సమర్పించెను. వెంటనే సీతముఖము వివర్ణమునందెను. సరసినుండి విడివడి, సూర్యాతపమునకుఁ గ్రాఁగి శుష్కించిన సారసముతీరున, నామెవదన మండలము వాడిపోయెను. ఆమె యటనుండి వెడలిపోయెను.

ఉన్నతవంశసంజాతయగుఁ గనకు ధర్మోపదేశముఁ గావింపఁగడఁగిన యన్యకాంతయగు శారదాంబయెడ, నామె కినుకఁగొనియుండునా? ఉద్దిష్టకార్యము విఫలమైనకతనఁ బన్నముపడియుండునా? తానుబ్రకటించిన నీచోద్దేశముఁ దలపోసి లజ్జనొందియుండునా? ఆయువతి శారదాంబికా సాంత్వనవచనములకు — భక్తిప్రపూర్ణభాషణములకుఁ గరఁగియుండునా? ఆ విషాదభావమున నేయర్థమిమిడియుండెనో గ్రహింపఁజాలక, శారదాంబ యందులకుఁ దనయపరాధమే కారణమైనట్లు తలచి విచారమునొందెను.

ఇరువదినాలుగవ ప్రకరణము

తూరు పాఱఁ బట్టుట.

మహాశివరాత్రినాఁటి పగలు సిద్ధరామపురమునందలి యాచారప్రియు లనేకు లుపవసించిరి. ఆరాత్రి వినోదకర్మజాలము చాల హెచ్చియుండెను. ఊరియందలి భజనశాలలన్నియు నీశ్వరసంకీర్తనలచేఁ బ్రతిధ్వనించుచుండెను. దేవతామందిరములయందు—ముఖ్యముగ శివాలయములలో నారాధనలువిరివిగ జరగుచుండెను. ఆలయప్రాకారములు దీపికాశ్రేణిచే బ్రకాశించుచుండెను. వీధిపురాణములు — హరికథలు — నతిశయించియుండెను. పురమధ్యమునను బాహ్యప్రదేశమునను గల మఠములన్నియు నద్వైతసిద్ధాంతుల వేదాంతగీతములవలనను, భంగిధూమవ్యాప్తిచేతను, నిండియుండెను. వేశ్యకాంతల సౌధసీమలు సాలంకృతములై కళకళ లాడుచుండెను. అందందు సంచారముసల్పెడు విలాసప్రియులకుఁ దఱుగు లేకుండెను. శిథిలాగారములలో జూదగుల యట్టహాసములు మద్యపాయినుల బొబ్బలు నార్పులు ప్రబలియుండెను. కొలఁది మాసములనుండి పనిచేయుచుండిన నాటకరంగములు రెండును బ్రదర్శనమునకుఁ బూనియుండెను. ఇవియన్నియు జాగరకార్యసౌలభ్యమునకయి యేర్పడిన సాధనములు కాఁబోలును. ఇందువలన సుఖలేశమును దుఃఖపూర్ణమును నగు నీమాయాప్రపంచమును దరించి, ముక్తిని బ్రాపింపనగునని, యందలి ప్రజలు భావించియుండనోపుదురు.

చదువరీ! నిర్ధరించుకొనుము. ఈ వినోదకలాపమున నీకుఁ
బ్రీతిఁగూర్చునదేది? నీయాప్సిత మేమి? మాసంకల్పము నాలింప
నీకుఁ గోరికయున్నదా? అయిన నాటకప్రదర్శనము నవలో
కింపవలయుననుట మాయభిమతము. నీకది సమ్మతమగుచో
మమ్మనుసరింపుము. నేఁటి నాటకరంగములు రెండని చెప్పితిమి.
అందొకటి హితకారిణీసంఘమునకుఁ జెందినది. రెండవది
యానంద మండలివారిది. మనకీరెంట నే సమాజమున విశేష
సంబంధమును నల్పపరిచితియును లేదు. మనహృదయము మెప్పుడు
నానందరసానుభవమునే కోరుచుండును; కనుక నానంద
మండలి నర్తనా సౌకర్యము నారయ నేగుదము. ఆప్రేక్షణీక
మహాజనము లీవీథిని గుంపులుకట్టి యాస్థానమునకే వెళ్ళుచుండఁ
బోలు. మన మాసమూహము నంటిపోవుదము రమ్ము.

ఒక్క క్షణములో నాట్యశాల సమీపించితిమి. ఆపాకకు
ముందటిభాగమున నచ్చపుఁ జీఁకటిబల్లపై నొకగుడ్డిలాంతరు
నుంచికొని, ముఖమునఁ బరిపూర్ణాలసభావము చిందులుద్రొక్క,
నడివయస్సు చెల్లిన కురిచీపై వెనుకకొరగిలి కూరుచుండి,
మనకుఁ గనులపండువొనరించెడు నాపురుషుఁడెవ్వఁడు? ఆ దివ్య
మూర్తియే రక్షకపత్రవిక్రేత. ఆ ఖండపత్రములఁ బుచ్చు
కొనుటకై యనేకు లిప్పుడిప్పుడే త్వరపడుచు, నాతనిఁ బరివే
ష్టించుచున్నట్లున్నది. మనకట్టి యావేగముతోఁ బనిలేదు.
ఆతనికడకు మనమరుగ నవసరము లేదు. ఆచీట్లనుగొను నావ
శ్యకమును మనకులేదు. మానవలోకమున కీశ్వరుఁడు ప్రసా
దించుచుండు నద్భుతోపకరణములలో నొక్క మనశ్శక్తి మన

కధికముగ నున్నఁజాలును. ఎట్టి యసాధ్యకార్యము నేనిఁ దృణముంబోలె నిరాయాసముగ మనము సాధింపఁగలము.

నిగూఢముగ నాట్యశాలలోఁ జొచ్చుటకై, ద్వారనికటమునఁ దగవులాడుచుండు జనస్తోమముఁ గడచి, ఎట్లో లోనఁ బ్రవేశించి మఃమరస్థ్స్థానమునఁ గూర్చుండఁగలిగినదియు నొక విశేషమేయగును. నాటకదిదృక్షాగతజనులచే నప్పుడే శాల నిండి పోయినదే!

గడియారమునఁ బదునొకండుగంటలు కొట్టినది. తొమ్మిదింటికిఁ బ్రదర్శనమారంభమగునని ప్రకటింపఁబడియున్నను నాటకులింకను గథ మొదలుపెట్టి యుండలేదు. వారిస్వాభావికధర్మమునం దిది యంత గణింపఁదగిన యంశముకాఁజాలదేమొ. ఆహా! నానావిధవిద్యుద్దీపములచే శాల యెంత తేజోవంతముగ నొప్పఁగుల్కుచున్నది! రంగమండపమున వ్రేలుచున్న యవనికయం దావేణుగానలోలుని సుందరవిగ్రహ మెంత రుచిప్రదముగఁ జిత్రింపఁబడినదో చూడుము.

కాళ్ళకుఁ బాగలు దొడిగి—చలువ ధవళ పరీధానముఁ గట్టి—నల్లని యంగరేకఁ దాల్చి—పైన సుపరిశుభ్రమగు నుత్తరాసంగము ధరించి—కన్నులకద్దముల జోడుపెట్టి—జరీబుటేదారుపని చేసిన పట్టుపాగఁ దలకుఁజుట్టి—సువర్ణశృంఖలానిబద్ధమై, చొక్క చిన్న జేబునందిమిడియున్న చిన్నని ఘటికాయంత్రమును మాటిమాటికి నవలోకించుచు, నిగ్గులుగులుకుచు నారంగపార్శ్వమునఁ గుఱిచీపై నాసీనుండై యుండు, కోమలగాత్రుఁడగు నాయొలజవ్వనునిఁ జూడుము. పలుమరుఁ బ్రేక్షణీక జనుల

వంక దృష్టినిసారించి, వారి యాందోళనము నుడుపఁ బ్రియత్నించుచు, సత్వరముగ నిరంతరాయముగ నాటకకార్యము నారంభింప నాతఁ డుత్తలపడుచు నుండుట గాంచితివా? అతఁడే సమాజాధినాథుఁడగు చంద్రమౌళీశ్వరుఁడు.

ప్రదర్శనమారంభింపఁబడనున్నదికాఁబోలును. గంటయు ఖంగు ఖంగున మ్రోఁగెను. తెర తనంతటఁ జుట్టుకొనుచు నొయ్యారముగ నల్లనల్లనఁ బైకిలేచుచున్నది. దానిమాటున నుండి సుసజ్జితుఁడై—యున్నతాసనాధిష్ఠితుఁడై యున్న యొకానొక పురుషవిగ్రహుఁడు కొంచెముకొంచెముగ గోచరించుచున్నాఁడు. అహాహా! రామాభిషేకవిషయమై సంప్రతించు లోకసంపూజ్యుఁడగు దశరథరాజచంద్రుఁ డాతఁడేనా? అయినచో రాజదత్తములైన కనకాసనములయం దిరుపార్శ్వములఁ బ్రజారాధ్యులగు నృపాలచంద్రులును, మంత్రిపురోహితప్రముఖమండలియు విరాజిలుచుండ లేదేమి! కవిరాజనికరమును పౌరజానపదులును సభాస్తారులును బలసి కొలువ, నా నృపాలమార్తాండుఁడు సమగ్రవైభవసమన్వితుఁడై, రత్నమయపీఠోపవిష్టుఁడై, శ్రీరాఘవాభిషేకసన్నాహములను గుఱించి గభీరార్థదాయకహర్షవచనములఁ బ్రతిపాదించుచుండ లేదేమి? ఆ దశరథరాజతిలకుఁడేనా యాతఁడు! ఆ సభాభవనమేనా యీ ప్రాసాదము! ఈ సుసమయమునసహితము నిర్జనమై—నిస్తేజమై—భీకరమై—కన్పట్టు నాస్థానమండపమున, నాతఁ డేకాకియై ఖిన్నుఁడై యుండనేల? అంతియకాదు. భాషింపఁ దగిన యంశములనుండియు విస్మృతినొందుచున్నాఁడు. తానాలపించెడు రా

గములకుఁ బలుతెఱఁగుల వన్నెలుపూసి మనోహరత్వముఁ గల్పింపఁ బూని, యాతఁ డాయంతరువు నతిక్రమించుచుండెనా?

అన్యోన్యవైషమ్య కారణమునఁ దమలోఁ దమకుఁ దీరని వివాదము లంకురించియున్న సందర్భమునఁగూడ, సపత్నులగుఁ గైకేయీకౌసల్యలు, ఒండొరుల నెడనెడఁ గదిసికొనుటయు, మోమున మోముచేర్చి కరవస్త్రముల మాటున సంశయనివృత్తిఁ జేసికొనుటయు, వారి యింగితజ్ఞతకుఁ దగియుండెనేమి?

రాముఁడు మాటలయందు మహానిపుణుఁడు. లక్ష్మణుఁ డన్ననో యట్టి నేర్పరి మనస్సుకుఁగూర్చునట్లు భాషింపఁగల సమర్థుఁడు. మాతృదేవినుండి రాముఁ డనుమతినొందునప్పుడును, గైకవలన ననుజ్ఞవడయుసందర్భమునను, సోదరు నంకమునుండి చతురభాషణములఁ గౌసల్య కూరట జనింపఁజేసి, పవిత్రభ్రాతృధర్మమును నిరూపించిన సౌమిత్రిపాత్రను ధరించియు, నాట్యాంత మొక్క పలుకైనఁ బలుకక దారుప్రతిమవోలె మిన్నకుండి, చివరఁ బరిహాసపాత్రుఁడై నిష్క్రమించుచుండు, నా రామానుజవేషధారునిఁ గాంచుము.

ఆ రామవిగ్రహుఁడు నృసింహుఁడే. కానిమొదల నాతని కనీనిక లరుణప్రభల నీనుటేల? దశరథరాజనందనుఁడగు రాఘవుని యంతరువునఁ దానున్నట్లుభావించియు, నా మందభాగ్యుఁడు నింపాదిగఁ బుష్పాసవముఁగ్రోలి, మదవిస్మృతినొంది, యెట్లు తూలుచున్నాఁడో చూడుము. సర్వజనాభీప్సితములై — శాంతభావపరిపూర్ణములై — రాణించెను, శ్రీరామచంద్రుని

మృదుమధురవాక్యసరణి, యీనిర్భాగ్యుని ధ్వంతపంక్తినడుమఁ జిక్కి, మిక్కిలి నుగ్గిక్కి, మలినమై — దుర్గంధయుక్తమై — బహిర్గతమై — లయమగుచుండెను. ఆ మహనీయునియందు సాధుస్వభావము మూర్తీభవించియుండఁగా, ధూర్తలక్షణమీ మాయకానియందుఁ గీర్తీభవించి యున్నది. నుదువఁదగిన దొక్కటియు నుడువుట వేఱొక్కటియు. నయముచూపు నెడ భయము. వికారచేష్టలు — వెఱ్ఱిచూపులు!

“రమణిచెల్లెలగు రాధయే కైకేయీవేషధారిణి. దాని యభినయ మంతస్వారస్యముగ నుండలేదు. అయిననేమి? ఆపె కలకంఠి; కనుక సుమనోరంజకముగఁ బాడఁగలదు. దాని స్వరమునకుఁ. గృష్ణమూర్తి యెంత మురిసిపోవుచున్నాఁడో! మీనాక్షీ! చూడుము. ఆరసికుఁడు సారెసారెకును బాడుమని తొందరపఱచుచుండుటచే నదియు విసిఁగుకొనుచు విధిలేక పాడుచున్నది. అదిగో! మరల నాదుండగీఁడు కురిచీనుండి లేచి నాఁడు చూడు.”

ఈధ్వని యాజనమధ్యమునందలి గరితమిన్నలది. వారనుకొన్నమాట నిజము. చినవీరశర్మ సేవకవర్గమునఁ బ్రముఖుఁడగు కృష్ణమూర్తి నిలుచుండి, యాసక్తిమెయి నామె మోహనగానము నాకర్ణించుచు, నా గానసుధారసమాధుర్యమునకుఁ బొక్కిపోవుచుండుట వాస్తవము. స్వీయసమ్మోహనాస్త్రజాలము నాతఁడామెపైఁ గురియించుచుఁ, బదంపడి గానమొనరింప నాజ్ఞాపించెను. సప్తసముద్రవలయితధరామండలనాయకుఁడగు దశరథరాజకేసరికిఁ బట్టమహిషిననుకొన్నను

శాప మాపె సానిబేరములకు మాత్రము విమోచనము కలుగలేదు.

ఆ కైక యేమిచేయఁగలదు? చంద్రమౌళీశ్వరుని యను మతికై యాతనివంకఁ దనచూడ్కులఁ బఱపెను. చంద్రమౌళీశ్వరుఁ డుపేక్షాపూర్వకభావముతోఁ గైకదెసఁ దన కుటిల కటాక్షము నిగుడించెను. అది తెలిసి కైక మరలఁ బాడలేదు; కాని కృష్ణుఁడు విడువలేదు. ఆతని నాపె లక్ష్యపెట్టలేదు. ఆతఁడు నాపెవంకఁ దీక్ష్ణవీక్షణముల సారించుచుఁ బాడుమని కేకలు వేయుట మానలేదు. అయింతి యనంతరసంభాషణమును నుక్రమించెను. ఆతఁడు చప్పటలుచఱచుచు నీలలువైచుచు నాందోళనముచేయ నారంభించెను. ఆపె "యాతనిని లాఘవమునఁ జూచెను. అందులకుఁ గృష్ణమూర్తి మూర్తీభవించిన రౌద్రమూర్తియై మఱింత బిట్టుగఁ గూకలు వెట్టఁదొడఁగెను. పార్శ్వవాసు లాతనిని శాంతిపఱుపఁ బ్రయత్నించిరి. ఆతని క్రోధాగ్ని మఱింత హెచ్చెను. దానినుండి కృష్ణుఁడు చల్లబడలేదు. ఆతఁడు వామకరమునఁ దనకోఱమీసములను బురివెట్టుచు, కుడిహస్తమునందలి వేత్రమును ఝళిపించుచు, మేఘగర్జనలు సలుపఁజొచ్చెను. ఈయల్లరి క్రమక్రమముగ హెచ్చుటచేఁ గొంతసేపటికే వాక్కలహముపోయి ముష్టియుద్ధమారంభమయ్యెను. ప్రతిఘటించి నిలిచినవారి నెల్లఁ గృష్ణమూర్తి తనకరదండమున నున్మత్తునిచందమున మోదుటకుఁ దివిరెను. ఆతని బయటికిఁ ద్రోయవలసినదని చంద్రమౌళీశ్వరుఁడు సేవకుల కాజ్ఞాపించెను. తత్క్షణమే దృఢగాత్రులగు

ముగ్గురుమనుష్యులు, రంగస్థానమునుండి బలోచితముగ నాతని లాగివేయుటకై ముందునకువచ్చిరి. చదువరీ! చూచుచున్నావు కదా; ఆ రోమకపాయిలనేతృఁడు కృష్ణుఁడు వారివంక వికట భావమునఁ జూచుచుఁ, దలపంకించుచు, 'మంచి' దనుచు, నేమిరెూ సణఁగుకొనుచు, నటనుండి తనంతనే వెడలిపోవుట!

నాటకము సమాప్తినొందలేదు. భరతవాక్య మింకను వినఁబడలేదు. "దిదృక్షులలో నెవ్వరైన నీదృశ్యముపైఁ దమ సానుభూతి నగపఱచుచు నుపన్యసింపఁ దలఁచియున్నచో, వారికి మేము మానిండుకృతజ్ఞతను జెల్లింపనుంటిమి." అనుచుఁ జంద్రమౌళీశ్వరుఁడు సభాస్తారులకు జోహారొనర్చెను. కొంత సేపటికిఁ బ్రేక్షణీకజనులనుండి యొక శుష్కశరీరుఁడు పైకి లేచి, ముందునకుఁబోయి, వేదిక నెక్కి యిట్లనెను.

"సోదరీమణులారా! సోదరులారా!

మీరీదృశ్యము నామూలాగ్రముగ నవలోకించియే యున్నారు. కావునఁ బాత్రలయొక్కటిని భావనైపుణ్యమును గుణావగుణములను గ్రహించియేయుందురు. ఆనందమండలి సభ్యులు నాకుమిత్రులుగాని శత్రులుగాని కారు. వారిని నేను భూషింపను. మఱి దూషింపను. నాటకపరిదర్శన ముచిత కర్మముకాదనియు నుడువ సాహసింపను. ఇది జనహితకర కార్యములలో నొక్కటియని రూఢిగఁ జెప్పఁగలను. ప్రపంచోన్నతికి సల్పఁదగిన యుత్తమప్రయత్నములలో నిదియు నొక్కటియనుట వింతకాదు. ఈ వ్యాపారకారణముననే మన ప్రాచీనార్యరాజుల విమలచరిత్రములు — వారి పూజ్యధర్మ

ములు— నాఁటి సాంఘికపరిస్థితులు — సామాన్యజనుల హృదయపీఠముల నిలుచుచున్నవి. అందుల కిది ప్రత్యక్షసాదృశ్యమైనది. నైతికవిషయములలోఁ బ్రజలకుద్బోధముఁ గల్గించుటయందు దీనికిమించిన సాధనము వేఱులేదు. భూతదయావిషయమై మాసములకొలఁది నుపన్యసించినను, గలుగఁజాలని ప్రయోజనము, ఒక శిబిచక్రవర్తిచరిత్రము నప్పుడప్పుడు ప్రదర్శించుటచేఁ జేకుఱగలదు. సత్యమునుగూర్చి శతాధికముఁగ నాదేశింపఁ గడఁగుటకంటె, నొక్కహరిశ్చంద్రసార్వభౌమకథను బ్రకటించుట యుక్తము. అట్లే భక్తినిగూర్చి ఘాటార్లుగ నుపన్యసించుటకన్నను, మనచిట్టిప్రహ్లాదుని మనోహరజీవితచర్య నొక్కమాఱు నర్తనముఁగావించినఁ జాలును; కాని మన నాటకులలో ననేకులవలన నిప్పుడు జనులకుఁగలుగవలసిన మేలు కలుగుచుండుటలేదు. (కరతాళధ్వనులు) నేను దృఢముగ జెప్పుచున్నాను వినుఁడు మేలులేదుకాని కీడున్నది. (వినుఁడు— వినుఁడు) అందుల కీప్రదర్శకులు తమసౌశీల్యముఁ గాపాడుకొనకుండుటయే కారణము. (నిజము — నిజము) ఒక గుడిసెవేటుది సీతామహాదేవిపాత్రను దాల్చి, పతివ్రతాధర్మమును బోధింపదొరకొనినచో, నాధర్మమునకు విలువయుండునా? (ఉండదు) అగ్నిసాక్షిగఁ బెండ్లియాడిన భార్యనుద్యజించి, వేశ్యకాంతలసంపర్కమే నిత్యజీవనముగాఁగల యొకజారశిఖామణి శ్రీరామవేషమునుదాల్చి, యేకపత్నీవ్రతమహాత్మ్యమును జాటఁబూనుకొనినచో, నామహిమ కేమేని గౌరవముండునా? (నిశ్చయముగా నుండదు.) నే నిందాఁకఁ బ్రక

ణిక జనులలో నుండివారియభిప్రాయములఁ గనుఁగొంటిని. పాత్రిధారులఁగూర్చి వారునుడువుచున్న యసభ్యవచనముల వినఁజాలక, దూరముగాఁ దొలఁగిపోయితిని. (ఆపాత్రిలకు సిగ్గులేదు) ఇట్టిచో నీ పాత్రిలాదేశించు హితోక్తు లెవ్వరి తల కెక్కఁగలవు? (నవ్వులు) ఆహా! గుణలేశమైనలేని యిట్టి పాషండులు — ఇటువంటితుచ్ఛులు (ఇట్టి తుచ్ఛులు మఱిలేరు) ధనాశచే ముఖములకు రంగుపూసికొని, యాపరమ కళ్యాణ గుణాత్మకుల యవతారములకు దిగి తెయితక్కలాడుట (పర మాసహ్యము) ఆజగద్విదితయశుల — మన భారతపవిత్రించ దేవశక్తుల — శ్రీరామకృష్ణాది మహనీయమూర్తుల — పావన చరిత్రిముల నిట్లు పరిహాసింపఁబూనుటకంటె, నవమానము వేఱు గలదా? (మిక్కిలి యవమానము) ఇట్టి పాత్రిలకు... ..."(సిగ్గులేదు. ఛీ! ఛీ! వారినిఁగూర్చి యిఁకఁ జెప్పకుఁడు.)

కరతాళములు—ఈలలు — కేకలు — అల్లరులు — హెచ్చెను. ఉపన్యాసము వినబడలేదు.

ఉపన్యాసము పూర్తియయ్యెనో లేదో! బాహ్యప్రదేశ నుండి నాట్యరంగముపై నెవ్వరో శిలావృష్టిఁ గురియింపసాగిరి. అందుండి యొక చిన్నరాయి యివ్వనవచ్చి, స్త్రీలు కూర్చుండి యున్న భాగమున, నొకవృద్ధురాలి ముండిత మస్తకమునఁ బడి, విఘాతమొనరించెను. ఆ దెబ్బతో ఆమె కెవ్వన నఱచి క్రింద బడిపోయెను. వెంటనే యచ్చటనున్న ముదితలెల్లరుఁ దమస్థాన ములను వీడి, యా జీర్ణకాంతను బరివేష్టించి, గగ్గోలు గావించిరి చంద్రిమౌళీశ్వరుఁ డాచోటికివచ్చి, చుట్టును ముసరియున్న వని

తలనెల్లఁ దొలఁగఁజేసి, యాసంక్షోభము నుడిపి యుచితచికిత్స చేయించుటకై, యా వృద్ధాంగనను సేవకాళిచేఁ బట్టించుకొనివెళ్ళెను. బాలకులు — యువకులు — గేకలిడుచుఁ, గరతాళముల మ్రోయించుచు వారి ననుసరించిపోయిరి. ఆటయాగిపోయెను. దిదృక్షులు నాటకమండపమును వీడిపోయిరి. ఇఁక మనకేమిపని?

ఇరువది యైదవ ప్రకరణము.

నాయకుని ప్రాణములు పోయినవి.

ఆనాఁడట్లు రక్షకభటాధ్యక్షుని వేషమునఁ గల్యాణగిరినుండి బయలుదేఱిన, నాయకుని యొక్కయు నాతని పరిజనులయొక్కయు మర్మముల భేదించుటకై, చిన్నోజియు రూపసింగును మొదటినుండి ప్రయత్నించుచు, సంశయమున కించుకేని తావులేనందున నేపనికిని సాహసింపలేక, పర్యవసానము నెఱుంగఁగోరి నాయకుని నాతని సేవకులను వెన్నాడియే వచ్చుచుండిరి; కాని దారిమధ్యమున నసహాయుఁడగు నొకరోగార్తుఁడు వారికి గోచరించి, వారి తోడ్పాటు నర్థించెను. ఆతని దైన్యప్రార్థనను నిరాకరించి ముందుఁబోవ వారికిఁగాళ్ళాడలేదు. కావున వారా రుజగ్రస్తుని యభిమతమును దీర్పఁబూనుకొనక తీరదయ్యెను.

ఆపురుషుఁడు సహజముగ వ్యాధిపీడితుఁడు కాఁడు. అస హాయుఁడునుగాఁడు. చిన్నోజిని రూపసింగును గుర్తించి, వారి పూన్కినిఁ జక్కఁగా గ్రహించిన మాయావి. అతఁడు వారి వ్యాపారము నడ్డగించి, వారి యమూల్యసమయమును వ్యర్థము సేయుటకును — దన్మార్గములనుఁ దమనాయకుని యభిమతము నవిఘ్నముగ ఫలవంతముచేయుటకును — బూనుకొన్న, వేష ధారియగుతస్కరభటుఁడు. అతఁడు కపటవర్తనము నభినయించి, వారినిఁ దనమాయాజాలమునఁ ద్రోసెను. కేవల ప్రేమైక స్వాంతులగు నా పరిశోధకు లీమోసము నెఱుంగక, యాపన్ను నకుఁ దోడ్పడుట విధియనుకొని, తమ ప్రధానకర్తవ్యమునకే ముప్పుదెచ్చుకొనిరి. ఈ ప్రయత్నమునఁ బూర్తిగఁ దమ మన స్సును జొప్పించుటచేఁ గాలావధిని గమనించుటకును, దాము వెన్నఁటుచుండిన దుష్టుల జైదములఁ గని పెట్టుటకును, వారికి వీలులేకపోయెను; కనుక నంతయునుజరగిన యనంతరమే వా రావన ప్రవేశము చేసిరి. ఈలోపల నచ్చట నడచిపోయిన చిత్రచరిత్రముఁగాంచి, దిక్కులివిభ్రాంతులై, వారురక్షకభటు లను బంధములనుండి తొలఁగించిరి. అపై నందఱు నొక్కపెట్టు నఁ జోరసమూహముపైఁబడ నుద్యమించిరి. ఆ యుత్తరక్ష ణమే నాయకుఁ డశ్వము నారోహించెను. అదియు మహావేగ మునఁ బరుగిడి, యా వృక్షవాటికలో మఱుఁగుపడి పోయెను. తస్కరభటులు నలువంకలఁ జెదరిపోయిరి.

చిన్నోజియు రూపసింగును దొంగలను బట్టుటకై సల్పిన ప్రయత్నము లిట్లు నిరర్థకము లగుచుండెనే గాని, వారికిఁ

దస్కరులు పట్టువడలేదు. దొంగల నివాసమైనను దెలియఁబడలేదు. వారాదుండగుల దౌష్ట్యములను గన్నారఁజూచుచుండియు, గుర్తించి పట్టఁజాలక పోయిరి. వారివలనఁ బ్రజలకుఁగలుగుచుండు విపత్తులను దొలఁగించుటనుగూర్చి, పాలకులైన నింతవఱకుఁ దగిన శ్రద్ధవహించియుండ లేదు; కాని చోరనాథుఁడు రక్షకభటులను గారించి, రాజస్వధనమును హరించిననాఁడే, యా నిశాచరనాయకుని విషయమునఁ, బ్రభుత్వ మించుక కనువిచ్చినది. యోజన కిడమిచ్చినది. చెవియొగ్గి వారి యపరాధముల నాలకించినది. సపరివారముగ నాదస్యనాథునిఁబట్టి వెంటనే శిక్షింప నున్నతాధికారుల కాజ్ఞాపించినది. ఈకార్యమునకు మండలమునందలి పరిశీలనాధ్యక్షుఁడు నియోగింపఁబడెను. ఇంతవఱకు నీతఁడనేక ప్రాంతములయందుఁ జక్కఁగఁ బనిచేసి, కొంతవఱకు ననుభవముఁ బొందిన ఇన్‌స్పెక్టరు రఘునాథరాయఁడు.

చోరనాథుని జాడలుఁదీసి, మర్మభేదనముఁ గావించుటకై రఘునాథరాయఁడు చాలఁ గృషిసల్పెను. ఆదినుండియు నా ప్రయత్నములయందే ముగ్గులయియుండినను చిన్నోజియు రూపసిఁగునుగూడ,నా సమయముననే రఘునాథరాయని సందర్శించి చోరనాథునిఁ గూర్చియే మాటాడుచు, నాతని వాసస్థానము తెలియకపోయినను దాత్కాలికముగ నతఁడు భటవర్గముతోఁ గలిసికొనెడు రహస్యస్థలము తెలియవచ్చినదనియు, దానిఁ జూపుచు వానిఁ బట్టితెచ్చు విషయమై తాము దోడ్పడు నట్లును మనవిచేసికొనిరి. రఘునాథరాయఁ డందులకుఁ దన

యామోదమును దెల్పి, కొందఱు పరిజనులతో నా నిగూఢ ప్రదేశమును ముట్టడింపఁదగు నియమితసమయమును సూచించెను. అందులకు రూపసింగును జిన్నోజియుఁగూడఁ దమయిష్టమును గనఁబఱచిరి.

అనుకొనినరీతిని ఇన్స్పెక్టరు రఘునాథరాయఁడు రక్షకవర్గముతో నమావాస్యానిశాసమయమున బయలుదేఱెను. చిన్నోజి మార్గదర్శియై ముందునడచుచు, నాప్రాంతమునఁగల ఘాతుకమృగావళి చర్యలను, వాని నెదుర్కొని నిహతులైన మర్త్యులకథలను. సరసముగ వర్ణించిచెప్పుచు నరుగుచుండెను. అతని నంటిపోవుచున్న రూపసింగు, తన మిత్రుఁడు చెప్పమఱచిన యంశములను దలఁపునకుఁ దెచ్చుచుండెను. వారి వెనుక నశ్వారూఢుఁడై వచ్చుచున్న రఘునాథరాయఁడాగాథల నాకర్ణించుచునే యుండెను. వారిమాటల సవ్వడి నాలకించియు వానియర్థము నెఱుఁగకున్నను గ్రహించినది పోలె, రఘునాథరాయని తురగమల్లనల్లనఁ దలయూఁచుచు, నాయంధకారములో నెమ్మదిగఁ బోవుచుండెను. దాని పిఱుందను రక్షకభటనికరము నడచుచుండెను.

కథలు ముగిసినవి. సమభూములు గడచినవి. కొలఁది కాలమునకే వారందఱు నొకానొక దుర్గమప్రదేశముఁ జొచ్చిరి. సువిశాలావకాశమునఁ గాటుకవన్నె తెఱంగున నన్నికడల దట్టముగనలముకొనియున్న మేఘమాలికలు — సందలి చంచలాలతలు — ఆదుస్తర యామినీసమయపారావారమున మునిఁగి యుభయపార్శ్వముల నాకసముఁ జీల్చుకొని

పోయియున్నట్లు దోఁచు సత్యున్నత గిరిశ్రేణులు — మార్గమున కిరువంకలఁ గ్రిక్కిఁసి యొండొంటితో నొరసికొనుచున్న వృక్షరాజములు — నిరంతరముగ నందుండి వెలువడు ఝింకృతులు — పొదరింటి గుంపులు — నూతన వ్యక్తులఁ గని హఠాత్తుగ నందందుఁ బరుగువాఱు క్రూరసత్వముల చరణశబ్దములు_భౌతిక ప్రపంచమునందలి యనూనచిత్రితరశోభావిశేషముఁ జాటుచుండెను. ఆ ప్రధానతత్త్వరహస్యములఁ గాంచుకొలఁది, బధికుల మనోఫలకమున సృష్టికారుని యత్యద్భుతోద్ధృతభావ మెట్లు చిత్రితమగు చుండెనో, మే మూహింపఁజాలము. వారీవైచిత్ర్యముల నెల్లఁ దిలకించుచునే నిశ్శబ్దముగ నేగుచుండిరి. రఘునాథరాయఁడు పురోగామియగు చిన్నోజినిఁ దలఁచు నాస్థలమహిమలఁగూర్చి ప్రశ్నించుచునే యుండెను. అతఁడు నతిమితముగ_నేకశబ్దమాత్రమునఁ_బ్రత్యుత్తర మొసఁగుచుఁ, జివరకు మౌనవ్రతమే పరమావధిగాఁగొని, మెలఁకువ మెయిఁ 'గాలిసడియైనఁ గలుగనిరీతి నడచుచుండెను. ఆభీకరధ్వాంతమున _ నా నిమ్నోన్నత సానుతటములలోఁ _ బ్రకృతియందలి యాయనంతసృష్టిలోఁ_ బరమేశ్వర నిగూఢకర్మకలాపమును గూర్చి, యాయధ్వగు లంతరంగమున నేమి తలపోసికొనుచు నెంతదవ్వేగిరో, మనకుఁ దెలియదు.

ఇట్లు పోవంబోవ నెట్టయెదుట వారికొక విశాలసమప్రదేశము గోచరించెను. చిన్నోజి యచ్చోటనాఁగి, గమ్యస్థాన మిదియేయనియు, నందఱు నత్యంతావధానమున నిరీక్షించి యుండి, సవ్వడినిఁబట్టి సమయము నెఱింగి పనిచేయవలసి

యున్నదనియు, నేమాత్ర మజాగ్రత్తచూపినను బ్రాణములు దక్కవనియు, సూచించెను. రఘునాథరాయఁడు హయమునుండి దిగి, యనుచరాళితో నొకమ్రానికడ కల్లనఁ బోయి, యాచెట్టు మఱుఁగునఁ గూరుచుండెను. ఆతఁడాస్థలభాగము నంతయు హెచ్చరికతోఁ దిలకించుచుండఁ, గొంత దవ్వునఁ—దమోమధ్యమున — నొకగుంటి ప్రక్కనఁ — గొందఱుమనుష్యు లేవియో కార్యాలోచనము సలుపుచున్నట్లాతని దృష్టికి గోచరించెను. అనంతర మాదిశనుండియే క్రింది ధ్వనులు వినవచ్చెను.

"ఛీ! నీవు నీపనిఁ జక్కఁగాఁ జేయుచుండలేదు. చండాలుఁడా! నిన్నిప్పుడే యీ కత్తికి బలిపెట్టెదను."

దొంగలరాయఁడగు కొండఁ డతఁడేయని గ్రహించి, రఘునాథరాయఁడు సంతసించెను

"మహాప్రభూ! ఈతడవ మీ యీపాదసేవకుని మహాపరాధమును క్షమింపఁ బ్రార్థించెదను. ఇఁక మీరు సెలవిచ్చినంతవఱకు నొక్కటియుఁ దప్పకుండఁ దలతోఁ జేసెదను."

ప్రభు—కానిమ్ము. మఱియొక వారము గడవు. ఇది మూఁడవ మాఱు. భైరవా? నీ వేమి చెప్పుచుంటివి?

భై—ఆ విషయ మెట్లుయోజించితిరి ప్రభూ!

ప్రభు—అది సాధనాంతరమున నీవలననే కాఁదగియున్నది. మన మనసరపడరాదు. అల్లరి కెంతమాత్రము నాస్పద మొసఁగరాదు. మన మీతరుణమున నెంతమెలఁకువతో నుండిన నంతమంచిది. విరోధులు హెచ్చుచున్నారు.

భైర—ఆ మహారాష్ట్రుఁడు — నా రసపుత్త్రుఁడు — పెచ్చిల్లి తిరుగుచున్న ట్లున్నది.

ప్రభు—అందువలననే మిము నుగాఁ జాలదు. మఱికొంత కాలము వారినట్లే యెగురనిమ్ము.

భై—రఘునాథనాయఁ డిప్పుడు మన విషయమై నడుముగట్టి నిలచినాఁడు.

ప్రభు—తెలిసినది. వానిఁ గూర్చి మనము లక్షింపఁ బనిలేదు. వాఁడును వాని వర్గమును మన వ్యూహాగ్నిని శలభములవోలె మ్రగ్గఁగలరు.

ఇంకను సంభాషణము ముగియలేదు. చినోజీ రఘునాథరాయని హెచ్చరించెను. నాయకుఁడగు రఘునాథరాయఁడు భటులతోఁ దిన్నఁగ — మెల్లని నడకలఁ — గదలిపోయి, కొన్ని క్షణములకాల మొక గుంటిమాటున నాఁగెను. అనంతరము సమయముఁ గని యాతఁ డనుచరులకు సంజ్ఞ చేసెను. వెంటనే పరిజనులందఱు నొక్క పెట్టున హఠాత్తుగ దొంగలపైఁ బడిరి. వారొక్కొకని నిద్దఱు ముగ్గురు బిగియఁ బట్టి చేతులకు సంకెలలు దగిలించిరి. ఒక్కఁడైనఁ బాఱిపోవ లేదు. రఘునాథరాయఁ డానందమునఁ బొంగి పోయెను.

ఇంత కాలమునకుఁ దమ ప్రయత్నములు ఫలించి నందునఁ, జిన్నోజియు రూపసింగును మహత్తర సంతోష రసానుభవము నందుచు, నాశృంఖలా బద్ధులఁ గొని రక్షకవర్గముతో ముందు నడువఁ జొచ్చిరి. వారివెనుక రఘునాథరాయఁడు గుఱ్ఱమెక్కి దాని నాతిమి రావరణమున నడపించుకొనుచు

పోవుచుండెను. అతఁడా సైంధవమును సమవేగమునఁ దోలుటకుఁ బ్రయత్నించుచుండెను; కాని యాగాఢాంధకారమున— నాదుస్తర శిలామయారణ్య ప్రదేశమున — నాడొంకలలో— హయము ముందడుగు వైచుటకే చాలకీలుచు, నతి కష్టముతో సాగుచుండుటచే, నది యంగరక్షకుల కించుక యెడమయ్యెను. ఆ తామసీ రాత్రిని — ఆభయంకర ధ్వాంత రాక్షసీ గర్భమున — నెట్టి యుత్పాతము లుద్భవించునో యెవరికెఱుక. అశ్వగమన మున్నట్టుండి పూర్తిగా నాఁగిపోయినది. నాయకుఁ డెంత పరిశ్రమించిన నాథదాశ్వ మొక్కయడుగైన వేయఁజాలకపోయెను. ఆశ్వికుఁ డతివిస్మయ విస్మితాంతరంగుఁడై, తనదృష్టి నధోముఖమునకు మరల్చెను. ఆ యవసరముననే జముని బంట్లఁబోలు భయంకరమూర్తులు నలువు రాఘోటకము నవరోధించియుంట, నాతఁడు గ్రహింపఁగల్గెను. సేవకులు కూఁతవ్రేటు దూరమును దాఁటి పోయియుండిరి. ఆ సందర్భమున నొకక్షణమైన జాగుసేయుట ప్రమాదకరము. రఘునాథరాయఁడు ధైర్యమును వదలక యొరనుండి కృపాణమును లాగుచున్నట్టే, యాకిరాత భటులలో నొక్కఁడు భారమగు తనపరిఘ, నాపురుషునిపై శక్తి కొలఁదినిఁ బ్రయోగించెను. ఆదారుణ ప్రహారకారణమున నారాతు దుస్సహబాధాపీడితుఁడై, తురగమున నిలువఁజాలక, బిట్టుగ నఱచుచుఁ గ్రిందఁ బడిపోయెను. ఆదస్యులాతని పైఁబడి మఱింత బలముగ మర్దింపసాగిరి.

అంగరక్షకు లాయార్తనాదమువిని, వెనుదిరిగి చూచి

జరగిన ప్రమాదమును దెలిసికొనిరి. వారి కేమియుఁ దోఁపలేదు. ఆవిపత్తునుండి తమ యేలికను సంరక్షించుటయే యా సందర్భమున వారికిఁ బ్రథమకర్తవ్యమై యుండెను. ఆ హేతువున వారు ముందువెనుక లారయక, ప్రభుఁడు పడియున్న స్థానమున కతిక్షిప్రగతిఁ బరుగిడిరి. ఆయదను దెలిసి శృంఖలాబద్ధులగు దస్యులు సంకెలలు విఱిచివైచి, తమకుఁ గాఁపున్న రక్షకుల నచ్చటి విషమతలమున బోరగిలఁ ద్రోసి, పాఱిపోయిరి. రక్షకభటులు తమ్ము సమీపించుచుండుట నారసి, రఘునాథరాయునిఁ బ్రహరించుచున్న దొంగలాతనిని వదలి, యదృశ్యులై పోయిరి. అంగరక్షకులు నాయకుని సమీపించి, యాతనిఁ బరీక్షించిరి. నాయకుని ప్రాణములు పోయినవి. తస్కరుఁ డొక్కఁడును దక్కలేదు.

ఇరువది యాఱవ ప్రకరణము

చిన వీరశర్మ

"ఉ. జాతిదొలంగుఁగాత, గుణ♦శక్తి రసాతల సీమకుఁ జన్కఁ
గాత, కులంబు బూదియగుఁ♦గాత, నగంబుననుండి శీలమున్
బాతముఁ జెందుఁగాత, బహు♦భంగుల విత్తమె మాకు మేలు, వి
ఖ్యాతగుణంబులెల్లఁ దృణ♦కల్పములొక్క ధనంబు లేవడిన్"

భర్తృహరి—

ఘోరదారిద్ర్యయాతనల ననుభవించినవారిలో శ్రీరామశర్మ యొక్కఁడు. ఇతని జన్మభూమి రాయదుర్గము.

ఈతని తండ్రి తాతలైన ధనికులుగ నుండిరని నుడువుట కాధారములేదు. ఒక పేదయింటి కన్యతో నీతనికిఁ బెండ్లి జరగినది. వివాహానంతరమే తండ్రి మరణించెను. ఆ తరుణమున నింట నొక వెండి నాణెమైన నుండలేదు. శ్రీరామశర్మ తన్నెఱిఁగిన మిత్రులకడకుఁ బోయి, యందఱను బ్రార్థించి, స్వల్పఋణముల క్రిందను దిరిపముల దిగువను గొంత రొక్కమును గూర్చుకొని, పితృని యంత్యకర్మలను నెఱవేర్చెను. అనంతర మాయూర నాతనికి జీవికయే దుర్భరముగఁ దోఁచెను. ఆ కారణమున నాతఁడు జన్మస్థలిని విడువ వలసి వచ్చెను.

శ్రీరామశర్మ యనేకప్రదేశములు తిరిగి భుక్తిసాధనోపాయమున కెందును మార్గములేక పోవుటచేఁ జివరకు సిద్ధరామపురముఁ జేరెను. ఆతఁ డాదినములలో నచ్చటఁ బ్రముఖుఁడుగానుండిన రాఘవయ్యను దర్శించి, తన దురదృష్టదశను గూర్చి యథాక్రమమున నివేదించుకొనెను. రాఘవయ్య యా విషయమును సావధానముగ నాలకించి, యాతని దీనవచనములకుఁ గరఁగి, యా బీదకుటుంబమున కూఁతయై, వారు నివసించుట కొకగృహమును - జీవనాధారముగ నొక పంటనేలయుఁ- గొంత ధనమును నొసఁగి, యాదరించెను. నాఁటి దినములలో రాఘవయ్యకుమారుఁడు పూర్ణచంద్రయ్య పదునాలుగేండ్ల యీడు గలవాఁడు.

శ్రీరామశర్మ సిద్ధరామపురముచేరి స్థావరముఁ గుదుర్చుకొనిన పిమ్మట నైదుసంవత్సరముల కాతనిభార్య గర్భవతియై, యొకపురుషశిశువును గాంచెను. ఆశిశువు వీరశర్మ

యునఁబడి, సంవత్సరకాలము జీవించి, తరువాత మృతినొందెను. అనంతరము గల్గినపుత్త్రుఁడు చినవీరశర్మ. ఈతఁడుద్భవమైన తొమ్మిది నెలలకు లోపలఁ దల్లి మృతినొందెను. పాపము శ్రీరామశర్మ యొకపాలదాది నేర్పఱచి, శ్రమయనక శిశువును బోషించెను. పంచవర్షప్రాయముననే జనకుఁడా బాలకునిఁ బాఠశాల కనిచెను. తోడిబాలురతోఁ జేరి యధేచ్ఛగ నాడుకొనమరగిన చినవీరశర్మ, బడికివెళ్లక సర్వసాధారణముగ నిలిచిపోవుచుండువాఁడు. తండ్రి స్వకార్యతత్పరుఁడై పొలముల మీఁద నుండుటచేఁ, గుమారుని విషయమునఁ గనుగల్గి చూచుటకు వ్యవధి లేకపోవుచుండెను. అతఁ డెప్పుడైన నాకస్మికముగ నడిచూచి చీవాట్లుపెట్టి, యాతని స్వయముగాఁ దీసికొనివెళ్లి బడిలోవదలివచ్చుటయుఁ, బిమ్మటనతఁడు పాఠశాలవంకఁ గన్నెత్తియైనఁ జూడక, నెచ్చెలులతో నెచ్చటనో కాలముఁబుచ్చి, వేళకుఁ జక్కఁగా నింటికివెళ్లుటయు, జరగుచుండెను. జనకుఁడు నిజము తెలిసికొని దండింప, నాతఁ డింటనుండి పాఱిపోయి, వనాంతరములలో నేకాంతముగ దినములకొలఁదినుండి, తండ్రి మరలఁ బిలుచుకొని వెళ్లువఱకు గృహమునకుఁ బోవువాఁడు కాఁడు. ఒక్కపర్యాయ మిట్లు పలాయనుఁడై, యాఱుమాసములకుఁ బిమ్మటఁ బర్వతారణ్య భూములలోఁ దండ్రికి లభించెను.

ఇట్టి స్థితిలోఁ గుమారుని నెట్లు మార్గమునకుఁ దేవలయునో యది శ్రీరామశర్మ కేమియును దెలియలేదు. పాఠశాల కనుచుటవలనఁ బ్రయోజన మావంతయు లేకుండుటయే

కాక, యనర్థములకుఁ గూడ నది హేతువగుచుండెనని యాతఁడు భావించెను. కొంతకాలమిట్లే వదలినచోఁ బుత్త్రుఁడు చేఁజిక్కఁడని యాతనికిఁ దోఁచెను. కనుక నాతని నెప్పుడును దనతో నుంచుకొన నిశ్చయించుకొనెను. సుతునకు విద్యాయోగము లేదని తలఁచి, యాతని బడినుండి వదలించి, సేద్యపుఁబనులయందు నియోగించెను. అప్పుడు నాతఁడు క్రమపథమునకు రాక సోమరిపిల్లలఁ జేరి యాలసవృత్తిని మెలఁగుచు, వ్యవసాయ కార్యములయందుఁగూడ. నశ్రద్ధవహించి, తనకు నియమించిన పనులలో నొక్కటినేని సంతృప్తికరముగఁ జేయఁజాలకుండెను. కొన్ని యేండ్లు గడచినపిమ్మట శ్రీరామశర్మ కాలగతినొందెను. నాఁటికాతఁడు దాదాపు రెండు వేలరూప్యముల. యాస్తిని సంపాదించి పెట్టియుండెను.

చినవీరశర్మకిపుడు రమారమి నలువది యేండ్ల వయస్సు. ఏ హేతువుననోగాని, ప్రకృత మాతని జీవితమే . మాఱియున్నట్లున్నది. ఆతఁడు పూర్తిగ వెనుకటి దశ నతిక్రమించి యుండెను. అతనికి ధనార్జనమే ముఖ్యలక్ష్యమయి యుండెను. అందుల కనేక విధములఁ గృషి సల్పుచుండెను. చివర కాతఁడు లక్ష్మీనాథుఁడయ్యెను. మన చరిత్ర జరుగుచుండిన కాలము నాఁటికిఁ జినవీరశర్మవంటి ధనికుఁడు సిద్ధరామపురమున మఱి లేఁడు. అంతటి మహత్తరసంపద యాతనియింటఁ జేరుట కనేకులనేకవిధకారణములను జెప్పుకొనువారు. ఏది యెట్లున్నను జినవీరశర్మ కుబేరుఁడు కాఁడని యెవ్వరును జెప్పఁజాలరు. అంతమాత్రమునఁ దృప్తినొందక తనయైశ్వర్యాభి వృద్ధికిని

స్వాగారవాభివృద్ధికిని, నాతఁడు సర్వవిధ ప్రయత్నములఁ గావించుచుండెను.

ఇంతవఱకును జినవీరశర్మకుఁ బరిణయము కాలేదు. అతఁడు వివాహకర్మము నొక ముఖ్యధర్మముగఁ దలపోయలేదు. అయిన నాతఁడు బ్రహ్మచర్యమునఁ బ్రవర్తించియునుండ లేదు. కొందఱుపపత్నులాతని యాశ్రయమున నుండిరి.

చినవీరశర్మ నిరంతరము దనభవనమునందలి మేడయింట నుపపత్నులతో నిష్టాగోష్ఠి నుండుననియు, నెప్పుడు వెలికివచ్చుటయు నన్యులతో సంభాషించుటయుఁ దటస్థించుట లేదనియు, జనులు చెప్పుకొనుచుందురు. అది చాలవఱకు నిజమే. చిన్నవీరశర్మ తనపౌరులకుఁగూడ నూతనమానవుఁడే. ఆపురమున నాతని పరిచయభాగ్యమును బొందియున్నవారు నూటికొకరైన నుందురనుటయు సంశయమే. ఏదేని యొక యనివార్య ప్రమేయము సంభవమైనఁగాని యాతఁడు తనమేడ విడచి వచ్చుటలేదు. అట్టిసమయమునను నాపురుషుఁడు తన పెట్టెబండిలోఁ గూరుచుండి వెళ్ళుచుండుటచేఁ బురవీధుల నెవ్వరికేనిఁగాన్పించుటయరుదు. తనప్రధానసేవకులకుఁ దప్ప మతెవ్వారికిని దర్శనమీయనొల్లఁడు. అతని కాంతరంగిక సేవకులు పెక్కండ్రుగలరు. అన్నికార్యములును వారినుండియే జరగుచుండును. అందుస్త్రీలు సహితముకొందఱు. ఆవర్గమునఁ జినవీరశర్మ కాప్తబంధువుల వంటివారిద్దఱు. అందొకర్తుకసీత. కృష్ణమూర్తి రెండవవాఁడు. చినవీరశర్మసేవక బృందమునందు స్త్రీవర్గమున సీతయుఁ, బురుషవర్గమునఁ గృష్ణమూర్తియు,

నాయికా నాయకులుగ నుండిరి; కనుక భృత్యవర్గమునకాయి ద్దఱియెడ భక్తిప్రపత్తి యతిశయము. స్వామికిఁ భాషించు సంపూర్ణాధికార మాయుభయులకుమాత్రమే యుండెను.

ఆనాఁడట్లు నాట్యశాలలో నవమతినొందిన కృష్ణ మూర్తి, యందునడచిన వృత్తాంతములఁ దనప్రభునకు విన్న వించుకొని, వెంటనే విరోధమడలికిఁ బ్రతిఫలముఁ గుడువఁ బెట్టవలయుననియు, ముఖ్యముగఁ బరిభవకారకుఁడగు చంద్ర మౌళీశ్వరునిఁ గడతేర్చువఱకుఁ జిత్తశాంతి కలుగఁజాలదనియుఁ దెల్పుకొనెను. చినవీరశర్మ యనేకదినములనుండి వియ్యారి వారికి నిష్కారణవిరోధి. తనగౌరవాభివృద్ధి కవరోధకారణుఁ డగు పూర్ణచంద్రయ్యను హతముగావింప, నాతఁడు చిరకాలము నుండి ప్రయత్నించుచుండెను. పూర్ణచంద్రయ్య సతీసమేత ముగ నీశ్వరసన్నిధానముఁ జేరుకొనిన పిమ్మట, సిద్ధరామపుర మున నన్నివిధములఁ జినవీరశర్మను మించినవాఁడు లేఁడయ్యెను; కాని యేదోయొక హేతువునఁ, జంద్రమౌళీశ్వరుని సహిత మంతమొందించి, శారదాంబను- సర్వస్వమును- స్వవశముగా వించుకొనఁదలఁచెను. శారదాంబకై యాతఁడు సల్పిన ప్రయ త్నములు ఫలింపలేదు. ఇందులకుఁద్రోడు చంద్రమౌళీశ్వ రుఁడు ప్రమత్తుఁడై, యాతని యాప్తభృత్యుని నిండుసభలోఁ బరిభవించెను; కనుకఁ ద్వరలోనే శారదను దనరహస్యో ద్యానమందిరమున నుంచుటకును, చంద్రమౌళీశ్వరుని నన్మూలించి యాతని చరసంపదలనెల్ల హరించుటకును, నాతఁడు నిశ్చయించుకొని సేవకుని యిష్టము నంగీకరించెను.

నాఁటఁగోలెఁ జివవీరశర్మ సేవకవర్గమునకును, చంద్రమౌళీశ్వరుని యనుచరులకును, నిష్కారణముగ వైమనస్యభావ మంకురించి, హెచ్చఁదొడఁగెను. ఉభయ పక్షములవారును విరివిగఁ గలుద్రావి, వీథులలోఁ గదిసికొనుచు, నొకరి నొకరు తూలనాడుకొనుచు, బడితెలతోఁ బ్రహరించుకొనుచు, శిలావృష్టిఁ గురియించుకొనుచు, మిగులఁ జెలరేఁగఁజొచ్చిరి. ఇట్లారంభము నొందిన యాజగడములు క్రమోన్నతినంది, యచిరకాలముననే ఘోరయుద్ధముగ మాఱెను. ఇందువలనఁ గుటుంబములకుఁ గుటుంబములే నాశనమొందుచుండినను, నాయకులు ప్రాణభీతియనునదిలవమైన లేక తమ మేడలలో—హంసతూలికాతల్పములయందు—సువిలాసముగఁ గాలముఁ గడపుచు, నీవినోదక్రియాకలాపములఁ దిలకించుచు, సేవకులనింకను బ్రోత్సహించుచుఁ, దామునిశ్చింతగ నున్నట్లుపైకి గనఁబడుచునుండిరి; కాని వారికి మాత్రమాత్మసుఖ మెక్కడిది?

ఇరువది యేడవ ప్రకరణము

ఎదురుచుక్క.

ఇట్టి సమయమందొకనాఁటి మధ్యాహ్నమున, భోజనానంతరమొక యున్నత సౌధమున నందమగు మేడలో, బంగారు నీరుపూసిన మేలుకట్లచేతను — ముత్యాల జాలరులతోడను — విరాజిలు ఖట్వాసనము నలంకరించియున్న మృదుతల్పముపై

నొక పురుషసింహుఁడర్ధశాయియై పరుండియుండెను. చూపఱ కాపురుషుఁడు సింహమువలెనే పొడఁగట్టుచుండెను. అతని విగ్రహ మెంత సుందరమో యంతభీకరము; కాని సుకుమారము కాదు. విశాలములై యున్నతములై మిగులఁ దీక్ష్ణములైన లోచనములు — పొడవై చివర వాఁడియైననాశిక — కుచ్చువలె దట్టముగఁ బెరిఁగి, కొనలుసాఁగి, గండువిూఱినకపోలతలములపై నుడిదిరిగి, చెవులఁదాఁకు కోఱమీసములు — నావీరపురుషుని గభీరవదనమున కింకను గీర్తిఁ దెచ్చుచుండెను. అతని శరీరాంగములన్నియు మాంసలములై దృఢపడియుండెను; అందుచే నావీరుఁడుక్కుతునుకవలె మిక్కిలి చేవఁబాఱియుండెను. అతఁడే చినవీరశర్మ..

కరకంకణక్వణము వెలయ నెలఁతయొకతె తనలీలావిశేషముట్టిపడ, నొకవంక నున్నతపీఠమున విలాసవంతముగఁ గూరుచుండి, వీవనచేఁబూని, చినవీరశర్మ కామోదదాయకముగ నల్లనల్లన విసరుచుండెను. మఱియొక వెలఁది నాయకుని యంకభాగమున వసించి, ముఖమండలమున దరహాసచంద్రికలు దళుకొత్తుచుండ, హాయలువిూఱ నాథునకాకుమడుపుల నొసంగుచుండెను. వేఱొకవనిత మృణాళకోమలములగుఁదన బాహువల్లరులను సాఁచి ప్రభువర్యుని పదయుగ్మము నొత్తుచుండెను. సంతోషరసానుభవమున కిట్టి సుఖసాధనములుండియు, నత్తఱి నాదివ్యాంతఃపురమునఁ జినవీరశర్మ యానందడోలికల నూఁగుచుండలేదు. తన మనోనాయిక సమర్పించు విడియముల నందికొని చర్వణమొనర్చును, నాతఁడు తన నిశ్చలదృష్టి

నూర్ధ్వముఖముగ సారించి, యోజనాపరవశుఁడై యుండెను. అట్టి సమయమునఁ జారుఁడొక్కఁడరుదెంచి, స్వామిసన్నిధి నొండొక దూరమున బద్ధహస్తుఁడై నిలుచుండెను. ప్రభువర్యుఁ డున్నట్టుండితనచూడ్కిని దాసునివంక మరలించి, "కృష్ణమూర్తి వచ్చియున్నచో రమ్మను"మని యాజ్ఞాపించెను. సేవకుఁడు సభయ భావమునవంగి మరలిపోయెను. పిమ్మటఁ గొన్నిక్షణములలోఁ గృష్ణమూర్తి మందిరప్రవేశముచేసి, పతియానతి నత్యంత వినీతభావమునఁ బార్శ్వస్థానమునందలి యుచితాసనమునఁ గూరుచుండెను. పిమ్మట శర్మయిట్లనెను.

"పరిస్థితు లెట్లున్నవి?"

"ఏలినవారి యనుగ్రహమునఁ జాల తీవ్రముగనే యున్నవి."

"మన సైన్య మెట్లు పనిచేయుచున్నది?"

"ప్రాణములకుఁ దెగించిపోరుచు, దేవరవారికి స్థిర యశము నొడఁగూర్చుచున్నది."

"లేదు — నీవుసత్యము వచించినట్లులేదు. మీ రొక సంవత్సరకాలమునఁ గూడఁ జేయఁజాలనిపని, నాఫ్రెంచిపటాల మొకదినముననే పూర్తిచేసినది. మీకృషి యింత యసంతృప్తికరముగ నుండనేల? పలుకులకును బనులకును మీరు చూపెడు సంబంధమిట్టిదేనా?"

ప్రభుని వాక్యములకుఁ గృష్ణమూర్తి కంఠము నులిమి వైచినట్టులయ్యెను. అతని వదనమునఁ గాంతిమాసెను. అతఁ డధోముఖుఁడై ఖిన్నభావమున నిట్లు విన్నవించెను.

"మాకుఁగల యనివార్యశ్రమల నేలికసమ్ముఖమునఁ గాక మఱెచ్చట మొఱవెట్టుకొన్నఁ దీఱును. పౌరులలో ననేకులు చంద్రమౌళీశ్వరుని పక్షమున నిలిచి, మము గాఢముగఁ దాఁకి, ముప్పతిప్పలఁ బెట్టియుండుట వాస్తవము. మాసంఖ్య యన్ననో మిక్కిలి యల్పము. ఈ ప్రయత్నమున మా కంతరాయములు వాటిల్లుట కిదియే ప్రబలహేతువు."

ప్రభుని వక్త్రమున రక్తిమము దోఁచెను. అతని నయనము లరుణకాంత్యుజ్జ్వలము లయ్యెను. భ్రూయుగ్మమునఁ గోపచిహ్నములు హెచ్చెను. ఇట్లనెను.

"ఆచండాలు రెవ్వరు?"

"వారు వీరని మనవియొనర్చుటకుఁ గాదు. అన్నివర్గములవారును జేరియుండిరి. అందుఁ బ్రముఖులు కాఁపులు — వర్తకులు —"

"కార్యారంభమున మన మీవిషయమై సంప్రతించుకొన్నరీతినిఁ గావింప మఱచితిరా?"

మనఃపూర్వకముగ నట్లొనర్చితిమి. అందువలన నుచితఫలమే యొనఁగూడినది. మాదార్ఢ్యవ్యాపారమున కనేకులు భీతిల్లి, మునుపడక నిశ్శబ్దముగ నిలిచిపోయిరి. నాఁడే మన ప్రతిభ యందఱకును దెలిసిపోయెను. దేవరవారి నామమొక్కొక్కనిగుండెకును గాలమైయున్నది. పసిపాపయుఁ దమ పేరువిన్నఁ బాలుద్రావ వెఱచును. గౌరవపాత్రులెవ్వరు నిప్పుడాతనిపక్ష మవలంబింప సాహసించుటలేదు."

"ఇఁక నాదుష్టుని ననుసరించువా రెవరు?"

"హితకారిణీ సంఘసభ్యులు"

"చంద్రమౌళీశ్వరుఁడు వారి విరోధవర్గమునకుఁ జెందియుండెఁగదా?"

"ఇంతవఱకట్లే నడచినది. శత్రుమండలి మనపక్షమవలంబించిన యనంతర మాతనికి హితకారిణీసంఘము శరణ్యమొసఁగినది."

"అందుఁ బ్రముఖుఁడు?"

"శివరామయ్య. అతనినుండియే చంద్రమౌళీశ్వరున కింతకాలము రక్షణము పొసఁగినది. తక్కినవారును సామాన్యులని తలఁపరాదు."

శివరామయ్యయెడలఁ గృష్ణమూర్తి కించుక విరోధభావము. దానిఁ దీర్చికొనుటకిది మంచియదను. స్వామి యేమి సెలవిచ్చునోయని, కృష్ణమూర్తి యేలికవంక సతృష్ణనయనుఁడై చూడఁదొడఁగెను.

"కాదు—వారినుండి యిట్టిపని కాఁజాలదు. వారిందుల కెంతమాత్రమును సాహసింపఁ జాలరు. అది రమణినుండియే జరగియుండవలెను. దాని చరధనమెల్ల హరించి మన ధనాగారమునఁ జేర్పించితివా?"

"అందులకింకను బూనలేదు."

ప్రభుఁడు క్రోధఘూర్ణిత లోచనుఁడై,దండతాడితవ్యాళరీతిఁ గృష్ణమూర్తివంకఁ గుటిల దృక్ప్రసారముల నిగుడించెను.

"ఛీ! దుర్బలహృదయుఁడా! అందుల కింత కాలమేల తామసించితివి?"

సేవకుఁడు దిగులుపడలేదు. అతని ముఖమున నెట్టివికృతచిహ్నములును బొడసూపలేదు. స్థిరప్రశాంత హృదయుఁడై సుస్మితభావమునఁ గృష్ణమూర్తి యిట్లనెను.

"తామసించుట మనకుమేలే. ప్రయోజనకర విషయములలోఁ ద్వరపడఁ దగదని భృత్యునకేలినవా రాజ్ఞాపించియున్నారు. ఆమె చంద్రమౌళీశ్వరునిఁ బట్టియిచ్చెదనని వాగ్దానము చేసియున్నది. అది తెలిసిన యుత్తరక్షణమే రమణియింటికిఁ గన్నము వేయింప నిశ్చయించుకొంటిని; కాని శివరామయ్య సంపూర్ణముగ నిందుల కడ్డంకియైయుండుటచే మనపని వెనుకాడుచున్నది."

"కొంతడబ్బు ముట్టఁజెప్పి వానిని లొంగఁదీసికొనుము"

"అతనికి ధనాశ లేదు; కనుక నందులకు లోనుగాఁడు."

"శివరామయ్య దరిద్రుఁడు కాఁడా?"

"గర్భదరిద్రుఁడే; అయినను ధనమునకు లొంగఁడు. అతని యిల్లొక పూరిగుడిసె."

"మంచిది—వాఁ డందుండఁగా దానికి నిప్పుముట్టించునట్లు సేవకుల కాజ్ఞాపించుము"

ప్రభుఁడు తన కానుకూల్యముగఁ దీర్పుచెప్పుటచేఁ గృష్ణమూర్తి మిగుల హర్షించెను. తదుపరి నీ విషయముగ నాతఁ డేదియో కొంతతడవు చింతించుచుండెను.

"చంద్రమౌళీశ్వరున కిప్పుడు ధనసాహాయ్య మాఁగిపోయినదా?"

"లేదు—ఒకానొక వర్తకుని యాదరువున నదియిం

తను సాఁగుచున్నది."
ప్రభుఁడించుక నవ్వెను. ఆనవ్వుసంపూర్ణమైనదికాదు.
హృదయపూర్వకమైనదియుఁ గాదు. మఱి ప్రేమాస్పదమును
గాదు. దాని కర్థము వేఱు. మానవ ప్రపంచమును గీటకలోక
ముగ భావించుటయే దానియందలి పరమార్థము. కృష్ణమూర్తి
యాకీలకము నెఱింగి యిట్లనెను.
"టేకూరి నారాయణనుగూర్చి దేవరవారు వినియే
యున్నారు. మనపురవాసులలో నాతఁడే కలవాఁడు. కనుక నే
గర్వించి కనుగానక మెలఁగుచున్నాఁడు."
"జాగుసేయక నేఁటిరాత్రియే వానియిల్లు కొల్ల గొ
ట్టించుము".
కృష్ణమూర్తి మాటలలోఁ గొంచెము నిజమున్నది.
టేకూరి నారాయణ ధనికుఁడగుటవాస్తవము; కాని పీఱిఁడి
కాఁడు. కృష్ణమూర్తికి నారాయణ నిష్కారణవైరి. అందుచే
నాతని వినాశముగఁ గల్పనమావశ్యకమయ్యెను. నారాయణ
యాతనియెడఁ గావించిన నేరమేమి? కృష్ణమూర్తి యొకనాఁడు
చుట్టముక్కలకట్ట నొకటిబంప నాతని కాజ్ఞాపించెను. కాలవశ
మున నాతనియంగడిలో నదియే కొఱవడియుండెను. అది కార
ణముగ నాతనిపైఁ గుట్ర - అతని యిల్లుకొల్ల.
కృష్ణమూర్తి యజమానునితోఁ బ్రస్తావింపఁదగిన యం
శ మింక నొక్కటిమాత్రమే మిగిలి యుండెను. అది చంద్రమౌ
ళీశ్వరుని శిరచ్ఛేదనోద్యోగమును గూర్చినది. తల దఱుగుట
యన నాతనికిఁ బుడకవిఱుచుట వంటిది. ఆత్మభయమొక్కింత

యును లేక, నిరంతర మత్యుత్సాహముతో నిందులకై నిరీక్షించియుండుట యాతనికిఁ బరమ సంతోషము.

"చంద్రిమాళీశ్వరునిఁ గూర్చి యేలిన వారేమి యాజ్ఞాపింతురో!"

"ముందు శారద విషయమై పరిష్కరింపఁ బడవలసియున్నది."

"తమ చరణసేవకున కీ యల్పకార్యమెంత? జేపటితో నది చక్కఁబడఁగలదు."

"ఔను—ఆపని యావశ్యము కాఁదగియున్నది. అనంతరము చంద్రిమాళీశ్వగుని దుర్గాంబికకు బలి యొసఁగు నట్లాజ్ఞాపింప వలసియున్నది. తదుపరి నాతని యాస్తులనెల్ల మనకోశమునఁ జేర్పింపవలసి యున్నది. ఈవిషయమున మిగుల నప్రమత్తతతోఁ బ్రవర్తింపవలసి యున్నది. సీతయెక్కడ?"

"లలితోపవనమున నున్నది."

లలితోపవనము సీత గృహారామము. ఆమె విరామ సమయములయందెల్ల వినోదార్థము మహారాణివలెఁ గాలముఁ బుచ్చుట యచ్చటనే.

"ఒక్కమాఱు నన్నిచ్చటఁ గలిసికొని మాటలాడవలసిన యావశ్యకమున్నట్లు, సీతకుఁ జెప్పింపుము. ఈవృత్తాంతములనెల్ల నామెకుఁదెల్పి, ముఖ్యముగ నీ విషయములయందామె సహాయ్యముఁ బడయుము. ఆమె నేమరించి యేపనియుఁ జేయవలదు."

• "ఆజ్ఞానుసారము"

ప్రధానుఁ డత్యంత వినయావనతముఖుఁడై ప్రభున కెఱఁగి యటనుండి క్రిందికిఁబోయెను.

ఇరువది యెనిమిదవ ప్రకరణము.

ఎంత భయానకము!

"రండు—చిన్నోజిగారూ! కూర్చుండుఁడు." అని ముఖమున నానందజ్యోతులు తాండవింప శివరామయ్య పలికెను. అతఁడొక నాఁటిరాత్రి, సుమారు పదిగంటల సమయమునఁ దనయింటఁ గూరుచుండి, చిన్నోజికొఱకు నిరీక్షించియుండెను. చిన్నోజియు నప్పుడప్పుడే యాతనికుటీరముఁ జొచ్చెను.

దస్యనాథునిఁ గనిపెట్టుటకయి చిన్నోజియు రూపసింగును జాలకాలము గ్రామాంతరములయందే కడపిరి. రమారమి యైదాఱు సంవత్సరములుగ వారివిషయమై పరిశ్రమించిరి. వారిప్రయత్న మన్నివిధముల విఫలమేయయ్యెను. ఈ యన్వేషకులు జన్మస్థానమును నితాంతముగ వదలి, నేఁటికి రెండు వత్సరములయ్యెను. వారిమధ్య నెన్నఁడును దమపురమునకువచ్చియుండలేదు. కనుకఁ బట్టణస్థితిగతు లీవలవారికంతగాఁ దెలిసియుఁడలేదు. స్వస్థలము చేరినతోడనే వారు ప్రాణమిత్రుఁడగు శివరామయ్యనుజూచి, యాతనితో సర్వవిషయములు మాటాడ సంకల్పించుకొనియుండిరి; కాని చిన్నోజిమాత్రమే శివరామయ్యనుజూడఁగోరి యాతనికుటీరముఁ జేరవచ్చెను. నాఁటి వెన్నె

లరాత్రిలో హుస్సేనువనమున నొండొరులు సందర్శించుకొన్నది మొదలింతవఱకు నా నెచ్చెలు లెచ్చటను 'గలిసికొనియుండ లేదు. ప్రియసఖుని మరల నీపాటికిఁజూడఁ దటస్థించి నందులకు శివరామయ్యమిగుల సంతసించి, కటోపరితలమునఁ గూరుచుండ నాతనిఁ బ్రార్థించెను. అతఁడును సుస్థిరప్రసన్న భావగర్భితుఁడై శివరామయ్య మ్రోల నాసీనుఁడయ్యెను.

శివ—ఎక్కడ? రూపసింగురాలేదా?

చి—నాతోవచ్చుచుండి యవసరకార్యమున నాతఁడు రామసాగరమున నాగెను. అయిన నీవఱకే వచ్చియుండవలసి నది. జాగేలయయ్యెనో—

శివ—మీరు నేఁటియుదయమే విచ్చేసితిరని వింటిని. అందువలననే మీకొఱకిప్పుడు బాలకునిఁ బంపితిని. ఆనాఁడు వెళ్ళి యింతకాలముగ గ్రామాంతరములయందే యుంటిరా?

చి—చిత్తము. బహుదినములు కల్యాణగిరి శేషనగర ములయందే వసించియుంటిమి; కాని ప్రయోజనము లేకపో యెను. ఆమాయకాండ్ర దుస్తంత్రముల భేదించుట యొంత మాత్రమును సులభముకాదు. మేముతొలుత దీని నెంతసుక రమని భావించియుంటిమో, యంత దుష్కరమేయైనది. అగాధ యటుండ నిండు. పురవిశేషములేమి? పూర్ణచంద్రయ్య మర ణించెను. చంద్రమౌళీశ్వరుఁడు మతిమాలి తిరుగుచుండెను. శారదాంబకుఁ గష్టగతి ప్రాప్తించెను. నేనీ విషయములఁగొన్ని నిమేషములకుముందే వింటిని. ఈలోపల మీరెప్పుడైన శార దాంబను జూచియుంటిరా?

శివ—చూచియుంటిని. ఆనిర్భాగ్యురాలిస్థితి చాల దుస్తరముగనున్నది. ఇప్పుడామె యుడకొత్తులోని పోక చందమున నైపోయినది. చంద్రమౌళీశ్వరుఁడామెను బూర్తిగా ధిక్కరించెను. అందులకుఁ దగిన భేదోపాయములు కల్పింపఁబడినవి. మాయలేఖలు సృష్టింపఁబడినవి. కొన్నియకర్మలు నాకంటఁగట్టఁబడినవి. ఇదియంతయు రమణివలననే జరగియుండును. శారదాంబ యెట్టి యాపదల కింకను లోనుగానున్నదో కదా?

చి—మాయపత్రముల సృష్టియేమి?

శివ—ఇది మిత్రభేదతంత్రము. మనయెడఁ జంద్రమౌళీశ్వరునకు లఘువృత్తియు, శారదాంబావిషయముగ విరక్తియు, రమణిపై గాఢానురక్తియు నెలకొనుటకు, వలయుసాధనములు నిర్మింపఁబడినవి. ఇవి కల్పనలగుటచేఁ జాలకాలము నిలువనేరవు. నిజము నిలుకడపైఁ దేలకమానదు; కానిప్రకృతస్థితిలో శారదకు ఘోరాపాయము తటస్థింప నున్నదను సంశయము నాలో దృఢపడినది.

చి—ఎవరివలన?

శివ—మీకీవృత్తాంతము సమగ్రముగఁ దెలిసియున్నట్లులేదు. ఆ దుష్టాత్ముఁడు — చినవీరశర్మ — యామెను వశపఱచుకొనఁదలఁచి, యాంతర్యమునఁ గృషిసల్పుచున్నాఁడు.

చి—అయినచో నిచ్చటనుండుట శారదాంబకీఁ క శ్రేయస్కరముకాదు. ఆమెను బితృగృహమునకుఁ బొమ్మని చెప్పుటమేలు.

శివ—అట్లు తలఁచియే యుమాపతి యామెను గొని

పోవుట్కైవచ్చియుండెను. ఈవిషమదశలోఁ దనవిభు నిచ్చటవదలి, యామెమాత్రము పుట్టినింటనుండ నిష్టపడలేదు. ఉమాపతి చంద్రమౌళీశ్వరునిఁ గనుఁగొనుటకై చాలఁబ్రయత్నించెను. చంద్రమౌళీశ్వరుఁడు మామగారికి ముఖముచూపవెఱచి, యాసమయమున రమణియింట దాఁగియుండును — లభింపలేదు. ఉమాపతి నిరాశచేసికొని స్వగ్రామమునకు మరలిపోయెను. ఆదుష్టురాలు — సీత — శారదాంబా గృహమునకుఁ బలుమఱు వెళ్ళుచు, నామెకేమేమియో దుర్బోధలుసల్పుచుఁ, దనకపటజాలమున నామెనుబంధింపఁ బ్రయత్నించుచున్నట్లున్నది; కాని శారదాంబ యామెమాటలను బాటించునని విశ్వసింపఁ జెల్లదు.

చిః—సీతవిషయమై కొంతమర్మము నాకుఁ దెలియవచ్చినది. ఆమె సామాన్యస్త్రీ కాదనియు, నసాధారణశక్తిగలదనియు, నామెవలనఁ గొన్నిరహస్యము లేవేని గ్రహించుటకు వీలగుననియుఁ గర్ణాకర్ణిగ వింటిని. ఈహేతువున నేను నేఁటి మధ్యాహ్నము లలితోపవనమున సీతను జూడఁబోయితిని. ఆమె నాకు సుకరముగ దర్శనమొసఁగినది. సంతోషముతో నన్నాహ్వానించినది. గౌరవభావమున సత్కరించినది. అనురాగపూర్వకముగ మాటలాడినది. ఇప్పు డామెమనస్సు పూర్తిగా మాఱిపోయినట్లున్నది. ఈ వఱకున్న యలక్ష్యము—క్రోధము—వాక్పారుష్యము — మున్నగు చిహ్నములేవియు నామెహృదయమునఁ దోఁచుటలేదు. ఇంతశీఘ్రముగ నామె మాఱియుండుట నాకుఁ బరమాశ్చర్యముఁ గొల్పుచున్నది. శారదాంబా

సంయోగమే యింతకును గారణమైయుండునని మీమాటను బట్టి నేనూహించుచున్నాను.

శివ—సీత సామాన్యస్త్రీ కాదనుట నిజమే. నిన్నామె యాదరించుటయు నాశ్చర్యకరమగు నంశమే. అందులకేదియో ప్రబలకారణ ముండవలయును. లేకున్న నామె యట్లు సులభురాలై యుండదు. నీ వా యువతిని సందర్శించునెడఁ జాల మెలఁకువ గల్గి యుండుట మేలు. ఆ ప్రాణాంతకురా లెట్టిజాడలో తీసి నిను విపత్సాగరమునఁ ద్రోయఁదలఁచి యుండును.

చి—అందులకుఁగారణము లేశమును లేదు. నేనామెతో సంభాషించునపుడు కనుగల్గియే యుంటిని. చాల సూక్ష్మ దృష్టితో నామెస్వభావమును గమనించితిని. ఆమె ప్రకృతి మారినది. నిశ్చయముగ నామె విశ్వసనీయురాలుగఁ దోఁచుచున్నది.

శివ—నీవు ప్రమాదవశుఁడవై యుందువు. ఎప్పటికినిసీత నమ్మఁదగినస్త్రీ కాదు. ఈమూఁడులోకముల నాసాహసికురాలు తనజిహ్వాగ్రమునఁ ద్రిప్పఁగలది. ఆమెమాటల కర్థములు రెండు. వాని గ్రహింపఁ జినవీరశర్మవంటి మాయకాండ్రకుఁగూడ నశక్యమే యగును.

చి—ఔను. ఈవఱ కట్లేయుండును. నేఁడామెధ్వనులలో నెట్టి యంతరార్థమును స్ఫురించుట లేదు. నాతో మాటాడునపుడామె వదనదర్పణ మాద్యంతము నిర్మాలిన్యముగనే యుండెను. ఆ సందర్భమున నీర్ష్య — కపటము — ద్రోహము — లవమేని యేభాగమున దాని నంటియుండ లేదు. ఈ విషయమున నేనిం

చుకయు భ్రాంతికిలోనై యుండదని దృఢముగఁ జెప్పఁగలను.

శివా—అయినచో నామె యేయంశమునుగూర్చి ప్రస్తావించినది?

చి—'చేసినపాపము చెప్పినఁదీఱు' నని తన బాల్యచరిత్రము నాద్యంతము వినిచినది. తాను కల్పించుకొనిన భయంకరపాపతాపముచేఁ దీవ్రవేదన ననుభవించుచున్నది. దాని పరిహారముకొఱకుఁ గాకున్నను జనహితార్థమైన, నీకు మీఁద సత్కార్యాచరణమునకుఁ బూన మనఃపూర్వకముగ స్వీకరించుకొన్నది. ఆవిషయమై మనతోడ్పాటు నర్థించుచున్నది. అందువలన మనప్రయత్నము లన్నియు సఫలములగునట్లునన్నుఁ బలికినది.

శివ—ఎట్టి కర్కశహృదయుఁడగు మానవుఁడైనను సత్సహవాసకారణమునఁ గేవల దయామయస్వాంతుఁడగుట సహజము. అట్టిచో నొకయబల శారదాంబవంటి యుత్తమశీలవతీ లోకోత్తర హితోక్తులచేఁ గరఁగిపోవుట యొకవింత కాదు. సీతనుఁబోలు కలుషకర్మిణి సన్మార్గవర్తిని యగుటకంటె మనకిఁకఁ గాంక్షింపఁ దగినది లేదు. ఆమె యేవిషయమున మన సాహాయ్యమపేక్షించినది?

చి—అదియే రహస్యము. ఆవిషయమునుగూర్చి యిప్పుడేమియు విశదపఱుపఁ దలఁచుకొనలేదనియు, సమయమువచ్చినప్పుడంతయు వ్యక్తముకాఁగలదనియు, నే నర్థించిన తఱి మీరగ్నినుఱుకవలసియున్నను వెనుదీయక సంసిద్ధముగ నుండవలెననియు, నందుల కియ్యకొనినచో మీతోడుఁ గాం

క్షింతుననియు నుడివినది. ఇందునుగూర్చి మీయభిప్రాయ మెట్లుండుననదియుఁ దెలిసికొని తనకు నేఁటిరాత్రియే తెలుపు మన్నది.

శివరామయ్య భావాంతరమగ్నుఁడై కొన్నిక్షణములు గడపెను. అనంతరము నిశ్చింతుఁడై యిట్లనెను.

"క్రియావంతు లెప్పటికి నవసరపడరు. సీత చక్కఁగా యోజించియే మాటాడినది. ఆమె కార్యదక్షురాలగుటచే వేగిరపడి రహస్యము వెలివేయ సాహసించియుండదు. ఇదియా మెకు సహజలక్షణమే. మన మింక నుపేక్షింపఁజనదు. ఈతరుణమున నామెతో నేకీభవించి పరిశ్రమించుట యామెయున్నతిని గాపాడుటకేకాక తన్మూలమున గాఢములగు మర్మముల నెన్నిఁటినో కనుఁగొన మనకవకాశము లభింపవచ్చును; కనుక నామె ననువర్తించుటలో నింక వెనుదీయుట క్రియావంతుల కుచితలక్షణమై యుండదు. ఆమె చినవీరశర్మనుగూర్చి యేమేని చెప్పెనా?

చి—ఆప్రస్తావమే రాలేదు. ఆమె చినవీరశర్మనుదల పెట్టనేలేదు. సందర్భవశమున నేనే యాతనిపేరు తీసితిని. ఆతని నామాక్షరము లామెచెవులకు ములుకులవలెఁ దాఁకినట్లు గ్రహించితిని.

శివ—అయినచో నిది యామె శుభోదయమున కాస్పదమగును. నీవు చినవీరశర్మను జూచి మీపరిశోధనవిషయ మేమియు సంప్రతింపలేదా?

చి—అతఁడెవ్వఁరికిని దర్శనమీయఁడనుట సరియేకదా?

నేను నేఁటిసాయంకాల మాతని ప్రధానుఁడగు గృష్ణమూర్తినిమాత్రము చూచి మాప్రయత్నములఁగూర్చి చాలసేపు మాటలాడితిని. పురవిషయమగు బ్రస్తావమును గొంత తెచ్చితిని. కాని యాతఁ డిట్టియుద్దేశము లేవియుఁ గనఁబఱుపలేదు. ఈవలఁ జినవీరశర్మ పూర్తిగా విపథగామియైనట్లు తోఁచుచున్నది. పరమసాధ్వియగు శారదాంబవిషయమై నిష్కారణముగ నాతఁడిట్టి ధర్మఘాతుకక్రియ కేలయొడిగట్టెను?

శివ—నిర్హేతుక కలహకారకులును, పరధన పరవధూ వాంఛాపరతంత్రులును, దయావిహీనులును, నగు దుష్టమానవులకుఁ గారణము లేమికావలసియున్నవి. వారికది నిసర్గము. చినవీరశర్మ స్వభావసిద్ధముగ భయంకర కాలసర్పమునుబోలిన వాఁడనుట వాస్తవము. సంవత్సరమునుండి బాహాటముగ నాతఁ డగపఱచెడు చర్యలవలన నిది వ్యక్తమగుచున్నది. చంద్రమౌళీశ్వరుఁ డట్టి క్రూరపన్నగప్రష్ఠమును బొడిచి, దాని విషదంష్ట్రపుఁగాటునకు గుఱియయ్యెను.

చి—ఎట్లు?

శివ—మహాశివరాత్రినాఁడు తన నాట్యశాలయందుఁ, జంద్రమౌళీశ్వరుఁడు కృష్ణమూర్తినిఁ బరిభవించెనఁట! అది కారణముగ నాతని భృత్యవర్గమునకును జినవీరశర్మ యనుచర మండలికిని గలహ మారంభమై, నానాఁట నభివృద్ధిఁజెంది, చివరకు భయంకరరూపమును దాల్చెను. కృష్ణమూర్తియొక్క దౌష్ట్యములకు జడిసి బహుదినములనుండి చంద్రమౌళీశ్వరుని నాశ్రయించి, యాతనివలన నపరిమిత సాహాయ్యముఁ బొందిన

నాటకసమాజికులు, తెరలు — దుస్తులు — విద్యుద్దీపములు — మొన్నగు పరికరములను జిక్కినవారు చిక్కినకొలంది నమ్ముకొని, తమ్ముఁ బ్రాణమిత్రులుగఁ దలఁచి, తమకై నానాశ్రమలకులోనయి, తమ తోడ్పాటును మిగుల నపేక్షించియుండిన చంద్రమౌళీశ్వరు నీ దుస్థితిలో — నిట్టి యసహాయదశలో వదలి, యాత్మసుఖపరాయణ హేతువున నాసభ్యులు ధనాశచేఁ జినవీరశర్మ పక్షమునఁ జేరి, తమ్ము నెంతయు విశ్వసించియుండిన చంద్రమౌళీశ్వరునకు మిక్కిలి ద్రోహముచేసిరి.

చి — కృతఘ్నుల చర్య లట్టివే కదా? తరువాత—

శివ—మన సాంఘికులును బురవాసులలోఁ బెక్కండ్రను జంద్రమౌళీశ్వరునకుఁ గాఁపైయుండి, చినవీరశర్మ పనిచినసేన నెదుర్కొని, మర్దింపఁజొచ్చిరి. అంతట నెంకుండియో యొక క్రొత్త పటాలమువచ్చి, చినవీరశర్మ సేవకాగణముతోఁ జేరినది. ఆపాషండు లెల్లరుఁ జంద్రమౌళీశ్వరున కుపబలముగాఁ బనిచేయుచుండిన కృషీవలులపైఁ జెలరేఁగి తీవ్రముగఁ గారించిరి. వారి కపిల గుట్టలను బడఁద్రోసిరి. గడ్డివాములను దగులఁబెట్టిరి. గృహములఁ గొల్లలాడిరి. గోవులను వధించిరి. పసుల మందలఁ ద్రిప్పిరి. పైరులను బరశురామప్రీతిఁ గావించిరి. బావులను బూడ్చిరి. మానవతులగు స్త్రీల నవమానించిరి. వనములు నఱికిరి. ఇంకను మహాపచారకార్యముల నెన్నింటినో గావించిరి. ఈ దారుణకృత్యములకు మిక్కిలిభయపడి, యాజనులందఱు నొక్కుమ్మడిఁ జంద్రమౌళీశ్వరుని నట్టి యనాథస్థితిలో జాఱవిడచిరి.

చి—ఆహా! ఆ ద్రోహాంతకుల నెవ్వరెదురొడ్డి నిలువ సాహసింతురు?

శివ—మన హితకారిణీమండలి మాత్రమింకను దమ విశ్వాసమును గోలుపోవలేదు. చంద్రమౌళీశ్వరుని ప్రాణరక్షణమే మండలికిఁ బరమకర్తవ్యముగ నున్నది. అతని నెందును వెడలనీయక మేమిప్పుడు గూఢముగ నొకయింట నునిచి యున్నాము.

• చి—మేలు. మీరు మంచిపనిచేసితిరి. అనరాధములు—అపశుమారకులు—చంద్రమౌళీశ్వరునిఁజూచినచోఁ, గడికండలు చేయక విడువరు. పురమున నలజడి మిక్కిలి హెచ్చియున్నట్లు • తోఁచుచున్నది. ఆహా! ఒక్క మాన్యకుటుంబ మంతరించినంతనే, నిరంతర సౌఖ్యదాయకమగు పట్టణ మెట్టి యధోగతి నందెను? ఇందుఁ బ్రశాంతము చక్కఁగ నెలకొను దనుక, మీరు చంద్రమౌళీశ్వరునిఁ జాల మెలఁకువతోఁ గాపాడ వలసియున్నది. అతఁ డిప్పటికైన రమణినిఁ బరిత్యజించెనా?

శివ—లేదు. రమణియే యాతని కాత్మసామ్రాజ్యమై యున్నది. ఆమెను వదలినచో నతఁడు జీవించునట్లులేదు. రమణియుఁ జంద్రమౌళీశ్వరుని నుండి సమస్తైశ్వర్యముల నాకర్షించి, యాతనిఁ బిచ్చిచేసి, సారమింకను గలదనునాశతో నిరీక్షించియున్నది. ఆమెయింట నాతనిని మేము విధిలేక రహస్యముగ నుంచియున్నాము.

చి—మీరుమాత్రము మాపాషాణహృదయుల యుపాయములనుండి యెట్లుతప్పించుకొనుచుంటిరి?

శివ—అయ్యో! ఆరాక్షసు లెవరిని విడిచిరి?

చి—చెప్పఁడు, చెప్పఁడు. మీావిషయమై యేమి జరిగినది?

"చూడుఁడు........."

శివరామయ్య యిట్లు పలుకుచుండ, ననంతరధ్వనులు వినఁబడనంతటి గభీరస్వరమున, నెటనుండియో 'ఝుంయి' మని భోరన నొక్క పెనుగాలి వీతెంచెను. ఆపవనవేగమునఁ గాఁబోలు నుత్తరక్షణముననే యాకుటీరద్వారము మూసికొనిపోయెను. తమ రహస్యభాషణము నన్యు లాకర్ణింపకుండుట కదియుఁ గొంత తోడ్పడినదని వారు భావించుకొనిరి. అల్పకాలముననే యాయింటఁ గొలఁదికొలఁదిగఁ బొగ ప్రవేశించుచున్నట్లు వారికిఁ బొడఁగట్టెను. పార్శ్వగృహవాసు లాహారపదార్థములు పచనము సేయుచుండ, నాచిన్నయింటఁ బొగరాయుట సహజమై యుంటచే, వారందుల కాశ్చర్యము నొందలేదు. నిముసములుగడచుకొలఁది నాధూమవ్యాప్తియు నధికమగుచుఁ, గొంత సేపటికాయల్పమందిరమున నది నాంద్రముగఁబర్వి, యాపురుషు లనంధప్రాయులనుగఁ జేసివైచెను. అనంతరము వారిహృదయమున నొకభయంకరసంశయ ముత్పన్న మయ్యెను. అదియంతయుఁ గొన్ని క్షణములలోనే సంభవించెను. వా రాపరిణామమునుగూర్చి యోజించుటకు వీలులేనంతకాలములోఁ — దృటిలో—హఠాత్తుగ నాకుటీరోర్ధ్వభాగమున, నొకదిశయందుఁ బెద్ద నిప్పుమంటవారికి గోచరమయ్యెను. "ఓహో! ఇల్లు తగులఁబడిపోయినది. చిన్నోజీగారూ! వెలికిఁబోవుదము రండు." అనుచు,

శివరామయ్య ధీరచిత్తుఁడుగనుక తొట్రుపాటునొందక జ్వాలప్రకాశసాహాయ్యమున మిత్రునితో ద్వారమును సమీపించి, దానిఁదెఱువఁబోయెను; కాని యాబోరువాకిలి కదలలేదు. దానికి వెలుపల గొళ్ళెము పెట్టఁబడియుండును. అహో! వారికిఁకగతియేమి! ఏద్రోహి యిట్లుచేసెనోకదా? శివరామయ్య బలముకొలఁది నాద్వారమును లాగెను. అదియీషన్మాత్రమైనఁ జలింపలేదు. అయ్యో! వారేమిచేయుదురు? స్వీయప్రాణరక్షణమునకే దారిలేకపోయినది. ఆపురుషులిద్దఱును దమజీవితముల కొక్కమాఱు జలాంజలి వదలుకొనిరి. ఒక్కముహూర్తకాలములో నాజ్వాలశిఖ లనంతముగ బహుముఖవ్యాప్తినొంది, వాయుమండలమునఁ గలిసిపోవుచుండెను. ఆకీలాభీలదవానలమున, వారిహేమసదృశకాయములు భస్మీభూతములైపోయెనా? ఓరా! ఎంతభయానకము!

ఇరువదితొమ్మిదవ ప్రకరణము

తోఁడునీడ.

గురు—గమనించుచుంటివికదా? వత్సా! పికనాయకమణి పంచమస్వర మభ్యసించి, తన మనోహర మధురగానముచేఁ బాంధులకు శ్రోత్రానందముఁగలిగించుచున్నది. మయూరరాజము వివిధవర్ణ సంశోభితమగు బర్హమును విచ్చి, తన శృంగార నాట్యతరంగములచేఁ బథికులకు నేత్రానందముఁ

గోల్పుచున్నది. పిపీలిక యెంతచిన్నజంతువో యది యిసుకలో సమ్మిళితమైన శర్కర నెట్లు గ్రహించుచున్నదో చూచుచుంటివి. ఒక యల్పపక్షియగు మక్షికము కోమల కుసుమగర్భమునుఁజొచ్చి, యందలి మధువు నాస్వాదన మొనరించుటలో, నది చూపెడు నైపుణ్యమును విలోకించుచున్నావు. కీటకసంచయము నేరి తినుటకై, భూతలమున నడయాడుచుండు పారావతమును హరింపఁ, దారామండలమున సంచారముసల్పు, శ్యేనవిష్కరలక్ష్యవైఖరిని గమనించుచున్నావు. చంపకసుమవాసనలకుఁ దమిఁజెంది, మృతినొందు భృంగమును—భాసమానమగు దీపశిఖ నమృతమయస్వరూపమని భ్రాంతినొంది, దాని సంస్పర్శమున మరణించు పతంగమును, నవలోకించుచున్నాఁడవు. జుంజురుమని రొదసేయుచు, శరవేగమునఁ బోయి స్వీయపక్షసాహాయ్యమునఁ దేజోవంతమగు దీపప్రభ నార్పివేయు రెక్కలపురుగును — మనుష్యశరీరమునఁ బ్రవేశించి, యాతని గర్భకుహరమునందలి కర్మకలాపమును భేదించి దైవప్రతిరూపుఁడగు మానవుని యమూల్యజీవచయమును సహిత మున్మూలించు, నొకయతిసూక్ష్మక్రిమిని నారయుచున్నాఁడవు. ఈ సాదృశ్యములచే నీవేమి గ్రహించితివి? ఒకటి పరార్థనిమిత్తము పాటువడెను. మఱొకటి స్వార్థమునకై సాధుమార్గ మవలంబించెను. వేఱొకటి సోదరపూరణార్థము క్రూరపథ మనుకరించెను. ఆనందానుభవము నర్థించి యొకటి యగ్నినఁటికి మడిసెను. మఱొక్కటి నిష్ప్రయోజనముగ నన్యప్రాణినష్టమునకుఁ బూనెను. ఒక యల్పప్రాణి సమూహమునసే

కాక, యిట్టి స్వభావముగల వర్గములు సమస్తజీవజాలమునందును వేర్వేఱునున్నవి; కాని యొక్కఁ మనుష్యజాతియందన్ననో, పైచతుర్విధ స్వభావములును గన్పట్టుచుండుట, నీకు వేద్యముకాఁగలదు.

శిష్యుఁడు విస్మయాభరిత భావమున నాలకించుచున్నాఁడు.

గురు—వత్సా! ఈస్థూలప్రపంచమును జక్కఁగా వివేచించి చూచితివేని, మానవలోకమున దేవమూర్తులును రాత్రసవ్యక్తులును నీదృష్టిపథమున నిలువఁగలరు. అన్నిఁటికొఱకు నియోగింపఁబడిన పూఁటకాఁపునని తలఁచి, స్వార్థమును నభిమానమును నితాంతముగ వదలి, నిఖిల భూతములయందును నీశ్వరమహిమఁ గాంచి, వాని సుఖాభివృద్ధికై తనజీవితము నొకఁడు ధారవోయుచు, నిర్మలనిత్యానంద పుష్కరమునఁ దేలియాడుచున్నాఁడు. ఒక్కఁడు స్వస్థానమునుండి చలింపఁడు— తృణమునైనఁ గదల్పఁడు — ఏమియు నొనరింపఁడు — చూడుము, భుజించుచున్నాఁడు; పానముసేయుచున్నాఁడు; వైభవములనందుచున్నాఁడు. వానికై స్వసుఖమును మఱచి కష్టము నొందువారెందఱు? ఒకఁ డీవిశాలభూతలమున నద్వితీయ పరాక్రమము నొడ్డి, తన వీరవిలాసమును వెలార్చి, లోక సంహారకార్యమునకుఁ బూని, జనుల విత్తమును — మందిరములను — నగరములను — జివరకు రాజ్యములను హరించి, నారీలోకమును గైవసము చేసికొని, విషయలంపటుఁడై, యథః పతితుఁ డగుచున్నాఁడు. ఒకమానవుని ప్రవృత్తుల నరికట్టి,

యాతనిఁ గల్యాణకరపథమునఁ ద్రిప్పి, యాత్మానందముఁ గూర్చుటకును — మఱొక్కనిఁ దుర్వృత్తులందు నానాముఖ వ్యాప్తి నొందించి, యమంగళకరమార్గమున నడపి, యాత్మ వినాశము నొందించుటకును — గారణమైన దొక్క మనశ్శక్తియే కదా? అట్టి దివ్యాంతఃకరణ తత్త్వమునుగూర్చి, మన మిప్పుడు యోజింతము.

శిష్యుఁ డుల్లసితాంతరంగుఁడై గ్రహించుచున్నాఁడు.

గురు—వత్సా! భగవత్సృష్టియందలి జీవజాలమున కాధారమగు ప్రాణిశక్తి. భూతకోటియందెల్లఁ బరిభ్రమించి క్రమోన్నతినొందుచుఁ, జీవులకు జ్ఞానాభివృద్ధికి మూలసాధనమై — పరిపూతమై — పూజనీయమైన మనుష్యశరీరము నారోహించుచున్నది. ఈ మానవదేహము పశుపక్ష్యాది జీవరాసుల కళేబరములవలెఁ బాంచభౌతిక పరమాణువులతోడనే సంసృష్టమయియున్నను, నందుఁబశ్వాదులకులేని పురుషార్థదాయినియగు నంతఃకరణము వెలయుచున్నది. ఇది మానవున కపూర్వమైన యద్భుతోపకరణమైయున్నది. దీనిమూలమున నున్నతిని నవనతినిఁబొందు సమర్థత, మనుజునకుఁ గలుగుచున్నది; కనుక నిది మనుష్యున కాత్మబంధువే కాక, గర్భశత్రువు కూడ నయియున్నది. మానవుఁడు మనశ్శక్తిని ధీబలమునకు వశవర్తినిగాఁ జేసికొని, యింద్రియనిగ్రహమునుబొంది, సత్య — శాంతి — దయాది విశిష్టగుణములనంది వర్తించుటచే నున్నతిని, విషయాదులకుఁజిక్కి యసన్మార్గమునఁ బ్రవర్తించుటకతన నవనతినిఁ గాంచుచున్నాఁడు. వత్సా! శరీరము రథము, ఇంద్రి

యములు గుఱ్ఱములు, మనస్సుకళ్ళెము, బుద్ధిసారధి, ఆత్మ యజమానుఁడు, నని తెలియుము. బుద్ధిసారధి హెచ్చరికనొంది, మనఃఖలీనము నీడ్చిపట్టి, యింద్రియాశ్వనికరమును దురూహలనుండి మరలించి, సత్పథమున నడపినచో — నాత్మేశుఁ డనాయాసముగఁ, దన గమ్యస్థానమగు నాముష్మికసామ్రాజ్యమును బ్రాపింపఁజాలును. కానిచో నింద్రియము లిచ్ఛానుసారమేగుటయు — శరీరము నిమ్నభూములలోఁ బతనమగుటయు — నాత్మవేదనలఁ గుములుటయుఁ గాక, క్రిమ్మఱ బంధములకుఁ జిక్కుటయు — సంభవమగును. మనోబుద్ధీంద్రియాదులు శుద్ధముగ లేని మానవుఁడెన్నఁటికి నున్నతినిఁ జెందఁజాలఁడు. మనశ్శక్తి సంకల్పకారణమున శుద్ధమును నశుద్ధమును బొందుచున్నది. మాలిన్యరహితమై సత్సంకల్పసాధనమగు మనస్సు శుద్ధమైనది. అట్టి విశుద్ధభావమున, నింద్రియాదుల నభ్యాసమువలన నేకముఖమునకుఁ ద్రిప్పి, విశిష్టగుణమార్గమున మెలఁగఁజేసి, హృదయము నీశ్వరాసక్తము గావింపవలయును. అట్టి సదభ్యాసము మానవునకుఁ బరమవిజ్ఞానము నొసఁగి, యాతనిఁ బ్రశస్తనీతిపథమునఁ గొనిపోయి, పవిత్రధర్మసోపాన పరంపరల నారోహింపఁజేసి, తుదుపరి నిర్మలప్రశాంత శాశ్వతానంద మోక్షసౌధమునఁ జేర్చును; కావున బంధమునకును మోక్షమునకును మానసము కారణమగుచున్నది.

శిష్యుఁడు సుస్థిరస్వాంతుఁడై యాకర్ణించుచున్నాఁడు.

గురు—వత్సా! పరమగురుని వలనఁ బ్రకృతియను గ్రంథము నీకుఁ బ్రసాదింపఁబడినది. అది పరమోత్కృష్టమగు

నామ్నాయరాజము. నీ వనుదినము నందొక్కొక్కపుటను దిలకించుచున్నాఁడవు. అందలి పవిత్రసూత్రములను శ్రద్ధతోఁ బరిశీలించి, వానిలోని పరమార్థమును గ్రహించుచుంటివా? తత్ప్రయత్నఫల మానందరూపమున నీమనోదృష్టికిఁ బ్రత్యక్షమయ్యెనా? కానిచో నిష్కళంకస్వభావుఁడవుకమ్ము. పవిత్రహృదయముతోఁ బ్రపంచయుద్ధరంగమునఁ బ్రవేశింపుము. అందు నిన్నవరోధించెడు విపత్పరంపరల కోడక, యుత్సాహముతో వాని నెదుర్కొని, విధ్వంసమొనరించి, శాంత్యైకమార్గము ననుసరింపుము. అప్పుడు లోకము నీపవిత్రదృష్టికి సుఖమయముగ గోచరించును. జీవితజయము లభించును. మృత్యువు సహిత మానంద దాయకమగును.

నాఁటి ధర్మోపదేశమునుండి విరజానందుఁడు విరమించెను. తోడనే కనుగొలకుల నానందధారలు దొలుకాడ, శిష్యుఁడు సర్వాంగాలింగితభూతలుండయి, గురువర్యుని పాదాగ్రములకెఱఁగి యమ్మహామహుని పవిత్రాశీర్వచనములను బొంది, నిజవాసమును గూర్చిపోయెను. అనంతరము కొన్ని నిమేషములకుఁ, గొందఱుమనుష్యులు బాహ్యప్రదేశమునుండి గుహాముఖముఁ జొచ్చి లోనికివచ్చుచున్నట్లు విరజానందుఁడు గ్రహించెను. యోగీంద్రుఁ డావర్గమును దదేకదృష్టితో నుపలక్షింపఁదొడఁగెను. అందొక స్త్రీమూర్తియు నున్నట్లు స్వామి గ్రహించెను. ఆమెయెవ్వరో స్వామికి బోధపడినది. అందలి పురుషులుమువ్వురు కరదండములను నొకఁడు చంద్రాయుధమును ధరించి, సోత్సాహముగ నడచుచుండిరి. కేవల మనా

గరకతయే ప్రధానధర్మముగాఁగాని చిక్కని కాటుకవన్నె వంటి మేనిఛాయఁ గల్గి, యందులకుఁ దగినమలినాంబరములను ధరించి, చక్కఁగఁ జేవఁబాఱిన దృఢావయవములచే నొప్పిన పురుషమూర్తులు నలువురు శృంఖలాబద్ధులై — యధోముఖులై — నడచుచుండిరి. చంద్రాయుధపాణి దృఢతరశరీరి. శ్యామలవర్ణుఁడు. త్రింశద్వర్షపూర్ణుఁడు. ఆతఁడు ధరించిన వీరపురుషోచితదుకూలము లాతనుమనుష్యుఁ డొకానొక సరదారుఁడని తెల్పుటకుఁ దగియుండెను. వారెవరును స్వామికిఁ బరిచితులు కారు. ఆయపరిచితమండలి గుహాబిలముఁ జొచ్చి, యిట్లు తనకభిముఖమై వచ్చుచుండుటచే విరజానందుని మానసము సంశయమున కాస్పద మొసఁగియుండలేదు. స్వామి వదనమండలమున భావాంతరమేఘసంచలనమేమియుఁ బొడసూపలేదు. ఆసమూహమునఁ గాషాయవస్త్రాంచితులగు సన్న్యాసులు నలువురుండిరి. యోగీంద్రుఁడు వారిని శిష్యులుగ గ్రహించియుండును. ఆజనకదంబకము విరజానందుని డాయజనెను. అందుఁగొందఱు స్వామికి భక్తిపూర్వక ప్రణామములను సల్పిరి. మఱికొంద ఱట్టి యభ్యాసము నితాంతముగ లేనందుననో — లజ్జచేతనో — పరిభవకారణముననో — మఱేహేతువుననో — మిన్నకుండిరి. అనంతరము శిష్యులలోఁ బ్రముఖుఁడగు సన్న్యాసి, సవినయముగ ముందునకువచ్చి నిలిచి, సరదారునివంకఁ గేలుసూపి, యిట్లు విన్నపించెను.

"గురునాథా! ఈపురుషవర్యుఁడు సిద్ధరామపురవాసుఁడు. అందలి దుర్గాధిపుఁడగు చినవీరశర్మ కాత్మీయసోదరుఁడు.

పరదారుఁడు. ఈతఁడు భైరవేశ్వరాభిధానుఁడు. మేమీప్రా
భాతసమయమునఁ గటక ప్రదేశారణ్యమున, స్వామియాన
తిని గుశలను సమిధలను సమకూర్చుచుంటిమి. ఈపరదారుఁ
డాసందర్భముననే మాకడకువచ్చి, ప్రస్తావవశమున నిట్లనెను.
"వాక్యసరణినిఁబట్టి మిమ్ముఁ బరోపకారపారీణులని భావించి
తిని. అందువలన నాయాశాంకూరము లొక్కుమ్మడి మొలక
లెత్తుచున్నవి. ఆకస్మికముగ మీయెడ నాకుఁ గల్గిన పూజ్యభావ
మును దృఢవిశ్వాసమును నామానసమున నడఁగియున్న రహ
స్యోద్దేశ్యములఁ బ్రకటింపఁ బ్రేరేచుచున్నవి. నేఁడొక పతివ్రతా
తిలక మొకానొక దుర్వ్యాచారపరుని కాముకాగ్నికీలల కింధనము
గానున్నది. నాప్రభునిఁ జినవీరశర్మను మీ రెఱుఁగరు. అతఁడు
లోలవ్యాపారమునకు దాసుఁడగుటకతన, విదుషియు విజ్ఞా
నవతియు నగు నొక వనితారత్నమును బలోచితముగఁ గొని,తన
రహస్యభవనాంతరమునఁ జేర్చి, సేవకుల కాజ్ఞాపించియున్నాఁడు.
ఈకార్యకరణమునకుఁ బూనినపురుషుఁడు నాకేలిక యగు
టచే, నేను స్వామిద్రోహకర్మమునకు గుఱియగుచున్నట్లు,
మీకుఁ దోఁపవచ్చును; కాని నాయంతరాత్మ నన్నట్లు ప్రబో
ధించుటలేదు. నాయజమానుఁడు సలుపనెంచినది, యొకానొక
ఘోరకలుషకర్మమగుటసత్యము. ఆదేవియన్ననో పరమ
సాధ్వి. నాకుమిక్కిలియుఁ బూజ్యురాలు. నేనామె యనుఁగు
శిష్యుఁడను."

ఈవాక్యముల నాలకించుచున్నట్లెల్ల, నాత్రిమూర్తి
ముఖమండలమున విస్మయవిచారభావములు వృద్ధినొందసా

గాను. ఇంతవఱకుఁ దనకెవ్వరును శిష్యులుగ నుండలేదని యామె చక్కఁగా నెఱుఁగును; మఱి యాభైరవేశ్వరుఁ డెవ్వఁడు? అతని నింతకుఁబూర్వ మెచ్చటనో చూచియున్నట్టు లామె కుఁదోఁచెను. సంశయలేశమును లేదు; కాని యాపురుషుఁ డెవ్వఁడు? పాపమామె పోల్చుకొనఁజాలక పోయినది. ఆ నారీరత్నము సరదారునివరిక నత్యంతదైన్యవిచారమును దెల్పు కృతజ్ఞతాపూర్వకమగు దన దృక్ప్రసారమును ద్రిప్పెను. సన్న్యాసి యింకను జెప్పుచున్నాఁడు.

"ప్రమాదవశమున దుష్టులకుఁ జిక్కి, న్యాయవంచితలై పరితపించుచుండు నబలకుఁ దోడుపడుట, సుబలులకుఁ బరమవిధియేకదా? సేవకజను లామెనొక పల్లకియం దుంచుకొని బయలు దేఱిరి. వారీవఱకుబహుదూరము వచ్చియుందురు. ఈ మార్గమునంటియే వారు పోవలసియున్నది. మీ యాశ్రమమిచ్చటికి సమీపమున నున్నట్లు పల్లకితోనుండు నా మిత్రులుచెప్పిరి. మీరు నాకుఁ గేలూఁత యొసఁగ ననుగ్రహించెదు పక్షమున, నాకులపాలికా తిలకము నందుఁ జేర్చి, సంరక్షించిన మహాభాగ్యమును మనము బడయఁగలుగుదుము. వాహనము తోడనుండు పురుషు లాస్త్రీరత్నమును గాపాడ నాకుఁ దోడైన నాయనుంగు సఖులు. తదితరులైన నాయానతి నతిక్రమింప నేరరు. వాహకు లొక వేళఁ బ్రమత్తులై కార్యమున కెడమొసఁగి ప్రతిఘటించునెడల, మనమా దుండగీండ్ర, శృంఖలాబద్ధులను గావింపవచ్చును. అందులకుఁ దగిన సాధనములు నా కడ నున్నవి" అని విన్నవించెను. తత్క్షణమే మే మీపురుషుని

సదుద్యమమునకు మా యామోదమును గనఁబఱచితిమి. అంతలోఁ బల్లంకిక మాకు సమీపించెను. తదుపరి సరదారుఁడా జనుల నెదురుకొని, యందలి బోయీలతోఁ గొంత తడవు రహస్య భాషణముఁ గావించి, మముఁ దరియఁజేరి దారిఁజూపఁగోరెను. మేము వారినిఁ గొని తెచ్చి, గుహాముఖమున వాహనము నునిచి, యెందులకైన మంచిదను తలంపున వాహకులను శృంఖలానిబద్ధులఁ గావించి, యిటకుఁ దెచ్చితిమి. ఇఁకను నీ భైరవేశ్వరుని మూలమున మన మాంతర్యమున గ్రహింపఁదగిన, యపూర్వవిషయము లనేకములున్నవి. నేఁ డీ పురుషవరేణ్యుని కారణమున నీవరవర్ణినీమానరక్షణ మొనఁగూడెను. ఈమె శారదాంబ."

సన్న్యాసి యిట్లుచెప్పి ముగించెను. అతని వాత్సల్యపూర్వకవచనములు శారదాంబా నవనీతకోమల దయామయాంతఃకరణమును ద్రవింపఁజేసెను. ఆమె మృదుల స్వాంతము దుఃఖపరివృతమయ్యెను. క్లేశభరమున నాయనాథస్త్రీ కసుఁగందు తెలుఁగున గనుల నీర్వెట్టి, దైవ సన్నిభుఁడగు యోగీంద్రుని యంఘ్రియుగ్మమునఁ బల్లవ మల్లికావల్లిక వోలె నల్లన వ్రాలెను. గురుదేవుఁడు తన దివ్యహస్తయుగళి నా కృశాంగి కరయుగ్మముఁ బట్టి యెత్తి, యిట్లు వచించెను.

"కుమారీ! ఏ హేతువున నీ స్థిరహృదయ మిట్లు తప్తకాంచన విధమునఁ గరఁగి పాఱినదో—నీ ప్రవిమలేక్షణయుగ్మ మే కారణమున నశ్రుపూరితమయ్యెనో — గ్రహించితిని. పుత్రీ! నీవు సర్వాఘాతములను సైఁచితివి. నీ యుపేక్షకుఁ దగిన

విచారమార్గమును నీవు పూర్తిగాఁ గడచితివి. సుఖసామ్రాజ్యమును సుకరముగ సమీపింపఁ గల్గితివి. ప్రియపుత్రీ! ప్రాణేశ్వరునికై నీ వింకను వ్యథఁ గుందకుము. పరాత్పరుని యిచ్ఛకు మాఱొడ్డి, స్వార్థుఁడగు నొకయల్పమానవుఁ డేమి చేయఁగలఁడు? మనుష్యుని జీవిక సమస్త భూతముల శ్రేయోభివృద్ధికి సాధనభూతముగ నుండ, సర్వమును దనకొఱకు సంసృష్టమైనదని భావించి, స్వార్థమునకు దాసుఁడై — వంచనావృత్తికిఁ గింకరుఁడై — హత్యాపచారమునకుఁ గడఁగి, యా పురుషుఁడు సఫలీకృత మనోరథుఁడగునని నీ వెట్లు విశ్వసించితివి. అత్యుదగ్రహృదయ మున్నతి నొందునని యెట్లు భావించితివి?

కేవలు మధురస్వభావుఁడగు యోగిపుంగవుని దివ్యవచనముల కందఱు నత్యంత విస్మయ పరిపూరితాంతరంగులైరి. విరజానందుని యానతి నానివహ మాగహ్వాంతరము నందలి నిగూఢస్థానమునఁ జేరెను.

ముప్పదియవ ప్రకరణము

పులినోరి కండ.

ప్రవిమలాంతరిక్షమున నిశాపతి సంపూర్ణకళల విరజిమ్ముచుఁ, దన యమృతకరములను సాఁచి, రసాతలమునకు వెండిపూఁత పూయుచుండెను. శైలపంక్తులు — నందలి ఝరీపరీవాహములు — సానుతటములు — మహారణ్యభూములు —

వివిధవిధపాదపములు — నికుంజపుంజములు—గుల్మినీతతులు—సమతలములు — సర్వస్వము నా పవిత్ర శారద రజనీ చంద్రికాపిధానమున నిలిచి, సుధాంశుని కౌముదీప్రసారమున నానందించుచున్నమాడ్కి నూత్నకళలఁ దేఱుచు, సుమనోభిరామముగ నొప్పారుచుండెను.

అట్టి యాప్రసన్న యామినీసమయమున, నాయుధహస్తులగు తలవరు లిరువురొక పురుషవ్యక్తినిఁ దీసికొని, యొక విశాలమార్గమునుబట్టి నడచుచుండిరి. వారొకరితో నొకరు సంభాషించుటలేదు. పార్శ్వభాగముల నవలోకించుటలేదు. ఆక్షపామనోజ్ఞతనుగాని, క్షపాకరుని సుధామయ ప్రశాంతశీతల చంద్రికాప్రసార సౌభాగ్యగరిమనుగాని, తిలకించుటలేదు. ఆకమనీయమృదుల సౌందర్యసార సంయుతమగు సృష్టిరామణీయకమునైనఁ బరికించుటలేదు. వారుద్దిష్టకార్య తత్పరులై కాఁబోలు కడుంగడు శీఘ్రగమనులై యుండిరి. వారియుద్దేశము చాల నిగూఢమైనదే యగును. ఆ మౌనవృత్తి వారి హృదయభావములను బ్రకటించుటలేదు.

తలవరుల ననుసరించి చనుచున్న పురుషమూర్తి చంద్రమౌళీశ్వరుఁడగుట నిజము. నడచిన కథాభాగమునుబట్టి తలవరుల ప్రకృతవ్యాపారమును జదువరు లూహించియుందురు. మహాశివరాత్రినాఁ డట్లు బన్నము పడిపోయిన కృష్ణమూర్తి, చంద్రమౌళీశ్వరునిపై నకారణకలహముపూని, యా విషయముగనింతవఱకు సల్పినచర్యలు పాఠకులెఱుంగుదురు. చివరకుఁ జంద్రమౌళీశ్వరుని ప్రాణములఁ గొన్నఁగాని తనహృదయమును

విడువక దహించుచుండెడు క్రోధాగ్ని చల్లఁబడదని యాతఁడు నిశ్చయించుకొనెనుగదా? అందులకుఁ బ్రభుని యాజ్ఞయునైనది. నయముననో భయముననో రమణినిలోఁగొని, తనమనోభీష్టము నామెకుఁ జెల్పి, యందులకుఁ దోడ్పడక తీఱదని యాతఁడు వచించెను. రమణియుఁ జంద్రమౌళీశ్వరునినుండి యిఁకఁ బ్రయోజనలేశమును లేదని భావించెను. అందుచేఁ దన్నాశ్రయించి, స్వీయజీవరక్షణమునకు సర్వవిధములఁ దానే యాదరువని విశ్వసించి, తన శరణ్యమునొందియున్న చంద్రమౌళీశ్వరుని, నామె రెండువేలనిష్కముల యాశచేఁ గృష్ణమూర్తి కాంతర్యముగఁ బట్టియిచ్చెను. కృష్ణమూర్తియుఁ దక్షిణామే శిరచ్ఛేదనార్థమై, చంద్రమౌళీశ్వరుని విశ్వసనీయులగు దలవరుల వశము చేసెను. ఈయుద్యోగధర్మమును బట్టియే భటులాతనిఁ గొనిపోవుచుండిరి.

వారుచనుచున్న మార్గమున నుభయపార్శ్వముల నున్న తరూరుహములు శ్రేణులుగాఁ బెరిఁగియుండెను. వానిశాఖలు కడుదీర్ఘములై మార్గోపరిభాగమున నొండొంటితోఁ గలిసిపోయినవి. అందలి చిఱుగొమ్మలసంఖ్యాకములుగ నంతరాళమున నొకటితో నొకటి యొరసికొనుచు సాంద్రతమముగఁ బర్వి, చంద్రద్యుతులకుఁ గడుఁగడు దుర్భేద్యములై యుండెను. ఆసరణి — నాద్రుమచ్ఛాయల — నాపురుషులు బహుదూరము వెళ్ళిరి. పిమ్మట నాగ్నేయ దిశగాఁ జీలిపోవుశాఖ ననుసరించి కొంత దవ్వరిగిరి. తదుపరి నొకనిబిడారణ్యముఁ జొచ్చిరి. వారమ్మహాటవియం దాఁగలేదు. అగహనాంతరమునఁ జాల

సేపు నడచిన యనంతర మొక పర్వతాళిని సమీపించిరి. ఆభూధర మాలికామధ్యమున వారు రమారమి రెండుకోసులు గడచి యుందురు. తదనంతర మాపాంథు లొకానొక ప్రపాతముఁ జేరిరి.

ప్రపాతమున స్వేచ్ఛగఁ బెరిఁగిన ముండ్లతుప్పలును, జీకిపొదలును నిబిడీకృతములై యుండెను. వాని నడుమ నొకపురాతనాలయమున్నది. అది దట్టముగ వ్యాపించిన యున్నత భూజములచే నావృతమయి యగోచరమయి యున్నందున దాని నెఱింగిన వా రెందఱో యుందురని చెప్పుటకు వీలులేదు. పవనసంచలనమున వృక్షపత్రములనుండి బయల్పడు మర్మరధ్వనులు — మహీరుహాలతాంతర్భాగమునుండి నిరంతరము వెలువడు కీచురొదలు — గలిగి, నవీనపాంథుల కాస్థానము మిగుల భయదాయకముగ నుండును. ఆ కేదారప్రాంతముల — నానిర్జనారణ్యమున — నాయాలయమే హేతువున నందు నిర్మింపఁబడి యుండెనో యెవ్వరికిని దెలియదు. ఈచరిత్ర జరుగుచుండిన దినములలో నదిభక్తులకుఁ గాకపోయినను, నరహంతకులకైన నుపకరించుచుండకపోలేదు. ఆనిలయ మొకానొక దుర్గాలయము. దానికొక మండపమును గర్భాలయమును నుండెను.

మననైస్త్రింశికు లాపురుషునితోఁ బొదరింటి గుంపుల నెల్లఁగడచి, వృక్షవాటికలనుదాఁటి, నిర్భయముగ నాలయప్రవేశము చేసిరి. అందలి భిల్లులలో నొకఁడు గర్భమందిరముఁ జేరి, తన కృపాణము నం దొకమూల నునిచి, యందలి దీపమును వెలిగించి, దుర్గకుఁ గుంకుమము వెట్టి, ధూపారాధనముఁ

గావించెను. అతఁడు దేవిపాదములకు సాగిలపడి ప్రణామములు సల్పి, పిమ్మట సోదరుని హెచ్చరించెను. వెంటనే ద్వితీయుఁడు తనపార్శ్వభాగమున నిలువఁబడియున్న, గాఢవిషాదపరితప్త మనస్కుఁడగు నాచంద్రమౌళీశ్వరుని వదనమునఁ జాలుకు చూపుల నిగిడించుచు "ఓయీ! తల్లినిజూచి మ్రొక్కు-కొనుము. జాగు సేయవలదు. నీకాయు వెంతో లేదు. మేమిప్పుడే నీతల నఱికి యీదుర్గమ్మతల్లికి బలిపెట్టెదము. ఇది మా యేలినవారి సెలవు." అనెను.

నిరంతర విచారాగ్నికీలలచే దహించుకొనిపోవుచుండిన చంద్రమౌళీశ్వరుఁడు కొంతతడవు మిన్నకుండి, పిమ్మట నశ్రుధారాపూర్వకముగా నిట్లు పలుకఁదొడఁగెను.

గీతము—

"అకట! నాజన్మఫలమిట్టు । లయ్యెనేమి?
కులసతినిబాసి ప్రాణ మి । త్రులనురోసి
బంధు సంగతివీడి సం । పదలనోడి
యామయంబులఁ బొంది సౌ । ఖ్యములడింది
యార్తి చేఁగుంది వెస నప । కీర్తిఁబొంది
కేరడంబులఁ జెంది దు । ష్కృతము నంది
రమణి! నీవునా యాత్మ సా । మ్రాజ్యమనుచు
నీవదేహంబు — ప్రాణంబు । నీవ యనుచు —
నీవ పతి — నీవగతి — భాగ్య । మీవయనుచు —
నీదు ప్రేమప్రకర్షంబు । నిక్కమనుచు
నీమధుర భాషణంబులు । నిక్కమనుచు
నీ విరహతాపవైఖరి । నిక్కమనుచు
నమ్మియుంటిని — నీప్రాపు । నమ్మియుంటి—

నాకు సర్వస్వ మీవని । నమ్మియుంటి
నాకు నీద లోకంబని । నమ్మియుంటి
నన్ను నెడఁబాయవని కడు । నమ్మియుంటి
నాశలిమ్మెయి వ్యర్థమ్ము । లయ్యెనొక్కొ!
యన్నిఁటను శూన్యఫలమె నా । కబ్బెనొక్కొ!
ఈవు చూపిన ప్రణయ ము । దేమియయ్యె
నీవు చూపిన వలపది । యేమియయ్యె
నీవు చేసిన ప్రతినసేఁ । దేమియయ్యె?—
మించు సౌఖ్యంబునించి, న । మ్మికలు పెంచి,
సర్వము హరించి, చివరలం । దను గడించి,
అతివ నాజీవరత్న చ । యమ్ము నిట్లు
నావిరోధికి — ద్రోహికి — । న్యాయమట్లు
చెల్లఁబో! విక్రయింపఁగఁ । గల్గెనెట్లు
చేడె! ఇటు సల్ప నీకుఁ జే । యాడెనెట్లు
ఇట్టి యన్యాయమునకోడి । గట్టితేల
ఇట్టి విద్రోహపథమును । మెట్టితేల?—
కూళ! నీదేహమది వహ్ని । కీలగాదె?
పలుకులను రత్నఖచిత శృం । ఖలలుగావె?
కంఠము విషంబు — హృదయంబు । కత్తెరగద?
మాయమర్మంబుల వెలార్చి । మరులఁ బేర్చి
ప్రాణకాంతపై నెంతో వి । రక్తిఁ గూర్చి
సఖిని నెడలించి సంసార । సుఖమడంచి
సారముఁ దొలఁచి పెంచి వి । చార మాత్మ
ధనమునొక్కడఁ గానుక । ధారవోసి
మించితిరె? లోవెలందుల । మేల్మి ప్రేమ
మిదియెయో? ఎవ్వఁడు మిమ్ము స్ప్ర । శంప నేర్చు
విశ్వసించితి నే నవి । వేకమతిని—
మందుఁడను — బొందనున్నాఁడ । మరణపదవి
'భోగవనితల నమ్మంగఁ । బోల' దనెదు

శిష్టజనవాక్య మనుభవ । సిద్ధమయ్యె—
శారద! విశారద! యరయ । పారసుఖముఁ
బొంద నను బెండ్లియాడి నీ । వందినట్టి
భోగభాగ్యమె శోకమై । పాపఁగ నేఁడు.
కావ నాప్రాణ తమవంచు । నెంచనైతి
నీవు ధర్మదేవతవని । యెఱుఁగనైతి
నీవుచూపిన పథము మ । న్నింపనైతి
నీవమితపింపఁగాంచి చిం । తింపనైతి
సేవ సర్వవిధమ్ముల । నెమ్మెదొఱఁగి
నిన్నుఁ గారియపెట్టిన । నీచతముఁడఁ
గానఁ బొందంగనుంటి దుః । ఖంబు; నీకు
దూరమగుచుంటి — ప్రాణంబు । దొఱఁగుచుంటి—
ప్రేయసీ! నేరములఁ దల । పెట్టఁబోకు
కష్టచయముల నిఁకను వ । గర్పఁబోకు
మీ పరమఘాతకుని మది । నెన్నఁబోకు
మఱచిపొమ్మిఁక—దేవి! న । న్మఱచిపొమ్ము—
ఓపరాత్పర! లోకేశ! ఓమహేశ!
నేఁడు నాప్రాణభిక్ష ని । న్వేఁడఁబోను
అఘవిముక్తిని గుఱించి ని । న్నడుగఁబోను
గురుత రాముష్మిక సుఖంబుఁ । గోరఁబోను
తోడుసర్థింపఁబోను — నా । వేఁడుకోలు
నాకొఱకు సర్వవేళల । శోకవశతఁ
గుందుచుండు నర్ధాంగినిఁ । గూర్చి కాన
నామెదుఃఖాశ్రువుల నాఁపు । మంతెచాలు—

ప్రార్థనానంతరము చంద్రమౌళీశ్వరుఁ డవనతముఖుఁడై కరబద్ధుఁడై మిగుల దీనాననుఁడై నిలుచుండెను. ఆ నిశితకరవాల మాదీపశిఖలనడుమఁ దళతళలాడుచుఁ, జంద్రమౌళీశ్వ

రుని శిరఃఖండనముఁ గావించి, యాతని వేఁడి రక్తమును బాన ముసేయఁ దహతహపడుచున్నట్లు, భిల్లునిహస్తమున నటునిటు కదలుచుండెను. ప్రార్థనము ముగిసినతోడనే వధోద్యోగ నిరతుఁడగు నైస్త్రింశికుఁ డాసంతాప సంతప్తచిత్తుని ముందునకు లాగి, తనవామహస్తమున నాతని సిగఁబట్టి వంగఁజేసి, శిరచ్ఛేదనమొనర్చుటకై యాతని గళమున లక్ష్యమిడెను. ఆదీన మానవుని శరీరము స్వేదజలకణాకీర్ణమయ్యెను. ఉగ్రస్వభావుఁడగు భిల్లుఁడు తనదక్షిణ భుజమునందలి మండలాగ్రమును పైకెత్తి, యాతని కంబుకంధరముపై విసరెను. తత్క్షణమే చంద్రమాళీశ్వరుని మస్తకము కాయమునుండి వేఱై నేలదొరలి యుండవలసినది; కాని యట్లుజరగలేదు. ఆ నిశితాసిధార యమ్మనుజుని కంఠనాళమునఁ బడలేదు. భిల్లుఁడెత్తిన కరమును దింపలేదు. అంత డెంతప్రయత్నించినను బాహువు క్రిందికి వ్రాల లేదు. దాని నుపరిభాగమున నెవ్వరోయడ్డగించిన ట్లాతనికిఁ దోఁచెను. హంతకుఁడు గుటినుండి తొలఁగి, తనరౌద్రవదన మండలమును గుడి పార్శ్వమునకుఁ ద్రిప్పి, తీవ్రదృష్టి నెదుటికి సారించెను. ఉత్తరక్షణముననే యున్నతదృఢశరీరుఁడును, — ఆజానుబాహు శోభితుఁడును—ధవళ జటాజూట వల్కలాంశుక ధరుఁడును — త్రిశూలపాణియు నగునొక్క గంభీరమూర్తి హంతకుని దృక్పథమున నిలిచెను. భిల్లునిప్రవేష్టము నట్లవరోధించియున్న దీమహానీయుని భుజాదండమే.

ఆ కిరాతుని తీక్ష్ణతర దృష్టులఁగని, యా లోకోత్తర మూర్తి యించుక రుచిరహాస మొనరించెను. ఆ దేవాంశ

సంభవుని సాధువీక్షణములలో నేమి మహిమ యుత్పన్నమయ్యెనో — ఆ దరహాసమున నెట్టిశక్తి ప్రభవించెనో — గాని యాన రాంతకుల హృదయములందు భయవిస్మయములు మల్లడిగొను టంజేసి, వారు మిక్కిలి చలించిపోయిరి. మహనీయుఁ డిట్లు ప్రవచించెను.

"అయ్యా! దైవవిరచితమగు నీ యనంత సృష్టియందలి యీ మహనీయుని ప్రాణిజీవన స్వాతంత్ర్యమున కిట్లు విచ్ఛేదముఁ గలిగింప, మీ కెవ్వఁ డధికారమిచ్చెను? ఒక యల్ప మానవుని యానతికి బద్ధులై మీరు మహేశ్వరుని యమోఘ శాసనమున కిట్లేల ప్రతిఘటింప సాహసించితిరి? శాశ్వత దుఃఖ దాయకమగు నిట్టి కలుషకర్మము నేల వెంబడించితిరి? ఆ శాలాంతకుని మ్రోల నీఘోర హత్యాపచారకార్యమునకు మీ రేమి కారణముఁ జెప్పెదరు? ఇది ధర్మబద్ధమైనదని యెట్లునిరూపించెదరు? చెప్పుఁడు—"

ఆ వాక్యముల కా కిరాతు లచలస్వభావులై స్థాణువులవలె నిలువఁబడిపోయిరి. హంతకుని ప్రవేష్టమునుండి యీ నిశితకృపాణము తనంతనే జాఱి త్మ్మాతలమునఁ బడిపోయెను. ఆ దేవమూర్తి గభీరభాషణములకు వారేమి యుత్తరము చెప్పఁగలరు? ఆ సాధువాక్యములయందలి, దైవము—జీవము—స్వాతంత్ర్యము — విచ్ఛేదము — అధికారము — అను పదములు వారి హృదయకుహరమును జొచ్చి, మహాసంక్షోభ మొదవించెను. కిరాతులు శోక భయాన్వితచిత్తులై, యమ్మహాత్ముని చరణారవిందములపై వ్రాలిరి. "స్వామీ! మేమీ

చెడుపనికిఁ దెలియక తలయొగ్గితిమి. మా కిప్పుడు నిజము తెలిసినది. మా యీ పాపమెట్లు తీఱును? మీకన్నను మాకు దిక్కులేదు. మీ పాదములఁ బడినాము. ఈ పాతకమునుండి తప్పించి, మమ్ముఁ గాపాడు భారము మీయది" అని భక్త్యనుతాపములు ముప్పిరిగొనఁ బలికిన భిల్లుల, నా పురుషవరేణ్యుఁ డనుగ్రహించి, "మంచిది. మీ సంకల్ప మపవిత్రకర్మనుండి మరలినది. పునీతభావములఁ బడయుటకు మీ మానస మావేగము నొందుచున్నదని నే నెఱుఁగుదును. రండు! ఆత్మోన్నతి నందుటకై యీ చంద్రమౌళీశ్వరునితో నను వెంబడించుఁడు" అని యుగ్గడించుచు, విరజానంద యోగీంద్రుఁడు ముందు నడచెను. ఆ పురుషులు మువ్వురును వారి ననుగమించిరి. మహనీయుఁడగు నా విరజానంద యోగీంద్రస్వామి వారిని స్వాశ్రమమునకుఁ గొనిపోయెను.

ముప్పదియొకటవ ప్రకరణము.

బుద్ధునునమ్మి యేటఁబడెను.

మీఁది ప్రకరణమునందలి యంశములు జరగిన మఱునాఁటి సుప్రభాతసమయమున కటకారణ్యప్రదేశమార్గమునఁ బురుషులు ముప్పదింటికి హెచ్చుగా నాయుధపాణులై ప్రయాణము సలుపుచుండిరి. అందొక యంసలుఁడు మార్గదర్శియై ముందు నడచుచుండెను. అతఁడు ధరించిన యంబరములన్నియు మిక్కిలి విలువగలవి. మొల నలంకరించిన యా

యంతరీయపుఁదీరు — ముంగాలివఱకు జీరువాఱు పొడుగైన యా యంగరేఖావైఖరి — వల్లెవాటుగ వైచికొనియున్న యా యుత్తరీయంపుఁ దెఱఁగు — భుజమునుండి వక్షమువఱకుఁ జుంగులు జాఱఁగట్టుకొనిన యా పట్టంచు తలపాగ సొబగు — నాతని కౌతుఁ దనమును సువ్యక్తము సేయుచుండెను. ఆ పురుషుఁ డింతవఱకు మనకుఁ బరిచయుఁడైన సరదారు భైరవేశ్వరుఁడే. ఆతని వెంబడించుచుండిన వ్యక్తులలో హితకారిణీ సభ్యులు, చిన్నోజి — రూపసింగు — శివరామయ్య — మొదలగువారును, విరజానందుల యాశ్రమ వాసులగు సన్న్యాసులును నుండిరి. ఈ సందర్భమున నందఱును దమతమ వేషములను మార్చి యుండిరి.

ఆనాఁడు కుటీరాంతర్భాగమున రోహితాశ్వశిఖల నడుమ దహనధర్మమునొందిన చిన్నోజియు శివరామయ్యయు నిందుఁ బ్రియాణము సల్పుట యెట్లు సంభవమయ్యెనను సంశయము మాచదువరులను బాధించుట సహజమే. నాఁడీక నొకటిరెండుక్షణములు జాగయియుండెనేని, వారాభయంకరాగ్ని హోత్రమునకుఁ దమకాయముల నాహుతిగా సమర్పించియే యుందురు. వారి జీవితచరిత్రము నంతటితో నంతరించియే యుండును. అట్లు జరుగలేదు. రూపసింగు రామసాగరమునుండి యప్పుడప్పుడే సిద్ధరామపురమునకువచ్చి, చిన్నోజినిఁ జూడఁ బోయెను. కొన్నిక్షణములకు ముందే యాతఁడు శివరామయ్య కడకు వెళ్ళుట నింటివారివలనవిని, యటనుండి శివరామయ్య కుటీరమువంక నడచెను. ఆతఁడు దూరమునుండియే యా యుల్పా

మందిరము తగులఁబడుచుంటఁజూచి పరుగువాఱి, గోళ్ళెమును దొలఁగించి, యుందలి బోరువాకిలిని లోనికిఁద్రోసెను. ప్రాణములపై నాశవదలుకొని, ద్వారముకడ నిస్తబ్ధముగ నిలిచి యుండిన శివరామయ్యయుఁ జిన్నోజియు ధ్వనివలనఁ గనులు విచ్చి, మఱునిమిషమే యుందుండి వెలువడిరి. ఆ యుత్తరక్షణమే తమప్రాణసంరక్షకుఁడును నాప్తమిత్రుఁడును నగు రూపసింగును గనుఁగొని యనిర్వాచ్యానందమునుబొంది, యాతని గాఢాలింగన మొనర్చుకొనిరి. తదుపరి సరదారునితోఁ గలిసికొనిరి.

సరదారుఁడాసేన నెటకుఁ గొనిపోవుచుండెనో — వారి నేమిచేయ నెంచెనో — మాకు బోధపడలేదు. ఆతని ముఖలక్షణములఁ బరికింప, నాపురుషుని నిస్తరంగమనస్సాగరమున, మహావాతూలతరంగములొక్కపెట్టునఁ గొట్టి, వీచికామాలికాపరంపరలు పయింబయిఁ జెలరేఁగ, మిగుల సంక్షుభితమొనర్చుచున్నట్లు పొడఁగట్టుచుండెను. వారు బహుదూరమిట్లరిగిరి. ఆ వెనుక సరదారుఁ డింతవఱకు నడచుచున్న మార్గమును వదలి దక్షిణాభిముఖుఁడై కేదారభూధరముల వామపార్శ్వమునఁ గల శాఖాపదవి ననుగమించెను. సేవకగణమున నెవ్వరు నేమియు మాటాడక నాయకుని ననుసరించుచుండిరి. ఆకాలిత్రోవ క్రమక్రమముగ సన్నగిలి, చివరకేమియు నగపడక పోయెను. ఆసముదయమున సంశయాపన్న మానసుఁడగు రూపసింగు సరదారుని నుద్దేశించి "మీరు దారితప్పినారని తలంతును. మ మ్మెక్కడకుఁ గొనిపోవనున్నారు? మీరువెళ్ళు

చున్నది త్రోవకాదు. ఈప్రదేశము మీ కింతవఱకుఁ బరిచిత మైనదేనా?" యనెను. "తొందరలేదు. మీరు మాటాడక నా వెంటరండు. ఎవ్వరునేమియుఁ బలుకవలదు." అని భైరవే శ్వరుఁడు గంభీరస్వరమున నుడివెను. తరువాత మాటాడుట కెవ్వరును సాహసింపలేదు.

ప్రదేశ మొక కాఱడవి. ఉన్నతవృక్షములు — కంటక గుల్మసీలతలు — లతావితానములు — నందు దట్టముగ మొలిచి యున్నతమ్ముగఁ బెరిఁగి, భీమముగఁ గన్పట్టుచుండెను. మార్గమున కడ్డపడెడు తీవలను బొదలను దన మండలాగ్రమునఁ దొలఁగిం చుచు, దారిచేసికొనుచు సరదారుఁడు ముందుఁబోవుచుండెను. అనతిదూరమున మహీరుహపత్రముల నడుమ నొక చిన్నని వెలుఁగు పాంథులకుఁ దోఁచెను. మఱికొంత తవ్వు ముందు చనఁగాఁ గొన్ని కుటీరములు వారికి గోచరించెను. వానిసమీపము నఁ బదిపండ్రెండుగురు కిరాతులొక యగ్నిజ్వాలను బరివేష్టించి, తామందందు దొంగిలి తెచ్చిన మృగాదుల మాంసశకలముల నందు వేల్చుకొనుచు, నొండొరులు సరస సల్లాపములాడుకొ నుచుఁ గూరుచుండియుండిరి. భైరవేశ్వరుఁడు దవ్వుదవ్వులనుం డియే వారినిఁజూచి, గూఢార్థబోధకమగు నొక ధ్వనిచేసెను. అదివిని యాభిల్లులలోని నాయకుఁడు తత్క్షణమే పరదారుని కడకుఁ బరుగిడివచ్చి, దూరమునుండియే యాతనికి నమస్క రించి, కుశలప్రశ్నానంతరము కొంతతడవు తమ సాంకేతిక ధ్వనిచే రహస్యభాషణముఁ గావించెను. పిమ్మట నాభిల్లుఁడు తమయనుచరులలో నొక్కనిఁ బిలిచి, 'మనప్రభుని గుహాయుం

దీనాయకులను వదలిర'మ్మనియాజ్ఞాపించెను.

ఆ కిరాతభటుఁడు దారిచూపుచు ముందుఁబోవుచుండఁ, దక్కినవారాతని వెంబడించుచు, సుమారొక కోసుదూరము గడచి, యొకానొక గుహాబిలముఁజొచ్చిరి. అదిచాలఁ గిష్కింధముగ నుండుటచే నాయుద్ధ్వగులు శ్రేణీబద్ధులై నెమ్మదిగ — నొక్కరొక్కరుగ — నడువసాగిరి. గాఢాంధకార బంధురమగు నాపర్వత గహ్వరాంతరాళమున వారెంత దవ్వేగిరో మనకుఁ దెలియదు. చాలసేపటికిఁ గిరాతభటుఁడు "మెల్లఁగ్గరండు — మెల్లెక్కుఁడు —" అని హెచ్చరించెను. అతఁ డామేలుకట్లఁ గడచి యచ్చటి శిలాద్వారమును దీసివైచియుండును. తత్క్షణమే సూర్యకాంతి గదియందుఁ బ్రవేశించుటయుఁ బాంధుల కెట్టయెదుట నొకవిశాల సమప్రదేశమును దానినడుమ నొక యారామమును గోచరించుటయు సందర్భించెను. వారందఱు నా నిగూఢభాగమునందలి యాచిత్రరంగముఁ దిలకించి, యత్యంత విస్మయావహులై యుపవనమును జేరిరి. ఆసానుతట మంత వైశాల్యమైనదికాదు. అయిన నది పెట్టనిగోడవలెఁ, జుట్టును నావరించియుండు మహోన్నత శైలరాజములచేఁ బరిరక్షింపఁబడి, శాత్రవుల కగమ్యగోచరమై యుండెను. కిరాత భటుఁ డావనమధ్యమున నుండు రాజసదన తుల్యమగు నొక యపూర్వసౌధము నాపురుషులకుఁ జూపి, వారివలన ననుమతి నొంది, యటనుండి మరలి వచ్చినమార్గమునఁ బోయెను. సరదారుఁడు మిత్రమండలినిఁ జూచి "మనము చేరఁదగిన స్థాన మిదియే. ఇచ్చట జరగవలసిన కార్యము చాలముఖ్యమైనదని

మీ రెఱుఁగుదురు; కనుక నే నీనిలయమును జొచ్చి, మనకుఁ గష్టములేనితీరున నానుకూల్యముల నన్నిఁటినిఁ గావించిన పిమ్మట నీలనై చెదను. తోడనే మీరందఱు నొక్కుమ్మడి భవనముఁ జొచ్చి, యనంతరకార్యమును బూర్తిగావింప సంసిద్ధులైయుండ, మిగుల హెచ్చరికతో నిరీక్షించి యుండవలయును. ఎవ్వరైన మిమ్ముఁగూర్చి తెలియఁగోరినపక్షమున, సరదారుని సేవకులమని మాత్రము వారికిఁజెప్పుఁడు." అనినుడివి యాభటులువసించుట కుచితస్థలము నందుఁ జూపి, యాతఁడు ముందునడచెను. గృహరక్షకు లాపురుషునిఁ గాంచి, తమసిగూఢధ్వనులచే నాతనిఁ బ్రశ్నించి, సదుత్తరమును గ్రహించి, యాగంతుకుఁడు తమనిత్రుఁడని తెలిసికొని, ముందుఁబోవ ననుమతించిరి. ద్వారపాలకుఁడు భైరవేశ్వరునిఁజూచి నమస్కరించి; లోనికి వెళ్లి కొంతవడికి మరలివచ్చి, 'ప్రభుని యాజ్ఞయైన' దని విన్నవించెను. వెంటనే సరదారుఁ డాని కేతనముఁ జొచ్చి, గృహాంతరమున సుఖోపవిష్టుఁడైయున్న దస్యునాథునిఁ గనుగొని, వినయపూర్వక ప్రణామము లాచరించెను. దస్యునాథుఁడు విస్మయవిస్మితముఖుఁడై సరదారుని వినతులకుఁ దనయామోదమును సూచించుచుఁదలయూఁచి "మంచితరుణముననే వచ్చితివి. నేనును నీకొఱకే వేచియుంటిని. నమ్ము." అనుచుఁ గురిచీపైనుండి కొంచెము ముందునకువ్రాలి, సరదారునకుఁ దనవామపార్శ్వము నందలి పీఠమునుజూపెను. ఆతని మోలనున్న బల్లపై నల్లని తైలవస్త్రము పఱుపఁబడినది. అందుఁ బలురకముల సారాయిబుడ్లును గొన్ని కాచపాత్రములును వరుసలు దీరియుండెను.

సరదారుఁడు తేనిఖ్యాపతి నాపీఠమున నాసీనుఁడయ్యెను; అనం తరమువారికి క్రిందివిధమున సంభాషణము జరిగెను.

భైర—ఔను – మహాప్రభూ! నాకిది మంచిసమయము. మీదయవలన –

దస్య—చెప్పుము. పల్లకి యేమైనది? సేవకుల సంగతి యేమి? ఆజవ్వని రహస్యభవనముఁ జేరుట కింత తడవేలయ య్యెను? నారాత్రి గడియలన్నియు నామనోహారిణీ స్వరూపాను సంధానముననే కడచిపోయినవని యెఱుఁగుదువా?

భైర—చిత్తము. అనుచరులువచ్చియే యున్నారు.

దస్య—(ఉద్విగ్నమానసుఁడై) ఏమీ! వచ్చియేయు న్నారా? ఎచ్చట? ఎందున్నారు? ఇంతిజాగేలయయ్యెను?

భైర—దారినడుమ నంతేగాయములు పొసఁగియుం డెను.

దస్య—ఎవ్వరివలన? మిమ్ముఁదాఁకిన యాచండాలుఁ డెవ్వఁడు?

భైర—కటకప్రదేశమార్గము దేవర వారెఱుంగనిది కాదుకదా?

దస్య—అంతయును దెలిసిపోయినది. ఆగొడవలికఁ జెప్పవలదు. నేఁ డాయున్మత్తుల తల లుత్తరణము నొందఁగలవు. ఆకాంతకెట్టి తొందరయుఁ గలుగలేదుకదా?

భైర—లేదు. మీప్రియురాలికెట్టి తొందరయుఁ గలు గలేదు.

దస్య—(సంతోషసూచకముగఁ దలనాడించుచు)

చక్కఁగా వచించితివి. ఇదిమొదలు లాహె నాప్రియురాలేకదా? యేమనుచున్నావు?

భైర—ఔను. మీరు సుమనోల్లాసముగ నుండఁదగిన దినములలో నిది యమోఘమైనది. మహాస్వామీ! ఇట్టి యపూర్వదినమిఁక మీకు రాఁజాలునా?

భైరవేశ్వరుఁ డుత్సాహపూర్వకముగఁ జనవుమెయి నొక సారాయిబుడ్డి నెత్తి దానిమూఁతను లాగివైచి, యొకనిడుపైన కాచపాత్రమున నందలి ద్రావకమును సగమువఱకుఁ బోసి, పరసవీక్షణములఁ బ్రభుని నారయుచు, దాని నేలికకందించెను. దస్యునాథుఁ డామద్యమును రెండు గుక్కలలోఁ ద్రావి, సరదారునివంకఁ జూచి వికావికనవ్వెను.

దస్యు—రాత్రియొక గర్భశత్రువు పడిపోయెను. వాని సర్వస్వము మనయధీనమయ్యెను. నేఁడొకఁడు తీఱుటతో మనపని పూర్తికాఁగలదు.

భైర—వాఁడేనా? ఔను. మీరు చక్కఁగా గ్రహించినారు. నిశ్చయముగ నది పూర్తికాఁగలదు.

భైరవేశ్వరుఁ డట్టహాసమొనర్చుచు, వేఱొకబుడ్డినుండి కొంతమదిరమును చషకమునఁ బోసి, స్వామి నుపలక్షించుచు విన్నవించుచున్నాఁడు.

“మహాప్రభూ! ఈప్రసన్న సమయమున నీసుప్రసన్నను సేవింపుఁడు. ఇది యానందకరమైనది.”

దస్యునాథుఁడు సరదారునినుండి పానపాత్రము గ్రహించి, యందలి మద్యము నానందపూర్వకముగఁ గ్రోలి, కన్నులర

మోడ్చుచు నిట్లనెను.

"ఆనందకరమా! ఔను — అంతయు నానందకరమే! బ్రహ్మానందకరము."

భైర—(వేఱొక మధుపాత్రమువంక వ్రేలుసూపుచు) ఈ గంధోత్తమము మిక్కిలి జాలప్రియమైనది. దీనిఁ గొంత పుచ్చుకొన ననుగ్రహింతురా?

దస్యు—(తూలుచు) ఇమ్మిమ్ము. అది నాచిన్ననాఁటి చెలి. దానినిమ్ము.

సరదారుఁ డందలి సుర నొక యనుత్తమమునఁ బోసి తెనికీయఁబోయెను. ప్రభుఁ డవశుఁడగుటచే దానిని బూనికగాఁ బట్టుకొనఁజాలక పోయెను. సరదారుఁడే యా పాత్రములోని పరిస్రుత నేలికగళమునఁ బోసెను. నాయకుఁ డద్దానిసేవించి, మాటాడ నుంకించెను; కాని ప్రభువర్యుని జిహ్వా బలము తొలఁగి చక్కఁగా నాడనందున నాతఁ డెద్దియో లోలోనఁ బ్రేలుచు వివశత్వమున వ్రాలిపోయెను. పిమ్మట సరదారుఁ డీలవైచెను. వెలుపల నిరీక్షించియున్న మిత్రమండలి వెంటనే గృహప్రవేశము చేసెను. దస్యునాథుఁ డతికష్టముతో నయనములను విచ్చి యా వర్గమును జూచి లేవఁబోయెను. పాపమాతని సర్వాంగములు సంపూర్ణముగ నవశము లగుటవలన నా పురుషుఁడు మరలఁ బడిపోయెను. అతని కనీనికలు భారముచే మూసికొనిపోయెను. మిత్రమండలి జనులాపురుషుని తెక్కలు విఱిచికట్టిరి. ఇది తెలిసి గృహపాలకులు పరుగిడి వచ్చి మందిరముఁ జేరిరి. వా రీప్రమాదముఁగాంచి తమ

ప్రమత్తతకు లోలోనఁ జాలించిరి. భవనకింకరులకును మండలి జనులకును బాహ్యప్రదేశమునఁ బోరుఘోరముగ హెచ్చెను. సరదారుఁడు నిలయసేవకులపైఁ దుపాకులనుబ్రయోగింప మిత్రులను బ్రేరేచెను. వారును వానిఁ జేఁబూనిగృహరక్షకులఁ గాల్పఁదొడఁగిరి.

భవనకింకరులలోఁ బ్రధానుఁ డాయుత్తరక్షణముననే దిశలు మార్మ్రోఁగ శంఖారావముఁ గావించెను. నేలఁ జీల్చుకొని వెలువడిన తెఱఁగునఁ గొన్నినిమేషములలో నెచ్చటనుండియో యొక గొప్పసేనవచ్చి తమవారివంకఁజేరెను. ఆ మహా శత్రుసైన్యప్రవాహమున మిత్రమండలి యొక నురుఁగువోలెఁ గన్పట్టుచుండెను. అయినను మండలిజనులు వెనుదీయలేదు. నిరుత్సుకత నొందలేదు. ధైర్యమును వీడలేదు. సాహసాతిరేకమున వా రాయహితవర్గము నెదుర్కొనిరి. ఉభయపక్షములవారికిని యుద్ధ మతితీవ్రముగ హెచ్చెను. సరదారుఁడెదుటి వారి మర్మజాలము నెఱిఁగిన వాఁడగుటకతననాసమూహారంగమున నుఱికి, సముచితోపాయాంతరముల నెఱపి, ప్రతిపక్షుల నవలీల నెదుర్చుచుండెను. చిగ్నేజి రూపసింగు మున్నగు శూరు లాతని యుభయ పార్శ్వముల నిలిచి, పయింబయి నెడతెగక వర్షధారాపాతముగఁ దుపాకిగుండ్లను బఱపుచు, శాత్రవుల హృదయనాళముల భేదింపఁజొచ్చిరి. ఆతాఁకుడున కరాతిసైన్య మాఁగఁజాలక పోయెను. ఇట్టి తరుణమున నున్నట్టుండి యెటనుండియో నిశితకుంత మొక్కటి రివ్వునవచ్చి, సరదారుని భుజశిరస్సునఁ జొచ్చి, బాహుమూలమువఱకు

గ్రుచ్చుకొనిపోయెను. తొలుత సరదారుఁ డాపాటునంతగా గణింపకపోయినను, ఆతని శరీరమునఁగల రక్తమెల్ల క్షతినుండి యనివార్యముగ స్రవించుచుండుటచేఁ, గ్రమక్రమముగ బలము తొలఁగఁ, జీవన కాపీరుఁ డశక్తుఁడై — కేవల దుర్బలుఁడై — సోలి నేల వ్రాలిపోయెను. కొంతసేపటి కాతని ప్రాణద్యుతులు నిస్తేజములైపోయెను. సరదారుని యాత్మ భౌతిక కాయమును వీడిపోయెను.

ఇట్లాతఁడు పడిపోవుటచే హతశేషులగు ప్రత్యర్థులకుఁ గలిగినయానంద మింతింత యనరాదు. తామిఁక నపజయ మన్నమాటయే యెఱుఁగమని తలఁచి వారు సంతోషకోలాహలము సేయుచు మిగులఁ విజృంభించిరి. నెచ్చెలియు నాయకుఁడును ముఖ్యముగఁ దమ కూఁతకోలయు నగు సరదారు భైరవేశ్వరుఁడు మరణించుటచే, మిత్త్రమండలి కపారమైన నష్టమే కలిగెను. అందులకు వారు కొంత విచారమునొందినను, దిగులు చెందక ద్విగుణీకృతోత్సాహులై రణావనిఁ దమ యనుపమానశౌర్యముఁ జూపుచుఁ విపక్షమండలిని విదళింపఁజొచ్చిరి. కొందఱా రిపుసమూహమున యుక్తిమెయి నగ్నిగోళములఁ బ్రయోగించుచు ననేకులను మ్రగ్గించుచుండిరి. చిన్నోజియు రూపసింగును సమరతలమున నిశ్చలముగ నిలిచి, నిరుపమోత్సాహమునఁ దమ దుర్నివార్య దోర్వీర్యమును వెలయించుచు, నభియాతులఁ బరిమార్చుచుండిరి. మఱి కొందఱది చూచి రెట్టించిన సాహసమునఁ దమ చంద్రాయుధ ఘాతముల నిచ్చుకొలఁది నరివీరుల వ్రచ్చుచు, నద్భుత భుజాదర్పముఁ జూపుచుండిరి.

ఆ తీవ్రతమాఘాతములకు నిలువఁజాలక, దస్యు సేనాదళము వెఱుఁగఁ బాఱెను. మండలి జనులు పరుగిడుచున్న వైరిజనులను వెన్నాడి, పట్టి బంధించుచుండిరి. దస్యునాథుఁడును— నిలిచిన యాతని యనుచరులును — మిత్రమండలికిఁ జిక్కి, శృంఖలా బద్ధులై పోయిరి. వారినిఁ గొని చిన్నోజీ రూపసింగు శివరామయ్య ప్రభృతు లచ్చటనుండి ముందు నడచిరి.

ముప్పది రెండవ ప్రకరణము.

మామాటయే మాట.

మాకివి మధుమా సాంత్యదినములు. ఈచరిత్ర మధుమాసముతోడనే ప్రారంభము నొందినది. కథాభాగమింకను ననేక రీతులఁ బెరుఁగవలసియున్నను నట్లుగావించుట కవధిలేదు. ఈమాసాంత్యముతో దీనిఁ బూర్తిచేయుట మాకుఁదప్పని సరియైనది. ఇట్టి యవ్యవధాన కారణముననను గ్రంథవిస్తరభీతి వలనను గలముసాగుటలేదు; కనుక ముఖ్యాంశములను మాత్ర మీ దిగువ సూచించి యంతటితో నీప్రసంగమును విరమింపఁ దలఁచితిమి.

నాఁడు రామసాగరమునఁ గొంతకాలముండి, తనశిష్యమండలిచే నందుఁ జౌర్యకృత్యములఁ జేయించి, ధనాభావమున శివభద్రశర్మగారి కుమారుని, రాఘవుని, నూరివెలుపలి కాళికాలయమునందు హత్యగావించి, పాఱిపోయిన బైరాగి—మహీశూరదేశపు దివానులమని ప్రకటించుకొని, విశ్వనాథపురము

సందలి సత్రమున బసచేసి, వేడుకలక్రిందను వినోదవైభవా దుల క్రిందను యథేష్టముగ డబ్బువ్యయముచేయుటలోఁ దన యపూర్వత్యాగముఁ జూపి, యచ్చటఁ బదునేను వేలధనము సంగ్రహించుకొని వెళ్లిన శ్రీశైల యాత్రికుఁడు — నాఁటి నిశీథసమయమున నుమాపతియింటఁ జేరి, యపరాధ పరిశోధకుని వలె నటించుచు, నచ్చటఁ గొన్నిదినములు వసించి, తనభట వర్గముచే నందలిధనికుల యిండ్లను గొల్లగొట్టించి, యుమాపతి యింటనున్న రెండువేల నిష్కములఁగూడ హరించి, పరుగిడి పోయిన యనంతశాస్త్రి — కటకప్రదేశారణ్య పరిసర జానపదముల హత్యలు - దోఁపులు - జరగించుచు, నా నిశాసందర్భమున శారదను హరింప సేవకులకాజ్ఞాపించిన దొంగల రాయఁడు — సిద్ధరామపురమునందలి రమణీ గృహప్రవేశము చేసి, రాత్రియెల్ల నామెతోఁ బ్రియభాషణములు నెఱపి, చివర కామె చరధనమును దస్కరించుకొని వెళ్లిన విటుఁడు — కల్యాణగిరి శేషనగర మధ్యమార్గమునందలి వనమునఁ, దరుప్రకాండములకు రక్షకభటులను నిర్బంధింపఁ జేసి, ప్రభుత్వధన పేటికలలోని ద్రవ్యమెల్లఁ గుమ్మరించుకొని పోయిన భటనాయకుఁడు — తన తాత్కాలికావాసమగు భూధరమాలికా ప్రదేశమున నొక్కచో, నాతామసీరాత్రి నిన్స్పెక్టరు రఘునాథ రాయనిచేఁ బట్టువడియుఁ దప్పిపోయిన బోయకొండఁడు — సరదారు భైరవేశ్వరుని సాహాయ్యమున, రూపసింగు చిన్నోజి మున్నగు హితకారిణీ సభ్యులకు వశుఁడై పోయిన దస్యునాథుఁడు — సిద్ధరామపురమున సకలసంపదలతో - సమస్తవైభవ

ములతోఁ - దులదూఁగుచుఁ, జంద్రమౌళీశ్వరునిపై ద్వేషము సాధించిన చినవీరశర్మ — అలనాఁడు కాటమేశ్వర కూటము నందలి సమారాధనదినమున, మహాసభలో, చోరనాథునిఁ బట్టితెచ్చు వీరునకు విరాళము నొసంగునట్లు గంభీరోపన్యాస మొనర్చిన చినవీరశర్మ — శ్రీరామశర్మ పుత్త్రుఁడును సిద్ధరామపుర వాస్తవ్యుఁడునునగు నొక్క చినవీరశర్మయేయని మా వాచకోత్తములు గ్రహించియుందురు. అదినిజము. అతఁడట్లు బహువిధ వేషములను ధరించి ద్రోహచింతనలకుఁ బాల్పడి, జనవధసల్పి, లోకకంటకుఁడై వర్తించి, కొల్లలాడిన సర్వసంపదలును రహస్యాగారమునందలి భూగర్భశాలయందే యుండెను. వానిని జన్నోజియు రూపసింగును గనిపెట్టిరి. అందుఁ జంద్రమౌళీశ్వరుఁడు రమణికై యొసఁగిన భూషణాంబరాదులు మాత్రమేకాక, తస్కరులచే నాప్రాంతవాసులు గోలుపోయిన సమస్త వస్తుజాలము నుండెను. ఇట్టి ఘోర పాపకార్యములకుఁ గారణభూతుఁడైన చినవీరశర్మకు, న్యాయస్థానమున నుచితదండనమే విధింపఁబడెను.

“నరదారు భైరవేశ్వరు”డను నామమునఁ — బురుషవేషమునఁ — బ్రవర్తించినది ఆశాచార్యుని తనూజాతయగు సీతయే. గ్రామాంతరసీమలలో రహస్యకార్యాచరణమునకుఁ బూనుకొను సమయములయందామె ధరించు వేషనామము లిట్టివే. నాఁడు కటకారణ్యప్రదేశమున శారదబండి నడ్డగించిన భైరవుఁడు సీతయే. శారదాంబను వంచింపనెంచి యేనాఁడు సీతె రూపమెయిందో జని తనమాయోపాయములచే వామె

యాత్మశోధనముఁగావించి, యా సాధ్వీమణి మధురస్వభావ కారణమున, నామె శాంతైకాదేశమునఁ గరఁగిపోయెనో, యా నాఁడే సీతమానసము సంపూర్ణముగ శారదాంబా హృదయమున లగ్నమయ్యెను. శారదాంబ మృదువచో రత్నములలో నేక్షణమున నెట్టి వినూత్నశక్తి యామెకుఁదోఁచెనో, వాని యందెట్టి మహత్తరమహిమ యావిర్భవించుట నామెకనుఁగొనఁ గల్గెనో, యాక్షణమునుండియు సీత యాకుల పాలికా పవిత్రసంయోగ మొక మహాభాగ్యముగ భావించుచు, నామె యమూల్యభాషణములఁ దలఁచు వినఁ గుతూహల పడుచుఁ, బలుమఱు శారదామందిరమున కరుగుచు, నామె భవ్యోపదేశము నాకర్ణించుచుఁ దనంతనే స్థిరపోయి, స్వీయ దేహమనోబుద్ధ్యాదులను సంపూర్ణముగ నా సాధ్వీమణిచరణ పంకేరుహములకు సమర్పించెను. అందువలన సీతకుఁ గలిగిన ఫలము పూర్వవాసనలకును దుచ్ఛసంకల్పములకును దిలోదక ములను వదలుటయే. ఇది కారణముగా నామె సద్విషయా సక్తినిఁబొంది, సత్పురుషులకుఁ గంటకప్రాయముగ నుండుట మహాఘోరపాతకమనియు, నట్టి దుష్టమానవులను బట్టియిచ్చి సాధువులను సంరక్షించుట పూజ్యధర్మమనియుఁ దెలిసి, యందులకుఁ గంకణబద్ధయయ్యెను. అనతికాలముననే యామె స్వధర్మము నెట్లు క్రియారూపమునఁ జూపినదియు మాపాఠక మండలి యెఱుఁగును.

అలనాఁడు సభాంతరాళమున దొంగలనాయకుని సవరి వారముగఁబట్ట దీక్షవహించిన హితకారిణీ సంఘసభ్యులగు

చిన్నోజియు రూపసింగును సకలానర్థములకు లోనై, చివరకె
...తమప్రతిజ్ఞను సాధింపఁ గల్గిరి. అందులకుఁ బ్రతిఫలముగ
...వేల బహుమాన మందకపోయినను, దమ యుత్తమపరి
...లనఁ బ్రపంచానుభవమును సమితజ్ఞానధనమును సము
...టయేకాక, పారమార్థిక విషయమై తమజీవితముల
సార్థకము చేసికొనఁదగు నేర్పును జాలవఱకుఁ బడసిరి.
...వారోక యుత్కృష్టభాగ్యముగఁ దలపోసి యానందింపఁ

శారదబండి నడ్డగించి యామెను వంచింపఁబూనిన స్థైర
వుని బారినుండి యాకన్యాలలామను సంరక్షించిన స్వామి—
శారదాంబ కాశ్రియ మొసఁగుటలో సీతాదులకుఁ దోడైన
సన్న్యాసులు — దస్యునాథునిఁబట్టి బంధించు విషయమునఁ
జిన్నోజి రూపసింగు మున్నగువారికిఁ దోడుగానుండిన యాశ్ర
మవాసులు — విరజానందుని శిష్యులే. విరజానందుఁడు తన
శిష్యమండలి కెల్లవిధముల నుచితప్రబోధముఁ గావించుచు,
వారి నిట్టి పారమార్థిక విషయములలోఁ ద్రిప్పుచు, లోకాప
న్నార్థమై పాటుపడుచుండును.

ఆవిలాసిని — ఆగానలోలిని — ఆ లోలవ్యాపార
పరాయణి — అరమణి — యింకనుభౌతిక దేహమును దాల్చి
మర్త్యలోకమున విషయసుఖములఁ దనియుచుండ లేదు. కృష్ణ
మూర్తినుడివిన ప్రీతివచనములకులోనై, యామె తన్నాశ్ర
యించియున్న చంద్రిమాళీశ్వరుని, ధనాశచే నేనాఁటిరాత్రి
చిదంబరశర్మ సేవకులకుఁ బట్టియిచ్చెనో, రాఁటినడు రేయియే

కృష్ణమూర్తి వలన సమస్త సంపదలు గోలుపోయి, రాధతోఁ దన
విలాసభవనసహితముగ దహనధర్మము నొందెను.

విరజానందుని యాశ్రమవాసభాగ్యము నొందిన
వర్గమునుగూర్చి చర్చించుటకింకను గొన్ని పరికరణము
కము లగుచున్నవి.

శారదాంబ సీతతో సంభాషించునెడ మాకివి
దినములని వచించియుండెను. ఇప్పు డాచీఁకటి దినముల
నవి. శారద నేఁడు శరచ్చంద్రచంద్రికలఁ దనివినొ...
ఆదంపతులు — శారదాచంద్రమౌళీశ్వరులు — ఒండొరుల
నెడఁబాసి యష్టకష్టములకు గురియై దుఃఖప్రాప్తినందినను
జవర కీశ్వరకటాక్షమునను శ్రీ విరజానందుని యనుగ్రహభా
గ్యమునను బునస్సమాగమము నొంది, యానందింపఁగలిగిరి.
వారు యోగీంద్రుని యనుజ్ఞచే నిజవాసమునకరిగి, ధర్మనిర
తిమై సుఖజీవనము చేయఁదొడఁగిరి.

లోకావనార్థమై సమస్తవిషములఁ గృషినల్పుట మహా
నీయులకుఁ బరమవిధియగుచున్నది. అట్టి మహాత్ము లెవ్వరైన
నేమి? ఇట్టి శుభోదయములకుఁ గారకుఁడగు శ్రీ విరజానందుఁ
డెవ్వరని పృచ్ఛచేయుటకుఁగాని, వీరని నిర్ణయించుటకుఁగాని,
యవకాశముండునా? ఒకవేళ నట్టియవకాశమున కావృతము
న్నచో, మేమును వారు వీరని నిర్ణయింపక మానుదుమా?

8	భాగవతకథారత్నావళి	0—8	
9	విజ్ఞానదర్పణము	0—5—0	0
0	జీర్ణవిజయనగరదర్శిని	0—6—0	0—4—0
1	అష్టవిధమ్‌పుష్పమ్	0—5—0	0—4—0
2	సదుపదేశములు (ప్రతులు లేవు)		
13	ప్రథమవార్షికము	0—3—0	0
14	ప్రహ్లాదచరిత్రము	0—6—0	0—
15	ధర్మవరచరిత్రము	0—8—0	0—
16	వీరవిలాసము	1—0—0	0—12

విలాసము—విజ్ఞానవల్లికా గ్రంథమాల

ధర్మవరము, (అనంతపుర